

INSTITUTE OF BIBLE TECHNOLOGY, HYD.
WORD OF GOD
C.G.S.T. HYDERABAD - INDIA.
ESTD : 1992

# దేవుని ముద్ర!

# సాతాను ముద్ర?

డా॥ బి. జాన్

# దేవుని ముద్ర!

# సాతాను ముద్ర?


**డా॥ బొంకూరి జాన్**

**ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బైబిల్ టెక్నాలజి, హైదరాబాద్,**

**తెలంగాణ, ఇండియా.**

**దేవునిముద్ర! సాతానుముద్ర (666)?!**

ప్రథమ ముద్రణ : మే 2007

రెండవ ముద్రణ : అక్టోబరు 2014 (రివైజ్‌డ్ ఎడిషన్)

ప్రతులు : 1000

వెల : రూ. 100/-

© సర్వ హక్కులు రచయితవి.

డిజైన్ & ప్రింటింగ్ : ఎ. శ్యాంసన్

9550015417, మంగళగిరి

రచయిత మరియు ప్రతులకు :

**Dr. JOHN BONKURI,**
Director & Founder.
Institute of Bible Technology, Hyderabad &
Temples of God Meet Here Church Building,
# 06 - 264 / 13 / 1 / 6H, HAL/Raghavendra Colony,
Suchitra X Road to Quthbullapur Road,
Behind Indian Oil Petrol Punk,
Quthbullapur (GHMC), HYDERABAD - 500067, INDIA.
Res Phone:+91 40 20000700,
Mob: +91 9440142887
website : www.bibletechnology.net
www.instituteofbibletechnology.com
E-mail : bibletechnology@gmail.com

ప్రతులకు :

**Bro. J. Ravi** (IBT Adminstrator & Correspondent)
H.No. 7-1-38/1/33, BJR Nagar,Ameerpet, Hyderabad-500 016
Cell : 9676744233, 9440792192, 9937592221

# అంకితం

క్రీస్తుయేసు దేవునికుమారుడని నమ్మి, బాప్తిస్మం
తీసుకొని, ఆయన రాజ్యంలో సాతాను ముద్రకుదూరంగా
ఉండి దేవుని ముద్రను వేసుకొని, తనలోని మానవత్వాన్ని
తట్టిలేపి, దేవత్వములోనికి రూపాంతరం చెంది
దానవత్వాన్ని రూపుమాపడానికే పరలోక రాజ్యానికి
వారధులై; వారసులై పరలోకాన్ని స్వతంత్రించుకోవాలనే
ఆశ గలిగిన ప్రతి క్రైస్తవ సోదరునికి, సోదరీమణికి
ప్రేమతో ఈ నా పుస్తకాన్ని అంకితమిస్తున్నాను.

మీ

**డా॥ జాన్ బొంకూరి**

# ముందుమాట



క్రీస్తు రాజ్య విస్తరణకై అనుక్షణం పాటుపడుతున్న దైవసేవకులకు, పరిచారకులకు, ఆత్మీయ సహోదరి, సహోదరులందరికి క్రీస్తు నామములో వందనములు, శుభములు తెలియజేయుచున్నాను.

శరవేగంగా అభివృద్ధి పథాన నడుస్తున్న నేటి ఆధునిక మానవుడు అనేక రంగాలలో తనకు తానే పోటీ అవుతూ తనదైన ముద్రను వేస్తున్నాడు. ఇది తప్పా? ఒప్పా? అని నేను చర్చించుటలేదు. అయితే మనిషి తను సాధిస్తున్న అభివృద్ధిలో (ఇహలోకంగా తనదైన ముద్ర వేయాలనే తపనతో) తనను సృష్టించిన దేవునికి ప్రతిక్షణం దూరమవుతున్నాడని గ్రహించలేకపోతున్నాడు. మనం చాలాసార్లు చాలామంది నోటి నుండి ఫలానావ్యక్తి ద్వారా ప్రభావితం అయ్యామనో, ఫలానా వ్యక్తి నన్ను ప్రభావితం చేశారనో వింటూ ఉంటాము. ఇక్కడ ముద్ర అనేది ప్రభావితం అనే రూపంలో, అర్థంతో వేయబడినది. ఒకరి ముద్ర మనమీద ఉంది అంటే ఆ మనిషిలోని ఏదో ఒక గుణం అంటే ఆలోచనా విధానం కావచ్చు, ప్రవర్తించే తీరు కావచ్చు. ఇలా ఏదో ఒకటి మనల్ని ఆకర్షించడం వల్ల మనము కూడా అలా వుండటానికి ప్రయత్నిస్తాము. ఇదీ ముద్రపడటం అంటే.

**"దేవుని ముద్ర - సాతాను ముద్ర"** అనే అంశము గురించి **డా॥ బి. జాన్ గారు** సెమినార్ నిర్వహించటము, దీనికి పుస్తక రూపం ఇవ్వాలని బ్రదర్ ఆశీర్వాదం గారు ఆలోచించటం, ఫలితంగా ఈ పుస్తకము యొక్క మొదటి ప్రతి (ఎడిషన్) మనమధ్యకు రావడం అందరికి తెలిసిన విషయమే. దీనికి అదనంగా కొన్ని అంశాలను జోడిస్తూ రెండవ ప్రతిని (సెకండ్ ఎడిషన్) మీ ముందుకు తీసుకువచ్చారు. ఇందులో నేటి సమాజంపై మనిషి వేస్తున్న ముద్ర దేవుని ముద్రను పోలివుందా? లేక సాతాను ముద్రను పోలివుందా? అనే అంశం గురించి విపులంగా చర్చించటం జరిగింది. దీనిని ప్రతి ఒక్కరూ చదివి తమపై ఎవరి ముద్ర వున్నది అని ఎప్పటికప్పుడు సరిచూచుకుంటూ ఒకరికొకరు హెచ్చరించుకుంటూ... పరలోక వారసులము అవ్వాలని కోరుతూ....

*ముందుమాట వ్రాయటానికి అవకాశమిచ్చిన డా॥ బి. జాన్ గారికి, ప్రభువు నామంలో కృతజ్ఞతలు తెలుపుతూ....*

ప్రభువైన క్రీస్తు పరిచర్యలో
మీ ఆత్మీయ సోదరుడు
**రతన్ రాజేష్ మొగలాపు,**
బెంగళూరు

# నా మాట

క్రీస్తు యేసు ప్రభువు నందు ప్రియులు, క్రీస్తు రక్త సంబంధులైన నా సోదర సోదరీమణులందరికి, సార్వత్రిక సంఘంలో నాతోటి జతపని వారైన సువార్తకులకు, కాపరులకు, రెవరెండులకు, బిషప్‌లకు, బైబిల్ కాలేజీల లెక్చరర్లు, ప్రిన్సిపాల్స్, డైరెక్టర్లు మరియు బైబిల్ పండితులందరికి ఆ యేసు నామంలోనే  నా హృదపూర్వకమైన ప్రత్యేక శుభాభినందనాలు.

ప్రకటన గ్రంథముపై వాఖ్యానాలను ఎంతోమంది బైబిల్ పండితులు ఎన్నో విధాలుగా వ్రాస్తూ అందరూ పరిశుద్ధాత్మ ప్రేరణతో వ్రాశానని చెప్పారు. ఒక్కడే అయిన పరిశుద్దాత్మ ఒక్కొక్కరినీ వేరే విధంగా ప్రేరేపించడనే నమ్మకంతో వీరందరూ అబద్దం మాట్లాడారని అనిపించి నేను కూడా ఒకసారి బైబిల్‌ను ఆత్మ సహాయంతో పరిశీలించాలని ఆశపడి ఈ చిన్న పుస్తకాన్ని వ్రాయడం ప్రారంభించాను. అందరూ సాతాను ముద్ర గూర్చే పట్టించుకొన్నారు, భయపెట్టారు కాని దేవుని ముద్రను గూర్చి ఎక్కువగా వివరించలేదు. నేను రెండింటినీ గూర్చి నాకున్న జ్ఞానంతో బైబిల్‌కు బైబిలే సమాధానం అనే విధానంతో దీనిని వ్రాశాను. ప్రకటన 13వ అధ్యాయం మొత్తం వచనాలను వివరించి సాతాను ముద్రను గూర్చి వ్రాశాను. దానిని చదివిన మీరే ఈ లోకంలోని న్యాయనిర్ణేతలు, పరలోకంలోని దేవునికి మాత్రం నేను లెక్క చెప్పాలి. కాబట్టి మీరేం చదువుచున్నారో జాగ్రత్తగా చూసుకోండి.

ఈ **"సాతానుముద్ర"** అనే అంశముపై 15-8-2005 సం॥లో సరూర్ నగర్, హైదరాబాద్‌లోని అశోకా పంక్షన్‌హాలులో బహిరంగ సెమినార్ నిర్వహించాను. 3 1/2 గంటలు వాక్యాధారంతో వివరంగా వందలాది మంది సమక్షంలో బోధించడమైనది. అయినా ఆ తర్వాత ఈ పుస్తకాన్ని వ్రాయడానికి 2 సం॥రాలు పట్టింది అంటే ఎంతగా శ్రమపడ్డానో, ఎన్నిసార్లు బైబిల్ మొత్తం చదివానో ఆలోచించండి. కేవలం బైబిల్‌ను రిసెర్చ్ చేశానే తప్ప ఎవరి పుస్తకాన్ని కాపీ చేయలేదు. ఎవరి పుస్తకాన్ని విమర్శించడంలేదు. ఈ పుస్తకం చదివాక ఎవరు వ్రాసిన పుస్తకాలలో తప్పులు ఎన్ని, ఎక్కడున్నాయో మీరే గ్రహించగలరు. సాతాను ముద్రపై ఇంతవరకు మీరు విన్న ప్రసంగాలను, చదివిన పుస్తకాలను పక్కన పెట్టి బైబిల్ రిఫరెన్స్‌లతో మాత్రమే సరిపోల్చుకొని ఈవిషయాన్ని చదివి గ్రహించగలరని మరొకసారి సాటి సంఘాల సహోదరీ సహోదరులను, నాకన్నా పెద్దవారైన కాపరులను, బైబిల్ పండితులను, బిషఫ్‌లను ప్రభువు పేరిట కోరుచున్నారు.

పుస్తకాన్ని వ్రాయడం ఒక యాగమైతే దానిని ప్రచురించి అందరికీ అందించడం మరొక యాగం. మొదటిసారి ఈ యాగంలో నాకు ఆర్థికంగా సహకరించిన నా సహోదరుడు, జతపనివాడు, సువార్తగాయకుడైన బ్రదర్ తెట్టెబావి ఆశీర్వాదం గారికి ఋణపడి ఉన్నాను. పుస్తకానికి మొదటి ముద్రణలో అందమైన, ఆకర్షణీయమైన, వాక్యానుసారమైన కవర్‌పేజీని సొంత ఖర్చులతో వేసిన సోదరులు ప్రముఖ ఆర్టిస్ట్ బ్రదర్ రాయల్ (Royal Arts) గారికి, గ్రాఫిక్స్‌తో మిక్స్‌చేసి వెనకపేజీని కూడా అందంగా మలచిన S.L.N.P Graphics అధినేత శ్రీ.సాయిరాం గారికి వందనాలు.

మరియు ఈ రెండవ ముద్రణలో మరింత అందమైన అక్షరాలతో D.T.P మరియు ముఖ చిత్రాన్ని గ్రాఫిక్స్‌తో డిజైన్ చేసి ముద్రించిన బ్రదర్

అంబడిపూడి సాంసన్ (ఎస్.ఎస్.గ్రాఫిక్స్, మంగళగిరి) గారికి కూడా ప్రేమపూర్వక వందనాలు. ఈ రెండవ (రివైజ్డ్) ముద్రణకు ఆర్థిక సహాయాన్ని అందించిన సోదరుడు రాజేష్-సంధ్య (U.S.A.) కు, వారి కుటుంబానికి ప్రత్యేక కృతజ్ఞతలు. ముందుమాట వ్రాసిన రతన్ రాజేష్ మొగలాపు గారికి, ఆయన కుటుంబానికి, ప్రత్యేక వందనాలు.

I.B.T. పరిచర్య అంతటిలో నాకన్నా ఎక్కువ భారాన్ని మోస్తున్న ఆత్మీయ సోదరుడు బ్రదర్ జేమ్స్ రవిగారికి, ఈ పుస్తకాలను, క్యాసెట్లను, సిడీలను బుక్‌స్టాల్స్‌లలో ఉంచి అందరికీ అందిస్తూ నాతోపాటు ఎన్నో కాలేజీలలో వాక్య పరిచర్య చేస్తున్న సోదరుడు బ్రదర్ దాసి ప్రసాదరావుగారికి వందనాలు. నా ఈ సజీవయాగంలో సహకరిస్తున్న మా బైబిల్ కళాశాలల ప్రిన్సిపాల్స్, లెక్చరర్లు, సువార్తికులు, విద్యార్థినీ, విద్యార్థులకు, ఆయా సంఘాల పెద్దలకు, నాయకులకు, కాపరులకు హృదయపూర్వక వందనాలు.

ఈ పుస్తకంలో దొర్లిన అనేక అచ్చు తప్పులకు నన్ను క్షమించి అర్థంచేసుకుని చదువుకోగలరు. బైబిల్‌కు వ్యతిరేకంగా (నేటి క్రైస్తవులకు కాదు) ఒక్క అక్షరం ఇందులో ఉన్నా దయచేసి నన్ను ఏవిధంగానైనా సరిచేయగలరని, ఆత్మీయంగా తప్పులుంటే, మరియు మీరు చెప్పింది బైబిల్ ప్రకారంగా కరెక్ట్ అయితే ఈ పుస్తకం తదుపరి ముద్రణలో తప్పకుండా సరిచేస్తానని సవినయంగా మనవి చేస్తున్నాను. మనందరికీ తండ్రియైన దేవుడు మనలను తన ఆత్మచేత ముద్రించి తన వాక్యపు వెలుగులో నిరంతరం నడిపించునుగాక.... ఆమెన్.

దేవుని ప్రియ కుమారుడైన క్రీస్తుయేసు పరిచర్యలో

మీ సోదరుడు **డా. బొంకూరి జాన్**



మానవాళి మనో నేత్రాలను వెలిగించి పరలోకానికి దారిచూపే
ఆణిముత్యాల్లాంటి కొన్ని దైవరాజ్య సువార్త మహాజ్ఞాన సభలు
ప్రాణం పోకడ?!
దశమభాగమా?
శతమభాగమా?!
యెహోవా
మానవ మేధస్సుకందని ప్రేమ
మహా బబులోను
దేవుడు కట్టిన ఇల్లు?!
ఆలయ ప్రతిష్ఠ
దేవునిచిత్తం
వివాహం
బంధమా? బంధకమా?!
మనిషి జీవనయానం
మనిషి జన్మ ఎందుకు?
అంత్య దినములు
ప్రార్థన-సువార్త
నిత్య శక్తిమంతుడైన దేవునికి
విశ్రాంతి అవసరమా?
గమనిక : ఇంకా అనేకమైన అంశములు సి.డి./డి.వి.డి.ల
రూపములో మహాసభలు, సెమినార్ స్టాల్సనందు లభించును.
ఆధ్యాత్మిక అంధకారంలో క్రీస్తు వెలుగు రేఖలు ప్రకాశింపజేస్తున్న
Dr. JOHN BONKURI
మా జానన్న
www.bibletechnology.net
కులం కుళ్ళు - మతం మత్తు - మనిషి మాయ - ధనం దగా - దేవుడే దిక్కు
INSTITUTE OF BIBLE TECHNOLOGY, HYD.
WORD OF GOD
C.G.S.T. HYDERABAD - INDIA.
ESTD : 1992
దైవపరిచర్యలో
ఇనిస్టిట్యూట్ ఆఫ్ బైబిల్ టెక్నాలజి - హైదరాబాద్
క్రీస్తు సైనికులు
9676744233, 9700107384

# విషయసూచిక


1. దేవునిముద్ర సాతానుముద్ర (666)?! ........................ 11
2. ముద్రయొక్క అర్థము ................................................ 15
3. యేసు యొక్క ముద్ర ................................................ 17
4. పరిశుద్ధాత్మ ముద్ర ................................................ 22
5. దేవునిముద్ర ................................................ 25
6. 1,44,000 మంది జనులు ...................................... 29
7. పరిలోక ప్రార్థనా? ప్రభువు నేర్పిన ప్రార్థనా!? ............... 37
8. మహాబబులోను "స్త్రీ" ................................................ 52
9. సాతానుముద్ర (666 లేక 616)?! ............................ 59
10. మరియొక క్రూరమృగము ........................................ 81
11. క్రూరమృగము యొక్క ప్రతిమా స్వరూపం .................... 89
12. మృగము యొక్క సంఖ్య (666 లేదా 616) ................... 102
13. దేవుని ఆశీర్వాదములు ............................................ 110
14. ప్రార్థించిన నూనె మహత్యం!? .................................... 126
15. నాశనకరమైన హేయవస్తువు ................................. 144

# దేవునిముద్ర!
# సాతానుముద్ర (666)?!

ప్రారంభం మానవుడైన ఆదాము మొదలుకొని నేటి ఆధునిక మానవులమైన మన అందరి వరకు సృష్టికర్తయైన దేవుడిని, ఆయన మాటలను అర్థం చేసుకోవడంలో అనేకసార్లు పొరపాటు చేస్తూనే ఉన్నాం. దేవున్ని అర్థం చేసుకొని మనకు అర్థం అయ్యేలా చేయాలని ప్రయత్నిస్తున్న అనేకులను మరి ఎక్కువగా అపార్థం చేసుకొనుటలో నేటికీ అనేకులది అందెవేసిన చేయి అనటంలో అనుమానంలేదు. అడవి మనిషి నుండి హైటెక్ మనిషి వరకు దేవుని వాక్కు ప్రత్యక్షమగుతూనే ఉన్నా దానిని పరిశోధించి పరిశీలనతో చూడలేక తన స్వంత మరియు అనేకుల అనుభవాలతోను సరిపోల్చడం నేర్చుకొని అభివృద్ధి పేరుతో అనుదినం బోల్తాపడుచున్నారు. దేవునిని,  ఆయన వాక్యాన్ని, దేవుని ఆత్మను నమ్మని వారిని వదిలివేస్తే, ఆయనను నమ్మినాము, మేమే బాగా ఎరుగుదుమని చెప్పిన ఇశ్రాయేలీయులు, నేటి క్రైస్తవులు కూడా దేవునిని ఏ మాత్రము ఎరుగలేకపోయారని నిశ్చయముగా చెప్పక తప్పదు.

ఎందుకంటే ప్రకటనగ్రంథంపై తెలుగులో నేను సుమారు(5)  ఐదు పుస్తకాలు చదివి చూశాను కాని నాకు తెలిసిన ఒక దైవసేవకుడు ప్రకటన గ్రంథంపై 14 పుస్తకాలు చదివానని చెప్పాడు. మనకు తెలియకుండా తెలుగుతో పాటు అనేక బాషలలో ఇంకా ఎన్నివేలపుస్తకాలు ఎన్ని అభిప్రాయ బేధాలతో వెలువడ్డాయోనని ఆలోచిస్తే ఒళ్ళు జలధరిస్తుంది గదూ! నేను

వ్రాయుచున్నది మాత్రం వీటన్నింటికి భిన్నంగా ఉంటుందని కూడా వేరే చెప్పనవసరం లేదు కాని ఈ అంశము దేవుని వాక్యానికి, ఆయన ఆలోచనకు ఎంత దగ్గరగా ఉందో చూసుకోవాల్సిన బాధ్యత మాత్రం ఈ పుస్తకం చదువబోతున్న అందరి మీదనే ఉన్నది (మార్కు 4:24).

ప్రకటన గ్రంథములో సాతానుముద్రకన్నా ముందుగా దేవుని ముద్రను గూర్చి కూడా ఉన్నది. దీనిని గూర్చి ఇంత వరకు ఎవరూ చెప్పడంలేదు, వ్రాయలేదు గనుక ముందుగా దేవుని ముద్రను గూర్చి వివరించడం న్యాయంగా  ఉంటుంది. (అన్నింటికన్నా ముందు ప్రకటన గ్రంథంను చదివే విధానం తెలుసుకోవాలి. దీనిని నేను వెయ్యేండ్ల(1000) పరిపాలన అనే పుస్తకంలో వివరించాను. దయచేసి దానిని చదువగలరు) బైబిల్‌లోని అన్ని (66) పుస్తకాల వలెనే ప్రకటన కూడా దర్శనగ్రంథం అని మీరు ముందుగా తెలుసుకోవాలి. అయితే ఇందులో మనం ఎన్నడూ చూడని జంతువులు, ఊహకందని సంఖ్యలు, చిత్ర విచిత్రమైన జంతువులు, గూఢార్థాలతో కూడిన పదాలు దర్శనమిస్తాయి.

ప్రకటనలోని మొదటి 10 అధ్యాయాలు ఆ కాలంలో జరిగినవి, ఆ వెంటనే జరుగబోయేవి అనగా త్వరలోనే జరిగినవి కూడా చెప్పిన తర్వాత ప్రవచించినటువంటి ప్రవచనాలన్నీ ఆదికాండము నుండి యూదాపత్రిక వరకు ప్రవచించినవే మరలా ప్రవచించాడు. “అంతట నేను ఆ చిన్న పుస్తకమును దూత చేతిలో నుండి తీసుకొని తినివేసితిని. అది నా నోటికి తేనె వలె మధురముగా ఉండెను గాని నేను దానిని తినివేసిన తరువాత నా నోటికి చేదాయెను. అప్పుడు వారు – నీవు ప్రజలను గూర్చియు, జనములను గూర్చియు, ఆయా భాషలు మాట్లాడు వారిని గూర్చియు **మరలా ప్రవచింపనగత్యమని** నాతో చెప్పిరి” (ప్రకటన

10:8-11). అందుకే 11 అధ్యాయము నుండి ధర్మశాస్త్రము, దేవాలము, ఇద్దరు సాక్షులు ఇలా 22వ అధ్యాయం వరకు పాతనిబంధనలో ప్రవక్తలు ప్రవచించినవే మరియు అప్పటికే జరిగినవి, జరుగుచున్నవాటిని గూర్చేమరలా చెప్పాడు.

దీనిలోని విషయాలు వర్తమానంలో అనగా బైబిల్‌లో యోహానుగారు జీవించినపుడు అనగా వర్తమానంలో చూచినవి. భూత, అనగా ఆయనకు ముందు జరిగినవి మరియు భవిష్యత్ అనగా ఆయన తర్వాత కాలంలో త్వరలో జరుగబోయే మరియు జరిగినవి కూడా ఉన్నాయి. (ప్రకటన 1:1-5) ఇవన్నియు రూపకాలంకారముతో అనగా ఆత్మీయ అర్థముతో కూడినవి అని అర్థమగుచున్నది. అయితే ఆత్మీయ అర్థాలన్నీ మనిషి అనుభవంతో కాక దేవుని వాక్యాన్ని బట్టి ప్రకృతిలో జరుగుతున్న నిరంతర వాస్తవాలను లేకా కొన్ని మార్పులను మాత్రమే పరిగణనలోనికి తీసుకోవాలి. ఎందుకంటే దేవుని వాక్యము కూడా ఓ (ధర్మ) శాస్త్రము గనుక (ఫిలిప్పీ 1:1-9).

ఎందుకంటే ఉదాహరణకు ఏడుతలలతో పది కొమ్ములతో ఇంతవరకు ఏ మృగము ఈ భూమిమీద పుట్టలేదు. అక్కడక్కడ రెండు తలలతో పుట్టినవే బ్రతకడంలేదు. పైగా ఇక ముందుకాలంలో పుట్టబోవు, ఎలాగనగా దేవుడు ప్రకృతిని, అందులోని సమస్త జీవరాశులను అనగా మనిషితో సహా చరాచర జీవులన్నిటిని కూడా ఆరురోజులలో సృష్టిని పూర్తిచేసి సృష్టినిర్మాణంనుండి విశ్రాంతి తీసుకొన్నాడు. (ఆదికాండము 1వ అధ్యాయం) మళ్ళీ కొత్తగా ఏ జంతువును సృష్టించలేదు. ఎందుకంటే ఇక ముందు సృష్టిస్తానని బైబిల్‌లో ఎక్కడా చెప్పబడలేదు. ప్రస్తుత కాలానికే జాతులు అంతరించిపోయాయి. ఇంకా అంతరించబోతున్నాయి గాని, క్రొత్తవి పుట్టినట్లు ఆధారాలు లేవు. గనుక ఇక సృష్టించబోడు. బైబిల్ ప్రకారంగా సృష్టించకూడదు కూడా.

దేవుడైనా సరే తన మాటకు తానే కట్టుబడి ఉండాలి. ఎందుకనగా మనల్ని ఒక నాలుకతో మాట్లాడమని ఆయన రెండు నాలుకలతో మాట్లాడకూడదు గదా! ఎవరైనా అబద్ధం చెబితే రెండు నాలుకలతో మాట్లాడకురా అని అంటాం. నిజానికి రెండు నాలుకలుంటే మాట్లాడలేం. దానికి రెండు విధాలుగా మాట్లాడటం అనే అర్థమే గదా! ప్రారంభంలో సర్పము కూడా మాట్లాడేది అని అర్థం చేసుకోవాలి. అందుకే సాతాను సర్పములో దూరి మాట్లాడింది. ఆ పామును/ ఘట సర్పమును / సాతానుకు అవకాశమిచ్చినందులకు దేవుడు మళ్ళీ మాట్లాడకుండా దాని నాలుకను చీల్చాడు. నడిచేదాన్ని కడుపుతో ప్రాకేటట్లు చేశాడు అని జాగ్రత్తగా ఆలోచిస్తేనే అర్థం అవుతుంది.

మనిషి ప్రతిసారి, ప్రతి విషయంలోకూడా దేవున్ని, ఆయన వాక్యాన్ని తన ఆలోచనతో, తన అవసరము, అనుభవములోనికి లాగి శారీరకంగా వాడుకోవాలని ఆలోచిస్తున్నాడు గనుకనే దెబ్బతింటున్నాడు. దేవుని ఆలోచనలోనికి వెళ్ళి ఆయన మనస్సు నెరిగిన వారికి మాత్రమే అనగా శరీర సంబంధముగా కాక, ఆత్మసంబంధముగా ఆలోచించిన వారికే వాక్యం అర్థం అవుతుంది. కాబట్టి ప్రతిదానిని అక్షరార్థముగా అర్థము చేసుకోరాదు. అపోస్తులుల బోధ అనగా సిలువ వేయబడిన క్రీస్తు బోధలోని మొదటి పరమార్థమిదే. “ఆయనే మమ్మును కొత్త నిబంధనకు, అనగా అక్షరమునకు కాదు గాని ఆత్మకే పరిచారకులమగుటకు సామర్థ్యము కలిగించియున్నాడు. అక్షరము చంపునుగాని ఆత్మజీవింపజేయును(1కోరంథి 3:6) ఈ వాక్యము పాత నిబంధనను సూచించినా పాత నిబంధనలోని అనేక అంశములు గూడా ఆత్మ సంబంధముగానే ఆలోచించాలి. బైబిల్ పరిశుద్ధాత్మ ప్రేరణచే వ్రాయబడినది. గనుక దీనిని చదివే వారు కూడా ఆత్మసహాయంతో లేదా ఆత్మనడిపింపుతోచదివితేనే పూర్తిగాఅర్థమవుతుంది.(1.కోరంథి 2:10-15).

# ముద్ర యొక్క అర్థము

బైబిల్‌లో ఈ ముద్రల విషయము అనేకసార్లు ప్రస్తావించబడినది. కొన్నిచోట్ల గుర్తులుగాను, మరికొన్ని చోట్ల సీల్‌గాను మరియు స్టాంపు అనే అర్థమిచ్చేటట్లు వ్రాయబడినది. అయితే మామూలుగా మన భాషలోని దీని అర్థం మరియు భావాన్ని గురించి ఆలోచిద్దాం. సాదారణంగా రాజుల కాలం నుండి తాఖీదులు వ్రాసి రాజముద్ర అనగా వారి స్టాంపువేసి దానిని ఒక కవరులో పెట్టి లక్కతో మూసి దాని మీద కూడా సీల్(ముద్ర) వేసేవారు. అదే సాంప్రదాయం నేటివరకు కూడా రాజకీయాలలో (సీల్డ్ కవర్) కొనసాగుచున్నది. మరియు మనకు గవర్నమెంట్ నుండి రావాల్సిన ధృవీకరణ పత్రములు జనన, మరణ, వివాహ, కుల, నివాస....! మొదలగునవన్నీ ఆ అధికారుల (వార్డు కౌన్సిలర్, తహశీల్దార్, కలెక్టర్, రిజిస్ట్రార్‌ల) యొక్క లేదా నాయకుల యొక్క ముద్రలు లేకుంటే అవి చెల్లుబాటు కావుకదా! ఇలా కనబడే ముద్రలన్నిటిలోను వారి, వారి అధికారిక గుర్తులు చెక్కబడి ఉంటాయి. ఏదైనా ఉత్పత్తులను అమ్మాలన్నా, కొనాలన్నా వారి కంపెనీల గుర్తులతో (లోగోస్) పాటు ఐ.ఎస్.ఐ, ఐ.ఎస్.ఓ, లాంటి ముద్రలు, గుర్తులు తప్పనిసరిగా ఉండాలి. ఇలా కనపడే వ్యక్తులు, అధికారులు, రాజ్యాల యొక్క ముద్రలు కంటికి కనబడే రీతిలో కనబడుతూ ఉన్నాయి, ఉండాలి కూడా.

అయితే మనం ఇప్పుడు మనకు అవసరమైనది, అసలైనది, అతి ప్రాముఖ్యమైనది. నిత్య జీవానికి ఎంతో అత్యవసరమైనదే అయిన ఇంకో

ముద్ర గురించి తప్పనిసరిగా జ్ఞాపకం చేసుకొని తీరాలి. కొందరి వ్యక్తుల మీద వారి అభిమాన వ్యక్తులు, నాయకులు, గురువులు, తల్లిదండ్రుల ముద్రలున్నాయని అంటున్నాము. నీ రూపాన్ని నా మనస్సులో ముద్రించుకొన్నాను అని కొందరిని గూర్చి కొందరంటున్నారు. కొందరి ప్రవర్తనలో వారి ఈ ముద్ర చాలా వరకు పనిచేస్తు ఉంటుంది. కొందరి పోలికల్లో కూడా అచ్చుగుద్దినట్లుగా అని, స్టాంప్ అనో జిరాక్స్ కాపీ అనో అని అంటుంటాము. అయితే ఈ ముద్రలు మాత్రం పేపర్ మీదగాని, శరీరం మీద గాని అస్సలు కనపడవు. కాని వారి జీవితంలో అగుగడుగునా దర్శనమిస్తుంటాయి. మన నడతలో అక్కడ కనపడని వ్యక్తి ముద్ర కళ్ళకు కట్టినట్లు కనబడుతుంది అని అంటాము. ఈ ముద్ర ఆలోచనలకు, ఆత్మకు సంబంధించినదే కాని అక్షరార్థంగా కనపడేది కాదని తేలిపోయింది.

ఇంకా కొందరు మీ మాటలు నా మీద చెరిగిపోని ముద్ర వేశాయి అంటుంటారు. కనబడే శరీరంపై కనపడని మాట చెరిగిపోని ముద్ర ఎలా వేయగలదో కొంచెం ఆలోచిస్తే మొత్తం అర్థం అయితీరుతుంది. దేవుని ముద్ర లేదా ఒక వ్యక్తి ముద్ర అనగా అతని ప్రభావము మన మీద పడటమే ముద్రింపబడటం. కనపడే లోకంలో కనబడుతున్న వ్యక్తులు – రాజ్యాల ముద్రతోపాటు, కనపడే వ్యక్తుల, కనపడని మనస్సుల మీద కనపడని ముద్రను గూర్చి తెలుసుకొన్నాం. ప్రకటన గ్రంథంలో సాతాను ముద్ర కన్నా ముందు దేవుని ముద్రను గూర్చి కూడా వ్రాయబడి ఉన్నది గదా. ముందు దేవుని ముద్ర గూర్చి ఆలోచించాలి. అంతకన్నాముందు పత్రికలలో యేసు యొక్క ముద్ర, పరిశుద్ధాత్మ ముద్రను గూర్చి వ్రాయించాడు దేవుడు. కనపడే మనుషులపై కనపడని దేవుని ముద్ర, ఆత్మముద్ర, యేసు ముద్రలు ఎలా ఉంటాయో వాక్యము ద్వారానే రుచి చూస్తేనే బావుంటుంది.

# యేసు యొక్క ముద్ర



**స**ర్వసృష్టికి అనగా అన్ని దేశాలలో ఉన్న అన్యులందరికి మరియు ఈనాడు ఇశ్రాయేలీయులకు సంపూర్ణమైన సిలువను గూర్చిన వార్తను, అనగా సిలువ వేయబడిన క్రీస్తును ప్రకటించిన అపోస్తులుడైన పౌలు తన శరీరమంతా యేసు యొక్క ముద్రలు ఉన్నాయి అంటున్నాడు. "నేను యేసు యొక్క ముద్రలు నా శరీరమందు ధరించియున్నాను. ఇక మీదట యెవడును నన్ను శ్రమపెట్టవద్దు" (గలతీ 6:17) ఇక్కడ పౌలుగారి శరీరమందు ధరించిన ముద్రలేమిటో ఆలోచించారా? యేసు అనగానే మనకు వెంటనే గుర్తుకు వచ్చేది సిలువ. అందుకే ప్రతివారు నేడు ఇంటిమీద, ఒంటిమీద మంగళ సూత్రాల మీద, బైబిల్‌ల మీద, చర్చిలమీద అన్నింటిమీద అదే గుర్తు వేయించుకొంటున్నారు. కాని ఆ ముద్రలు సిలువగుర్తు అని పౌలు ఎక్కడా చెప్పలేదు. యేసు కూడా నా సిలువ మీరు గుర్తుగా వాడండి అని ఏనాడు చెప్పలేదు.

కాని మనవాళ్ళు ఎలక్షన్లలో యేసు ప్రభువును గాని, ఆయన పేరుమీద పార్టీపెట్టి ఎవ్వరినైనా నిలబెట్టితే మాత్రం ఆయనకు సిలువ గుర్తునే కేటాయిస్తారు అని ప్రత్యేకంగా చెప్పనవసరంలేదు. ఇప్పటికే చాలా సంఘాలలో బాప్తీస్మం ఇచ్చేటప్పుడు నీటితో మనిషి నుదుటి మీద సిలువ గుర్తు వేసి బాప్తీస్మం అయిందని అంటున్నారంటే ఎంతగానో ఈ ముద్రలను గూర్చి జాగ్రత్తగా ఆలోచించాలి. ప్రత్యేకంగా సిలువ గుర్తును గూర్చి మాత్రం చాలా తప్పనిసరిగా ఆలోచించాలి.

"క్రీస్తు మన కోసం శాపమై మనలను ధర్మశాస్త్రము యొక్క శాపము నుండి విమోచించెను. ఇందును గూర్చి - మ్రాను మీద వ్రేలాడిన ప్రతివాడును శాపగ్రస్తుడు అని వ్రాయబడియున్నది"(గలతీ 3:13-14)

ఆనాడు క్రీస్తు మోసిన సిలువ శాపానికి గుర్తు దాని మీద వ్రేలాడిన ప్రతివాడు శాపగ్రస్థుడు అని దేవుడే అన్నాడు గనుకనే క్రీస్తు మనల్ని తన సిలువను మాత్రం మోయవద్దు అన్నాడు. ఆ కాలంలోని ప్రభుత్వాలు నేరస్థులను సిలువ మీద వేలాడదీసి చంపేవారు. అందుకే ఆయన మోసిన సిలువ కాకుండా మనం మన సిలువ నెత్తుకొని ప్రతి దినం తనను వెంబడించమన్నాడు (లూకా 9:23). గనుక తన సిలువను ఎంతమాత్రము యేసు మన మీద కాని పౌలు మీద కాని ముద్రించే వీలులేదు. మనమే ఇష్టపడి, ఆయన వద్దన్నా, అది శాపగ్రస్తమైనదని చెప్పినా అర్థంగాక కడకు మంగళసూత్రాల మీద కూడా సిలువబొమ్మ వేసి భయంకరమైన విగ్రహారాధన చేస్తున్నాము.

ఇంటిమీద సిలువ ఉంటే క్రైస్తవులని, సిలువగుర్తుంటేనే అది చర్చి అని, సిలువ గుర్తుంటేనే ఆఖరికి క్రైస్తవుడి సమాధి అని గుర్తుపట్టే స్థితిలోనికి చేరింది నేటి సమాజస్థితి. ఈ స్థితి మంచిస్థితి లేకా దుస్థితా అనే సంగతి

బైబిల్ చదివితేనే సంపూర్ణముగా గ్రహించగలము. అందుకే దేవుని ఆత్మక్షోభిస్తూ, మీలో “అనేకులు క్రీస్తు సిలువకు శత్రువులుగా నడుచుకొనుచున్నారు. వీరిని గూర్చి అనేక పర్యాయములు చెప్పి ఇప్పుడును ఏడ్చుచూ చెప్పుచున్నాను”(ఫిలిప్పీ 3:18) అని వ్రాయించాడు పౌలుగారితో.

ఈ మధ్య ఒక పాస్టర్‌గారికి ఒక హేతువాది ఒక అద్భుతమైన ప్రశ్న వేశాడు. అదేమనగా ఈ మధ్య క్రైస్తవులు ఎక్కడ చూసినా సిలువను పెడుతున్నారు, పూజిస్తున్నారు తమ మెడలో కూడా ధరిస్తున్నారు ఇందతా ఎందుకండి అని అడిగాడట. అందుకు ఆ సేవకుడు గర్వంగా సంతోషంగా నవ్వుతూ సిలువ మీదనే మా యేసుక్రీస్తు చనిపోయాడు. ఆ సిలువను మోయించి, దానిపైననే ఆయనను వ్రేలాడదీసి చంపారు. గనుకనే మాకు రక్షణ వచ్చింది. అందుకే మా ఈ సిలువారాధన అన్నాడట. అందుకు హేతువాది (కారణము అడిగి తెలుసుకొనే ప్రతివాడిని హేతువాది అనగా హేతుబంద్ధంగా వాదించేవాడు అని కూడా అర్థం) ఆ కాలంలో ఆ ప్రభుత్వంలో నేరస్తులను సిలువవేసి చంపేవారు ఈ విషయం బైబిల్ చదివినా, సంఘచరిత్ర మరియు లోకచరిత్ర చదివినా సులువుగా తెలిసిపోతుంది కూడా. ఆయనకన్నా ముందుగా అనేకులను అదే సిలువలో చంపారు. ఆనాడు ఆయనతో పాటు ఇద్దరు దొంగలను కూడా సిలువ వేశారు. ఆయన తర్వాత కూడా అనేకులకు సిలువవేసారు గదా! మరి దీని సంగతి ఏమిటి? అని ప్రశ్నించాడు.

మరియు ఒకవేళ మీ యేసుప్రభువును ఆనాడు గన్‌తోగాని, పిస్టల్‌తో గాని లేదా ఉరివేసి చంపితే గన్నునో, ఉరితాడునో మీ మెడలో వేసుకొని ఊరేగించేవారా? అని ప్రశ్నించేసరికి సేవకుని ముఖములో నెత్తురుబొట్టు లేదట. ఆలోచించారా? క్రైస్తవులే ఎలా క్రీస్తు సిలువకు శత్రువులగుచూ,

విగ్రహారాధన చేస్తున్నారో, కావున ఆయన మోసిన సిలువ ఎంత మాత్రమూ యేసు మనమీద వేసే ముద్ర కాదని ఖచ్చితంగా చెప్పవచ్చును. ఎందుకంటే ఆయన మోసిన సిలువను కాదని, మన సిలువను మాత్రమే మనం ప్రతి రోజూ మోయాలని యేసే గట్టిగా చెప్పి వెళ్ళాడు (లూకా 9:22-24). గనుక యేసు మోసిన సిలువ మనకు ముద్రకానే కాదు గదా! కనీసం ఆత్మీయ గుర్తుగా కూడా పనికి రాదు. అయితే లోకంలో సిలువను క్రైస్తవులు అందరిలలాగే ఓ సింబల్ (Symbol) గా వాడుకోవచ్చునేమోగాని దేవుడు చెప్పాడని మాత్రము కాదు. ఆ విధంగా సాతాను భిన్నమైన సువార్తలో ఉంచి మనకు తెలియకుండానే మన మీద తన ప్రభావం పడేటట్లు చేస్తున్నాడు.

ఇక మిగిలింది యేసు అనగానే గుర్తుకువచ్చేది ఆయన మనస్సు, లక్షణాలు, లక్ష్యం, ఆయనపడ్డ శ్రమలు, వేదనలు, నిందలు, అవమానాలు, సిలువ అంటే ఒక నిలువు కర్ర, ఒక అడ్డకర్ర కాదు. సిలువ యొక్క ఆత్మీయ భావం శ్రమకు గుర్తు. అందుకే పైన పేర్కొన్న వాక్యములో "ఇక మీదట ఎవరును నన్ను శ్రమ పెట్టవద్దు" (గలతీ 5:17) అని పౌలుగారు అన్నాడు. యేసు కోసం పౌలు తన శరీరంలో ఎంత శ్రమ అనుభవించాడో ప్రభువే స్వయంగా చెప్పాడు." ప్రభువు నీవు (అననీయతో) వెళ్ళుము. అన్యజనుల యెదుటను, రాజుల యెదుటను ఇశ్రాయేలీయుల యెదుటను నా నామము భరించుటకు ఇతడు నేను ఏర్పర్చుకున్న సాధనమైయున్నాడు. ఇతడు నా నామము కొరకు ఎన్ని శ్రమలను అనుభవింపవలెనో నేను ఇతనికి (పౌలుకు) చూపుదునని అతనితో (అననీయతో) చెప్పెను." (అపోకా 9:15, 16) అందుకే పౌలుగారు దేవుని రాజ్యంలో ప్రవేశించాలంటే మనం అనేక శ్రమలను అనుభవించాలి అని అన్నాడు.(అపోకా 14:22)

ఇంతకీ ఆనాడు పౌలుగారి శరీరముపై ఉన్న ముద్రలు కనపడే బెత్తముల దెబ్బలకన్నా కనపడని శ్రమలు ఎన్ని అనుభవించాడో ఆలోచిద్దాం. "వెఱ్ఱివానివలె మాట్లాడుచున్నాను. నేనును మరి ఎక్కువగా క్రీస్తు పరిచారకుడను, మరి విశేషముగా ప్రయాసపడితిని, మరి అనేక పర్యాయములు చెరసాలలో ఉంటిని... ఒకసారి రాళ్ళతో కొట్టబడితిని, ముమ్మారు ఓడ పగిలి శ్రమపడితిని, ఆపదలలోను ప్రయాసముతోను, కష్టములతోను, తరచుగా జాగరణములతోను, ఆకలి దప్పులతోను, దిగంబరత్వముతోను ఉంటిని. ఇంకనూ చెప్పవలసినవి అనేకములున్నవి. (2 కొరంథీ 11:22-28 దానియేలు 6:3-10, 1కొరంథీ 4:9-13)

ఇలా మనం అందరం కూడా ఎన్నో రకాల శ్రమలను అనుభవిస్తేనే ఆయన (క్రీస్తు) ముద్రలు మన శరీరముపైనా ఉన్నట్లే. కాని అవి బయటకు కనపడవు. ఎందుకంటే అవి ఆత్మసంబంధమైనవే తప్ప భూసంబంధమైనవి కావు. ఇవి అనగా శ్రమలు అనుభవించడమే మన సిలువను మనం మోయడం అన్నట్లుగా గ్రహించాలి. క్రీస్తుయేసు యొక్క ముద్ర కలిగినవారు పూర్తిగా ఆయన ప్రభావమునకు, ఆయన తత్వమునకు (ఫిలిప్పీ 2:4-8) లోబడినవారు లేదా లోనై ఆయనలా నడుచుకొన్నవారు అని వేరే చెప్పనవసరం లేదు. యేసు యొక్క ముద్రలు మన శరీరంపై కనబడగానే సాతాను తన ముద్రను మన మీద వేసే అవకాశమే లేదు కదా! కాబట్టి ప్రతి విశ్వాసి ఆడ-మగ, కుల-మత, వర్గ-వర్ణ, ప్రాంతీయ-భాషా విబేధాలకతీతముగా ఎవరిమీద ఏ ముద్రలున్నాయో మనల్ని మనమే పరీక్షించి, పరిశోధించి చూసుకుందాము (2కొరింథీ 13:5,6).

# పరిశుద్ధాత్మ ముద్ర

**మ**నుషులందరి బ్రతుకు పుస్తకం, జీవగ్రంథం, పరిశుద్ధగ్రంథమైన బైబిల్‌లో మనకు తండ్రియైన దేవుడు ప్రభువుగా చెప్పబడ్డాడు, మన రక్షకుడైన క్రీస్తు కూడా ప్రభువుగానే చెప్పబడ్డాడు, చివరగా ఆదరణకర్తయైన దేవుని ఆత్మ కూడా ప్రభువుగా చెప్పబడ్డాడు. ముగ్గురు ప్రభువులే



సందర్భానుసారంగా ఆ బిరుదులను వాడారు భక్తులు. ప్రభువగు పరిశుద్ధాత్మ (2కొరింథీ 3:15-18) యొక్క ముద్ర కూడా ఎలా ఉంటుందో కూడా జాగ్రత్తగా చూద్దాం.

"మీరును సత్యవాక్యమును, అనగా మీ రక్షణ సువార్తను విని క్రీస్తునందు విశ్వాస ముంచి, వాగ్దానము చేయబడిన **ఆత్మ**చేత ముద్రింపబడితిరి" (ఎఫెసి 1:13)

"దేవుని పరిశుద్ధాత్మను దు:ఖపరచకుడి విమోచన దినము వరకు ఆయన యందు మీరు ముద్రించబడియున్నారు(ఎఫెసి 4:30)

దేవుని పరిశుద్ధాత్మ మనతో, మనలో ఉన్నా మనము ఆయనను కంటితో చూడలేము, (యోహాను 14:16,17) ఆయన మనలో ఉన్న అనుభూతి, ఆనందాన్ని మాత్రమే అనుభవ పూర్వకముగా తెలుసుకోగలము. పైన వ్రాయబడిన వాక్యములలో మొదటి దానిలో ఆత్మచేత ముద్రింపబడ్డాం అంటున్నాం. అనగా ఆత్మయే ఒకముద్ర అని అర్థమిచ్చుచున్నది. రెండవ వాక్యములో ఆయన అనగా ఆ ఆత్మయందు మనం ముద్రింపబడియున్నాం అని అంటున్నాడు. అనగా ఆయన మనలో ఉండగా మనం ఆయనలో ఉండి చక్కగా (వాక్యానుసారంగా) నడువటమే ముద్రింపబడటం అంటే, ఆయన (పరిశుద్ధాత్మ) పోలిక, గుణగణములను మన ప్రవర్తన ద్వారా ప్రత్యక్షపరచటమే ఆయన ముద్రను కలిగి ఉండటము అన్నమాట. ఆయన (సత్య స్వరూపియగు ఆత్మ) కనిపించడు గనుక ఆ ఆత్మ ముద్ర కూడా కనపడదు. కాని నిన్ను మరియు నన్ను లేదా మనల్ని ఇతరులు చూడగానే ఆయనలో మనం ఉన్నట్లుగా లేదా ఆ ఆదరణకర్త మనలో ఉన్నట్లుగా కనబడాలి. ఆత్మచేత ముద్రింపబడిన వారిని గుర్తు పట్టడానికి వారు ఈ క్రింది వాక్యానుసారంగా ఉన్నారో లేదో సులువుగా చెప్పవచ్చు.

"మనము 'ఆత్మ'ననుసరించి జీవించువారమైతిమా 'ఆత్మ'ను అనుసరించి క్రమముగా నడుచుకొందము" (గలతీ 5:25). మన నడవడిని

బట్టి దేవుని ఆత్మచేత ముద్రింపబడ్డామో లేదో?, ఆత్మలో, ఆత్మతో నడుస్తున్నామో లేదో చెప్పవచ్చును అనిపై లేఖన భాగము చెప్పుచున్నది. ఆత్మచేత ముద్రింపబడిన వారంతా ఆత్మఫలాలను కలిగియుంటే చాలని వేరేగా చెప్పనవసరంలేదుగా. "అయితే 'ఆత్మ' ఫలమేమనగా ప్రేమ సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వికము, అశానిగ్రహము, ఇట్టివాటికి విరోధమైన నియమమేదియు లేదు" (గలతీ 5:22, 23).

దీనిని బట్టి గూడా దేవుని ఆత్మయొక్క ముద్ర శరీరము మీద బయటికి కనిపించదు కాని దాని ప్రభావంతో మన శరీరముతో నడుచుకొని ఇతరులు ఆ ముద్రను గుర్తుపట్టేట్లు జీవించడమే దేవుని ఆత్మ చేత ముద్రింపబడటం. ఇది కూడా మనిషి మామూలు కంటికి మరియు భూ సంబంధమైన కెమెరాలకు కూడా కనబడని ఆత్మసంబంధమైన ముద్రే. అనగా పూర్తిగా ఆత్మ ప్రభావానికి లోనైపోయి జీవితంలోని చివరి వరకు ఆ ప్రభావముతో ప్రతిక్షణం బ్రతికిన వారంతా ఆత్మచేత ముద్రింపబడినవారే. ప్రారంభ శతాబ్దములో అపొస్తలులతో పాటు ఆనాటి సంఘాలలో ఉన్నవారు ఈ ముద్రను కలిగియున్నారు గనుక ఆ వాక్యాలను పౌలుగారు మనకు బుద్ధి కలుగాలని వ్రాసియున్నాడు. ఎందుకంటే ఇశ్రాయేలీయులకు జరిగినవి ఆనాడు వారికి బుద్ధి కలుగుటకై మరియు నేడు మనకు కూడా బుద్ధి రావడానికేనని పరిశుద్ధాత్మ ద్వారా వ్రాయించాడ దేవుడు (1కొరింథీ 10:1-11; రోమా 15:4).

# దేవుని ముద్ర

**ము**ందుగా వివరించిన రెండు ముద్రలను అర్థము చేసుకొన్న వారికి దేవుని ముద్ర ఎలా ఉంటుందో సులువుగానే అర్థమవుతుంది. దేవునికి మరియు దేవుని వాక్యానికి సమాధానము దేవుని వాక్యమే తప్ప మరొకటి కాదు. దేవుని గూర్చిన సాక్ష్యము ఆయన కుమారుడైన క్రీస్తు అనగా వాక్యమే



సమాధానం చెప్పింది. దానిని ఒక క్రమ పద్ధతిలో చదవటమే మనం చేయాల్సిన పని. ఇలా చేస్తే ప్రకటన గ్రంథము అంతటి సులువైన పుస్తకం బైబిల్‌లో మరొకటి లేదు. ప్రకటన కన్నా పౌలు వ్రాసిన పత్రికలే గ్రహించుటకు కష్టమైనవి అని ఈ వాక్యానికి సాక్షియైన సంఘ స్థాపకుడు

అయిన పేతురు చెప్పాడు. (2 పేతురు 3:15-18) ఇక దేవుని ముద్ర గూర్చి కూడా జాగ్రత్తగా ఆలోచించి వాక్యానుసారంగానే పరిశోదిద్దాం.

"మరియు సజీవుడగు దేవుని ముద్ర గల వేరొక దూత సూర్యోదయం దిశ నుండి పైకి వచ్చుట చూచితిని. భూమికిని, సముద్రమునకు హాని కలుగజేయుటకై అధికారము పొందిన ఆ నలుగురు దూతలతో ఈ దూత మేము  మా దేవుని దాసులను వారి నొసళ్ళయందు ముద్రించువరకు భూమికైనను, సముద్రముకైనను హాని చేయవద్దని బిగ్గరగా చెప్పెను" (ప్రకటన 7:2-9)

ఈ సకల చరాచర సృష్టిలోని ప్రకృతిని అందులోనికి దేవుని కుమారులను నడిపించి, జీవింపచేయుటకే దేవుడు తన ప్రియ కుమారుడైన క్రీస్తును మరియు తన ఆత్మ అయిన పరిశుద్ధాత్మను ఎంచుకొన్నాడు. వారిరువురు దేవుని పని జరిపిస్తూ వారిద్దరి ముద్రలను మనకు వేయుచున్నారు. అయితే దేవుని ముద్ర అని  మళ్లీ ప్రత్యేకంగా వ్రాస్తున్నాడు అంటే ఇది ఏమై ఉంటుందో? దేవుడు కూడా ఆత్మ (యోహాను 4:24) ఆయనకు అదృశ్య లక్షణములున్నాయి (రోమా 1:18-22). గనుక ఆయనకు కనపడే రక్తమాంసాలతో కూడిన శరీరంలేదు. గనుక ఆయనను చూచిన ఏ నరుడు బ్రతకడు గదా, కాబట్టి ఆయన ముద్ర కూడా మనకంటికి కనిపించదని మళ్ళీమళ్ళీ వేరే చెప్పనవసరంలేదు. అయితే కనపడే మన నుదుట ఎలా కనపడని తన ముద్రను ఎలా ముద్రించుచున్నాడు దేవుడు.

"మీతో కూడా నిలిచియుండునట్లుగా మమ్మును స్థిరపరచి అభిషేకించినవాడు దేవుడే. ఆయన మనకు ముద్రవేసి మన హృదయములలో మనకు ఆత్మ అను సంచకరువు అనుగ్రహించియున్నాడు" (2 కొరంథీ 1:21, 22)

హృదయాలను పరీక్షించే దేవుడు మన హృదయాలలోనే తనదైన ఆత్మ ద్వారా ప్రతి వారిపైనా ముద్ర వేస్తున్నాడు. ఆ ఆత్మ మనం పరలోకం చేరేందుకు ధరావత్తుగా ఉన్నాడు. ఆత్మ మన హృదయంలో, మన శరీరం అనే తన ఆలయంలో ఉన్నప్పుడే మన నుదుట ముద్ర వేస్తున్నాడు. ఒక మనిషి దేవునిలో ఉన్నాడా? లేదా? అని చెప్పాలంటే ఏం చేస్తామో ఆలోచించండి. ఉదా:- వాకిలిని మరియు ఇంటిని చూసి ఆ ఇల్లాలిని గూర్చి అంచనా వేయవచ్చనే నానుడి ఎంత సరియైనదో, మనిషి ముఖం చూసి ఆ మనిషి గుణం చెప్పవచ్చు. అనేది అంతే కరెక్టు గదా! Face is the index of the mind అని విలియమ్ షేక్స్‌ఫియర్ చెప్పాడు. అయితే అంతకుముందు కొన్నివేల సం॥ల క్రితం ఇదే విషయాన్ని దేవుడు తన మరియు మన బైబిల్‌గ్రంథంలో చెప్పాడు. “వారి ముఖ లక్షణమే వారి మీద సాక్షమిచ్చుచున్నది” (యోషయా3:9). అందుకే ముఖంలో కూడా మనిషి గుణగణాల కోసం వారి నుదుటిని బట్టి అంచనావేస్తారు. గనుక దేవుడు తన ముద్రను కూడా మనిషి నుదుటి మీదనే వేస్తున్నాడు. అయితే సాతాను కూడా తన ముద్రను అక్కడే ఎందుకు వేస్తున్నాడో ఇప్పటికైనా అర్థం అయి ఉండాలి మనకు.

“మరిము సున్నతిలేని వారైనను నమ్మిన వారందరికి అతడు తండ్రి అగుట వలన వారికి నీతి ఆరోపించుటకై అతడు సున్నతి పొందక మునుపు, తనకు కలిగిన విశ్వాసము వలననైన నీతికి ముద్రగా సున్నతి అను గురుతు పొందెను”(రోమా4:11)

నీతిమంతుడు, అనేక జనముల నీతిమంతులకు తండ్రిగా పిలవబడ్డ అబ్రహాముకు కూడా దేవుడు తన యొక్క (ముద్ర) గుర్తువేశాడు. వారికి బయటకు కనపడే గుర్తు సున్నతి అయితే కనపడని ముద్రను నీతి

అంటున్నాడు. అబ్రహాము తన నిరీక్షణకు ఏ మాత్రము ఆధారము లేనపుడే దేవున్ని నమ్మాడు. గనుక అది అతనికి నీతిగా ఎంచబడింది. (రోమా 4:18-24) కాబట్టి ఆయనకు నీతి అనే ముద్ర వేశాడు. అతనితో పాటు అతనిలాగే దేవున్ని నమ్మిన వారందరికి నీతిని ముద్రగా వేసి నీతిమంతులుగా తీర్చిదిద్దుచున్నాడు. దేవుని ముద్రలో నీతి, విశ్వాసము అనగా శరీరకార్యములుగాకుండా అన్నీ ఆత్మయొక్క ఫలములే కనిపించాలి తప్ప కనపడే సిలువ గుర్తులో లేక వేరే ముద్రలో ఇంకేవైనా అక్షరార్థమైనవికావు అనేది దేవుని వాక్యము కూడా వివరించుచున్నది.

మన ఆత్మ దేవుడైన ఆత్మలో ఒక భాగము గనుక మన ఆత్మపై తన ముద్రను వేస్తున్నాడు. ఆయన వాక్యము శరీరాన్ని ధరించి నది గనుక మన శరీరముతో ఆయన పని చేయాలి. గనుక శరీరము మీద యేసుక్రీస్తు యొక్క ముద్ర వేస్తున్నాడు. శరీరమును-ఆత్మను అనుసంధానము చేయుటకే పరిశుద్ధాత్మచేత ముద్ర వేస్తున్నాడు. నిజంగా దేవుని పని, ప్రణాళిక ఎంత అద్భుతమైనదో ఆలోచిస్తే, మన ఆలోచన, జ్ఞానం అందులో ఒక బొట్టు లేదా చుక్కకు కూడా సరిపోదు. అందుకే మూడు ముద్రలు గూర్చి వ్రాయించాడు.

# 1,44,000 మంది జనులు

**త**న ప్రజలుగా ఏర్పరచుకొన్న వారిపై తన ముద్రను వేసేంత వరకు సముద్రానికి, భూమికి ఏ హానీ చేయవద్దు అని తన దూతలకు ఆజ్ఞాపిస్తున్నాడు దేవుడు. ఆ తర్వాత ఎవరు లెక్కింపలేని జనులను కూడా తన ప్రజలని అంటున్నాడు. ఆకాశ నక్షత్రముల వలె, సముద్రపు ఇసుక రేణువుల వలె విస్తరించిన తన ప్రజలైన ఇశ్రాయేలీయులలో కేవలం 1,44,000 మంది మీదనే తన ముద్రను వేయిస్తున్నాడంటే ఇంతకీ ఎవరు వీరు? ఏ కాలానికి, ఏ దేశానికి చెందిన వారు అని జాగ్రత్తగా దేవున్నే అడుగుదాము. ఈ లక్షానలుబది నాలుగువేల మందిని గురించి బైబిల్ పండితులు తలా ఒకరకంగా తలబద్దలు కొట్టుకొంటున్నారు. నేటి అనేక సంఘాల వారు ప్రత్యేకంగా ఉజ్జీవ సంఘాలుగా చెప్పుకుంటున్నవారు ఎవరికి వారు మేమే ఆ జనాంగం అని గర్వంగా చెప్పుకొని తిరుగుతున్నారు.

దేవుడు బైబిల్‌లో ఖచ్చితంగా, లెక్కతో సహా వివరంగా ఆ ప్రజలు ఇశ్రాయేలు 12 గోత్రాలలోని వారు మాత్రమే అని చెప్పినా, భారతీయులు, ప్రపంచంలోని అన్యుల నుండి మారిన క్రైస్తవులైన వారు మేమే ఆ జనాంగం అని అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలుగుతున్నారో అర్థంగావటంలేదు. ఎన్నో దేశాలలోని అన్యులైన వారి నుండి వచ్చిన క్రైస్తవులు కూడా ఇలాగే భయంకరముగా మోసపోతున్నారనే ఆలోచన వచ్చినపుడు ఎంతో బాధగా ఉంది. ఇప్పటికే ఎంతోమంది ఈ విషయం తెలియకనే మోసపోయారు.

ఇంకా రాబోయే తరాలలోని వారినైనా నిజమైన దేవుని వాక్యాలలో, విశ్వాసంలో ఉంచాలనే ఆలోచన, ఆశతో, ఆవేదనతో దేవుని ఆత్మచేత ముద్రింపబడి, ఆయన వాక్యపు వెలుగులో అదే దేవుని వాక్య ప్రకారంగా ఈ ప్రత్యేక జనులెవరో మనం కూడా పరిశోదిద్దాం. మనతో బాటు అనేకులకు ఆత్మీయ మేలులు అందేటట్లు చేద్దాం.

"మరియు ముద్రింపబడిన వారి లెక్క చెప్పగా వింటిని ఇశ్రాయేలు గోత్రములన్నిటిలో ముద్రింపబడిన వారు లక్షానలుబది నాలుగువేల మంది యూదా గోత్రములో ముద్రింపబడిన వారు 12వేల మంది, రూబేను గోత్రములో 12 వేలమంది, దాను గోత్రములో 12 వేలమంది, ఆషేరు గోత్రములో 12 వేలమంది, నఫ్తాలి గోత్రములో 12 వేలమంది, లేవి గోత్రములో 12వేల మంది, ఇష్షాఖారు గోత్రములో 12 వేలమంది జెబులూను గోత్రములో 12 వేలమంది, యోసేపు గోత్రములో 12 వేలమంది, బెన్యామీను గోత్రములో 12 వేలమంది ముద్రింపబడిరి" (ప్రకటన7:4-6)

ప్రకటన గ్రంథములోనే మరోచోట సంఖ్యలను గూర్చి ముఖ్యంగా 1000 అనే సంఖ్యకు ఆత్మీయ అర్థం చాలా పెద్దది. కాబట్టి వాటి విలువ ఇంత అని చెప్పలేక ఆ వేయి సంవత్సరాలను యుగయుగములు అని కూడా చెప్పినప్పుడు మరి 1,44,000 మందికి ఏదైనా మర్మయుక్తమైన అర్థం లేదా అని అనవచ్చును. అయితే వేయి సం॥ల పాలనలో కాల విభజనగాని, ఫలానా వారి దినాలలో అని గాని వివరంగా విడగొట్టి చెప్పలేదు. కాని దాని ప్రారంభమును గూర్చియు, ఆ పరిపాలన అంతమును గూర్చియు బైబిల్‌లో చాలా వివరంగా ప్రవక్తలు, అపొస్తలులు, క్రీస్తు వివరించారు గనుక దానిని యుగయుగాలు అని చెప్పాల్సి ఉంది.

ఎందుకంటే అది ప్రారంభమై 2000 సం॥లు అయింది. ముగింపు సూర్య, చంద్రులు, భూమి, చివరగా ఈ సృష్టి ముగింపుతో ముగుస్తుంది. అయితే ఈ 1,44,000 మందిని గూర్చి చెప్పినప్పుడు మాత్రము వారిని విభజించి ఒక్కొక్క గోత్రానికి 12 వేలమంది చొప్పున ఖచ్చితంగా లెక్కించాడు. గనుక ఈ సంఖ్యను సరిగ్గా ఆ సంఖ్యగానే తీసుకోవాలి.

అయితే మరీ ప్రత్యేకంగా నొక్కిచెప్పిన వీరెవరు? ఎప్పటివారు అనేది తేలాలి ఎందుకంటే వీరి గుణగణాలు లేదా ప్రత్యేకతలను చూచినపుడు మాత్రమే వారు ఏ కాలానికి, ఏ ప్రాంతానికి చెందినవారో తేలిపోతుంది. ఒకవేళ సరియైన అందరికి నచ్చిన సమాధానం దొరక్కపోతే బైబిల్‌ను మళ్ళీమళ్ళీ అడగాలి. దానిని కాలానుగుణంగా పరిశోధించాలి. (1 పేతురు 1:8-10), సత్యవాక్యాన్ని సరిగ్గా విభజించాలి. (2 తిమోతి2:15) కాబట్టి ఇదే 1,44,000 వేలమందిని గూర్చి మరోచోట అదే గ్రంథములో వ్రాయబడిన దానిని కూడా జాగ్రత్తగా చదివి ఆలోచించి, పరిశీలించి, పరిశోధించి వాక్యాధారమైన సమాధానాన్ని కనుక్కొందాం. క్రైస్తవ లోకంలోని వారి కలవరాన్ని కాలరాద్దాం. అందరిని వాక్యంలో ఐక్యం చేద్దాం.

“మరియు నేను చూడగా ఇదిగో ఆ గొఱ్ఱెపిల్ల సియోను పర్వతము మీద నిలబడియుండెను. ఆయన నామమును, ఆయన తండ్రి నామమును నొసళ్ళ యందు లిఖింపబడియున్న నూట నలుబది నాలుగువేల (1,44,000) మంది **ఆయనతో కూడా ఉండిరి**. మరియు విస్తారమైన జలముల ధ్వనితోను, గొప్ప ఉరుము ధ్వనితోను సమానమైన ఒక శబ్దము పరలోకము నుండి రాగా వింటిని. నేను వినిన ఆ శబ్దము వీణెలు వాయించుచున్న వైణికుల నాదమును పోలియున్నది. వారు సింహాసనము ఎదుటను, నాలుగు జీవుల యెదుటను, పెద్దల యెదుటను ఒక కొత్త

కీర్తన పాడుచున్నారు. భూలోకము నుండి కొనబడిన ఆ నూటనలుబది నాలుగువేల మంది తప్ప **మరి ఎవడును ఆ కీర్తన నేర్చుకొనజాలరు.** వీరు స్త్రీ సాంగత్యమున అపవిత్రులు కానివారు, స్త్రీ సాంగత్యమును ఎరుగనివారునైయుండి, గొఱ్ఱెపిల్ల ఎక్కడికి పోవునో అక్కడికెల్లా ఆయనను వెంబడింతురు. వీరు దేవుని కొరకును, గొఱ్ఱెపిల్ల కొరకును **ప్రథమ ఫలముగా** ఉండుటకై మనుషులలో నుండి కొనబడినవారు. వీరి నోట ఏ అబద్ధమును కనబడలేదు. వీరు అనింద్యులు"(ప్రకటన 14:1-5)

మొదటి వచనంలో లోకపాపాన్ని మోసుకొనిపోయే గొఱ్ఱెపిల్ల (యోహాను 1:32) అనగా యేసుక్రీస్తు శరీరధారియై భూమి మీద బ్రతికినపుడు మాత్రమే కొండ మీది ప్రసంగం వినినవారు అనగా ఆయనతో పాటు మొదట విన్నవారు ఇశ్రాయేలీయులు మాత్రమే ఉన్నారు. ఆయన ఎన్నుకున్న12 మంది అపొస్తలులు కూడా ఇశ్రాయేలీయులే, ఆయన తన స్వకీయుల యొద్దకే మొదట వచ్చాడు. రక్షణ మొదట యూదుల నుండియే కలిగింది. పరిశుద్ధాత్మ ఆనాటి పెంతెకొస్తు పండుగనాడు దిగి వచ్చిన తర్వాత అపో.కా. 10వ అధ్యాయంలోనే అన్యజనుల ప్రవేశము కూడా జరిగింది. ముందుగా 3000 మందితోనే సంఘం ప్రారంభమయింది. ఎందుకనగా సియోను పర్వతమనగా యెరుషలేము పట్టణము అందులో దేవుని ప్రజలు, దేవుని సమాజము లేక సంఘము అని అర్థం (యెషయా2:2,3) మొదట యేసుబోధనలో తన శిష్యులను నశించిన ఇశ్రాయేలు గొఱ్ఱెల యొద్దకే వెళ్ళమన్నాడు (మత్తయి 10:5-15) అని కూడా గుర్తుంచుకొంటే అద్భుతంగా ఉంటుంది.

ఆయన బ్రతికి ఉన్నపుడు మొట్టమొదట ఆయనను వెంబడించి, రక్షించబడిన వారంతా ఇశ్రాయేలీయులేనని మరచిపోవద్దు. అయితే

ఇశ్రాయేలీయులలో అనేకులున్నా కొందరు మాత్రమే తండ్రిని, కుమారున్ని సరిగ్గా అర్థం చేసుకొన్నవారు. యేసు దేవుని కుమారుడని ఆయన మరియు దేవుడు, యేసుక్రీస్తు కూడా విడిగా ఉన్నారని అర్థం చేసుకున్నవారు మాత్రమే ఆయనను యథార్థముగా వెంబడించారు. యూదుడిగా ధర్మశాస్త్రమునకు లోబడిన యేసు (గలతీ 4:4,5) ధర్మశాస్త్రమునకు వ్యతిరేకముగా మాట్లాడక దానిని నెరవేరుస్తూ, అది అప్పటికి యూదుల స్వంతం గనుక, అది కొట్టి వేయబడక ముందే అందులోని మర్మాలు అన్యులకు చెందగూడదు గనుక అనగా వారికి అర్థముగాకుండా కేవలము ఇశ్రాయేలీయులకు మాత్రమే అవి అర్థమయ్యేటట్లు మాట్లాడి, (మత్తయి 13:10-35) అనేకులు (అన్యులు) న్నప్పుడు మాత్రము ఉపమానములతోనే మాట్లాడేవాడు.

కాబట్టి మొదటి వచనం ప్రకారం ఈ 1,44,000 మంది యేసు శరీరంతో బ్రతికి ఉన్నప్పుడు మరియు చనిపోయి తిరిగిలేచాక అపొస్తలులు అదే వాక్యాన్ని స్థిరపరుస్తున్నప్పుడు, అనగా రాజ్యస్థాపన జరిగి దాని ద్వారా సంపూర్ణ సువార్త ప్రకటింపబడినప్పుడు క్రీస్తును దేవుని కుమారుడు మాత్రమే అని నమ్మి (అపొ.కా. 2:37-47) లోకంలో అన్నీ వదులుకొని భార్యాపిల్లలతో, కట్టుబట్టలతోనే ఏకమనస్సుతో, ఏక హృదయంతో, సంఘము లోపలి వారితోనే కాక, సంఘము వెలుపలి వారితో కూడా అనింద్యులుగా బ్రతుకుతూ తమ జీవితంలో ఆఖరి క్షణం వరకు శ్రమలను, శోధనలను సహించి ఆయనను వెంబడించిన వారేనని అర్థమగుచున్నది.

2వ వచనంలో దేవుని స్వరము ఇశ్రాయేలీయులకు ఉరుములు, మెరుపుల ధ్వనిలాగా విస్తార జలము లాగా వినబడింది అని చెప్పాడు (ప్రకటన 4:5). ఆ వెంటనే యేసును నమ్మిన గొఱ్ఱెలు అనగా అన్యులైన మనకేమో వీణెను వాయిస్తే వచ్చేంత మధురంగా ఉంది అంటున్నాడు.

పాత నిబంధనలో సినాయి కొండ మీదకి దేవుని మహిమ దిగి వచ్చినపుడు ఆయన ప్రజలు ఉరుములు, మెరుపుల ధ్వని పుట్టి భయపడినారు.(నిర్గమ 19:16 - 19) అదే స్వరము కొత్త నిబంధనలో అందరికి అర్థమయ్యే బాషలో ఈయనే నా ప్రియ కుమారుడు ఈయన యందు నేను ఆనందించుచున్నాను అనే వాక్కు వినబడింది. (మత్తయి 3:16) అది విని అందరూ ఆనందించారు. యేసు దేవుని కుమారుడని నమ్మి ఆయనను వెంబడించారు. దేవుని కుమారుడని నమ్మని వారైన యూదులే ఆయనను సిలువ వేశారు.

దేవుని వాక్కు జుంటితేనె కన్నా మధురమైనదని మరోచోట వ్రాయబడింది. అనగా వినగలిగే చెవులుంటే ఆ వాక్యము వీనులకింపైన సంగీతంలా మాధుర్యమైనదనియు దానిని వినలేని వాడికి అది ఉరుములతో కూడిన భయంకరమైన సముద్ర తరంగాల ఘోషగా ఉంటుంది అనేభావంతో చెప్పుచున్నాడు. ఇది కూడా యేసు నూతన నిబంధనను ఇశ్రాయేలీయులతో ప్రారంభించిన కాలంలోనిదేనని సులువుగా అర్థము చేసుకోవచ్చును.

3వ వచనంలో వారు సింహాసనము యెదుటను, నాలుగు జీవులు, పెద్దలయెదుటను నిలువబడ్డారు అన్నాడు. (ప్రకటన 4:2-11) సృష్టి ఆరంభమునకు పూర్వము కూడా దేవుని సింహాసనము అందరికన్నా ఎత్తైన పరలోకంలో ఉన్నది. ఆయనను సేవించే దూతలు, అందులో కొందరు అధికారులు, ప్రధానులుగా నాటి నుండి నేటి వరకు ఉండి ఆయన ఆజ్ఞలను గైకొని ఈ సృష్టిని మనకోసమే క్రమంగా నడిపిస్తున్నారు. మొదటి మానవుడైన ఆదాము మొదలుకొని నేటివరకున్న మనుషులందరమూ ఆయన పరలోకపు సింహాసనము ముందే నిలబడియున్నాము. ఎందుకంటే ఇశ్రాయేలీయులతో మరియు నేడు అందరితో కూడా దేవుడు మనం జీవిస్తున్న చూస్తున్న

ఆకాశము నా సింహాసనము, భూమి నా పాదపీఠము అని కూడా అన్నాడని మరచిపోవద్దు (అపో.కా. 7:50).

గొఱ్ఱె పిల్లగా వచ్చిన యేసును వెంబడించిన వారందరు కూడా ఆనాడు పరలోకంలోని ఆయన సింహాసనముతో పాటు, ఆయన సేవకగణమైన దూతలముందు నిల్చున్న వారి కిందనే లెక్క. వారందరు దేవునికి ఒక ఒక కొత్త కీర్తన పాడుతున్నారని, ఆ కీర్తనను వారు తప్ప మరొకరు నేర్చుకోజాలరని అనగా మరెవరు పాడలేరు, పాడకూడదు అన్నట్లుగా భావమిచ్చుచున్నది గదా. ఇంతకు ఆ కీర్తన ఏమిటో? ఆలోచించారా! యేసుతో పాటుగా నూతన నిబంధన కాలంలో క్రీస్తును వెంబడించిన కొందరు (ఇశ్రాయేలీయులలోని 12 గోత్రాలలో) మాత్రమే పాడినపాట మరియు ఇప్పుడు మరెవ్వరు పాడలేని, పాడకూడనిదే ఈ కీర్తన. ఈ కీర్తన అందరూ కలిసి పాడితే ఎంతో మధురంగా కూడా ఉంటుంది. కాని అది ఇప్పుడు అవసరమా కాదా? అనేది కూడా ఆలోచించాలి కదా! ఎందుకంటే చేయమన్నది చేయకపోయినా, వద్దన్నది చేసినా పాపమేకదా! (1యోహాను 5:17).

బైబిల్‌లో కీర్తనలు అనే గ్రంథము కలదు. అందులో దావీదు, అసాపు, కోరహు కుమారులు మోషే మొదలగు వారు వ్రాసిన 150 కీర్తనలున్నాయి. వాటిని పాటలుగా కూడా అర్థం చేసుకొన్నాము వాటి ద్వారా నేటికీ దేవున్ని కీర్తిస్తున్నాం, పాడుతున్నాం కూడా. గాని అవన్నీ ఆనాడు వారు దేవునికి పెట్టిన మొరలే సుమా! దేవునికి మొరపెట్టడం, దేవునికి విజ్ఞాపనచేయడం, దేవునిని అడగటం అనే దానిని మరొక పదంలో ప్రార్థన అని కూడా అంటాము గదా! వారు అనగా ఈ 1,44,000 మంది మాత్రమే పాడిన కొత్తకీర్తన అంటే బైబిల్‌లో అప్పటి వరకున్న కీర్తనలలోను, అంతకు

ముందున్న దేవుని ప్రజలుగాని వారి తర్వాత వచ్చే దేవుని ప్రజలు గాని అప్పటి వరకు ఎవ్వరూ పాడనిది అనగా ఎవ్వరూ చేయని ప్రార్ధనే ఆ కొత్త కీర్తన.

అదే విధంగా ఇది వాక్యానుసారంగా ఉన్నదో లేదో అదే దేవుని వాక్యంతో సరిచూసి అర్ధం చేసుకొందాం. ఇదే ఆనాటి వారికి, మరుగైయున్నా. నేటి జనులకు పూర్తిగా విప్పబడిన మర్మము. ఇది అపొస్తలుల ద్వారా అపుడే వివరించబడినా నాటి మరియు నేటి క్రైస్తవులలో 90శాతం మందికి నేటికీ అర్ధం కాలేదు. కాని పెద్ద, పెద్ద సంఘాలని చెప్పుకొని రైటు రెవరెండ్‌లు, బిషప్‌లనే వారు కూడా గుడ్డిగా చేస్తున్న ప్రార్ధన లేక కీర్తనే ఇది. ఈ కీర్తనను వారికివారే పాడరు కాని నేర్చుకొని పాడెదరని గూడా గుర్తు చేసుకొందాం. ఇంతకీ ఏమిటా కీర్తన? లేక ఎలాంటిది ఆ ప్రార్ధన. ఇది ఎవరు ఎవరికి, ఎందుకోసం, ఏ సందర్భములో నేర్పిన కీర్తనో కూడా చూద్దాం ఆలోచించి వివేకాన్నిపొంది దానిని ప్రకటిద్దాము.

# పరలోక ప్రార్థనా?
# ప్రభువు నేర్పిన ప్రార్థనా!?

“**ఆ**యన (క్రీస్తు) ఒకచోట ప్రార్థన చేయుచుండెను. ప్రార్థన చాలించిన తర్వాత ఆయన శిష్యులలో ఒకడు–ప్రభువా, యోహాను తన శిష్యులకు **నేర్పినట్టుగా** మాకును **ప్రార్థన చేయనేర్పుమని** ఆయననడిగెను. అందుకాయన కాబట్టి మీరీలాగున ప్రార్థనచేయుడి – పరలోకమందున్న మా తండ్రీ, నీ నామము పరిశుద్ధ పరచబడును గాక, నీ రాజ్యము వచ్చును గాక, నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమి యందు నెరవేరును గాక. మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము. మా రుణస్థులను మేము క్షమించియున్న ప్రకారము మా రుణములను క్షమించుము. మమ్ము శోధనలోనికి తేక దుష్టుని నుండి తప్పించుము. రాజ్యము, బలము, మహిమయునీవైయున్నవి. ఆమేన్” (లూకా 11:1–4; మత్తయి 6:9–13).

యేసు ప్రభువు భూలోకములో మనలాంటి మనిషిగా, ఆనాటి ఇశ్రాయేలు వారి తోటి మానవుడిగా, యూదుడిగా జీవించినప్పుడు పరలోకమందున్న దేవునినే సరాసరి తమకు కావాల్సిన వాటిని అడుక్కోవడానికి యూదులైన తన శిష్యులకు నేర్పిన ప్రార్థన ఇది. దీనిని భూమిమీద ఇశ్రాయేలీయులు జీవించిన కాలములో మాత్రమే చేయడానికి ప్రభువు వారికి నేర్పిన ప్రార్థనైతే దీనిని తమ స్వనీతితో నమ్మిన నేటి భక్తులు దీనికి పరలోక ప్రార్థన అని మరో పేరుపెట్టి ప్రతి ఆదివారం ఆరాధన, సభల తర్వాత తప్పనిసరిగా అందరిని నిలబెట్టి చేయిస్తున్నారు.

ఆలోచించండి దీనిని కొందరు కొన్ని సంఘాలలో మాత్రము ఇప్పుడు చేయడం లేదు. పెద్దపెద్ద సంఘాలుగా చెప్పుకొంటున్న వాటిలో మాత్రం తప్పక చేస్తున్నారు. ఈ ప్రార్థన లేక కీర్తన పాడకపోతే ఆ రోజు దీవెనలు పోగొట్టుకుంటామేమోనని చాలా మందిని భయపెడుతున్నారు. ఈ ప్రార్థన క్రైస్తవులలో ఎంతో గందరగోళముగా ఉన్నది. దీనిని ప్రత్యేకమైనదిగా చెప్పి నేడు క్రైస్తవుల చేత ఈ ప్రార్థన బలవంతంగా చేయించడం న్యాయమేనా? అని దేవుని వాక్యాన్నిబట్టి పరిశీలించి ఇకముందు మీరేమి చేయుచున్నారో జాగ్రత్తగా చూచుకొనండి. నా ఈ వివరణ తర్వాత మీరేం చేయాలో మీరే నిర్ణయం తీసుకోండి. అందుకే ఇంత వివరణగా వ్రాయుచున్నాను. గనుక తమ్మును తాము విమర్శించుకొనే వారు గొప్పవారు (2కొరింథీ 13:5).

బైబిల్‌లోని మోషె ధర్మశాస్త్రములో గాని, కీర్తనల గ్రంథములోగాని, ప్రవక్తల గ్రంథాలలోగాని లేని ఈ ప్రార్థన యేసు ప్రభువు కాలములో మాత్రమే ఉన్నది గాను, ఆయన ద్వారా ఆనాటి ఇశ్రాయేలీయులు అడిగి నేర్చుకొన్నదిగానూ కన్పిస్తుంది. పాత నిబంధన కాలంలోని ఇశ్రాయేలీయులు తమకు ఏది కావాలన్నా దేవున్ని అడగమని తమ యాజకుడితో చెప్పేవారు. యాజకుడు దేవాలయంలోని పరిశుద్ధస్థలంలోనికెళ్ళి వారి విన్నపాలు దేవుడితో చెప్పేవాడు. అయితే క్రమంగా వారి వారి క్రియలను బట్టి దేవుడు వారికి దూరమయ్యాడు. తర్వాత కాలంలో మళ్ళీ వారిని కరుణించి కరుణామయుడైన క్రీస్తుద్వారా ఇమ్మానుయేలుగా దేవుడు వారికి తోడయ్యాడు. త్వరలో ఆయన సిలువలో వారికిచ్చిన ధర్మశాస్త్రాన్ని నెరవేర్చి కొట్టివేయబోవుచున్నాడు. గనుక వారి మధ్యవర్తులైన యాజకులు కూడా తీసివేయబడతారు.

అయితే యేసును మధ్యవర్తిగా గుర్తించడానికి కొత్త నిబంధన లేక సంపూర్ణ సువార్త ప్రకటింపబడేంత వరకు వారు డైరెక్టుగా దేవునితో సంబంధము పెట్టుకోవడానికి క్రీస్తుద్వారానే దేవుడు వారికిచ్చిన అవకాశమే ఈ కొత్తగా నేర్పిన ప్రార్థన. యేసు అప్పటికింకా సిలువలో మరణించలేదు, తిరిగి లేపబడలేదు. ఆ కాలములో ధర్మశాస్త్రము మార్పునకు లోనవుతుంది (కొండమీద ప్రసంగము ద్వారా). గనుక ఆ గొఱ్ఱెపిల్ల తాను బోధించిన $3^{1/2}$ (మూడున్నర) సంవత్సరాల కాలములో ఆయన ఎక్కడికెళితే అక్కడికెళ్ళిన వారే ఈ 1,44,000 మంది జనులు, వీరు ఈ లోకమనే స్త్రీతో మరియు మహాబబులోను అనే వేశ్యయైన స్త్రీతో అనగా ఆనాటి రోమా ప్రభుత్వానికి లొంగక, దానితో సహవాసము లేక సాంగత్యము లేని వారు. అనగా తన లోకాశలను చంపుకొని లోకములోని వారితో లోకనాధుడైన సాతానుతో కూడా నింద మోపబడిన వారు కారు. ఇక ప్రభువు నేర్పిన ప్రార్థన లేక పరలోకప్రార్థనను ఇప్పటికీ మనం కూడా చేయవచ్చా అనేది కూడా ఓసారి ఒక్కొక్క వాక్యాన్ని ప్రత్యేకంగా పరిశీలించి ధ్యానిద్దాం.

**పరలోకమందున్న మా తండ్రీ నీ నామము పరిశుద్ధపరచబడునుగాక**

ఈ ప్రార్థన లేక కీర్తనలోని మొదటి వాక్యము తండ్రీ నీ నామము పరిశుద్ధపరచబడును గాక. పాత నిబంధన కాలములో దేవునిని అనగా యెహోవాను భీకరుండు, భయంకరుడు, యాజమాని, ప్రభువుగా పెదవులతో కూడా స్తుతించి పొగిడేవారు (కీర్తన 136). ప్రభువుకు స్తోత్రములు కలుగునుగాక అని చెప్పేవారు. కాని ఈ నూతన నిబంధనలో ఉన్న మనమంతా ఆయన నామమును ఆ తండ్రికి కుమారులుగా మనము కూడా పరిశుద్ధపరచాలి. మనం (క్రైస్తవులు) పనిచేసి మన చేతలతో (లూకా

6:46) స్తుతించాలి. క్రియలతో మహిమ పరచాలి. పెదవులతో దేవునికి స్తోత్రములు కలుగును గాక అని మాత్రమే పలుకకూడదు. దేవుని నామానికి స్తుతి మరియు స్తోత్రములు అని అనాలి (ఫిలిప్పీ1:3-9). కాబట్టి దీనిని కేవలము వారు అనగా ఆనాడు ప్రభువును వెంబడించిన ఇశ్రాయేలీయులలో కొందరు మాత్రమే పలకడమే అనగా పాడటమే న్యాయం.

**నీ రాజ్యము వచ్చును గాక**

తరువాత వాక్యము నీ రాజ్యము వచ్చును గాక (దేవుని రాజ్యము, పరలోక రాజ్యము, క్రీస్తు యేసు రాజ్యము ఈ భూమిమీదకు వచ్చిందా? లేదా అనే విషయం **1000 ఏండ్ల పరిపాలన** అనే పుస్తకంలో పూర్తిగా విశదీకరించి వ్రాశాను. దయచేసి దానిని తప్పనిసరిగా చదువగలరు). యేసు భూమి మీదకు వచ్చినదే ఆయన రాజ్యాన్ని స్థాపించడానికి అది వారి మధ్యకు త్వరగా రావాలని వారంతా ఆ రాజ్యంలో మొదటప్రవేశించాలి గనుక వారిని మాత్రమే ఈ ప్రార్థన చేయమన్నాడు లేదా ఈ కీర్తన పాడమన్నాడు. యేసు, మరణ, సమాధి పునరుత్థానంతో యేసు రాజ్యంలోనికి ప్రపంచమంతా (అన్యులు మరియు ఇశ్రాయేలీయులు) సభ్యులుగా లేదా రాజులైన యాజక సమూహంగా (1పేతురు 2:9) ఆ రాజ్యంలో పాలిభాగస్తులనుగా చేసి (ప్రకటన 1:6,9) ఆయన రాజ్యనివాసులనుగా ఎప్పుడో చేశాడు (కొలస్సి 2:13).

ఎప్పుడైతే ఆయన రాజ్యం అనగా సంఘం లేదా నూతన యెరూషలేము పెండ్లి కుమార్తెగా అలంకరించుకొని తన భర్తయైన క్రీస్తు కొరకు సర్వాంగ సుందరంగా అలంకరించుకొని (ప్రకటన 21:2-10) భూమి మీదకు (అ.పొ.కా. 2:38-47) దిగి వచ్చింది కాబట్టే అప్పటినుండే

నీ రాజ్యము వచ్చునుగాక అంటే ఎంత దరిద్రంగా ఉంటుందో ఆలోచించండి. ప్లేటులో భోజనం వడ్డించాక తినాలిగాని ఇంకా అన్నం వడ్డించండి అంటే గుడ్డివాడు అంటారు గదా! మనం గుడ్డివారము కాదు కళ్ళముందు జరిగిన, జరుగుచున్న, జరుగబోవుచున్న వాస్తవాలను చూడాలి, అవసరమైతే వ్రాయబడిన వాక్యాన్ని పరిశోధించాలి కూడా దేవుని రాజ్యం మనమే (లూకా 17:20,21). ఇప్పుడు సత్యం తెలిశాక కూడా నీ రాజ్యము వచ్చునుగాక అని ప్రార్ధన చేయడం అవిశ్వాసం గాక మరేమి అవుతుందని ఆలోచిద్దాము.

**నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు, భూమి మీద నెరవేరును గాక :**

అందరికి తండ్రియైన దేవుడు ఆయన పిల్లలైన మానవులు అందరూ తన ప్రియకుమారుడైన క్రీస్తును నమ్మి క్రీస్తుద్వారానే ఆయనయెదుట పరిశుద్ధులై, నిర్దోషులై నిలబడి ఆయన కృపామహిమకు కీర్తి తేవాలని ఈ జగత్తుకు పునాది వేయకముందే తన దయాసంకల్పము చొప్పున ప్రేమతో క్రీస్తులోనే మనలను అందరిని నిర్ణయించుకొన్నాడు. (ఎఫెసీ 1:1-12) ఆయన చిత్తాన్ని మరియు దేవుడు చెప్పిన ప్రతిపనిని పరలోకంలోని దేవదూతలు, పరలోకం నుండి పంపబడిన క్రీస్తు, పరిశుద్ధాత్మ సహాయంతో నెరవేర్చారు, ఇంకా నెరవేర్చుచున్నారు. ఏ తండ్రి అయినా తమ పిల్లలు తన పనిచేస్తే చూసి ఆనందిస్తారు గదా! తన పిల్లలుగా మనం చేయాల్సిన పని మరొకరు చేస్తారులే అని మనమే చెపితే ఆ తండ్రికి బాధతో పాటు కోపం గూడా వస్తుంది.

యేసుక్రీస్తు కూడా ఈ లోకంలోనికి శరీరధారియై వచ్చేటప్పుడు "బలియు అర్పణయు నీవు కోరలేదు గాని నాకొక శరీరమును అమర్చితివి,

పూర్ణహోమములు పాప పరిహారార్ధ బలులును నీకిష్టమైనవికావు. అప్పుడు నేను – గ్రంథపు చుట్టలో నన్ను గూర్చి వ్రాయబడిన ప్రకారం దేవా నీచిత్తము నెరవేర్చుటకు ఇదిగో నేను వచ్చియున్నానంటిని" (హెబ్రీ 10:5-7).

మనందరికి మార్గమైన యేసే దేవుని చిత్తాన్ని తన శరీరంతో నెరవేర్చినప్పుడు ఆయన (క్రీస్తు) శిష్యులమైన మనము కూడా మన శరీరముతో దేవుడా నీ చిత్తము నెరవేర్చుటకే మేం వచ్చి ఉన్నాం అని తప్పకుండా అనాలి. కాని ఇంకా ఆయన లేకా నీ చిత్తము నెరవేరును గాక అంటే ఎవరో కొందరు నెరవేరుస్తారు మాకెందుకులే ఈ భారము అన్నట్లుగా లేదా! కాబట్టి ఆనాటి ఇశ్రాయేలీయులను అనమన్నట్లు లేక అడుగమన్నట్లు నేడు మనం అనకూడదు. మనకున్న ఆజ్ఞలన్నీ మనం స్వయంగా నెరవేర్చి ఆయనను మహిమపర్చాలే గాని పెదవులతో మాత్రమే దీనిని పలుకకూడదు. మీ చిత్తము మేమే నెరవేరుస్తాము తండ్రీ మాకే ఆ భాగ్యము ఇవ్వండి నాయనా అని అనాలి. ఇది బైబిల్‌లోని వాక్యాలకు ఒకటి కలుపడము కాదు, ఒకటి తీసివేయడమూ కాదు. సిలువ వేయబడిన తర్వాత క్రీస్తుబోధ ప్రకారము నడుచుకొనుట అని గ్రహించాలి.

**"మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము" :**

ఆనాటి శిష్యులు ఆయన ఆజ్ఞప్రకారం ఎక్కడికెళ్ళినా సంచినిగాని, జోలెనుగాని (మత్తయి 10:5-15) తీసుకెళ్ళలేదు. ఏమి తిందుమో, ఏమి త్రాగుదుమోనని ఆలోచించలేదు (మత్తయి 6:30-34). ఎందుకంటే ఆయన చెప్పిన మాట విన్నారు, దాని ప్రకారం ప్రవర్తించారు గనక వారు ప్రతిదినము ప్రార్థన, సహవాసములో తప్పకుండా కలుసుకొని ఇంటింటా రొట్టెవిరిచి భోజనం చేశారు. అందుకే వారికిది నేర్పాడు. మరి ఈ రోజుల్లో

మనందరము ఎలా ఉన్నామో ఒక్కసారి ఆలోచించండి. పంట పండించుకొన్న రైతులైనా ఉద్యోగం చేసే వాళ్ళు అయినా సంవత్సరానికి సరిపడా లేదా ఒక నెలకు సరిపోయే బియ్యం మొదలైనవి ముందుగానే ఇంట్లోనే ఉంచుకొంటున్నారు. ఏదైనా ఊరెళ్ళినా, సువార్తకెళ్ళినా సాధ్యమైనంతమట్టుకు నీళ్ళ సీసాతో సహా ఆహారం వండుకొని, ప్యాక్ తీసుకెళ్ళుచున్నాం గదా! ఆదివారం ఒక్కరోజే మరియు సువార్త సభలలో మాత్రమే అది కూడా తినివచ్చి మా అనుదినాహారం మాకు దయచేయమని ప్రార్థించడం అన్యాయం, అక్రమం కాదా! ఆలోచించండి.

వార్షిక సభలలోనో, ప్రతి విధమైన ఆరాధనలో కూడా ఈ ప్రార్థన చివర్లో చేయడం అదీ వంతుకు అనగా మొక్కుబడిగా చేయాలి అన్నట్లు చేస్తున్నాం అంటే అది ఆత్మీయంగాకాక నటనలాగే అనగా తప్పనిసరిగా చేయాలనే రూలు ఉన్నట్లుగా చేస్తున్నారు. ఇది ఎంతవరకు వాస్తవమో ఆలోచించండి. వండుకున్న ఆహారము కూడా తినలేని పరిస్థితి, తిన్నది అరగక ముందే పోయేవారం మనము. అందుకు ప్రతి క్షణము, ప్రతి దినము దేవుని ప్రార్థిస్తూ ఉండాలి. నేడు శరీర ఆహారంకోసం కాక (యోహాను 6:25-27) ఆత్మరక్షణ, పరలోకం కోసం మాత్రమే ఇప్పుడు ప్రార్థించాలి. నేటికాలంలో మనకు ఆహారం కావాలంటే కష్టపడి పని చేయాలి (2థెస్స 3:11-12). మనం సువార్తికులమైనాక కూడా ఎవరి వద్ద ఉచితంగా తినకూడదని సిలువవేయబడిన క్రీస్తు బోధించాడు (అపొ.కా. 20:33-35).

**"మా రుణస్థులను మేము క్షమించియున్న ప్రకారము మా రుణములను క్షమించుము" :**

దేవుడు ఇశ్రాయేలీయులైన వారికి మాత్రమే ఇచ్చిన పాతనిబంధన లోని ధర్మశాస్త్రములో ఉన్న ఆజ్ఞలు అన్నింటిని తుచ తప్పకుండా ఆచరించి

తీరాలి ఆనాటి ఇశ్రాయేలీయులు. అదే వారికి దేవునికి మధ్యన మధ్యవర్తి. తొమ్మిది ఆజ్ఞలను నెరవేర్చి ఒక్క ఆజ్ఞ నెరవేర్చకపోయినా అపరాధి అవుతారు (యాకోబు 2:10-13). అందుకే వారికి నేర్పిన ఈ కొత్త కీర్తన లేక ప్రార్థనలో కూడా ఖచ్చితంగా మేము నెరవేర్చియున్న అనగా క్షమించిన ప్రకారము అనమని అనమంటున్నాడు. వారు అప్పటికింకా క్రీస్తు ధర్మశాస్త్రము (కొత్త నిబంధన) / కృపలో లేరు గనుక వారు ఇతరుల పాపాలను క్షమించినపుడే వారి పాపాలు క్షమింపబడుతాయి. మరి క్రీస్తు కృపలో సిలువ వేయబడిన క్రీస్తు బోధలో ఉన్న మనం మనవారి పాపాల్ని క్షమింపకపోయినా దేవా మమ్మల్ని మాత్రము క్షమించండి అని అడిగితే చాలు మన పాపాలు అన్నీ క్షమించబడతాయి.

నూతన నిబంధన ద్వారా వారి మరియు మన పాపాల్ని దేవుడు మరచిపోతానని ఎప్పుడో చెప్పినా (హెబ్రీ 8:8-13) మనమే వద్దు ప్రభువా మీరు మునుపటివి మరువకండి మేం మా వారిని క్షమిస్తేనే మీరు మమ్మల్ని క్షమించండి లేకుంటే వద్దు అని చెప్పడం ఎంత వరకు న్యాయమో ఆలోచించాలి. ఆయన చెప్పినట్లు మనం వినాలి, చేయాలి గాని ఆయనకు మనం ఎదురు చెప్పకూడదు గదా. అందుకే ఈ మాట కూడా మనం ఎప్పుడైనా అనకూడనిదే అని అర్థం చేసుకొంటేనే ధన్యులము, దేవా మమ్మల్ని క్షమించి రక్షించమని అనుక్షణము ప్రార్థించాలి, వారానికొక్కసారి కాదు. లేదా సువార్త సభలలో, పెళ్ళిళ్ళలో, కేవలము కృతజ్ఞతా కూటాలలో మాత్రము కాదు. ఇది మనుష్యులు కల్పించిన పద్ధతి. దీనిని చేస్తే వచ్చే లాభంకన్నా నష్టమే ఎక్కువగా ఉందని గ్రహించితేనే ధన్యులము.

**"మమ్మును శోధనలోకి లేక దుష్టుని నుండి తప్పించుము"**

పాత నిబంధనలో దేవుడు ఏర్పాటు చేసుకొన్న ప్రజలు ఇశ్రాయేలీయులు గనుక ఆయన వారి అవసరాలన్నీ వారు అడుగకముందే తీర్చాడు. దేవున్ని వారు అడుగకముందే వారిని స్వస్థపరుస్తానన్నాడు (నిర్గమ 15:26). అడిగినప్పుడల్లా తినడానికి మన్నాను కురిపించాడు. ప్రతిసారి వారికి ముందుండి నడిపించాడు. దుష్టునితో యుద్ధము నేను చేస్తాను యుద్ధము యెహోవానైన నాదే మీరు నా వెనుకాల ఉండండి అన్నాడు. అందుకే వారిని అడగమన్నాడు కనుక వారు దేవా దుష్టుని నుండి మమ్మును తప్పించుము అని అడిగారు కొందరు ఇది గ్రహించలేక నేటికీ అడుగుతున్నారు. అదే నేడు మన క్రైస్తవులకైతే "శోధన సహించువాడు ధన్యుడు, అతడు శోధనకు నిలిచినవాడై ప్రభువు తన్ను ప్రేమించు వారికి వాగ్దానము చేసిన జీవ కిరీటము పొందును" (యాకోబు 1:12) అని అన్నాడు.

"సాధారణముగా మనుష్యులకు కలుగు శోధన తప్ప మరి ఏదియు మీకు సంభవింపలేదు. దేవుడు నమ్మదగిన వాడు. మీరు సహింపగలిగినంత కంటే ఎక్కువగా ఆయన మిమ్మును శోధింపబడనియ్యడు. అంతేకాదు సహింపగలుగుటకు ఆయన శోధనతో కూడా తప్పించుకొను మార్గము కలుగజేయును" (1 కొరంథీ 10:13) అని నాటి నుండి నేటి వరకు ఈ మాటలు బోధిస్తూనే ఉన్నాడు. కాని మనవారిలోనే కొందరు సాతాను అనుచరులైన బోధకులే పనిగట్టుకొని ప్రతివారు బాప్తీస్మం తీసుకొని సంఘంలోనికి రాగానే నేడు మనకు పనికిరాని ఈ ప్రార్థన బలవంతంగా నేర్పించి ఆజ్ఞాతిక్రమము చేయిస్తున్నారు.

ఈ రెండు వాక్యముల ప్రకారం ఆలోచిస్తే మనం ఎట్టి పరిస్థితులలో కూడా మమ్మల్ని శోధనలోకి తేవద్దు అని అడుగకూడదు. ఎందుకంటే పాతనిబంధనలో ఉన్న యోబును, క్రీస్తును దేవుడే శోధనలోనికి తెచ్చాడు. అనగా వారిని ఇంకా కొందరిని (హెబ్రీ 11:36-38) శోధించే అవకాశం దేవుడే సాతానుకు అప్పగించాడు గదా. ఇప్పుడైతే మనం మన స్వకీయ దురాశలను బట్టి ఎప్పుడో ఒకప్పుడు తప్పక శోధనలో పడుతాం. ఈ కృపాకాలంలో ఆయన ఎవనిని శోధింపడు, శోధింపబడనీయడు (యాకోబు 1:12-18). మనమే కావాల్సి శోధనలో పడిపోతాం గనుక దాని నుండి తప్పించుకోవలసింది కూడా మనమే. గనుక ఇది దేవునికి సంబంధము లేదు. శోధన సహించి అందులోంచి బయటపడే మార్గము చూపించు దేవా అని ప్రార్థించాలి. ఆనాడు శోధన సహించిన యోబును జ్ఞాపకం చేసుకోవాలి. అలాగే దుష్టున్ని మనమే ఎదిరించి పోరాడాలి. "అపవాదిని ఎదురించుడివాడు మీ యొద్ద నుండి పారిపోవును" (యాకోబు4:7).

దుష్టుని నుండి మనం తప్పించుకోవాలి. కాని నీవే తప్పించు దేవా, మాకు శోధన వద్దు, అన్నీ శుభాలే కావాలి అని అడుగటం క్రీస్తుబోధ ప్రకారం ఆజ్ఞాతి క్రమం అవుతుంది జాగ్రత్త. ఇప్పటికి అర్థము కాకపోతే ఇంకా బైబిల్‌లో చాలా వాక్యాలున్నాయి. వెతుక్కొని చదివి గ్రహించుకోగలరు. మనం చేసేది వాక్యంలో ఉన్నా దానిని ఏ కాలంలో ఏది చేయాలో అది చేస్తేనే వివేకులము అవుతాము. లేదా అక్రమము చేయువారలారా నా యొద్దనుండి తొలిగిపొండి అనే వారి జాబితాలో చేరిపోతాము (మత్తయి 7:22-27). కాబట్టి ఈ కీర్తన లేదా ఆనాడు వారికి ప్రభువునేర్పినప్రార్థనలో ఈ వాక్యభాగానికి కూడా నేడు కాలం చెల్లిందని గుర్తుంచుకోగలరు.

**"రాజ్యము, బలము, మహిమయు నీవైయున్నది" "ఆమెన్"**

నేడు మనం చేస్తున్న ప్రార్థన మొదటలో తండ్రీ అని ప్రారంభించి, చివర్లో కూడా యేసునామంలో అడుగుతున్నాము తండ్రీ అని అనటం అపొస్తలుల ద్వారా సిలువ వేయబడిన క్రీస్తు మనకు అనగా క్రైస్తవులకు నేర్పిన ప్రార్థన. మరియు అలాగే చేసితీరాలి. కాని ఆనాటి వారికి నేర్పిన ఈ ప్రార్థనలో చివర్లో యేసునామంలో అడుగుతున్నాము తండ్రి అనేపదం కూడా లేదు. ఆనాటి యూదులకు దేవునికి క్రీస్తు మధ్యవర్తిగా లేడు. వారు డైరెక్టుగాకాక యాజకుడి ద్వారా దేవుడినే అడుగాలి. కాని ఇప్పుడు మనం దేవున్ని ఏది అడిగినా దేవుని కుమారుడైన యేసుక్రీస్తు నామంలో అడుగమని క్రీస్తు ఆనాడే చెప్పాడు. "ఆ దినమున మీరు దేనిగూర్చియు నన్ను అడుగరు. మీరు తండ్రిని నా పేరిట ఏమి అడిగినను ఆయన మీకు అనుగ్రహించునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను.

ఇది వరకు మీరేమియు నాపేరిట అడుగలేదు. మీ సంతోషము పరిపూర్ణమగునట్లు అడుగుడి, మీకు దొరుకును" (యోహాను 16:23-24) క్రొత్త నిబంధన పూర్ణముగా ప్రకటింపబడి అమల్లోకి వచ్చిన తర్వాత ఎవ్వరూ కూడా తండ్రియైన దేవునిని డైరెక్టుగా ఏది అడుగకూడదు. ప్రతీది యేసు నామంలో అనగా యేసు ద్వారానే అడిగి తీరాలి. (యోహాను 14:6, ఎఫెసి 5:19-21, కొలస్సీ 3:16,17) ఈ ప్రార్థన లేక కొత్త కీర్తనలో యేసుక్రీస్తు నామంలో అడుగుచున్నాము. తండ్రీ అనే మాట అస్సలు లేదు గనుక ఈ ప్రార్థనను ఈ కాలంలో మనం అస్సలు చేయడానికి వీలులేదని ఖచ్చితముగా చెప్పవచ్చును. యేసు శరీరధారియై ఉన్నప్పుడు ఆనాటి ఇశ్రాయేలీయులైన వారికి మరియు అపొస్తలులకు క్రీస్త మధ్యవర్తిగా లేడు గదా! అయితే ఇప్పుడు ఆయనే (క్రీస్తే) అందరికి మధ్యవర్తి.

యోహోవా ఏర్పాటుచేసిన దినమని ఆ దినము ఇశ్రాయేలీయుల బలము అనగా ధర్మశాస్త్రము కొట్టివేయబడిన ఆ భయంకరమైన మహ దినము అనియు సూర్యున్ని చీకటి కమ్మిన దినము అయిన క్రీస్తు మరణ దినము ఆ తర్వాత యెరుషలేములో నుండి అనగా ధర్మశాస్త్రమనే చెరలో నుండి, యూదా మతాధికారుల బోధ, పరిపాలన వారి అర్చన, ఆరాధనల నుండి, మనుషులు కల్పించిన పారంపర్యాచారముల నుండియు తప్పించుకొనిన వారందరు రక్షింపబడతారని దేవుడు ముందే వ్రాయించాడు. “యోహోవా యొక్క భయంకరమైన ఆ మహాదినము రాకమునుపు సూర్యుడు తేజోహీనుడగును, చంద్రుడు రక్తవర్ణమగును. యోహోవా సెలవిచ్చినట్లు సియోను కొండమీదను, యోరుషలేములోను తప్పించుకొనిన వారందరు శేషించిన వారిలో యోహోవా పిలుచువారు కనబడుదురు. ఆ దినమున యోహోవా నామమును బట్టి ప్రార్థన చేయువారందరును రక్షింపబడుదురు” (యోవేలు 2:28-32, అ.పో.కా. 2:17-21).

యేసు మరణించిన తరువాత ఎవరైతే యెరుషలేములోని హింసలకు తట్టుకొని, వాటిని తప్పించుకొని ఆయనకు సాక్షులుగా నిలబడ్డారో, ఎలాగైనా దేవుని నామమును బట్టి అనగా ప్రభువైన యెహోవా నామమును బట్టి అదేనండీ పరలోకందున్న మా తండ్రీ అనే ప్రభువు నేర్పిన ఆ ప్రార్థన లేక ఆ కొత్త కీర్తన పాడిన వారే రక్షింపబడుతారు అని చెప్పాడు, వారిని నేనే పిలిచానని అంటున్నాడు. గనుక దేవుడు ప్రత్యేకంగా పిలిచిన వారే ఈ 1,44,000 మంది ఇశ్రాయేలీయుల గోత్రములలోని జనులు. అప్పటికి వీరికింకా యేసు నామంలో ప్రార్థన చేయడం అలవాటులేదని అర్థమగుచున్నది.

ఎందుకంటే ఇంకా అపోస్తలుల కార్యముల ద్వారా సువార్త బోధనల ద్వారా మరియు పత్రికల ద్వారా సత్యము పరిపూర్ణము కాలేదు గదా. అనగా సంపూర్ణ సువార్త లేదా సర్వసత్యము ఇంకా రాని సమయంలో మరియు అన్యజనులు ఇంకా దేవుని రాజ్యములోకి రాని ఆ కాలములో గొఱ్ఱెపిల్లను వెంబడించిన ఇశ్రాయేలు 12 గోత్రములలోని వారే ఈ 1,44,000 జనులు అని ఖచ్చితముగా చెప్పవచ్చును. వీరు ప్రభువు ద్వారా ప్రత్యేకంగా పిలువబడిన వారు, వ్రాయబడినవారు గనుకనే వారిని గూర్చి ప్రకటన గ్రంథంలో 2 చోట్ల ఖచ్చితంగా వ్రాయబడినది. దీంట్లో అన్యులెవరు లేరు. వారికిచ్చిన వాగ్దాన ప్రకారం ఉండకూడదు కూడా.

ఇంత అద్భుతమైన అంశము ఆ 1,44,000 మంది ఇశ్రాయేలు గోత్రముల వారు పాడే ఆ కీర్తనలో ఉన్నది. దేవుని చేత ముద్రింపబడిన వారు ఎవరో ఇప్పటికైనా పూర్తిగా అర్థం అయిందనుకొంటున్నాను. ప్రకటన గ్రంథము చదివే విధానంలో చాలా జాగ్రత్తగా చదివి, ఆత్మతో చాలా ఆలోచించి, ఆత్మ సహాయంతోనే చదివితే ఒక్క ప్రకటనే కాదు బైబిల్ అంతా చాలా సులువుగా అర్థం అవుతుంది. మిగతా వాక్యాలను కూడా ధ్యానించి ఇంకా ముందుకెళ్ళి దేవుని ముద్ర గల ఆ 1,44,000 మంది ఎవరో పూర్తిగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నిద్దాం.

**ప్రకటన14:4**వ వచనంలో “వీరు స్త్రీ సాంగత్యమున అపవిత్రులు కాని వారును, స్త్రీ సాంగత్యమును ఎరుగని వారునైయుండి, గొఱ్ఱెపిల్ల ఎక్కడికి పోవునో అక్కడికెల్ల ఆయనను వెంబడింతురు. వీరు దేవుని కొరకును గొఱ్ఱెపిల్ల కొరకును ప్రథమ ఫలముగా మనుష్యులలో నుండి కొనబడినవారు”.

స్త్రీ అనగానే అక్షరార్థముగా ఆడవారిగానే తీసుకొని పెళ్ళి చేసుకోకుండా వివాహమును నిషేదించి ఈ 1,44,000 మందిలో ఉండాలని ఈనాటికి మన దేశం, మన ప్రాంతంలోని అనేకులు చూస్తున్నారు. కాని దేవుని అనాది సంకల్పం ఏమిటో తెలుసా? (ఎఫెసి 1:3-6) నరుడు ఒంటరిగా ఉండుట ఆయనకే (దేవునికే) మంచిది కాదని (ఆది.కాం.2:18) అడగకుండానే ఆదాముకు పెళ్ళిచేసి, వారిని ఫలించి, విస్తరించి, భూమిని నిండించమని ఆజ్ఞాపించి ఆశీర్వదించాడు (ఆది.కా. 1:28,7).

ఆ తర్వాత దేవుని కోసమే పిల్లలనుకని యేసుక్రీస్తు ద్వారా తన సన్నిధిలో పరిశుద్ధులుగా, నిర్దోషులుగా నిలబెట్టండి అని అన్నాడు. (ఎఫెసి1:3-6) దేవుడే వివాహాన్ని ఆశీర్వదించి, పరిశుద్ధపరచి పిల్లలను కనమంటే, స్త్రీతో కలువకూడదంటాడా? ఆలోచించండి. పరాయి స్త్రీలతో అక్రమంగా కలువడం పాపం కాని మన స్వంత భార్యతో కలువడం ఆయన అశీర్వాదం. దేవుని పవిత్ర, పరిశుద్ధకార్యం, దేవుని ఆజ్ఞ మరియు ఆశీర్వాదం కూడా సృష్టిలో ప్రతిసృష్టి చేయాలనే నరున్ని కన్నాడు దేవుడు. అందుకే వివాహాన్ని నిషేదించే వారిని అబద్దికులు, భ్రష్టులు అని కూడా అన్నాడు దేవుడు (1తిమోతి 4:1-3).

కాబట్టి పైన చెప్పబడిన వీరు దేవుని రాజ్యములోనికి, అనగా సంఘములో చేరడానికి గొర్రెపిల్ల రక్తము ద్వారా మొట్ట మొదట కొనబడినవారు అన్నాడు. అనగా వీరంతా ప్రారంభ సంఘములోని సభ్యులని మాత్రమే గ్రహించాలి. పెంతెకొస్తు పండుగ దినాననే ప్రథమ ఫలముగా 3 వేల మంది ఇశ్రాయేలు వంశములోని వారే సంఘములో చేర్చబడ్డారు. ఆ తర్వాత చాలామంది (అపో.కా. 8) వచ్చారు. అందులోని

ప్రారంభ సంఘము వారే వీరు. అంతేకాని వీరంతా అన్యులైన ప్రపంచ దేశాలలోని వారు ఎంతమాత్రము కాదు. ఇక్కడ స్త్రీ అనగా అక్షరార్థముగా ఆడవారు కాదని, ఆడ వారితో శారీరక సాంగత్యము అసలే కాదని అర్థమగుచున్నది. మరి ఇక్కడ వ్రాయబడిన స్త్రీ ఎవరో అదే వాక్యాన్ని ధ్యానిద్దాం, ఆలోచించి గ్రహిద్దాం.

పాత నిబంధనలోని యోహేజ్కేలు గ్రంథము 23వ అధ్యాయంలో రెండు పట్టణాలను గూర్చి వ్రాస్తూ "నరపుత్రుడా ఒక తల్లికి పుట్టిన ఇద్దరు స్త్రీలు కలరు. వారిలో ఒకదాని పేరు ఒహోలా, ఆమె సహోదరి పేరు బహోలిబా, వీరు నాకు పెండ్లి చేయబడిన వారై కుమార్తెలను, కుమారులను కనిరి - ఒహోలాయను పేరు షోమ్రోనునకును, ఒహోలిబాయను పేరు యెరుషలేమునకును చెందుచున్నవి" (యెహేజ్కేలు 23:1-4). ఈ అధ్యాయమంతా ఆ అక్కాచెల్లెళ్ళు చేసిన కాముకత్వమును గూర్చి వేశ్యాతనము గూర్చి మనము ఇప్పుడు నోటితో బయటకు బహిరంగముగా అనలేని బాషతో తిట్టాడు. అయితే ఈ ఇద్దరు స్త్రీలు నిజంగా ఆడవారుకారని ఒక స్త్రీ షోమ్రోను పట్టణమని, మరొక స్త్రీని యెరుషలేము పట్టణముతో పోల్చాడు. ఇక్కడ స్త్రీని రూపకాలంకారముతో పోల్చబడిన పట్టణము అని ఆయనే చెప్పుచున్నాడు గనుక ఇక ఏ సందేహము అక్కర్లేదు. మరి ప్రకటనలో వ్రాయబడిన ఆ స్త్రీయెవరో అదే ప్రకటన గ్రంథములోని 17వ అధ్యాయంలో వివరించాడు. దానిని కూడా వివరంగా ఆలోచించాకనే ముందుకు వెళదాం. దేవునిముద్రకై సమయమందును, అసమయమందును ప్రయాసపడుదాము. అజ్ఞానముగా మాట్లాడు మూర్ఖుల నోరు మూయిద్దాం.




ఒకనాటి బాబేలు పట్టణమే తర్వాత కాలంలోబబులోనుగా మారినది. రాజైన నెబుకద్నేజరు రాజ్యానికి రాజధానిగా మారి అనేక దుష్కామ, దుర్మార్గపు క్రియలకు కేంద్రముగా తయారై దేవుని వ్యతిరేకతకు గురి అయినది అని బైబిల్‌లోనే ఉన్నది. అదే బబులోను పట్టణము నేడు ఇరాక్ రాజధాని బాగ్దాద్‌గా కూడా నామాంతరము చెందినది. అయితే మహబబులోను అనే మరో కొత్త పేరు ప్రకటన గ్రంథంలో అనేక చోట్ల కనిపిస్తుంది. దీనిని మహావేశ్యగా కూడా పోల్చాడు. ఇంతకీ ఆ వేశ్య ఎవరు? బబులోనును మించిన ఈ మహాబబులోను ఏ పట్టణమయి ఉంటుంది. ఆనాటి బబులోను ప్రపంచాన్ని పరిపాలించిన మొట్టమొదటి మహాసామ్రాజ్యమైన బాబిలోనియాకు రాజధాని. దాని రాజునుగూర్చియు, ఆరాజు పరిపాలనగూర్చి కూడా అన్నీ దానియేలు గ్రంథంలో కనిపిస్తాయి. దాని తర్వాత వరుసగా మాదీయ - పారసీక సామ్రాజ్యము, గ్రీకు సామ్రాజ్యము చివరిగా రోమా సామ్రాజ్యము ఈ ప్రపంచాన్ని పరిపాలించిన (4) నాలుగు మహాసామ్రాజ్యాలు. ఇవన్నీ నెబుకద్నేజరు కన్నకలకు వివరణగా దానియేలు ద్వారా ఈ లోకానికి తెలియజేశాడు దేవుడు.

నెబుకద్నేజరుకు దేవుడు ముందుగా విగ్రహం ద్వారా ఆ సంగతులు చూపిస్తే ఆ తర్వాత కాలంలో దానియేలుకు భిన్నమైన కౄరమృగముల ద్వారా ఈ రాజ్యాలను గూర్చి దర్శనమిచ్చాడు దేవుడు (దానియేలు 7:1-7). ఆఖరిది, చివరిది అయిన కౄరమైన మహాసామ్రాజ్యమే ఈ రోమా (ప్రకటన 13:1-2) సామ్రాజ్యము, యెహాను జీవించిన కాలంలో అధికారంలో ఉండి త్వరలో అదృశ్యమగుటకు అనగా నాశనానికి పోవుటకు సిద్ధమైనది రోమా సామ్రాజ్యము దాని రాజధాని నగరమైన “రోమా” పట్టణము. బైబిల్ వాక్య ప్రకారము ఇదే “మహబబులోను” అని రుజువు చేయుటకు దేవుని వాక్యాన్ని పరిశోధించి గ్రహించుదాం.

“ఆ యేడు పాత్రలు పట్టుకొనియున్న యేడుగురు దేవదూతలలో ఒకడు వచ్చి నాతో మాట్లాడుచూ ఈ మాట చెప్పెను. నీవిక్కడికి రమ్ము విస్తార జలముల మీద కూర్చొన్న మహావేశ్యకు చేయబడు తీర్పు నీకు కనబరచెదను. భూరాజులు ఆమెతో వ్యభిచరించిరి, భూనివాసులు ఆమె వ్యభిచార మద్యములో మత్తులైరి. అప్పుడతడు ఆత్మవశుడైన నన్ను అరణ్యమునకు కొనిపోగా, దేవదూషణ నామములతో నిండుకొని (నిండికొనిన నామములుగలదై) ఏడు తలలును పదికొమ్ములు గల ఎఱ్ఱని మృగము మీద కూర్చుండిన యొక స్త్రీని చూచితిని. ఆ స్త్రీ ధూమ్ర రక్తవర్ణము గల వస్త్రము ధరించుకొని, బంగారముతోను, రత్నములతోను, ముత్యములతోను అలంకరింపబడినదై, ఏహ్యమైన కార్యములతోను తాను చేయుచున్న వ్యభిచార సంబంధమైన అపవిత్ర కార్యములతోను, నిండిన యొక సువర్ణపాత్రను చేత పట్టుకొని యుండెను. దాని నొసట దాని పేరు ఈలాగు వ్రాయబడియుండెను. మర్మము, వేశ్యలకును భూమిలోని ఏహ్యమైన వాటికిని తల్లియైన **“మహాబబులోను”**.

మరియు ఆ స్త్రీ పరిశుద్ధుల రక్తముచేతను, యేసు యొక్క హతసాక్షుల రక్తము చేతను మత్తిల్లి యుండుట చూచితిని. నేను దానిని చూసి బహుగా ఆశ్చర్యపడగా, ఆ దూత నాతో ఇట్లనెను - నీవేల ఆశ్చర్యపడితివి, ఈ స్త్రీని గూర్చి మర్మమును, ఏడు తలలును, పదికొమ్ములును కలిగి దానిని మోయుచున్న కౄరమృగమును గూర్చిన మర్మము నేను నీకు తెలియజేయుదును. నీవు చూచిన ఆ మృగము ఉండెను, గాని ఇప్పుడు లేదు. అయితే అది అగాధ జలముల నుండి పైకి వచ్చుటకును, నాశనమునకు పోవుటకును సిద్ధముగా ఉన్నది. భూనివాసులలో జగదుత్పత్తి మొదలుకొని జీవగ్రంథమునందు ఎవరి పేరు వ్రాయబడలేదో వారు, ఆ మృగముండెను గాని ఇప్పుడు లేదు. అయితే అది ముందుకు వచ్చునన్న సంగతి తెలుసుకొని ఆశ్చర్యపడుదురు. ఇందులో జ్ఞానము గల మనస్సు కనబడును. ఆ యేడు తలలు, ఆ స్త్రీ కూర్చున్న యేడుకొండలు" (ప్రకటన 17:1-9).

"మరియు నీవు చూచిన ఆ స్త్రీ భూరాజులనేలు ఆ మహాపట్టణమే" (ప్రకటన17:18) దానియేలు గ్రంథము 7వ అధ్యాయమును బట్టి కౄరమృగము అనగా భూ రాజ్యమునకు సూచన. యోహాను పత్మాసు ద్వీపములో పరవాసియై యుండి ఆ దర్శనము చూసేటప్పటికి, దేవుని కుమారుడు, వాక్యము అనే ఖడ్గము చేత దెబ్బతిని నాశనమునకు పోవుటకు సిద్ధముగా ఉన్న కౄరమృగమే ఈ రోమా సామ్రాజ్యము, దాని రాజధాని నగరమే రోమ్ నగరము, భౌగోళికంగా ఈ పట్టణము (7) ఏడు కొండల మీద నిర్మించబడినది. (7) ఏడు తలలు అనగా ఏడు కొండల మీద ఉన్న కౄరమృగము రోమా సామ్రాజ్యమైతే ఆ కొండల మీద కూర్చున్నదే (నిర్మింపబడినది) రోమ్ నగరము, దాంట్లో ఎంతటి వ్యభిచారము మరియు

విగ్రహారాధన జరుగుచున్నదో రోమాపత్రికలోని (1:24-32) వచనాలను చదివితే అర్థమవుతుంది. ఆ నగర నిర్మాణము కొన్ని సంవత్సరాలు నిర్మించారు. దాని అందము, ఆకర్షణ, కళ్ళతో చూసినా కూడా వర్ణణాతీతము "ROME WAS NOT BUILT IN A DAY" అనే సామెత కూడా జ్ఞాపకం చేసుకోగలరు.

క్రీ॥శ॥ 2004 డిసెంబరు నెలలో నేను ఇటలీ దేశంలోని రోమ్ నగరాన్ని అందులోని ఉన్న వాటికన్‌సిటీ అనే దేశాన్ని కూడా సందర్శించడం జరిగింది. ఇటలీ బాషలో దానిని "రోమా" అని అంటారు. అందులోని వాటికన్‌సిటీ అనే ప్రత్యేకదేశంలో ఉన్న సెయింట్‌పీటర్ బాసిలికా (దేవాలయము)ను దాదాపుగా 100 సం॥ల కాలములో నిర్మించారంట. ఆ కట్టడాన్ని, ఆ నగరాన్ని పూర్తిగా సందర్శించితే దాని అందం ప్రపంచంలోని మరే నగరానికి లేదు. ఆనాటి రోమన్ రాజులు ప్రపంచ దేశాలెన్నిటినో దోచి బంగారము, రత్నాలు, ముత్యాలు ఎన్నింటితోనో ఆ నగరాన్ని నిర్మించారు. ఆనాడే ప్రపంచ దేశాలన్నింటితో వర్తక వ్యాపారాలు నిర్వహించింది ఆ నగరమే. అందుకే దానిని అందరి కన్నులకు అందనిది మరియు దానిని వేశ్య అంటున్నాడు. ఆ నగరం అంతటా వివిధ రంగులతో కూడిన మనసునుదోచే పాలరాతి కట్టడాలే. దానిని చూస్తున్నప్పుడే ప్రకటన గ్రంథములోని ఈ 17వ అధ్యాయంలోని స్త్రీ కళ్ళకు కట్టినట్లుగా కనిపిస్తుంది.

ఏడు కొండల మీద నిర్మింపబడి ప్రపంచాన్ని నేటికి శాసిస్తున్న రోమన్ కాథలిక్ పీఠం యొక్క వాటికన్ (దేశం) పట్టణ స్వరూపాన్ని ఆ నగరం యొక్క ప్లాను ఒక మ్యూజియం ముందు పెయింట్ చేశారు దానిని చూసిన వెంటనే ప్రకటనగ్రంథంలోని ఈ సంగతిని నాకు గ్రహింపజేశాడు దేవుడు. ఆ నగరంలోని టి.వి.చానళ్ళలో కొన్ని చానళ్ళలో ఈనాటికి 24 గంటలు

నీలి చిత్రాలు (రోమా 1:26-27) ప్రదర్శింపబడుతున్నాయి. ప్రపంచంలో ఉన్న దేవాలయలన్నిటిలో వాటికన్ దేవాలయము ఆదాయమే నెంబర్‌వన్. ఆ తర్వాత 2వ స్థానంలో మనదేశంలోని (7) ఏడు కొండల మీదనున్న తిరుపతి దేవస్థానం ఉన్నదని గుర్తుచేసుకోండి. ఇంకా వచనం వచనాన్ని వివరించాలంటే సమయం మరియు ఈ పుస్తకం సరిపోదు. అయినా మరికొంత వివరణ ఇస్తాను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి.

ఇంకా ఈ నగరంలోనే క్రీస్తు పూర్వం అనేకమంది యూదులు, క్రీ॥శ॥లో వేలాదిమంది ఇశ్రాయేలీయులు, యూదులైన క్రీస్తు శిష్యులు హతసాక్షులయ్యారు. రోమా ప్రభుత్వ అధికారాన్ని ఎదిరించి దాని ముద్రను వేయించుకొనని అపోస్తులులతో పాటు కొన్ని వేల మంది హతులయ్యారు. వారి యొక్క రక్తముతో మత్తిల్లినదే ఆ మహాబబులోను అని దేవుని చేత పిలువబడ్డది రోమ్ నగరం. ఇకపోతే ఏడుగురు రాజులతో పాటు అనగా వీరంతా అప్పటి రోమా ప్రభుత్వములో సామంత, స్వతంత్ర రాజులన్నమాట. ఆ తర్వాత పదికొమ్ములు పదిమంది రాజులను సూచిస్తుంది అని చెప్పాడు. ఈ దశ రాజ్యకూటమినే అనేకులు మొన్నమొన్న ఏర్పడ్డ యూరప్ దేశాల (EUROPIAN UNION - EU) కూటమి అని చెప్పారు. ఇప్పటికి కూడా చెప్పడానికి ప్రయత్నిస్తున్నారు. అయితే నేను ఇటలీ దేశం వెళ్ళేటప్పటికి ఆ యూరోపియన్ కమ్యూనిటీలో 16 దేశాల సభ్యత్వం ఉంది. ఇప్పటికి వాటి సంఖ్య చాలా పెరిగింది కూడా కాబట్టి ఇప్పుడది దశ రాజ్యకూటమి (2004లోనే) కాదు 16 దేశాలకూటమి. అందుకే దీనికి బైబిల్‌తో సంబంధము లేదు. ఇది మనుషుల ఊహ మాత్రమే.

ఈ తరంలో మనకళ్ళముందు జరుగుచున్నది గాక ఆ నాడే అనగా కొత్త నిబంధన ఆరంభంలోనే (ప్రారంభలేదా మొదటి) ఆ దశ రాజ్యకూటమి

కూడా వచ్చి ఆ పదికొమ్ముల క్రూరమృగము లేకుండా పోయింది అని అక్కడే చెప్పాడు (ప్రకటన17:11). ఈ మహావేశ్య కూర్చున్నచోట అనగా ఆ నగరంలో జనులను, జలములతో పోల్చాడు (15వ) గనుక రోమా ప్రభుత్వ అధికారము ప్రజలలో నుండి ప్రజల కొరకే వచ్చినదని చెప్పవచ్చును. ఈ విషయం దానియేలు గ్రంథములో కూడా చెప్పబడినది గనుక, దానియేలు గ్రంథం యొక్క నేరవేర్పు ఇశ్రాయేలీయుల అంత్యదినాలు మరియు కొత్తనిబంధనలోని ప్రారంభ దినాలలోనే ఇవి నెరవేరాలి గనుక అప్పుడే నెరవేరియున్నది అని మనం విశ్వసించాలి. కాబట్టి ఈ దశరాజ్య కూటమి ఈనాటిది గాక ఆనాటిదే సుమా! నూతన నిబంధనలో చెప్పిన ఒక్క క్రీస్తు రెండవ రాకడ తప్ప బైబిల్‌లోని అనగా పాతనిబంధనలో చెప్పబడిన ప్రవచనాలన్నీ క్రీస్తు అపొస్తలుల కాలంలోనే నెరవేరినవి అని జ్ఞాపకము చేస్తున్నాను.

ఆ స్త్రీ అనగా రోమా పట్టణము గనుక ఆ పట్టణముతో వ్యాపారముగాని, సహవాసంగాని, సాంగత్యముగాని లేనివారు, దాని వాసన, నీడ కూడగిట్టని వారే ఈ 1,44,000 మంది. అంతేగాని నేటి భారతదేశంలో గాని, ఏ దేశంలోగాని ఉన్న క్రైస్తవులు ఎంతమాత్రం కాదని, మొదటి శతాబ్దంలోనే ఆనాటి రోమా ప్రభుత్వం, మరియు యూదామతాచార్యుల క్రౌర్యానికి బలైన హతసాక్షులే ఈ 1,44,000 మంది అని గ్రహిద్దాము (హెబ్రీ 11:35-39). వీరు ప్రథమఫలముగా ఉండుటకై మనుష్యులలో నుండి యేసురక్తంతో కొనబడినవారు అనగా ప్రారంభ క్రైస్తవ సంఘము అనగా పెంతకోస్తు దినమునాడు విశ్వాసులుగా మారిన 3,000 మంది కూడా అందులో ఉన్నారు అని మరోసారి జ్ఞాపకం చేస్తున్నాను.

వీరు ఆనాడు కేవలం క్రీస్తునే వెంబడించినవారు. 12 మంది అపోస్తలుల చేత తీర్పు తీర్చబడినవారు (మత్తయి 19:27-30). అనగా వారికి బోధింపబడి క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన 12 గోత్రాలకు చెందిన ఇశ్రాయేలీయులే వీరు(మత్తయి19-27-29, లూకా 22:28-30) వీరి నోట ఏ అబద్దమును కనబడలేదు, వీరు అనింద్యులు పేతురు ప్రసంగం విన్నవారు మరియు ఆ రోజే మూర్ఖులగు ఆనాటి లోకసంబంధులైన తరంవారికి వేరై రక్షణ పొంది ఏకమనసును, ఏక హృదయమును గలవారై అందరూ కలిసి ఇంటింటా రొట్టె విరుచుచూ ప్రజలందరిచేత దయ పొంది, ఎట్టి అపనిందలపాలు కానివారు. (అపోకా 2:37-47).

ఇదే దేవుని ముద్ర కలిగిన 1,44,000 మంది ఇశ్రాయేలీయులను గూర్చిన మర్మము ఆ గొఱ్ఱెపిల్ల ఎక్కడికెళితే అక్కడికెళ్ళిన వారు అంటున్నాడంటే తమ చరస్థిరాస్తులను అమ్మి అపొస్తలుల పాదముల యొద్దపెట్టి అందరూ వారివారి అక్కరకొలది పంచుకొని తిని, సంఘము వెలుపలి వారితో కూడా నిందలపాలు కాకుండా బ్రతికిన వారు మరియు లోకంలో అన్నీ వదిలివేసి సువార్తకై, క్రీస్తు రాజ్య విస్తరణకై ఆదేశమంతా అపొస్తలులతో తిరిగినవారు. ఈ లోకంలో ఉన్నదేది తమ స్వంతం అనుకోక పౌరస్థితి పరలోకమందున్నదని యెరిగినవారు (అపొ.కా. 4:32-35). దీనిని బాగా ఆలోచించి మరెన్నో ఎక్కువ వాక్యాలను బైబిల్ నుండి తీసి అనేకులకు ఇంతకన్నా బాగా అర్థం చేయించండి. దేవుని తలంపులతోనే దేవుని వాక్యాన్ని చదివి గ్రహించి దేవునిని దేవునిగానే మహిమపరిచి దేవుని రాజ్యాన్ని విస్తరింపచేద్దాము.




ఇంతవరకు దేవుని యొక్కయు, యేసుక్రీస్తు యొక్కయు, పరిశుద్ధాత్మని యొక్కయూ ముద్రలను గూర్చి ఆలోచించినప్పుడు ఏమీ అనిపించలేదు. అందరం మాములుగానే ఉన్నాం అనుకుంటున్నాను. కాని ఇప్పుడు సాతాను ముద్ర అనగానే ఒళ్ళు జలదరించి ఒకరకమైన భయమునకు లోనవుతాం. ఇంతవరకు బహుశా నాకు తెలిసి ఎక్కువమంది తండ్రి కుమార పరిశుద్ధాత్మల ముద్రను గూర్చి వ్రాసినట్లుగాలేదు, కాని వినియుండవచ్చును అని నేను అనుకుంటున్నాను. కాని ఈ సాతాను ముద్రను గూర్చి కొన్ని వందల మంది బోధకులు వందల రకాలుగా వ్రాసి, బోధించి కొన్ని లక్షల మందిని భయాందోళనలకు గురిచేశారు. ఇంకా చేస్తూనే వున్నారు. ఇప్పటికే ఈ ముద్ర వచ్చిందని కొందరంటే ఇంకా రాలేదుగాని త్వరలో రాబోతుందని మరికొందరు బోధిస్తున్నారు. ఈ ముద్రను అంత్యక్రీస్తువచ్చి వేస్తాడని అందరి అంచనాలే. ఎందుకంటే అంత్య క్రీస్తు అనే పదము/వ్యక్తి బైబిల్‌లో లేదు. ఇదే సాతాను తంత్రము.

ఇప్పటికే అది మనమీద పడ్డదో లేక త్వరలో పడబోతున్నదో అది ఎలా ఉంటుందో, ఏమై ఉంటుందోననే విషయం మీద ఎవ్వరికీ నేటికి

ఏకాభిప్రాయం కుదరడములేదు. ఈ మధ్యనే ఒక బోధకునితో ఈ విషయం మాట్లాడితే అందరికీ ఒకే అభిప్రాయం ఉండదు బ్రదర్ అది సాధ్యంకాదు గదా అని ఖచ్చితంగా చెపుతున్నాడు. ఒకే దేవుని మాటలను ఒకే పరిశుద్ధాత్మ ప్రేరేపించి వ్రాసిన ఈ అంశం, అదే పరిశుద్ధాత్మ నడిపింపుతో చదివి అర్థం చేసుకొంటే ఒకే అభిప్రాయం రావాలి కదా! మరి మొదటి శతాబ్దపు లేదా ప్రారంభ క్రైస్తవులు ఎలా ఏకమనసును, ఏకాభిప్రాయాన్ని కలిగివున్నారో ఈనాడు ఎవ్వరూ అర్థం చేసుకొని గ్రహించడానికి ఏ మాత్రం ప్రయత్నించడం లేదు. మరోసారి మనం మళ్ళీ ప్రయత్నించి విజయం సాదిద్ధాం, దేవుని రాజ్యాన్ని విస్తరిద్దాం, సాతాను సామ్రాజ్యాన్ని కూల్చేద్దాము.

కనపడని ఆ దేవ దేవుని ముద్ర కనపడే మనుష్యుల ఆత్మ మరియు శరీరాల మీద ఎలా పడిందో, ఇప్పటికి ఎలా పడుతుందో ఈపాటికే గ్రహించాం. అలాగే కనపడని సాతాను (దురాత్మ) ముద్ర కూడా కనపడే మనుష్యుల శరీరాల మీద ఎలా పడుతుందో అదే దేవుని వాక్యాన్ని అడిగితేనే తెలుస్తుంది. దీనికోసం అందరిలా ప్రకటన గ్రంథం 13వ అధ్యాయంలోని చివరి వాక్యాలను మాత్రమే కాక మొదటి ప్రవచనం నుండి చివరి వచనం వరకు కూలంకషంగా ధ్యానిస్తేనే ఈ సాతాను ముద్రకు దాని సంఖ్యకు న్యాయం జరుగుతుంది. సాతానుముద్ర అనగా దాని ప్రభావము అని ముందుగానే చెప్పినది జ్ఞాపకం ఉంచుకొనండి. దేవుని చేత ముద్రింపబడటం అంటే ఆయన గుణగణాలను కలిగి వుండటం, ఆయన ప్రభావానికిలోనై, ఆయన కుమారునిలాగా జీవించడమే సరియైనది అని గ్రహిస్తే, సాతానుముద్రను విప్పడంచాలాసుళువు. ఇందులోనివన్నీ దర్శనాలైనా ప్రతిదానిని అక్షరార్థంగా కాక ఆత్మసంబంధమైన సంగతులను, ఆత్మసంబంధమైన సంగతులతో సరిచూసుకోవాలని మరోసారి గుర్తు చేస్తున్నాము.(1కొరంథీ 2:1-16)

**ప్రకటన 13:1**

"మరియు పదికొమ్ములును, ఏడు తలలను గల యొక క్రూరమృగము సముద్రంలోనుండి పైకి వచ్చుట చూచితిని. దాని కొమ్ములమీద పదికిరీటములు, దాని తలల మీద దేవదూషణకరమైన పేరులును వుండెను".

సృష్టిలో ఇంతవరకు ఒక మెడ మీద రెండు తలలతో పుట్టిబ్రతికిన మనిషిని గాని జంతువును గాని చూచిన సాక్ష్యాధారాలు లేవు. రెండు తలల పామును గూర్చి విన్నాం, చూశాం కాని ఆ రెండు తలలు వేరు వేరు దిశలుగా ఉంటాయి. మరియు సాధారణంగా పామును మృగము అనరని తెలుసు గదా. ఇది రూపకాలంకారములో వ్రాయబడింది గనుక అలాంటి జంతువు ఊహించిరాసిందే కాని నిజంగా లేదు. ఒకవేళ రాబోతుంది అని అన్నా తప్పే. కొండొకచోట (2) రెండు తలలు ఒక్కటిగా అతుక్కొని పుట్టిన మనుష్యులను వేరుచేసి బ్రతికిస్తున్నామే తప్ప మరొకటి కాదు. మరియు ముఖ్యంగా ఆదికాండం మొదటి అధ్యాయంలో దేవుని చేత ఆయా జాతుల ప్రకారం భూమి మీద సృష్టించబడ్డ జీవరాశుల సిద్ధాంతం అనగా ఆదికాండములోని సృష్టి క్రమము కూడా తప్పు అయి తీరుతుంది. కాబట్టి దాని అర్ధాన్ని మాత్రమే ఆలోచించాలి.

కాబట్టి బైబిల్ ప్రకారంగా అక్కడే చెప్పబడిన దానిని ఆలోచిస్తే ఆ ఏడుతలలు ఏడుకొండలకు సాదృశ్యము(ప్రకటన 17:9). పదికొమ్ములు పదిమంది రాజులకు గుర్తు (ప్రకటన 17:12) ఏడు తలలు, పది కొమ్ములున్న క్రూరమృగము అనగా ఏడుకొండల మీద ఉన్న నగరంలో పదిమంది రాజులతో కూడిన ఒకే ఒక్క రాజ్యము అని అర్థం. ఆ రాజ్యాలన్ని కలిసి క్రూరంగా తమ ప్రజలను పాలించి, వారి రాజ్యాధికారం కోసం రక్తపాతాన్ని సృష్టించినవే. గనుక క్రూరమృగముతో దానిని ఆ రాజ్యాన్ని పోల్చాడు దేవుడు. ఒక రాజ్యమే క్రూరంగా పరిపాలిస్తే లేదా ఒక రాజే

క్రూరుడైతే అలాంటి 10మంది రాజులు ఒకచోట కూడితే అదెంత భయంకరమైన, కౄరాతి కౄరమైన రాజ్యంగా ఉంటుందో ఆలోచిస్తేనే భయంకరంగా ఉంటుంది.

ఈ రాజ్యము (మృగం) సముద్రములోనుండి పైకి వచ్చుట చూసితిని అంటున్నాడంటే మృగాలు, రాజ్యాలు, రాజ్యాధికారులు, భూమిలోనుండి అనగా రాజ్యం, దేశం, భూమి అనగా మట్టికాదు మనుషులే గనుక అందులో ఉన్న మనుషులలోనుండే అవి రావాలి గనుక సముద్రం అనగా జలములతో కూడినది గనుక జలములు జనులు, జనసమూహ మేనని అదే గ్రంథంలో మరోచోట దేవుడే వివరించాడు (ప్రకటన17:15). దాని తలల మీద దేవదూషణకరమైన పేర్లు ఉన్నాయి. అంటే ఆ రాజ్యములన్నీ దేవున్ని ఆయన సంకల్పాన్ని వ్యతిరేకిస్తూ తమ్మును తామే గొప్పగా చేసుకొంటున్న వారు అని అర్థం. మనిషిని నశించిపోయే మృగము అని ఎప్పుడో చెప్పాడు దేవుడు (కీర్తన 49:12). ఈ రోజుల్లో మానవ మృగము అని అప్పుడప్పుడు దుర్మార్గులను, రౌడీలను నియంతలను, ఉగ్రవాదులను అంటుంటాము గదా. ఈ మృగాలవంటి మనుషులను పరిపాలించే రాజు కూడా క్రూరమృగముగాక మరేమవుతాడో ఆలోచించి గ్రహించండి (1సమూయేలు8:10-18).

అధికారంలో ఉన్న మనవాళ్ళకు అధికారమధం బాగా తలకెక్కితే ఏరా! కొమ్ములు మొలిచాయా? అని  అంటాము గుర్తుందా! అలా ఈ లోక రాజ్యాధికారం తలకెక్కి దేవుడెక్కడున్నాడు. నేనే దేవున్ని. నాకే నమస్కరించండి, మొక్కండి అని అన్న ఎంతోమంది రాజుల చరిత్ర బైబిల్‌లోను, బయటవారు వ్రాసిన ప్రపంచ చరిత్రలోను లేదా? బాగా ఆలోచించి అర్థం చేసుకోండి ఆ మృగం తలల మీద దేవదూషణకరమైన

పేర్లు ఎందుకున్నాయో! ఈ రోజుల్లో రాజులు లేదా రాజ్యాధినేతలు, వారి తలల మీద అలాంటి కిరీటాలు లేవు కేవలం టోపిలే ఉన్నాయి గనుక ఇది యోహానుగారు శరీరంలో బ్రతికున్న కాలంలోనే జరిగి ఉండాలి.

ఎందుకంటే ఆ రోజుల్లోనే రాజులు, రాజరికాలు వారి ఠీవిని ప్రదర్శించటానికి వజ్రాలు, వైడూర్యాలతో, రత్నాలతో పొదిగిన విలువైన కిరీటాలు గూడా ఉండేవి. ఆనాటి రాజులు, రాణులు కిరీటం లేకుండా బయటకు వచ్చేవారుకాదు. రాజ్యాలు రాజులు, సంస్థానాలుపోయినా వాటి సాక్ష్యాలు నేడు కూడా అనేక సంస్థానాలలో, కోటలలో, మ్యూజియాలలో మనం చూస్తూనే ఉన్నాము గదా! మన దేశంతోపాటు ఎన్నో దేశాలలో కూడా జరిగిన చాలామంది రాజుల పరిపాలన రాక్షసపాలనే అని చరిత్ర చెబుతుంది. ఇంతెందుకు నా చిన్నప్పుడు మా తెలంగాణ ప్రాంతంలో రాజులు, దొరలపాలన ఎంత క్రూరంగా ఉందో దానిని అనుభవించినవారు ఇప్పటికీ బ్రతికే ఉన్నారు. రోమా ప్రభుత్వ క్రూరత్వాన్ని కళ్ళార చూసిన యోహానుగారు దానిని కళ్ళకు కట్టినట్టు అనగా ఓ దృశ్యంలో చూపిస్తున్నాడు ఇక ఆ క్రూర మృగము యొక్క అసలు రూపాన్ని ఆలోచించి చూద్దాం.

**ప్రకటన 13:2**

"నేను చూసిన ఆ మృగము చిరుతపులిని పోలియుండెను. దాని పాదములు ఎలుగుబంటి పాదములు వంటివి, దాని నోరు సింహపునోరు వంటిది, దానికి ఆ ఘటసర్పము తన బలమును తన సింహాసనమును గొప్ప అధికారమును ఇచ్చెను."

ఇక్కడ చూసిన మృగము సృష్టి కార్యక్రమమునకు విరుద్ధముగా ఉన్నది గనుక తప్పకుండా ఇది రూపకాలంకారము అనగా



ఊహజనితమైనది అనే ఆలోచించాలి. ఒక మృగములో మిగతా మూడు క్రూర మృగాలను యోహాను గారు చూస్తున్నాడు అనగా నాలుగు మృగాలు కలిసి ఒకేసారి ఒక మృగంలా కనపడుతున్నాయంటే ఆ నాలుగు మృగాల అధికారములు చివరిదశలో ఉండి త్వరలోనే కనుమరుగవుతున్నట్లుగాను, వాటి బలాలు, లేదా గుణాలు ఒకేమృగంలా ఇమిడి ఉన్నాయని అర్థం చేసుకోవాలి. ఇక్కడ యోహాను గారికి ఒకేసారి కనబడుచున్న (క్రీ.శ. 95లో) ఆ నాలుగు మృగాలు దానియేలు కాలంలో (క్రీ.పూ. 700లో) ఆయనకు మాత్రము విడివిడిగా కనపడ్డాయి.

దేవుడు దానియేలు కిచ్చిన దర్శనంలో ప్రపంచాన్ని పరిపాలించబోయే నాలుగు మహాసామ్రాజ్యాలను వాటి గుణాలను బట్టి ఒకదాని వెంబడి మరోదానిని చూపించాడు. (దానియేలు 7:1-17). దానియేలు చూసిన మొదటి క్రూరమృగమైన సింహము నెబుకద్నేజరును. ఆయన రాజ్యమైన

బబులోనును చూపించుచున్నది. అతని పరిపాలన, విస్తరణకు రెక్కలు చూపించి తర్వాత ఆ మృగము యొక్క రెక్కలు తీయబడి ఆయన రాజ్యము ఆయన వద్ద నుండి తీసివేయబడిన విధానము సూచించబడుచున్నది.

రెండవ కౄరమృగమైన ఎలుగుబంటి దాని పాదములు మాదీయ పారసీక సామ్రాజ్యాన్ని సూచిస్తూ అది బాగా తిని పడుకొన్నదని దాని మత్తును సూచిస్తున్నదని చెప్పబడినది. ఆ తర్వాత మూడవ కౄరమృగం చిరుతపులి కనబడినది. చిరుత బలానికి మరియు వేగంగా పరుగెత్తి జంతువులను లేదా తన ఆహారాన్ని వేటాడే మనస్తత్వమునకు గుర్తు దానికి కూడా రెక్కలున్నాయి. అవి పక్షి రెక్కల వంటివి అంటున్నాడు. ఇది చిన్నతనంలో లేదా యౌవ్వనంలోనే (తన బలంతో) ప్రపంచాన్ని అత్యంత వేగంగా జయించిన గ్రీకు సామ్రాజ్యాన్ని దాని అధినేత అలెగ్జాండర్ దిగ్రేట్‌ను సూచించినది.




ఆ తర్వాత నాలుగవదైన భయంకరమైన కౄరమృగం ఇనుప దంతములు గలది, ఇది ముందు చూపడిన వాటికి భిన్నమైనది అంటున్నాడు. దీని రూపాన్నిగాని పేరుగాని వివరంగా చెప్పలేదుగాని ముందు చెప్పిన వాటికన్నా చాలా బలము గలది, అన్నింటిని తన కాళ్ళ కింద అణగదొక్కుచున్నది. ఇది నెబుకద్నేజరు చూసిన దర్శనములోని విగ్రహము యొక్క

కాళ్ళు దాని రాజ్యానికి గుర్తు (సింబాలిక్) అయిన రోమా సామ్రాజ్యానికి గుర్తు. పదిమందితో కూడిన ఒకే రాజ్యమైనా ఈ రాజుల కాలంలోనే దేవుడు తన రాజ్యాలన్నిటిని యేసుక్రీస్తు అనే చేతి సహాయంలేని రాయి (రాజు) ద్వారా స్థాపిస్తాడని, ఆ రాజ్యాన్ని నాశనం చేస్తాడని దానియేలు ప్రవచించాడు (దానియేలు 2:40-44).

ఈ రోమా సామ్రాజ్యమే యోహాను కాలంలో పరిపాలన సాగిస్తూ ముందున్న రాజ్యాల గుణాలన్నిటిని కలబోసుకొని వాటన్నింటికంటే భయంకరంగా క్రూరంగా పరిపాలిస్తున్నది. దాని కాళ్ళు ఇనుము, మట్టిని పోలినవి గనుక ఆ పదిరాజ్యాలు ఒకదాని కొకటి భిన్నముగా ఉన్నవి అనగా అందులో లుకలుకలున్నాయి అని అర్థం. యోహాను పత్మాసు ద్వీపంలో రోమా ప్రభుత్వం చేతనే బంధింపబడి దర్శనము చూస్తున్న సమయంలో ఈ రోమా సామ్రాజ్యం చివరి దశలో అనగా కనుమరుగవుతున్న అనగా కూలిపోయే దశలో ఉన్నది. కాని అది పరిపాలించిన కాలములో మాత్రం ఎంత భయంకరంగా పరిపాలించిందంటే "పిలాతు గలిలయులైన కొందరి రక్తము వారి బలులతో కలిపియుండెను. ఆ కాలమున అక్కడనున్న కొందరు ఆ సంగతి యేసుతో చెప్పగా" (లూకా13:1). ఇంతటి క్రూరమైన రాజ్యాధికారాన్ని ఈ రోమా ప్రభుత్వానికి ఆ ఘటసర్పమైన సాతాను ఇచ్చింది. గనుకనే ఆనాడు ఈనాడు మరియు అంతకుముందు ఇంకా రాబోయే రోజుల్లో కూడా ప్రపంచాన్ని ప్రజాప్రభుత్వాల పేరిటనే మనలను పరిపాలిస్తున్నది సాతాను.

యేసుప్రభువును సాతాను 40 రోజులు శోధిస్తూ చివర్లో కూడా ఆయనవద్దకు వచ్చింది "అప్పుడు అపవాది ఆయనను తీసుకొనిపోయి, భూలోక రాజ్యములన్నిటిని ఒక నిమిషములో ఆయనకు చూపించి

ఈ అధికారమంతయు, ఈ రాజ్యముల మహిమయు నీకిత్తును. అది నాకప్పగింపబడియున్నది. అదెవనికి నేనియ్యగోరుదునోవానికిత్తును. కాబట్టి నీవు నాకు మొక్కితివా ఇదంతయు నీదగునని ఆయనతో చెప్పెను" (లూకా4:5-7; మత్తయి 4:8-9). ఈ లోకాధికారియైన సాతాను, అపవాది, ఘటసర్పముగా పిలువబడి తన అధికారాన్ని, బలాన్నంతటిని ఈ భయంకర క్రూరమృగమైన రోమా ప్రభుత్వానికిచ్చినది గనుకనే రోమా ప్రభుత్వము భయంకరముగా అందరిని అణుగదొక్కింది. గనుక ఖచ్చితముగా ఈ రోమా సామ్రాజ్యమే ఆ భయంకరమైన క్రూర మృగము. అదే విషయాన్ని అంతకుముందే యేసుతోపాటు కళ్ళారా యోహాను గారు కూడా చూశారు గనుక దానికి అనగా ఆ మృగానికి సాతానే తన అధికారమిచ్చెను అని వ్రాశాడు.

**ప్రకటన 13:3**

"దాని తలలో ఒకదానికి చావుదెబ్బ తగిలినట్టుండెను. అయితే ఆ చావు దెబ్బ మానిపోయెను. గనుక భూజనులందరూ ఆ మృగము వెంట వెళ్ళుచు ఆశ్చర్యపడుచుండిరి".

పదిమంది కలయికతో (అందులో వారికి ఒకరంటే ఒకరికి పడకపోయినా) బలంగా విస్తరించియున్న ఆ మహా సామ్రాజ్యంలో ఒక రాజ్యానికి మాత్రమే చావుదెబ్బ తగిలింది అంటున్నాడు. యేసు ప్రభువు ఈ లోకంలో జీవించి,బోధించి సిలువలో మరణించి తిరిగి లేచినపుడు అక్కడున్న లోక రాజ్యాధికారమైన రోమా ప్రభుత్వానికి, దాని వెనుక ఉన్న సాతానుకు చావుదెబ్బ తగిలింది గదా! ఆయన మరణించి తిరిగిలేచి అన్న మాటలు చదవండి. "అయితే యేసు వారి యొద్దకు వచ్చి -

పరలోకమందును, భూమిమీదను నాకు సర్వాధికారమియ్యబడియున్నది” (మత్తయి 28:18).

దేవుడిచ్చిన ఆ సర్వాధికారంతోనే యేసుప్రభువు తన రాజ్యాన్ని ఈ భూమి మీదనే స్థాపించాడు. (అ.పో.కా. 2:14-47) అయితే ఆ చావుదెబ్బ ఆ తర్వాత కొద్దికాలానికే మానిపోయింది అంటున్నాడంటే సాతాను తన అధికారాన్ని మనవద్దనుండే తిరిగి తీసుకొన్నాడని, భూజనులందరూ అని అన్నాడంటే విశ్వాసులున్న సంఘానికి అనగా దేవుని రాజ్యానికి కూడా మరోసారి దెబ్బ తగిలిందని అర్థమగుచున్నది. భూజనులందరు ఆ క్రూరమృగం వెంట వెళ్ళుచుండుట జరిగింది అని తను బందీగా పత్మాసుద్వీపంలో ఉన్నపుడు చెప్పాడంటే అప్పటికి క్రీస్తు రాజ్యము లేదా క్రీస్తు స్వరక్తమిచ్చి సంపాధించిన సంఘము ముక్కలై చెడిపోయి సాతాను సంబంధులు అనగా క్రీస్తు విరోధులు దానిలో నుండి పుట్టుకొని వచ్చారని, (1యోహాను 2:18-22) అలా సాతాను వారిని మాయ చేసిందని అర్థమగుచున్నది. దీనికి మరో వాక్యాధారము ఏంటంటే.

“క్రీస్తు కృపను బట్టి మిమ్మును పిలిచిన వానిని విడిచి భిన్నమైన సువార్త తట్టుకు మీరింత త్వరగా తిరిగిపోవుట చూడగా నాకాశ్చర్య మగుచున్నది. అది మరియొక సువార్త కాదు గాని, క్రీస్తు సువార్తను చేరుపగోరి మిమ్మును కలవరపరచువారు కొందరున్నారు”. (గలతీ 1:6-9) పేతురుగారు సంఘాన్ని స్థాపించిన సుమారు 25 సం॥లకే అనగా క్రీ.శ. 64లోనే గలతీలోని సంఘము దెబ్బతిన్నట్లుగా పౌలుగారు వ్రాస్తున్నారు. ఇక యోహాను చెరపట్టబడిన కీ॥శ॥95 సం॥లకు పరిస్థితి ఏవిధంగా ఉందో ఆలోచించండి. అది నేటికి మరెంత భయంకరంగా మారిందో, కళ్ళారా చూస్తూ అనుభవిస్తున్న మీరే చెప్పగలరు. యోహాను గారు

ఈ ప్రకటన గ్రంథము వ్రాసే కాలానికి ముందునుండే సాతాను విజృంభిస్తున్న విషయాన్ని వివరించాడు అంతే (1కొరింథీ 1:10-15).

భూజనులందరూ ఆ మృగము వెంట వెళుచూ ఆశ్చర్యపడుచున్నారంటే అందులో యూదులు, ఇశ్రాయేలీయులు, రక్షణలోకొచ్చిన క్రీస్తు స్వరక్తమిచ్చి సంపాదించిన ఆనాటి సంఘ సభ్యులు మరియు క్రీస్తును నమ్మని అన్యజనులు కూడా ఉన్నారని, ఆ భయంకరమైన కౄరమృగము జనులను నాటి నుండి నేటి వరకు మనమే ఇచ్చిన రాజ్యాధికారంతో మనలనే ఎలా భక్షిస్తున్నదో, జనులెలా దాని అధికారానికి లోబడుచున్నారో ఆలోచించండి. ఇలా ఎంతోమందిలేదా అందరూ ఆ ఘటసర్పము లేదా అపవాది మాయలో పడిపోయారు. ఇది ఆనాటి పరిస్థితే సుమా! ఆనాటి నుండి నేటి వరకు ఎంతమంది ఆ ఘటసర్పాన్ని వెంబడించారో ఇక ముందు కూడా ఇంకెంతమంది వెంబడిస్తారోనని ఆలోచిస్తే చాలా భయంవేస్తుంది. నేడున్న చాలా సంఘాలను గూర్చి నాకెంతో బాధ కలుగుతుంది. దేవుడు మనకు స్వాతంత్రమునిచ్చి మన విజయం కోసం ఎదురు చూస్తూ, మనలను గూర్చియే చింతించుచున్నాడు (1పేతురు 5:8).

**ప్రకటన 13:4**

"ఆ మృగమునకు అధికారమిచ్చినందున వారు ఘటసర్పమునకు నమస్కారం చేసిరి. మరియు వారు ఈ మృగముతో సాటి ఎవడు? అని చెప్పుకొనుచు ఆ మృగమునకు నమస్కారము చేసిరి".

ఆదిలోనే ఆదాము హవ్వలు తమ ఆలనా పాలనా చూసే తమ తండ్రియైన దేవునిని వదిలి సాతాను తంత్రానికి లొంగిపోయారు. ఆ తర్వాత కూడా ఇశ్రాయేలీయులు తమకు తండ్రిగా, యజమానిగా, రాజుగా,

న్యాయాధిపతిగా ఇలా అనేక రీతులుగా తోడై ఉండి అన్ని విధాలుగా కాపాడుతున్న దేవునికి కాక మాకు మావాడే రాజు కావాలని సౌలుకు నమస్కరించారు. ఆ తర్వాత చెరలోనికి వెళ్ళి అన్యరాజులకు కొందరు లోబడ్డారు. క్రీస్తు కాలములోను, ఆ తర్వాత కూడా ఈ జనులు రోమా ప్రభుత్వపు కౄరత్వానికి రాజదర్పానికి నమస్కరించి తద్వారా ఆ ఘటసర్పానికి నమస్కరించటం కొత్త ఏమికాదు గదా! (రోమా 10:1-3)

ఘట సర్పానికి మొక్కారంటే ముందుగా తను అధికారమిచ్చిన ఆ ప్రభుత్వానికి మొక్కాలి గదా. అందుకే ఆ రోజుల్లోని కౄరమృగమైన రోమా ప్రభుత్వాన్ని కూడా ఇశ్రాయేలీయులు పొగడుతూ, ప్రశంసిస్తూ దాని అధికారానికి లొంగి శారీరకంగా బ్రతకడానికి ఆశించారు. నేడు కూడా రోమ్ నగరాన్ని చూసిన ప్రతివారు వారి పనితనాన్ని ప్రశంసించకుండా, ఆ కట్టడాలను చూసి నోరెళ్ళబెట్టకుండా ఉండలేము. రోమ్‌నగరము ఒక్క రోజులో నిర్మింపబడలేదు, అనే సామెత దాని అందాన్ని గర్వాన్ని, మదాన్ని, మత్తును చూపిస్తుంది. కాబట్టి ఆనాడే అనేక జనం దాని వెంబడి వెళ్ళడంలో ఏమాత్రం ఆశ్చర్యపడవలసిన పనిలేదు. ఈ రోజు ఎవరైనా ఈ లోకసంబంధమైన దాని గొప్పతనాన్ని చెప్పకపోతేనే లేదా పొగడకపోతేనే ఆశ్చర్యపడాలి.

**ప్రకటన 13:5,6**

“డంబపు మాటలను, దేవ దూషణలను పలుకు ఒక నోరు దానికి ఇయ్యబడెను, మరియు నలుబదిరెండునెలలు తన కార్యము జరుపనధికారము దానికి ఏర్పాటాయెను. గనుక దేవుని దూషించుటకును, ఆయన నామమును, ఆయన గుడారమును, పరలోక నివాసులను దూషించుటకును అది నోరు తెరిచెను”.

కత్తి దెబ్బతిని, ఆ దెబ్బ మానిపోయిన తర్వాత అనగా సిలువలో అపజయము పొందిన కొద్ది రోజులకే అపవాది తన అనుచరులైన ఆనాటి లోకాధికారులతో మరియు ఆనాటి మతాధికారులతో అపోస్తలులను బెదిరించి సిలువవేయబడిన యేసును గూర్చి ప్రకటింపకూడదని ఆజ్ఞాపించడమును గూర్చి అపోస్తలుల కార్యములలో చూస్తాము (అపొ.కా. 14:13-18, 5:28).

ఆనాడు అనేకమందిని సాతాను తన రోమా రాజ్యం యొక్క అధికార బలముతో ఆనాటి అధికారులు, శాస్త్రులు, పరిసయ్యులు, యూదా మతాధికారులు యేసుకు ఆయన శిష్యులకు విరోధముగా ఎన్నో మాటలు పలికి, అపోస్తలులు చెప్పిన ప్రతి దానికి అడ్డుపలికి దేవునికి మరియు క్రీస్తు బోధకు వ్యతిరేకముగా మాట్లాడినట్లు చూడగలరు. ఇలా యేసు ప్రభువు శరీరధారియై బోధించినది ఆ నలుబది రెండు నెలలు అనగా $3^{1/2}$ సంవత్సరాలు జరిగింది. 42 నెలలు అనగా యెషయా, యిర్మీయా, యెహెజ్కేలు, దానియేలు ప్రవక్తలు వారి గ్రంథాలలో చెప్పిన వాటి నెరవేర్పు అనేది గ్రహించాలి. అలా ఆ కాలములో రాజ్యహింసవలన క్రీస్తు శిష్యులు ఎన్నో శ్రమలను అవమానాలను అనుభవించి యెరుషలేమును విడిచి అనేక ప్రాంతములకు చెదిరిపోవడం కూడా అదే అపొ.కా.లో చదివి గ్రహించగలము.

ప్రభువైన యేసు శరీరములో మనలాంటి మామూలు మనిషిగా బ్రతికి బోధ చేసిన కాలములో అనగా $3^{1/2}$ సంవత్సరాలలో కూడా ఆయనకు, దేవునికి వ్యతిరేకముగా అపవాది డంబపు మాటలు, పలుకుతూ దేవదూషణ చేయడం చూశాం. క్రీస్తునుకాదని దానికే అనేకమంది యూదులు కూడా నమస్కరించడం జరిగిందని వాక్యంలో చెప్పబడింది. ఇక్కడ చెప్పబడిన 42 నెలల కాలంలో కూడా అనేకమంది నమ్మినవారు

సహితం ఆ బాధలు తట్టుకోలేక అపవాది తంత్రాల ముందు ఓడిపోయారని వాక్యములో వ్రాయించుచున్నాడు దేవుడు. ఆ రోజుల్లో విశ్వాసులు దేవుని నివాసస్థలమైన ఆ బంగారు దేవాలయమును విడిచి చిన్నచిన్న గుహల్లో, అనగా సినగోగులలో దేవునిని ఆరాధించారు అని సంఘ చరిత్రలో వ్రాశారు. అలా అపవాది ఆ కొద్దికాలములోనే అనేకులను గెలువడం చూస్తున్నాము (అపొ.కా. 5:1-11).

**ప్రకటన 13:7**

"మరియు పరిశుద్ధులతో యుద్ధము చేయను వారిని జయింపడానికి అధికారమియ్యబడెను.ప్రతి వంశము మీదను, ప్రతి ప్రజ మీదను, ఆయా బాషలు మాటలాడు వారి మీదను, ప్రతి జనము మీదను అధికారమియ్యబడెను".

ఆ రోజుల్లోనే తండ్రియైన దేవునిచేత వాగ్దానము చేయబడిన పరిశుద్ధాత్మ అగ్ని బాప్తీస్మము పొందిన వెంటనే అపోస్తలులు చేసిన సూచక క్రియలను, మహత్కార్యములను బట్టి, వారి బోధను బట్టి ఇశ్రాయేలు వంశములోని వారే కాక గ్రీసు దేశస్థులు, అన్యులు ఆయా బాషలు మాట్లాడు ప్రతి జనములో నుండి అనేకులు యేసుక్రీస్తుకు శిష్యులయ్యారు. అనేక పట్టణాలలో బహుబలమైన ఎన్నో క్రీస్తు సంఘాలు వెలిశాయి. అలాంటి సంఘమే గలతీలో కూడా ఉన్నది. అయితే ఎన్నోవ్యయ ప్రయాసాల కోర్చి కట్టిన ఈ సంఘములో కొన్ని సంవత్సరాలకే వారిలో అనేకులను సాతాను భిన్నమైన సువార్తతో తన మాయ మాటలతో, రాజ్యాధికారంయొక్క అండతో గెల్చినట్లుగా పౌలు బాధపడుతూ వ్రాశాడు.

ఆదేదనగా "క్రీస్తు కృపను బట్టి మిమ్మును పిలిచిన వానిని విడిచి భిన్నమైన సువార్త తట్టుకు మీరింత త్వరగా తిరిగిపోవుట చూడగా

నాకశ్చర్యమగుచున్నది" (గలతీ 1:6-9) ఇలా ఆనాడు అనేకులైన విశ్వాసులను భిన్నమైన సువార్తతో, లోకాశలు చూపించి, డంబపు మాటలతో మాయచేసి అనగా తప్పుడు యుద్ధము చేసి వారిని జయించినది. దీనికి అధికారమియ్యబడెను అని ఉంది అనగా సంఘములోని కొందరు కపట సోదరులే దానికి ఆ విజయాన్ని దక్కించారని, అందుకే దానికి అధికారమియ్యబడెను అని ఇక్కడ వ్రాయించాడు దేవుడు. ఇలా కొరింథీ సంఘములో కూడా విబేధాలొచ్చి ఆనాటి విశ్వాసులు అనేక గ్రూపులుగా విడిపోయారని, సాతానుకు లొంగిపోయారని వ్రాయబడి ఉన్నది (1కొరింథీ 1:11-13). ఆ తర్వాత అలానే ఇంకా అనేకులు క్రీస్తు సిలువకు శత్రువులుగా మారారు (ఫిలిప్పీ 3:18,19). అనేకమంది క్రీస్తు విరోధులు సంఘంలోనుండే బయలుదేరారు (1యోహాను 2:18-20) అని సిలువ వేయబడిన క్రీస్తే బోధించాడు.

**ప్రకటన 13:8 :**

"భూనివాసులందరును, అనగా జగదుత్పత్తి మొదలుకొని వధింపబడియున్న గొఱ్ఱెపిల్ల యొక్క జీవగ్రంథమందు ఎవరిపేరు వ్రాయబడలేదో వారు, ఆ మృగమునకు నమస్కారము చేయుదురు".

ఆదాము మొదలుకొని క్రీస్తు వరకు, ఆ తర్వాత క్రీస్తు బలియాగము జరిగిన తర్వాత నుండి నేటివరకు పుట్టినవారందరు మరియు రాబోయేకాలంలో పుట్టబోయే వారందరిని గూర్చి వ్రాస్తూ వీరిలో ఎవరి పేరైతే తాను మనకోసం వ్రాయించిన జీవగ్రంథములో వ్రాయబడలేదో వారందరు ఆ మృగమునుకు నమస్కారము చేస్తారని ఖచ్చితంగా చెప్పుచున్నాడు. జనులలో నుండిజనుల కోసమే అధికారము పొందిన

ఈ మృగమే సాతాను. అయితే ఆయన ఈ ప్రకటన గ్రంథాన్ని వ్రాస్తున్న సమయంలో అధికారంలో ఉన్నది రోమా ప్రభుత్వమే సుమా. ఈ అధ్యాయం మొదటి రెండు వచనాలను బట్టి ఆ తర్వాత చావుదెబ్బ తగిలిన దానిని బట్టి ఆ మృగము రోమా ప్రభుత్వమే అనేది మరిచిపోరాదు. అందుకే అప్పటివరకు  దేవుడెవరి పేరైతే తన జీవగ్రంథములో వ్రాసుకొన్నాడో వారంతా ఆ మృగానికి మ్రొక్కలేదు. అందుకే వారిని వారికన్న ముందున్న వారిని కూడా మహిమ పరిచానని చెప్పుచున్నాడు. దీనిని విని లేదా చదివి గ్రహించి దాని ప్రకారము ప్రవర్తించిన వారు మరిమరీ ధన్యులు.

"దేవుని ప్రేమించు వారికి అనగా ఆయన సంకల్పము చొప్పున పిలువబడినవారికి, మేలుకలుగుటకై సమస్తమును సమకూడి జరుగుచున్నవని యెరుగుదము. ఎందుకనగా తన కుమారుడు అనేక సహోదరులలో జేష్ఠుడగునట్లు, దేవుడెవరిని ముందుగా ఎరిగెనో వారు తన కుమారునితో సారుప్యము గల వారగుటకు వారిని ముందుగా నిర్ణయించెను. ఎవరిని ముందుగా నిర్ణయించెనో వారిని పిలిచెను. ఎవరిని పిలిచెనో వారిని నీతిమంతులుగా తీర్చెను ఎవరిని  నీతిమంతులుగా తీర్చెనో వారిని మహిమ పరిచెను" (రోమా 8:28-30).

ఇలా మనుషులందరి జీవగ్రంథములో పేరులేక దేవునికి దూరమైన వారంతా ఆ క్రూర మృగానికి అనగా ఆనాటి ప్రభుత్వానికి నమస్కారము చేసి నాశనపాత్రులయ్యారు. దేవునిని ప్రేమించిన వారికిని, మరి విశేషముగా దేవుని చేత ప్రేమించబడిన వారికి దేవుని సంకల్పానుసారముగా అన్ని సమకూడి జరిగాయని, ఇప్పుడు జరుగుచున్నాయనియు, ఇకముందు కూడా జరుగుతాయని వ్రాయుచున్నాడు. జీవగ్రంథమనగా మరొకటి ఏదో కాదు.

మనచేతుల్లో ఉన్న పరిశుద్ధ గ్రంథమని దేవోక్తులని పిలువబడుతున్న బైబిలే సుమా ఎందుకనగా మనము మన అపరాధముల చేత చనిపోయిన వారమైయుండగా మనలను బ్రతికించినది ఇప్పటికిని, ఇకముందు గూడా బ్రతికించేది మనకు నిత్యజీవాన్నిచ్చేది కూడా జీవముగల ఈ వాక్యమే గదా (ఎఫెసి2:1-5)

ఇందులో విశ్వాసలులైన వారి అనేకుల పేర్లు ఇప్పటికే ఎన్నో వ్రాయబడి ఉన్నవి. వారందరికి దేవునికి కృప దొరికింది. అయితే ఇప్పుడు మనపేరెలా ఉంటుందో తెలుసా? దానిలో వ్రాయబడిన మాటల ప్రకారం మన బ్రతుకు ఉంటేనే అందులో అనగా మనందరి పేర్లున్నట్లు. అటువంటి వారి జీవితం మనం క్రియలతో జీవించగలిగితే మన పేరు కూడా ఇదే గ్రంథంలో ఉన్నట్లే కదా! ఎందుకంటే మన అంత్యదినాన మనకి తీర్పుతీర్చేది గూడా ఇదే వాక్యం గదా! (యోహాను 12:48). మనం క్రీస్తులో ఉన్నా, క్రీస్తు మనలో ఉన్నా మన పేరున్నట్లే ఎందుకంటే ప్రభు యేసే జీవవాక్యము గదా! ఆ వాక్యమే మన యొద్దను, మన నోటిలో (రోమా 10:5-10) మన చేతిలో ఉన్నది. కాబట్టి బైబిల్ అనబడే లేఖనాలు, ప్రవచనాలు, వాక్యము అనేదే జీవగ్రంథము.

దేవుడు నిత్యజీవము గలవాడు. ఆయన వాక్యము నిత్యజీవమని, వాక్యమైన యేసుక్రీస్తు జీవాధిపతి అని అదేవాక్యము అనేకచోట్ల సెలవిచ్చింది. గనుక మనలనందరిని నిత్యము జీవింపజేసే జీవగ్రంథమే ఈ బైబిల్ గ్రంథము సుమా! ఇది నేడు మనచేతుల్లో ఉన్నా ఈ జీవగ్రంథములో చెప్పబడిన ప్రకారం మనం నడవలేకపోతే మనకు నరకమే గతి. అలా నడువని వారే ఆ మృగము నకు నమస్కారము చేస్తారని వ్రాయడంలో ఏ మాత్రం సందేహములేదు. ఇప్పటికైనా ప్రతి క్రైస్తవుడైన

నా సోదరీ, సోదరులారా మీ చేతుల్లోనే ఉన్న దివ్యమైన పరిశుద్ధలేఖనాలని పిలువబడుతున్న బైబిల్ గ్రంథములో మీ పేరు ఉందో లేదో మీరే చూసుకొనుడి. క్రూరమృగముతో పోరాడి, వానిని ఎదిరించి మనల్ని మనమే కాపాడుకొనుటకు ప్రయత్నించి విజయం సాదిద్దాం. వాక్యానుసారమైన పోరాటం చేసి విశ్వాసములో ఉంటే మనకసాధ్యమైనదేదియులేదు (ఎఫెసి 6:10-18).

**ప్రకటన13:9,10**

"ఎవడైనను చెవిగలవాడైతే విననుగాక : ఎవడైనను చెరపట్టవలెనని యున్న యెడల వాడు చెరలోనికి పోవును, ఎవడైనను ఖడ్గముచేత చంపిన యెడల వాడు ఖడ్గము చేత చంపబడవలెను. ఈ విషయములో పరిశుద్ధుల ఓర్పును, విశ్వాసమును కనబడును."

సంఘములతో ఆత్మ చెప్పుచున్నమాట చెవిగలవాడు విననుగాక అని ప్రకటన 2,3 అధ్యాయాలలో ప్రతిసంఘానికి కూడా వ్రాస్తూ చెప్పాడు. ప్రతి మనిషికి వినటానికే రెండు చెవులనిచ్చాడు దేవుడు. ఈ రెండుచెవులతో లోక సంబంధమైన సంగతులు వినటానికి మాత్రమే మనము ప్రాధాన్యతనిస్తాము. కాని పరసంబంధమైన దేవుని మాటలకు ఇవ్వడంలేదు. ఎప్పుడైనా ఎవరైనా ఎక్కడైనా డబ్బులు పంచుతున్నారని గాని, భూములు పంచుతున్నారని గాని, బిర్యాని పార్టీలు ఉన్నాయని గాని చెవినపడగానే నిష్ప్రయోజనమైన కడుపు కోసం అక్కడికి పరుగోపరుగు. ఎవరిమీదనైనా చెడువార్తలు చెపుతుంటే ఇంకా దగ్గరకెళ్ళి ఏది మళ్ళీ చెప్పండి అంటాము, వాటిని జాగ్రత్తగా వింటాము.

అదే సువార్త, రక్షణ, ఉజ్జీవసభలని చెప్పండి విన్నా వినబడనట్లు నటిస్తారు. లేకపోతే శరీర సంబంధమైన స్వస్థత మహాసభలు, స్వస్థత పండుగలు అనండి అక్కడికి జనం తండోపతండాలుగా వస్తారు. అయితే

పైన చెప్పబడుతున్న మాటలన్నీ మన ఆత్మల రక్షణకు సంబంధినవి (యాకోబు 1:23). గనుక ప్రతివారు ఈ క్రూరమృగము బారినపడకుండా ఉండాలంటే వాక్యాన్ని జాగ్రత్తగా వినాలి. గనుక ఈ సంగతులు పైపైన మాత్రమే కాకుండా ఆత్మ సంబంధమైన సంగతులను ఆత్మ సంబంధమైన చెవులతో వినమంటున్నాడు. అలా దేవుని తలంపులతో దేవుని మనస్సు నెరిగి ఆయన మాటలు వినేదే ఆత్మీయ చెవి అన్నమాట.

దేవునికి కాక సాతానుకు దాని రాజ్యమైన క్రూరమృగానికి అనగా సాతానుకులోబడి దానికి నమస్కరించిన ప్రతివాడు దానిచేత చెరపట్టబడుతాడు. దాని మాయలో, తంత్రాలలో పడిపోతాడు. ఇలా జీవగ్రంథంలో పేరులేని వారంతా చెరపట్టబడుతారని, వేరే వారిని చెరపట్టాలని ఆశగలవారు కూడా చెరపట్టబడుతారు. "పైకి భక్తిగల వారి వలె ఉండియు దాని శక్తిని ఆశ్రయించని వారునైయుందురు.ఇట్టి వారికి విముఖుడవై ఉండుము. పాపభరితులై నానావిధములైన దురాశల వలన నడిపింపబడి, యెల్లప్పుడు నేర్చుకొనుచున్నను. సత్యవిషయమైన అనుభవజ్ఞానము ఎప్పుడును పొందలేని అవివేక స్త్రీల యొక్క ఇండ్లలో చొచ్చి వారిని చెరపట్టుకొని పోవువారు వీరిలో చేరినవారు". (2తిమోతి 3:1-8, తీతు 2:16).

పై వాక్యాలలో దేవునిని చాలా బాగా ఎరుగుదుమని చెప్పుకొనేవారు కూడా అనగా క్రీస్తు యేసులోనికి బాప్తీస్మం పొంది సంఘములోనికి వచ్చినవారు గూడా చెడిపోయిన మనస్సు గలవారు. వారందరు కేవలం ఏదో ఆశించివచ్చిన వారే తప్ప హృదయ పూర్వకంగా పాపక్షమాపణ కోసం మారుమనస్సు పొందినవారు కాదు. ఈ రోజుల్లో ఎలాంటి ప్రార్థనా కూటములలో, బహిరంగ సభలలో వినబడే సాక్ష్యాలను ఓసారి

పరిశీలించండి. ప్రతివాడు నాకు, నాకు కుటుంబానికి, నా బర్రెలకు, గొర్రెలకు, చెట్లకు మంచి లేదా మేలు జరిగింది గనుకనే యేసును నమ్మాను అంటాడే గాని, నాకు ఈ లోకంలో ఏది దొరక్కపోయినా కేవలం పాపక్షమాపణ మరియు పరలోకం కోసమే యేసును ప్రభువని, దేవుని కుమారుడని నమ్మానని సాక్ష్యమిచ్చేవారు ఒక్కడు కూడా లేదు. ఇది కూడా సాతాను చేత చెరపట్టబడటం, దాని ముద్ర వేయించుకొని, దానికి నమస్కారము చేయడమే.

ఇలాంటి వారు కూడా చెరలోనికి కొనిపోబడుటకు నిర్ణయించబడిన వారే. గనుక ముఖ్యంగా వీరి విషయంలోనే నిజమైన విశ్వాసులు జాగ్రత్త పడాలని గూడా దేవుడు చెప్పుచున్నాడు. ఎందుకంటే నమ్మిన వాడే నమ్మిన వానిని మోసం చేయగలడు. దొంగే దొంగా, దొంగా అరిచినట్లు, వాడే ముందుగా దొంగ బోధకులొస్తారు జాగ్రత్త అని హెచ్చరిస్తూ మన విశ్వాసాన్ని దోచుకుంటున్నాడు. ఇంటి దొంగను ఈశ్వరుడైన పట్టలేడు గదా! ఈ రోజుల్లో దొంగ బోధకులే ఎక్కువగా నిజమైన సేవకులుగా చలామణి అవుతున్న రోజులివి.

యేసుక్రీస్తును పట్టుకోవడానికి రోమా సైనికులు ఆ రోజు కెద్రోను వాగు దాటిన తర్వాత గెత్సమనే తోటలో ఆయన్ను పట్టుకొన్నప్పుడు పేతురుగారు తన కత్తిదూసి ప్రధాన యాజకుని దాసుని చెవిని తెగ నరికెను. ఆ దాసుని పేరు మల్కు (యోహాను 18:1–11) అప్పుడు ప్రభువు కత్తిదూసిన పేతురుతో ఈ మాటలు పలికినాడు : "యేసు –నీ కత్తివరలో పెట్టుము. కత్తి పట్టుకొను వారందరు కత్తిచేతనే నశింతురు" (మత్తయి 26:52). దాదాపు రెండువేల (2000) సంవత్సరముల క్రితమే క్రీస్తు పలికిన ఈ మాటలు సత్యము గనుకనే అవి ఇప్పటికి నెరవేరుచున్నవి. ఎప్పటికైనా

"సత్యమేవ జయతే:" అని జ్ఞాపకం చేసుకొండి. మనం చూస్తున్న ఈ ప్రపంచంలో మర్డర్లు చేసినవాడు మర్డరు గావించబడుతున్నాడు. ఎకె 47 తుపాకులతో ఆడుకొంటున్న నక్సలైట్లు, టెర్రరిస్టులు, రౌడీలు వాటితోనే ఎన్కౌంటర్ అవుతున్నారు.

బాంబులతో ఆడుకొంటున్న ఫ్యాక్షనిస్టులు, తీవ్రవాదులు వాటితోనే అంతమవుతున్నారు. రాజకీయాలతో ఆడుకొనేవాడు తప్పని సరిగా రాజకీయాలతోనే పోతున్నాడు. మోసం చేస్తున్నవాడు ఏనాటికైనా మోసానికే బలవుతున్నాడు. దుష్టశక్తులతో ఆడుకొంటున్నవాడు ఒకనాడు వాటికే బలవుతాడు. ఇలా దేనితో నీవు ఆటలాడితే లేక దేనిని పట్టుకొంటే దానితోనే పోతావు అని ఆనాడే ప్రభువు ప్రపంచానికి చెప్పాడు. ఇక్కడ కౄరమృగముతో ఆడుకొంటే దానిచేతనే బలవుతావు అని మరోసారి హెచ్చరించాడు. ఆనాటి కాలంలో మనిషి వద్ద ఉన్న ఆయుధం ఖడ్గం లేకా కత్తే గనుక దానినే ఉదాహరణగా చెప్పాడు. ఈ రోజు వ్రాస్తే ఈ కాలంలో ఉన్న వాటిని ఉదహరిస్తాం గదా!

క్రీస్తు నందు ప్రియులారా దేవుని నమ్మానని, ఆయన పేరు చెప్పుకొని అలా వచ్చిన డబ్బుతోగాని, విదేశీ సహాయంతో గాని ఆటలాడితే అనగా దేవునితోనే ఆటలాడితే, ఆ డబ్బును దేవుని రాజ్య సువార్త పరిచర్య కోసం సరిగ్గా ఖర్చు చేయలేకపోతే అదే డబ్బుతో పోతావు తెలుసా!" "ఇందుచేత సత్యమును నమ్మకదుర్నీతి యందు అభిలాషగల వారందరు శిక్షావిధి పొందుటకై, అబద్ధమును నమ్మునట్లు మోసము చేయుశక్తిని దేవుడు వారికి పంపుచున్నాడు" (2థెస్స2:9-12, రోమా 1:26-28) మంచిని లేదా సత్య వాక్యాన్ని ఆయుధంగా పట్టుకొని జీవితాంతము దేవుని కోసం న్యాయంగా ఈ ఆట ఆడావా? అనగా అన్యాయం మీద యుద్ధం చేశావా,

ఆ వాక్యము లేదా ఆ మంచితో పాటు తప్పకుండా పరలోకం పోతాము. ఈ సత్యాన్ని వినుటకు చెవిగలవాడు వినునుగాక.

ఈ విషయములో క్రీస్తులోనికి బాప్తీస్మము పొందిన వారైన పరిశుద్ధులు ఓర్పును, విశ్వాసమును కనపరుచవలెనని దేవుడు ఎంతో ఆశిస్తున్నాడు. ఓర్పుగల వారు ఓదార్చబడుతారు. విశ్వాసముగలవారు దేనినైనా జయించగలరు (1యోహాను 5:6). అయితే తొందరపడకుండా దేవుడు దీర్ఘశాంతము గలవాడని ఆయన నుండి సమాధానం కూడా మెల్లగానే వస్తుందని యెరిగిన వారు ధన్యులు పౌలుగారు తిమోతికి అనగా క్రైస్తవుడికి, ప్రతి విశ్వాసికి వ్రాస్తూ...

"అయితే నీవు నా బోధను, నా ప్రవర్తనను, నా ఉద్దేశమును, నా విశ్వాసమును, నా దీర్ఘశాంతమును, నా ప్రేమను, నా ఓర్పును, అంతియొకయ ఈకొనియ, లుస్త్ర అను పట్టణములో నాకు కలిగినట్టి హింసలను ఉపద్రవములను తెలిసి కొనినవాడవై నన్ను వెంబడించితివి. అట్టి హింసలను సహించితిని గాని, వాటినన్నింటిలో నుండి ప్రభువు నన్ను తప్పించెను" (2తిమోతి 3:10-15).

ఎన్ని శ్రమలు, నిందలు, అవమానాలు వచ్చినా క్రీస్తు మాటను బట్టి ఆయన ఇవ్వబోయే అనగా తీసుకొచ్చే జీతము, బహుమానాన్ని బట్టి ఓర్పుతో వాటిని భరించాలి. ఎన్ని శోధనలొచ్చినా మన శరీరంలో నుండి పుట్టినవైనా, మన కుటుంబ సభ్యుల నుండి, స్నేహితులనుండి, సంఘంలోని వారి నుండి, ఆఖరికి సంఘకాపరి నుండి పుట్టినవైనా వాటిని సహించి (యాకోబు 1:12-16) వాటిలోంచి బయటపడే మార్గం దేవుడు తప్పకుండా చూపిస్తాడని ఎదురుచూస్తూ ఓర్పును విశ్వాసము కనపరచాలి (1కొరంథీ 10:12-13). తొందరపడి మోసపోకూడదు, ఇతరులను మోసపరచకూడదు.

# మరియొక క్రూరమృగము

**ప్రకటన 13:11**

"**మ**రియు భూమిలో నుండి మరియొక క్రూరమృగము పైకి వచ్చుట చూచితిని. గొఱ్ఱెపిల్ల కొమ్ముల వంటి రెండు కొమ్ములు దానికుండెను. అది ఘటసర్పమువలె మాటాలడుచుండెను".

మొదటి క్రూరమృగం సముద్రంలో నుండి వచ్చినా అనగా జనసముద్రంలో నుండే వచ్చి అనేకులను మోసం చేసి నమస్కరింప జేయించుకొనినది. ఇప్పుడు అలాంటిదే మరియొక్క క్రూరమృగము కూడా భూమిలో నుండి వచ్చుట చూచాను అంటున్నాడు. భూమియే తొలినాళ్ళలో జంతువులను, మృగాలను పుట్టించినది. మళ్ళీ ఇప్పుడు జంతువులను గాని వేటిని మరలా, మరలా పుట్టించే అవకాశములేదు. గనుక మరి ఈ మృగం కూడా భూమిలో నుండే వచ్చింది అంటున్నాడు. భూమి అనగా మట్టి, మట్టిలో నుండే ఈ మానవ మృగాలు కూడ పుట్టుకొచ్చాయి గదా. దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుశులోయ్ అని మన తెలుగుకవి అన్నాడు.

కాని ఎప్పుడో ఇది బైబిల్‌లో చెప్పబడినదే సుమా ప్రకటన 1వ అధ్యాయం 6వ వచనంలో "ఆయన మనలను (అనగా మనుషులను) ఒక రాజ్యముగాను, యాజకులుగాను చేసెను" అని అన్నాడు. రాజ్యం అనగా మనుషులే కావున భూమిని అనగా అందులోని మనుషలను అనగా రాజ్యాన్ని పాలించే ఈ రాజు కూడా మనుషులలో నుండే పుట్టుకొచ్చాడు

అని అర్థము చేసుకోవాలి. ఒక రాజ్యములో రాజుగా అధికారం పొందాలంటే వంశపారంపర్యముగా కానివారైతే ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి, ట్రిక్కులు, జిమ్మిక్కులు, మాయలు ఎప్పటికీ అమలు కాని వాగ్దానాలు, అరచేతిలో వైకుంఠాన్ని చూపించి మసిపూసి మారేడు కాయను చేసి చివరగా అధికారం కోసం ఎలాగైనా పైకి వస్తారనడం మనకు తెలిసిన మరియు మన కళ్ళముందు జరుగుచున్న పచ్చి నిజం. ఈనాడు మన దేశంలో, రాష్ట్రంలో ఎన్నుకోబడుతున్న ప్రభుత్వాలను గూర్చి ఆలోచిస్తే నిజం మీకే తెలుస్తుంది.

మొదటి మృగం మరియు మహా సామ్రాజ్యాలలో చివరిదైన క్రూర మృగం అవన్నియు వంశపారంపర్యాచారం ప్రకారంగా వస్తే ఈ మృగం మాత్రము మొదటి మృగం లాంటిదే అయినా అది జనులలో నుండి పైకి వచ్చినది అని చెబుతున్నాడంటే ఇది అదృష్టవ శాత్తుగా కాక తన కాళ్ళమీద తాను నిలబడి పైకి వచ్చిన రాజ్యము అనగా ఈ రాజ్యము ప్రజల చేత, ప్రజల కొరకు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకోబడినది అన్నమాట. ఇది గొఱ్ఱెపిల్ల వంటి కొమ్ములు గలది అని అంటున్నాడు. కొమ్ములు అహంకారానికి, దర్పానికి, అహంభావానికి రాజరికానికి గుర్తులు. అయితే ఈ కొమ్ములు గొఱ్ఱెపిల్ల కొమ్ములవంటివి అంటున్నాడంటే పైకి అపాయకరంగా కన్పించేవి కాకపోయినా లోన భయంకరమైనవే. అసలు గొఱ్ఱెపిల్ల వంటివి అంటున్నాడంటే ఆ క్రూరమృగం గొఱ్ఱెపిల్ల చర్మంలాంటిది కప్పుకొని వచ్చిందని అర్థం.

గొఱ్ఱెల వంటి మనుషులను పరిపాలించడానికి అది కూడా గొఱ్ఱెపిల్ల వలెనే ఉన్నట్లు నటించేది అన్నమాట. నేటి తరంలో మనుష్యులలో నుండి ఎన్నుకోబడి మనుష్యుల క్షేమం కొరకు మనలాంటి వారితోనే ఏర్పాటు చేయబడిన రాజ్యాధికారాన్ని “ప్రజాస్వామ్య ప్రభుత్వం” అంటారు. అప్పటి

నుండి ఇప్పటివరకు వచ్చిన ప్రజాస్వామ్య ప్రభుత్వాలన్నీ ముందున్న రాజుల రాజ్యాలలాగ కౄరంగానే తన ప్రజలను పరిపాలించాయని పరిపాలిస్తున్నాయని మరువకూడదు. ఇది ఎవరు కాదనలేని పచ్చి నిజం సుమా". కావాలంటే మనుషులు వ్రాసిన చరిత్రపుటల్లోనికి వెళ్ళి చూడండి. లేదా బైబిల్‌లో దేవుడు సమూయేలు ద్వారా ఇశ్రాయేలీయులకు చెప్పిన వాక్యాలను చదివైనా గ్రహించండి (1సమూ 8:4-23).

మనలో నుండి మన చేతనే మన క్షేమంకోసమే ఎన్నుకోబడి అధికారంలోనికి వెళ్ళిన మన వాడి అధికారదాహం ఎంతటి ఘోరానికైనా తెగిస్తుందనేది తెలియనిది కాదు. ఆ కౄరమృగం ఏమంటుందంటే చట్టం తన పనితాను చేస్తుంది. నా ప్రజలకు ఎలాంటి అన్యాయం జరుగదు అంటూనే, డబ్బున్న వాడికి, వారి బంధువులకు ఎలా చుట్టంగా మారుతుందో ఈనాడు మనం దాని ఫలితం అనుభవిస్తున్నాం కూడా. ప్రజాస్వామ్య ప్రభుత్వాల యొక్క మాటలు అన్నీ మాయమాటలే సుమా. ఆనాటి ఘటసర్పము అవ్వను 'ఇది నిజమా? అని తన తంత్రగొట్టి మాటలతో మోసం చేసినట్లే, నేడు కూడా ఈ ప్రజాస్వామ్య ప్రభుత్వాలు మాట్లాడుతున్నాయి. నాటి నుండి నేటి వరకున్న మనదేశ ప్రజాస్వామ్యంలో పేదవాడు మరింతగా మోసపోతూ పరమ దరిద్రతలోనికి వెళ్ళిపోతున్నాడు. ధనవంతుడు మరింత ధనవంతుడుగా మారిపోయి భయంకరమైన నరక పాత్రులవుతున్నారు. అయినా క్రొత్తగా వచ్చే ప్రతి ప్రజాస్వామ్య ప్రభుత్వం దేశంలో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలిస్తాం అని సిగ్గు-ఎగ్గు లేకుండా వాగ్దానం చేస్తుంటాయి.

ఎన్ని సంక్షేమ పథకాలు, ప్రారంభించినా, ఎన్ని పంచవర్ష ప్రణాళికలు వేసినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే ఉన్నది. ఇంకా ఆ గొంగళికి చీకిపోయి

చిల్లులు పడుతున్నాయి. ఇదంతా ఆ మృగం మాయ మాటలతోటే గట్టెక్కుతుంది. ఇది యోహానుగారి కాలంలోనే అనగా రోమా ప్రభుత్వపతనంతో ప్రారంభమయింది. నేటికి ఇది ఎలా వర్ధిల్లుచున్నదో వివరించాలంటే సమయం చాలదు. కావాలంటే మన దేశానికి స్వాతంత్ర్యాన్ని పోరాడి తెచ్చిన సమరయోధులైన వారిని అడుగండి ఆనాటి తెల్లవారి పాలన నయమా? ఈనాటి మన నల్లవాడి పాలన నయమా? వాస్తవం అప్పుడే తెలుస్తుంది.

యోహాను ఈ గ్రంథాన్ని వ్రాసేటప్పటికి భూమి మీద వధింపబడిన గొఱ్ఱెపిల్ల తన రాజ్యాన్నికూడా ఈ భూమిమీదనే స్థాపించి పరిపాలించు చున్నది. అదే క్రీస్తు రాజ్యము, దేవుని రాజ్యము, పరలోక రాజ్యము, సమసమాజము, నూతన యెరూషలేము, పరలోక పట్టణము (అపొ.కా. 2:37-47, 4:32-35) గా పిలువబడినది. ఆనాటి నుండి క్రీస్తును నమ్మిన వారు అందరు ఆ సామ్రాజ్యంలోనికి వెళ్ళుచున్నారు. గనుక ఆ ఘటసర్పము, సాతాను తెలివితో నాది కూడా అలాంటి అనగా దేవునిలాంటి రాజ్యమేనని చెప్పి నమ్మించడానికే గొఱ్ఱెపిల్ల కొమ్ములవంటి రెండు కొమ్ములను చూపించింది. ఈ రెండు కొమ్ములు ఇద్దరు రాజులను సూచిస్తుంది. ఇద్దరు కూడా మానవ మృగాలతో కూడినదై పాత రాజ్యాల లాంటిదే కాని ప్రజలకే తన జీవితం అంకితం అనే పేరుతో సరికొత్త అవతారం ఎత్తినదన్నమాట. అందులకే దానిని మరియొక కౄరమృగం మరియు దాని యొక్క ప్రతిమా స్వరూపం అని అన్నాడు.

**ప్రకటన 13:12**

“అది మొదటి కౄరమృగముకున్న అధికారపు చేష్టలన్నియు దానియెదుట చేయుచున్నది మరియు చావుదెబ్బ తగిలి బాగుపడియున్న

ఆ మొదటి మృగమునకు భూమియు దానిలో నివసించువారును నమస్కారము చేయునట్లు అది బలవంతము చేయుచున్నది.

ప్రజాస్వామ్యం, సమసమాజం, భూతల స్వర్గం అనే ముసుగులో ఉన్న ఈ మృగము యొక్క ప్రభుత్వపు చేష్టలన్నియు మొదటి కౄరమృగము యొక్క చేతలేనని చెప్పాడు. అందుకే ఆనాటి నుండి ఈనాటి వరకు వస్తున్న ప్రభుత్వాలన్నీ ప్రజాస్వామ్యం పేరుతోనే తమను ఎన్నుకొన్న ప్రజలను హింసిస్తూ వారి బాగోగులను ఏ మాత్రం చూడకుండా మొదటి రాజ్యాల అధికారపు నిరంకుశత్వాన్నే కలిగియున్నదనే సత్యాన్నే దేవుని వాక్యము చెప్పుచున్నది. యేసుక్రీస్తు సిలువ మరణంతో చావుదెబ్బ తగిలి మరలా బాగుపడియున్న ఆ ప్రభుత్వానికి భూమిలో నివసించు వారందరు నమస్కారము చేయవలెనని ఈ మృగం బలవంతము చేయుచున్నది.

అనగా ప్రత్యేక రాజ్యంగా ఏర్పడి ప్రభువును నమ్మిన వారిని కూడా తన బలంతో బలవంతంగా ఈ లోక అధికారమునకు లోబడునట్లు చేయుచున్నది. చట్టం ముందు అందరూ సమానమే అని చెబుతూ చట్టం చేసేవారు, దానిని అమలు చేసేవారు వారి చుట్టాలు మాత్రం దాని నుండి తెలివిగా తప్పించుకొంటున్నారు. ఇది ఖచ్చితంగా ఆనాటి రాజుల పరిపాలనను పోలియున్నదే. ఆనాడు రాజ్యాధికారులు, వారి బంధువులు, ఆ రాజును పొగిడేవారు. శిక్షల నుండి తప్పించుకొనేవారు గదా! అలా శిక్ష నుండి తప్పించు కోవాలంటే ప్రభుత్వ అధికారాన్ని అన్యాయాలను ఒప్పుకొని తీరాలని అనగా దానికి నమస్కరించాలని సాతాను అందరిని బలవంతము చేయుచున్నది. తప్పులు, మోసాలు చేసే అధికారులు, న్యాయవాదులు, న్యాయమూర్తులు, ఎమ్మెల్యేలు, మంత్రుల పైరవీలతో

కేసులనుండి తప్పించుకొంటున్న వారంతా ఈ క్రూరమృగానికి నమస్కరిస్తున్న వారే. అలాంటి వారే భయంకరంగా దాని ముద్ర గలవారు అని సుళువుగా గ్రహించగలరు.

ఈ లోకములో రాజ్యాధికారము చెలాయించేవారెవరైనా, ఏ ముసుగులో ఉన్నా వారు లోకాధికారి క్రిందకే వస్తారు. మనదేశంలో కాని, ఏ దేశంలోనైనా ప్రజాస్వామ్యం ముసుగులో ఉన్న వారు అందరూ బైబిల్ చెప్పినట్లు ఈ లోకాధికారి క్రిందకే వస్తారు. మనదేశంలో కాని, ఏదేశంలోనైనా ప్రజాస్వామ్యం ముసుగులో పాతకాలపు నిరంకుశపు పాలన లేదా కుటుంబ పరమైన పాలనాధికారమే ఇప్పటికీ నడుస్తుంది. గనుక ఈ ప్రభుత్వాలన్నీ ఈ రెండవ మృగము పాలన క్రిందనే ఉన్నాయి అని తప్పకుండా చెప్పవచ్చును.

నాటి నుండి నేటికి నిజంగా క్రైస్తవుడైన వాడెవడు ఈ రాజ్యాధికారాన్ని కోరకూడదు. ప్రభుత్వాన్ని ఏ విధముగానైనా, క్రైస్తవుల మేలుకోసమేననైనా నడిపి ప్రజలచేత పరిచారము చేయించుకొనకూడదు. తనవారందరికి పరిచారము చేయాలే కాని వారి చేత సేవలు చేయించుకోకూడదు. ఇది క్రీస్తు పాటించిన పరిపాలన విధానము. ఆయనను ఆనాడే లోకంలో రాజుగా చేయాలని శిష్యులంటే తప్పించుకొని కొండకు పారిపోయాడు (యోహాను 6:15). మనల్ని (క్రైస్తవులను) రాజరికము గాని ప్రభుత్వాధికారము చేయువారి వలె ఎట్టి పరిస్థితిలో కూడా ఉండకూడదని ఖచ్చితముగా చెప్పెను. (మత్తయి 20:25-28).

**ప్రకటన 13:13 :**

“అది ఆకాశము నుండి భూమికి మనుష్యుల యెదుటకు దిగివచ్చునట్లుగా గొప్ప సూచనలు చేయుచున్నది”

దేవుడు తన ప్రజలైనవారికి ఏమి తిందుమా, ఏమి త్రాగుదుమా ఏమి ధరించుకొందుమా! అని ఆలోచించవద్దు. నేను అన్నీ మీకు అనుగ్రహిస్తాను. మీరు మాత్రం మొదట నా నీతిని నా రాజ్యాన్ని వెదుకుడి అని చెప్పాడు గదా! (మత్తయి 6:25-34). అయితే కూడు, గుడ్డతోపాటు మీకు ఇల్లు (దేవుడు చెప్పనిది) కూడా కట్టిస్తానంటున్నాయి నేటి ప్రభుత్వాలు. దేవుడెక్కడున్నాడు మేమే దేవుళ్ళం మాది కూడా దేవుని పాలనే మీకు సకాలంలో వర్షాలు పడకపోతే మేఘమథనం చేసి వర్షాలు కురిపించి మిమ్ము్మను ఆదుకొంటాం అని అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారు. జనాకర్షక పథకాలు ప్రవేశపెట్టి అప్పటివరకు వినని, ఊహించని పథకాలతో ఊదరగొట్టి ప్రజలను అదరగొడుతున్నారు. శత్రుదేశాలను, ప్రక్కదేశాలను ప్రమాదంగా చూపి అంతరిక్ష యుద్ధం కోసం అనేక అణు క్షిపణులను తయారుచేసో, కొనో జనులను వేరే దేశాల వారినికూడా అబ్బురపరచు చున్నారు. మానవ మేథస్సుతో, సైన్సుతో సాధించిన ప్రగతితో అంతరిక్ష యానాలు చేస్తూ గ్రహంతర వాసం చేయిస్తూ గ్రహాలలో ఇల్లు కట్టించి, వ్యవసాయం చేయిస్తామని గొప్ప గొప్ప సూచనలు చూపిస్తూ అందరిని ఆశ్చర్య పరుస్తున్నాయి నేటి ప్రభుత్వాలు అనగా క్రూరమృగం లేదా ఈ లోకాధికారియైన సాతాను.

శాస్త్రంతో ఆకాశంలోను, భూమి మీదను జరుగుచున్న ఈ సూచనలు లేదా అద్భుతాల వల్ల జనులు దేవుడెక్కడున్నాడు, శాస్త్రం ముందు దేవుడు గాని, దైవగ్రంథమని చెప్పుచున్న బైబిల్ గాని నిలువబడగలదా? అని ప్రశ్నిస్తూ, ప్రగల్భాలు పలుకుతూ ఆ క్రూరమృగం వెంబడి పరిగెడుతున్నారే గాని, దేవునిని మహిమ పరచడం లేదు. మనిషి మేథస్సుకు అందిన ఈ జ్ఞానం కూడా దేవుడిచ్చినదేనని మరచి సాతాను మాయలోపడి ఇది

మా జ్ఞానం మేం పరిశోధించి తెలుసుకొన్నది అని అంటున్నారు. మొదటి శతాబ్దపు తర్వాతనే కొద్దికొద్దిగా మనిషి ఈ లోకజ్ఞానాన్ని అనగా శాస్త్రాన్ని నేర్చుకోవడం ప్రారంభించాడు.

శాస్త్రాన్ని గుడ్డిగా వ్యతిరేకించడము లేదు. దానిని ఉపయోగించుకొని దేవుని పనిని జరిగించి దేవుడిలా బ్రతకాలి కాని దేవునినే ఎదిరించకూడదు అనేది దేవుని సంకల్పము మరియు అదే నా ఉద్దేశ్యము. శాస్త్రము భౌతిక ప్రపంచము మీద ఆధారపడింది గనుక ఈ భూమి లేక విశ్వంలో నిరంతరము జరిగే మార్పులను బట్టి మారిపోతుంది. కాని దేవుడు మారడు మరియు దేవుని సృష్టినుండి పుట్టింది శాస్త్రము. అనగా దేవుని వాక్కు సకల శాస్త్రాలకు నిలయమని మరచిపోయినవారే సాతానుముద్ర కలవారు.

దేవుడు యోబు గ్రంథంలో చెప్పినదే ఈనాడు నెరవేర్చుచున్నాడని మరచిపోయారు. బైబిల్ ఒక మత గ్రంథం అనే స్థాయికి క్రైస్తవులే చేర్చారు. ప్రత్యేకించి 18వ శతాబ్దం ప్రారంభం నుండి ఈ 21వ శతాబ్దం వచ్చే సరికి శాస్త, సాంకేతిక రంగంలో విప్లవాత్మకమైన మార్పులు త్వరత్వరగా సంభవించాయి. కంప్యూటర్‌ను కనుగొన్న తర్వాత ఇక మనిషి గర్వానికి అంతేలేకుండా పోతుంది. లోకాధికారి మాయలోపడి కౄరమృగం తోడ్పాటుతో సృష్టికి ప్రతిసృష్టి చేస్తూ సృష్టికర్తనే ఎదిరించే స్థాయికి చేరాడీ నవ నాగరిక నరుడు. ఇదంతా సాతాను వెనుకాల ఉండి మాయ చేస్తుందని, ఎవరు కూడా అర్థం చేసుకోలేకపోవుచున్నారు. ఈ లోకం కోసం వ్యర్థంగా బ్రతుకుతున్నారు. తమ కోసం అనగా తమైన ఆత్మ కోసం ఆలోచించే వారు రోజు రోజుకూ తగ్గిపోతున్నారు అనగా కరువైపోతున్నారు.

# క్రూరమృగము యొక్క ప్రతిమా స్వరూపం



**ప్రకటన 13:14**

"కత్తి దెబ్బతినియు బ్రతికిన ఈ క్రూరమృగమునకు ప్రతిమను చేయవలెనని అది భూనివాసులతో చెప్పుచూ, ఆ మృగము ఎదుట చేయుటకు తన కియ్యబడిన సూచనల వలన భూనివాసులను మోస పుచ్చుతున్నది".

బైబిల్ ప్రకారంగా అనగా దేవుని మాట ప్రకారంగా లోకాన్ని పరిపాలించిన ఆ ఆఖరి రోమా మహాసామ్రాజ్యం వాక్యమనే ఖడ్గంతో దెబ్బతిని తిరిగి జీవం పోసుకొని తన అధికారాన్నంత మరొక క్రూర మృగమైన అనగా ప్రజాస్వామ్యం పేరుతో ఉన్న ప్రభుత్వానికి అప్పజెప్పినది. ఇప్పుడు ఈ రెండవ క్రూర మృగము మొదటి క్రూరమృగానికి ప్రతిమను చేయవలెనని అదే భూనివాసులతో చెప్పుచూ వారిని మరింతగా మోసపుచ్చుచున్నదని వ్రాయుచున్నాడు. ఇంతకు ప్రతిమ అనగా దాని బొమ్మనా, దాని నకలునా, దాని అధికారాన్నంతా ఒక చోట చేర్చి లిఖించడమా? బొమ్మను చేస్తే ఎల్లకాలం ఉండదు. ఒకప్పుడు నెబుకద్నేజరు అదే క్రూరమృగానికి లోబడి తన బొమ్మను నిలువబెట్టి అందరూ దానికి మొక్కాలని ఆదేశించాడు.

దానియేలు ఆ విగ్రహానికి మొక్కలేదు ఎందుకంటే జీవగ్రంథములో ఆయన పేరుంది గనుక (దానియేలు 3:22). ఆ తర్వాత దేవుని మహిమను కళ్ళారా చూసిన ఆ క్రూరమృగం ఆ ప్రతిమకు నమస్కరింప జేయాలనుకొన్న సాతాను అనుచరులు మరలా రాజు నొద్దకు వెళ్ళి ఎవడును రాజుకు తప్ప దేవునికైనా, ఏ మనుష్యునికైనా మొరపెట్టవద్దని శాసనాన్ని చేయించడం చూస్తాం. బొమ్మ తర్వాత **'శాసనం'** రాజ్యాధికారానికి, రాజు అహంకారానికి, దానికి మూలపురుషుడైన సాతానుకి చిహ్నంగా లేక నకలుగా రాజ శాసనంగా మిగిలింది (దానియేలు 6:6-1).

ఆ శాసనానికి ప్రతిమలే అనగా దానికి True Copy లేదా Xerox Copyలు లేదా నకళ్ళు మరియు డూప్లికేట్లే నేటిరాజ్యాలు దాని రాజ్యాంగాలు అనగా మన ప్రజాస్వామ్య ప్రభుత్వాలు, ప్రజలెన్నుకున్న ప్రతినిధుల చేతనే తయారుచేసుకొన్న మరియు తమ అవసరాలను బట్టి మార్పులు, చేర్పులకు లోనవుతున్నటువంటి రాజ్యాంగం అని వేరే చెప్పనవసరం లేదనుకుంటా. రాజులు పోయినా, వారి అధికారానికి గుర్తుగా ఉన్న రాజశాసనాలకు ప్రతిమలు లేక నకళ్ళుగా ఈ రాజ్యాంగాలు మాత్రం మిగిలే ఉన్నాయి సుమా! ప్రజలను పరిపాలన ఎలా చేయాలో ఆ ప్రజలచేతనే వ్రాయించింది సాతాను. ఒక్కోసారి రాజ్యాంగం మంచిదయినా దానిని అమలుచేయాల్సిన వారు దాని మరియు తమ అధికార మాయలోపడి దానికి విపరీత బాష్యాలు చెప్పి, వికృతంగా దానిని అమలు చేయుచున్నారు. ఈ ప్రతిమనడ్డుపెట్టుకొని ఈ క్రూరమృగాలైన ప్రభుత్వాలు తమ ప్రజలకొరకు ఏమైనా చేయగలమని గొప్పగొప్ప సూచనలు చేస్తున్నట్లు చూపించి అందరిని తనకు నమస్కరించేటట్టు చేస్తుంది. ఇది లేఖానుసారంగా వాస్తవం అని నేడు జరుగుతున్న వాటిని చూసైనా గ్రహింపగలరు. మీరేమి చదువుచున్నారో జాగ్రత్తగా లేఖానుసారంగా చూసుకోగలరు. ఆలోచించి వివేకంతో నిర్ణయం తీసుకోగలరు.

ఇది తెలియని ఎంతోమంది దైవజనులు, బైబిల్ పండితులు ప్రతిమ అనగా రోమాపత్రిక 1వ అధ్యాయంలో దేవునికి ప్రతిగా సాతానుకు ప్రతిమను చేయడం గూర్చి మాట్లాడారు. “వారి అవివేక హృదయము అంధకారమాయెను. తాము జ్ఞానులమనుకొని చెప్పుకొనుచూ బుద్ధిహీనులైరి. వారు అక్షయుడగు దేవుని మహిమను క్షయమగు మనుష్యులయొక్కయు, పక్షుల యొక్కయు, చతుష్పాద జంతువుల యొక్కయు, పురుగుల యొక్కయు ప్రతిమా స్వరూపముగా మార్చిరి (రోమా 1:21-23). రోమా పత్రికలో చెప్పినటువంటిది దేవునికి ప్రతిగా చేసిన ప్రతిమ వేరు ప్రకటన గ్రంథంలో చెప్పిన కౄర మృగానికి మనుషులు చేసిన ప్రతిమ వేరు. రోమా పత్రికలో కనబడని దేవునికి కనపడే ప్రతిమా స్వరూపమిచ్చారు. ఇది మనుషులు చేసినదే అంటున్నాడు దేవుడు. ముందుగా దేవుడికి మనమే చేసిన ప్రతిమ స్వరూపం ఏమిటో ఆలోచిస్తే అద్భుతంగా, ఆశ్చర్యంగా ఉంటుంది.

ఈ రోజుల్లోనే కాదు యేసుప్రభువు భూమిమీద జీవించిన కాలంలోనే సిరి లేక ధనం దేవుడి అంత ఎత్తుకు ఎదిగింది. “ఎవడును ఇద్దరు యాజమానులకు దాసుడుగా ఉండనేరడు... మీరు దేవునికి సిరికిని దాసులుగా ఉండనేరరు” (మత్తయి 6:19-24). ధనము దేవునితో సమానత్వం సంపాదించుకొని మనుష్యుల హృదయాలలో స్థానం సంపాదించుకొన్నది. అందుకే మనిషి నేడు డబ్బుంటే కొండ మీద కోతినైనా దించుతాను అని అంటున్నాడు, కాని దేవుడుంటే ఏమైనా చేయగలను అని అనడం లేదు. డబ్బుకు లోకం దాసోహం. ధనం మూలం మిథం, జగత్తు అనే సామెతలు ఎన్నో పుట్టుకొచ్చాయి.

ఈనాడు ధనాన్ని దేవత అని, దేవుడు అని ధనలక్ష్మి అని నిత్యం పూజిస్తున్నారు. రూపాయి నోటు క్రిందపడితే కళ్ళకద్దుకొని దండం

పెడుతున్నారు. దాని వల్ల ఎవరికైనా నష్టం, అన్యాయం జరిగినప్పుడు మాత్రమే దానిని దయ్యము అని, పాపిష్టిసొమ్ము అని, ధనపిశాచి అని అంటున్నారు. వాస్తవంగా మనిషి సృష్టించిన ఈ డబ్బు ఖచ్చితంగా సైతాను స్వరూపమే కాని అది దేవునిదే అనుకొని చేశారు అలాగే పూజిస్తున్నారు. మీరు ఏ దేశంలోని కరెన్సీ అనగా రూపాయి నోటు గాని, నాణము గాని తీసుకొంటే దానిపై నాలుగుకాళ్ళ జంతువు బొమ్మగాని, పక్షుల బొమ్మగాని, పురుగుల బొమ్మగాని మరీ ముఖ్యంగా మనుష్యుల బొమ్మలు గాని తప్పపకుండా ఉంటాయి. ఇది దేవుడికి ఆనాటి అజ్ఞానులు చేసిన ప్రతిమ. కొన్ని చోట్ల విగ్రహాలతో ప్రారంభమైన విగ్రహారాధన పోటు నేడు కనబడని భయంకర విగ్రహమైన డబ్బును పూజిస్తున్నారు. డబ్బును పెట్టుకొనే జేబును మనభాషలో హృదయానికి (గుండెకు) అతి దగ్గరలోనే టైలర్ కుడుతున్నాడు. ఆలోచించండి ఈ రోజుల్లో డబ్బు ఎక్కడుందో...

ఇక సాతానుకు ప్రతిమ ఎలా ఉంటుందో ఆలోచించండి. సాతాను పుట్టిందే అధికారం కోసం, ప్రారంభంలో అది దేవునినే ఎదిరించింది (యెషయా 14:12-15). ప్రపంచ మహాసామ్రాజ్యాలను మనుష్యుల చేతనే తయారు చేయించింది. ఎన్నో విగ్రహారాధనలు చేయించింది. ఇవన్నీ కనబడుతున్నాయి గనుక, మనుషుల ఆలోచనలకు దొరకకుండా నిరంకుశ, నియంతల రాజ్యాలను తొలగించి వాటి ముసుగులో ప్రజాస్వామ్య పాలనను పుట్టించి ఎవ్వరికి దొరకకుండా తన అధికారాన్ని కొనసాగించడానికే ఆ రాజ్యాంగాన్ని కూడా తనకు ప్రతిమగా ఈ మనుషుల చేతనే చేయించుకొన్నది.

ఈ రోజు ఏ దేశంలోనైనా ఆ రాజ్యాంగాలే రాజరికాలను, అధికారాలను, ప్రజల సంక్షేమాలను, తీర్పులను కూడా నడుపుతున్నాయి. రాజు శాసనం మొదటి మహాసామ్రాజ్యమైన బబులోనులో అధికారం చేయడం ప్రారంభమవటం చూశాం. మనదేశంలో ఉన్న మనం కూడా,

కోర్టులు అన్ని రాజ్యాంగం ప్రకారంగానే మాట్లాడాలి. దాని గీతను జవదాటకూడదు. ఇలా మొదటి క్రూరమృగానికి ప్రతిమను రెండవ క్రూరమృగం మనుషుల చేతనే బలవంతంగా చేయించింది. మానవ మృగాల వలననే ఎంతో మంచి రాజ్యాంగాలు ఆ మృగాలకు ప్రతినిధులై వారి అధికార దాహానికి ప్రతిరూపాలై కూర్చున్నాయి కాని రాజ్యాంగాలు మంచి ఉద్దేశంతోనే వ్రాయబడ్డాయి అని ఆలోచిస్తేనే ఈ కౄరమృగం యొక్క మూలం గ్రహించగలం.

**ప్రకటన 13:15**

"మరియు ఆ మృగము యొక్క ప్రతిమ మాట్లాడునట్లును, ఆ మృగము యొక్క ప్రతిమకు నమస్కారము చేయనివారిని హతము చేయునట్లును ఆ మృగము యొక్క ప్రతిమకు ప్రాణమిచ్చుటకై దానికి అధికారమియ్యబడెను".





ఇప్పుడు ఏ దేశాధినేతను కదిలించినా చట్టం తన పనిని తాను చేసుకొనిపోతుంది అంటాడు. ఆ చట్టం న్యాయాన్ని అందించటానికి,

పరిపాలించడానికి రాజ్యాంగాన్ని చూపుతూ రాజ్యాంగంలో ప్రతి అక్షరం, సున్నా, పొల్లు, కామాతో సహా జడ్జిలతో గాని, అధికారులతో గాని మాట్లాడుతుంది. ఈ రాజ్యాంగానికి ఎవరు నమస్క రించరో లేదా లోబడరో లేక వ్యతిరేకంగా మాట్లాడుతారో వారికి కఠిన శిక్షలుంటాయి. నెబుకద్నెజరు నిలబెట్టిన విగ్రహానికి నమస్కరించనందుకు మరణశిక్షకు పాత్రులుగా ఎంచబడి అగ్ని గుండములో త్రోయబడ్డారు షద్రకు, మేషాకు, అబెద్నగోలు. రాజైన దర్యావేషు శాసనాన్ని (ప్రతిమను) ధిక్కరించి సింహాలగుహలో పడదోయబడ్డాడు భక్తుడైన దానియేలు.

ఇలా అప్పటి నుండే ఆ మృగము యొక్క ప్రతిమకు నమస్కారము చేయని వారిని హతము చేయునట్లు అది అధికారము చెలాయించుచున్నది. స్వాతంత్ర్యము కోసం పోరాడి మన దేశంలోని ఎందరో సమరయోధులు బ్రిటీషు వారి శాసనాలను, అధికారాలను ఎదిరించి హతులయ్యారో గుర్తు చేసుకోండి. ఆ ప్రతిమ యొక్క నిజస్వరూపాన్ని ఇప్పటికైనా గ్రహించండి. మనకై మనం దానికి నమస్కరింపకుండా జాగ్రత్త పడుదాం. అనేకులను దాని మాయలో పడకుండా కాపాడుదాం. ఎట్టి పరిస్థితులలో మనం నివసిస్తున్న దేశంలోని రాజ్యాంగాన్ని విమర్శింపకుండా తప్పుపట్టకుండా, వ్యతిరేకించకుండా తెలివిగా దానితో మనకవసరమైన పనిచేయించుకోవాలి. దేవుని పనికి మరియు దేశ ప్రజల ప్రయోజనం కోసం కూడా జాగ్రత్తగా దానిని ఉపయోగించుకోవాలి.

ఆ రోజుల్లో ఈ పాపలోకాన్ని, లోకాధికారాన్ని ఎదిరించిన అపొస్తలులు, శిష్యులు ఎందరో హతసాక్షులయ్యారు. ఇప్పటికిని దేవుని రాజ్య సువార్త కోసం సాతాను సామ్రాజ్యాన్ని, ప్రభుత్వాలను, వాటి చట్టాలను కాదని ఎందరో క్రీస్తు శిష్యులు హతసాక్షులవుచున్నారు. ఈ ప్రతిమకు ఓటువేసి అనగా రాజ్యాంగానికి ప్రాణం లేక పవర్ ఇచ్చింది కూడా ప్రజలే

గదా. సాతానుకు దాని సామ్రాజ్యానికి అధికారాన్నిచ్చింది క్రీ.పూ. కూడా ప్రజలే. "ఈ అధికారమంతయు, ఈ రాజ్యముల మహిమయు నీకిత్తును, అది నా కప్పగింపబడియున్నది, అదెవనికి నేను ఇయ్యగోరుదునో వానికిత్తును. కాబట్టి నీవు నాకు మ్రొక్కితివా ఇదంతయు నీదగునని ఆయనతో చెప్పెను" (లూకా 4:6,7).

క్రీస్తు పూర్వము నుండే జనులు ఈ మృగము అయిన సాతానుకు అధికారాన్ని అప్పగిస్తే ఆ సాతాను తన ప్రతిమకు తన అధికారాన్నంత ఇచ్చి ఆ ప్రజల చేతనే దానికి ప్రాణమిప్పించ్చి దానిని జీవింపజేయుచున్నది. ఈ రోజు రాజ్యాంగాన్ని మార్చాలని కొందరు, తిరిగి వ్రాయాలని కొందరు, అవసరం లేదని చాలామంది అంటున్నారు. ఒకవేళ కొత్తది వ్రాసుకొన్నా దాని ప్రకారమే మళ్ళీ పరిపాలన ఉంటుంది. కావున అది ఎప్పటికి ప్రాణంతోనే ఉంటుంది. మన దేవుని ప్రజల ప్రాణాలు తీస్తూనే ఉంటుంది. రాజ్యాంగము మంచిదే మరియు దానిని వ్రాసిన వ్యక్తులు మంచి ఉద్ధేశ్యంతోనే వ్రాశారు. కాని దానిని అమలు చేసే వారిలోనే సాతాను దూరి తన చిత్తాన్ని నెరవేర్చుకొంటుంది. పాలకులైన వారు రాజ్యాంగానికి తలనొప్పిగా తయారవుతూ, తప్పనిసరిగా దానిపేరు మీదనే దర్జాగా ఊరేగుతున్నారు (ప్రకటన 13:16-17).

"కాగా కొద్దివారుగాని, ధనికులు గాని, దరిద్రులు గాని స్వతంత్రులు గాని, దాసులు గాని, అందరూ తమ కుడిచేతి మీదనైనను తమనొసటి యందైనను ముద్రవేయించుకొనునట్లును, ఆ ముద్ర అనగా ఆ మృగము పేరైనను, దాని పేరిట సంఖ్యయైనను గలవాడు తప్ప, క్రయవిక్రయములు చేయుటకు మరియెవనికిని అధికారము లేకుండునట్లును అది వారిని బలవంతము చేయుచున్నది".

ఇక్కడ సాతాను లేదా క్రూరమృగము అనగా రాజ్యాధికారము తన ముద్ర అందరు వేయించుకోవాలని బలవంతము చేయుచున్నట్లు

కనబడుచున్నది. ముద్ర అనగా స్టాంప్, సీల్, అధికారిక చిహ్నముతో కూడిన గుర్తు మాత్రమే కాదు అని ముందే వివరించాను. ఎందుకంటే రబ్బరుతో కూడిన రాజముద్రను పేపర్ల మీద మాత్రమే వేస్తారు గాని మనిషి చేతిమీదగాని, మనిషి నుదిటిపైన కూడా వేయరు. కనపడని సాతాను యొక్క ఆ ముద్ర అనగా దాని ప్రభావమే మన మనుషుల మీద పడుతుంది. అధికారం అనుభవించాలనే ఆలోచన నుదుటి మీద అనగా తలలోపడగా అది అనుభవించి చేతలలో నడిపించాలనే ముద్ర కుడిచేతి మీదనే ఉంటుంది. ఇప్పుడు సాతాను ముద్ర అనగా దాని ప్రభావాన్ని అనుభవించాలని, నడుపాలని లేదా పరిపాలించాలని ప్రతివాడు అనుకొంటాడు. జీవితంలో ఏ మాత్రం అనుకొనని వారిచేత కూడా రాజ్యాధికారం అనుభవించాలని అనుకొనేటట్లు చేయుచున్నది ఈ లోకాధికారం.

కొద్దివారు అనగా పేరు ప్రఖ్యాతులు లేనివారు అని అర్థం. వారికి పేరురావాలంటే అధికారంలోనే ఉంటేనే వస్తుంది గనుక, అనామకులు కూడా నేడు అధికారానికి అర్రులు చాస్తున్నారు. అధికారాన్ని అందుకొని డబ్బు సంపాధించుకొని దాని ముద్ర ఇష్టపడి ఆనందముతో వేయించుకొను చున్నారు. కొందరి వద్ద ఎంతో డబ్బున్నా అనుకొన్నవన్నీ చేయాలంటే లేకా అనుభవించాలంటే అధికారమొక్కటే పరమావధి అని ఆలోచిచస్తూ తమ ధనాన్ని ఘనంగా పెట్టి అధికార అందలం ఎక్కి ఇంకా సంపాదించుకొని తనే సుఖపడాలనే తపనతో సాతాను ప్రభావానికి లోనవుతున్నారు. అధికారంలో ఉంటే అన్ని పనులు చేయవచ్చు. డబ్బుంటే కూడా చేయలేనివి చాలా ఉన్నాయి. స్మగ్లర్ల దగ్గర, తీవ్రవాదులు, ఉగ్రవాదులు వద్ద ఎంతో డబ్బు ఉన్నది కాని దానితో బహిరంగంగా తిరిగి ఏ పని చేయలేరు గదా! వారు కూడా సాతాను సంబంధులే అనగా దాని ముద్ర గలవారే అయినా

చీకటి సామ్రాజ్యాన్ని నడుపగలరే కాని ప్రజల మధ్య, ప్రజల అందరి కొరకేనని అందరిముందు బహిరంగముగా తమ పబ్బం గడుపుకోలేరు గదా!

ఇక దరిద్రులు అనగా బీదవారు చాలామంది తమ దరిద్రానికి కారణం డబ్బు లేకపోవడం అని ఆలోచించి ఆ డబ్బును సంపాదించే దగ్గర దారి అధికారమొక్కటేనని ఆలోచిస్తున్నారు. నిజానికి అధికారం అనగా రాజ్యాధికారం, లేక శాసనం ఈ డబ్బును సృష్టించిందికాని డబ్బు అధికారాన్ని సృష్టించలేదు. కేవలం డబ్బుంటే ఎలాంటివాడైనా అధికారాన్ని అందుకోవచ్చు. అందుకే దరిద్రులు మరియు ధనవంతులు కూడా ఈ రాజ్యాధికారం వైపే మొగ్గు చూపుతున్నారు. అందుకే చాలామంది బీదవారు కూడా బాగా చదివి లోకరాజ్యంలో కనీసం అధికారులై డబ్బు సంపాదించి సాతాను లేదా క్రూరమృగం యొక్క ప్రభావానికి లోనవుతున్నారు. పవర్ పాలిటిక్స్ అనే మాట చాలామంది వినే ఉంటారు కదా! రాజకీయమే రాజ్యాధికారానికి బేస్‌కదా. పవర్‌లోకి రావాలన్నా, ఆ పవర్‌ను నిలుపుకోవాలన్నా కావాల్సింది డబ్బు కదా!

ఇకపోతే స్వతంత్రులు కూడా దాని ముద్ర వేయించుకొనునట్లు బలవంతము చేయుచున్నది. బైబిల్ ప్రకారం స్వతంత్రులు అనగా దేవుని కుమారులు అనగా క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన వారు లేకా క్రైస్తవులు అని బైబిల్ చెప్పుచున్నది. “ఈ స్వాతంత్ర్యమును అనుగ్రహించి క్రీస్తు మనలను స్వతంత్రులనుగా చేసియున్నాడు... సహోదరులారా, మీరు స్వంతత్రులుగా ఉండుటకు పిలువబడితిరి” (గలతీ 5:1,13). పాపం నుండి విడుదల పొంది స్వతంత్రులైన మనపై కూడా దాని ముద్ర తిరిగి వేయాలని లేదా మనమే ఏదోరకంగా వేయించుకోవాలని సాతాను విశ్వాసులను బలవంతము చేయుచున్నది. సాతాను ప్రభావానికిలోనై ఎలా మనం దానికి నమస్కరిస్తున్నామో ఓసారి ఆలోచిద్దాం.

నేటి క్రైస్తవులలో కూడా చాలామంది ఈ లోకాధికారం కోసం అర్రులు చాచుచున్నారనే విషయం బహిరంగ రహస్యమే. క్రైస్తవుల మీద దాడులు, హింసలు జరుగుచున్నాయనే సాకును చూపించి ఈనాటి రాజకీయాలలో, ప్రభుత్వాలలో, రాజ్యాధికారంలో ప్రతిచోట క్రైస్తవుడికి వాటా ఉండాలని, ఎమ్మెల్యే, ఎం.పీ., మంత్రులలో కూడా క్రైస్తవులకు రిజర్వేషన్ ఉండాలని వాదిస్తున్నారు. బైబిల్ ప్రకారం అనగా దేవుని వాక్య ప్రకారం మనం అనగా క్రైస్తవులము ఈ లోకాధికారం కోసం అస్సలు ప్రాకులాడకూడదు (మత్తయి 20:25-28). అలా రాజ్యాధికారం కోసం (పవర్ కోసం) ప్రయత్నించిన వాని మీద సాతానుముద్ర పడుతుందని కాస్త జాగ్రత్తగా బైబిల్‌ను బట్టి ఆలోచిస్తేనే గ్రహించగలం. ఈ మధ్యన చాలామంది అజ్ఞానులైన బోధకులు, సువార్తికులు కూడా చట్టసభలలో మన గొంతు (వాణి) వినిపించాలంటే అన్ని పదవులకు (కౌన్సిలర్ నుండి ఎం.పి.వరకు) పోటీ చేయండి అని అమాయకులను రెచ్చగొట్టి బలవంతంగా సాతానుముద్ర వేయిస్తున్నారు. ఏ పనిచేయాలన్నా అనగా ఎలాంటి క్రయవిక్రయాలు చేయాలన్నా దాని ముద్రగాని, దాని పేరిట సంఖ్య ఉండాలని అంటున్నాడు. ఆ సంఖ్య ఏమిటో తర్వాత వచనంలో వివరిస్తాను. త్వరపడి చంచల మనస్కులు కావద్దు, ఏ మనిషిని నమ్మొద్దు.

నేటి బోధకులలో అనేకులు ప్రార్థన చేయడానికి, సువార్త సభలలో ప్రసంగించడానికి డబ్బును డిమాండ్ చేస్తున్నారు. సభలుపెడితే ఎంత డబ్బు వెనకేసుకోవచ్చు అనగా మిగిల్చుకొని లాభం పొందవచ్చు అని ఆలోచిస్తున్నారు. సంఘంలో వచ్చే డబ్బులు చాలవని విదేశీ డబ్బుకు ఆశపడి, అమ్ముడుపోయి తమ పేరు మీదనే ఎసి కార్లు, ఎసి చర్చి బిల్డింగులు కడుతూ సుఖం అనుభవిస్తున్నారు. డబ్బుకు ఆశపడి విశ్వాసాన్ని అనేక డినామినేషన్లకు, సిద్ధాంతాలకు అమ్ముడుపోయి అక్రమం చేస్తున్నారు. ఇదే స్వతంత్రులు వేసుకొంటున్న సాతానుముద్ర.

డబ్బు, అధికారం అనేవి ఏనాడైనా క్షయమయ్యేవని, అనగా నాశనమయిపోయేవనియు క్షణం, క్షణం మార్పులకు లోనయ్యే చంచల మనస్తత్వం గలవనియూ అవి మనల్ని దగా అనగా మోసం చేసేవేనని క్రైస్తవుడు ముందుగా గుర్తెరిగి వాటి ముందు మోకరించకూడదు లేకా వాటిని ఆశించకూడదు. అప్పుడే ఆ ముద్ర నుండి బయటపడగలం. యేసును నమ్మనివారు ఈ విషయం తెలియక దాని మాయకు లోబడి అధికారం కోసం దేవుని పేరుతోనే, మతం మత్తులో సాతాను యొక్క ముద్రను ఇష్టపడి తమ మీద వేయించుకొంటున్నారు. ఈ రోజు గాని మరే రోజైనా క్రైస్తవుడు ఈ లోకాధికారంలో ఉన్నాడంటే అతడు పేరును బట్టి నామకార్థభక్తుడే కాని నిజంగా క్రీస్తును ధరించుకొని, ఆయనలోనికి రూపాంతరము చెంది, ఆయన రాజ్యంలో రాజు, యాజకుడై ఆ రాజ్యమేలుతున్న నిజమైన క్రైస్తవుడు కాడని గ్రహించిన వారు ధన్యులు.

దాసులు అనగా పనివారు కూడా తమ యజమానుల యొక్క పవర్ (అధికారం) చూసి వారి చేత అణగదొక్కబడినవారై ఎలాగైనావారిని తిరిగి అణగదొక్కాలనే ఆశతో, పగతో కూడా ఈ లోక అధికారం వైపు చూస్తున్నారు. కొందరు యజమానులకు తొత్తులుగా ఉండటానికో, మరి కొందరు యజమానులు తమకు అనువుగాని చోట తమ దాసులద్వారా పెత్తనం చేయటానికి కూడా దాసులను సాతాను ప్రభావం అనగా అధికారం వైపు వెళ్ళనిస్తున్నారు. ఇలా నేటి సమాజంలో చిన్నా, పెద్ద, బీద, ధనిక, క్రైస్తవ మరియు క్రైస్తవేతరులు జాతి, మత, కుల, ప్రాంతీయ, వర్ణ, వర్గభేదం లేకుండా తమ పరబేధము చూడకుండా అందరూ సాతాను సామ్రాజ్యంవైపు అనగా అధికారంవైపు పరుగులెత్తుతూ అన్యాయమై నరకానికి పోతున్నారు. అందరిని ఆ ముద్ర నుండి తప్పించటానికే దేవుడు తన వాక్కుల ద్వారా ఈ ప్రయత్నం చేయించాడు. ఇప్పటికైనా దేవుని మనస్సును ఎరుగండి. దేవునిముద్ర కోసమే కష్టపడైనా సర్వ ప్రయత్నం చేయండి.

నాటి నుండి నేటివరకు తమకు కావాల్సిన వస్తువులు కొనాలన్నా, అమ్మాలన్నా ఈ సాతాను ముద్ర తప్పనిసరిగా ఉండి తీరాలని క్రూరమృగం శాసనాలను వ్రాసిపెట్టింది గనుక మన జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు ఇది మనకిష్టం లేకున్నా తప్పనిసరైన పరిస్థితుల్లో దాని చుట్టూ తిరిగి దాని ముద్ర బలవంతముగా వేయించుకోవాల్సి వస్తుంది. ఒకప్పుడు మనుషులకు లోకంలో ఏది కావాలన్నా ఆ సమాజంలో వస్తుమార్పిడి పద్ధతి అమలులో ఉండేది. అనగా కుమ్మరి కుండనిస్తే, రైతు ధాన్యమిచ్చేవాడు. ఏ వృత్తివారు ఉత్పత్తి చేసిన వస్తువులను మార్పిడి చేసికొని ఆనందంగా సమాజంలో కలిసిమెలిసి ఉండేవారు. పెత్తందారి వ్యవస్థలో చాలా బాధపడ్డా కూడా వస్తుమార్పిడి ఉండేది. కాని ఎప్పుడైతే ఈ రాజ్యాధికారం డబ్బును సృష్టించిందో ఆ తర్వాతనే పరిస్థితి దారుణంగా మారింది. యోహాను కాలానికి అది బలవంతంగా తన ముద్రను అందరిమీద ముద్రించే స్థితికి వచ్చిందంటే నేటికి దాని ముద్ర వేసుకోకుండా ఎవరైనా ఉన్నారా? అని ఆలోచిస్తే చాలా భయం వేస్తుంది.

ఒక వ్యక్తి మంచి విశ్వాసి, సమాజంలో కూడా ఎవరికి ఎలాంటి హాని చేయకుండా ఉండి ఇతరులకు, సువార్తకు పనికివచ్చే నీతిమంతుడు అనుకొందాం. అతను బ్రతకడానికి, అనేకులను బ్రతికించడానికి సువార్త పరిచర్యకు ఉపయోగపడాలని కూడా ఒక ప్యాక్టరీ లేదా ఒక సంస్థను నెలకొల్పుతాడు. ఆ సంస్థకు లేదా కంపెనీకి కావాల్సిన ముడిసరుకు కొనాలన్నా, అతను తయారు చేసిన వస్తువులు మార్కెట్‌లో అమ్మాలన్నా అతనికి ఈ క్రూరమృగం అనగా ప్రభుత్వం యొక్క ముద్ర గాని, దాని పేరిట సంఖ్యయైనా తప్పనిసరిగా అవసరమవుతుంది.

ఇప్పుడైతే మనం కష్టపడి సంపాదించిన డబ్బును అనుదిన ఖర్చుల కోసం వాడుకోవడానికి బ్యాంక్‌లో వేయాలన్నా, తిరిగి తీసుకోవాలన్నా

కూడా పాన్‌కార్డ్ నంబర్ కావాలని తప్పనిసరి రూల్ ప్రవేశపెట్టింది. ఇవన్నీ కనపడని సాతాను ముద్రలే. అదే బలవంతముగా పొందడమంటే అసలు ఓ కంపెనీగాని ఓ దుకాణము పెట్టాలన్న చివరికి చర్చి మరియు బైబిల్ కాలేజీ పెట్టాలన్నా కూడా ప్రభుత్వము నుండి అధికారముద్ర కలిగిన రిజిస్ట్రేషన్ మరియు లైసెన్సు అవసరం గదా!

ఇంకా మామూలుగా ఒక ప్రాంతంలో బ్రతకడానికి కూడా ఎన్నో అనుమతులు, పరిమితులు విధిస్తూ తన అధికార ధృవపత్రాలు (రేషన్ కార్డు, ఓటర్‌కార్డు, ఆధార్‌కార్డు, బర్త్, నేటివిటి, కులం ధృవీకరణ పత్రాలు ఇలా ఎన్నింటినో) పొందమని బలవంతము చేయుచున్నది. దానిని పొందటానికి ఆలోచిస్తేనే వెంటనే అది మన నొదుట కనబడుతుంది. అధికారుల నుండి ఆ పత్రం తీసుకొనేటప్పుడు మన కుడిచేతిమీద ఆ ముద్ర పడుతుందని చెప్పవచ్చును.

ఈ అధికార ధృవపత్రాలు తీసుకోవద్దని నేను చెప్పడం లేదు. కార్డుల ద్వారా మన మీద సాతాను తన ముద్ర బలవంతంగా వేస్తున్నాడని చెబుతున్నాను అంతే. అలా ఏ కాగితాన్ని అనగా అధికార ముద్ర కలిగిన ధృవపత్రాలను ఇచ్చేవాడు, తీసుకొనేవాడు కూడా కుడిచేతినే ఉపయోగిస్తాడు. ఎడమ చేతితో చాలావరకు ఎవ్వరూ ఇవ్వరు, తీసుకోరు. అందుకే వాక్యములో కుడిచేయి అని ప్రత్యేకంగా వ్రాయించాడు దేవుడు, దేవుడు వ్రాయించాడని మనం తీసుకోవడం లేదు. ఇలా ముందు ముందు జరుగుతుందని తెలిసిన దేవుడు దేవుని రాజ్యంలోనికి ఎట్టి పరిస్థితిలో దీనిని తీసుకొని రాకూడదని మనకు బుద్ధి రావాలని ముందే వ్రాయించాడు. ఆహా! దేవుని వాక్యమెంత అక్షరసత్యం. అందుకే ప్రతివాని మోకాలు యేసునామంలో దేవునిముందు మోకరిల్లాలి.

# మృగము యొక్క సంఖ్య
# (666 లేదా 616)

**ప్రకటన 13:16**

"**బు**ద్ధి గలవాడు మృగము యొక్క సంఖ్యను లెక్కింపనిమ్ము. అదియొక మనుష్యుని సంఖ్యయే ఆ సంఖ్య ఆరువందల అరువదియారు. ఇందులో జ్ఞానము కలదు".

ఈ 666 అనే సంఖ్యనుగూర్చి ఎన్నో అభిప్రాయాలు ఇదివరకే చదివి ఉంటారు. ఇది ఇంతవరకు రాలేదని కొందరు. ఇప్పుడే వస్తుందని మరి కొందరు. అంత్యక్రీస్తు వచ్చి త్వరలో ఆ సంఖ్యను శరీరాల మీద పచ్చబొట్టు పొడిచినట్లు పొడుస్తారని, కంప్యూటర్ బార్‌కోడ్ లేదా మైక్రోచిప్ అని ఇలా ఎవరికి నచ్చినది వారు వ్రాశారు. మేమే జ్ఞానులమనుకొనే కొందరైతే దేవుడు ఆరురోజులు సృష్టి చేశాడు, ఆరవరోజుననే మనిషిని సృష్టించాడు, ఆరురోజులు కష్టపడి ఏడవరోజు విశ్రాంతి తీసుకొన్నాడు గనుక 666 అనేది సాతాను సంఖ్య కాదు అది దేవుని సంఖ్య అని కూడా చెప్పారు. కొద్దిమంది మాత్రము కాథలిక్ వారి పోప్‌గారే ఆ మృగమని, ఆయనే ఆ మృగం పేరిట ఉన్న సంఖ్యను తన కిరీటంలో కలిగియున్నాడని వ్రాశారు.

ఇంతకీ ఇది ఒక సంఖ్య ఎంతమాత్రము కాదని మన చేతుల్లో ఉన్న దైవగ్రంథమే చెబుతుంది అంటే నమ్మలేని స్థితిలో ఉన్నారు క్రైస్తవులు. ఒరిజినల్ బైబిల్ ప్రతిలో ఏముందో ఎవరు చెప్పలేకపోతున్నారు. కాని కొన్ని ప్రాచీన ప్రతులలో ఆ సంఖ్య ఆరు నూట పదహారు (616) అని

ఉందని బైబిల్‌లోని ఆ వాక్యముపైననే చిన్నఫుట్‌నోట్ ఇచ్చి వ్రాశారు. అంటే నిజంగా అది 666 అనే సంఖ్యా లేక 616 అనే సంఖ్యా? అనేది ఆలోచిస్తేనే సత్యము తెలుస్తుంది. బైబిల్ ప్రకారంగా ఆలోచిస్తే ఈ రెండు సంఖ్యలు నిజం కాదు. ఎందుకంటే ఇందులో జ్ఞానము కలదు అని వ్రాశాడు. గనుక దీనిని ముందు ఆలోచించాలి.

మట్టిబుర్రతో మాములుగా ఆలోచిస్తే జ్ఞానమంటే బుద్ధి మరియు తెలివి. అయితే బైబిల్‌లోని వాక్యాల ఆధారంగా పరిశీలించి పరిశోధిస్తే జ్ఞానమంటే దేవుని వాక్యమైన క్రీస్తు అని తెలుస్తుంది. "ఆయన (క్రీస్తు) యూదులకు ఆటంకముగాను అన్యజనులకు వెఱ్ఱితనముగాను ఉన్నాడు. గాని యూదులకేమి, గ్రీసు దేశస్తుల కేమి, పిలువబడిన వారికే క్రీస్తు దేవుని శక్తియు, దేవుని జ్ఞానమునైయున్నాడు" (1కొరంథీ 1:24 సామెతలు 8:1-36). దీనిబట్టి ఈ ముద్రను, లేక దాని సంఖ్యనుగూర్చి వివరణ వ్రాయాలన్నా, వివరంగా అర్థం చేసుకోవాలన్నా దేవుని వాక్యమంతా వెతకాలన్నమాట అనగా ఆదికాండము నుండి ప్రకటన గ్రంథం వరకు ఉన్నదంతా దేవుని జ్ఞానమైన వాక్యమే గనుక ఆ సంఖ్యకోసం మొత్తం వాక్యాన్ని వెతకాలి మరియు దానిని వాక్యప్రకారమే వెతకాలి (మార్కు 4:24,25). అందుకే ఇంతసేపు మిమ్మల్ని ఒక్కొక్క వచనం కోసం బైబిల్‌లోని గ్రంథాలన్నీ తిప్పి వాటిని విప్పి వివరణ ఇచ్చాను.

ఇంతవరకు వివరించిన వాటిని బట్టి సాతాను ముద్ర వేసుకోవడం అనగా దాని అధికార ప్రభావానికి లోనుకావడమే అని అర్థం చేసుకొన్నాము. అయితే ఆ ముద్రను క్రూరమృగము యొక్క సంఖ్య అని వ్రాస్తూనే అది ఒక మనుష్యుని సంఖ్య అని కూడా వ్రాయుచున్నాడు. ఈ లోకంలో ఎంతటివాడైనా బ్రతకటానికి లేదా బ్రతుకుతెరువు కోసం ఆనాటి క్రూరమృగం

అనగా వారి వారి ప్రభుత్వం నుండి అధికార ధృవపత్రం తీసుకొని తీరాలన్నా దాని మీద సంభందిత అధికారి ముద్రను కలిగి ఉండాలి అని కూడా తెలుసుకొన్నాం.

అలాంటి అధికారపత్రం మీద ఆ ప్రభుత్వపు సంఖ్యతోపాటు (ఫైల్ నంబరు) దానిని పొందే మనుష్యుని సంఖ్య కూడా ఉండాలని ఆ ప్రభుత్వము యొక్క ఆదేశము ఉంటుందని దేవుడు కూడా చెబుతున్నాడు. అనగా ప్రభుత్వం సంఖ్య మరియు మనిషి సంఖ్య రెండూ కలిసే ఉంటాయి. కొన్నిసార్లు పభుత్వం నుండి అందుకొనే పత్రాలపై కేవలం ఆ మనుష్యుని సంఖ్య కూడా ఉండవచ్చును. అదే కౄరమృగము సంఖ్యకూడా అయి ఉండవచ్చును. ఇంతకీ ఆ సంఖ్య ఏమిటో? సకల విధములైన అనుభవ జ్ఞానముతో సువార్త విశ్వాస పక్షాన పోరాడుటకు ఆలోచించి వివేచించి దేవుని ముద్రను వేయించుకొందాము (ఫిలిప్పి 1:9; 2తిమోతి 2:7).

ఉదాహరణకు నేను ప్రారంభించిన మా బైబిల్ కాలేజీకి మరియు సంఘానికి వచ్చేవారికి వారి పిల్లలకు, వారి బంధువులకు పెళ్ళిళ్ళు జరిపించాలి కదా? అది క్రైస్తవ వివాహచట్టం ప్రకారంగా లైసెన్స్ తీసుకొన్న వారే చేయాలనే నిబంధన ప్రభుత్వం పెట్టింది. దానికి అనగా ఆ ప్రతిమకు మనవారు (ఆనాటి పెద్దలు) కూడా ప్రాణమిచ్చారు అని అర్థం. దానిని బలవంతంగానే తప్పని సరైన పరిస్థితిలో నేను కూడా తీసుకోవడం జరిగింది. సంఘం అనగా మన బాషలో చర్చిగాని, బైబిల్ కాలేజీ గాని, ఒక అనాథ సంస్థను నడపాలన్నా ఈ ప్రభుత్వము యొక్క ఆదేశము. అనుమతి, రిజిస్ట్రేషన్ చేయడం తప్పనిసరి. ఇలా అందరూ ఈ రోజుల్లో తమ సంస్థలను, చర్చిలను రిజిస్ట్రేషన్ చేసుకొన్నవారే అనగా స్వతంత్రులమైన మనల్ని కూడా ఈ కౄరమృగం తన సంఖ్యను ప్రతిమనిషి కలిగియుండాలి అని బలవంతం చేయుచున్నది.

ఇప్పుడు నాకు మన రాష్ట్రప్రభుత్వం మంజూరు చేసిన మ్యారేజిలైసెన్స్ సంఖ్యను చూద్దాం. G.O.MS No:413 Dt:20-5-1994 AP Govt. GEN-A DEPT. అని ఉంది. అది ప్రత్యేకంగా ఈ రాష్ట్రంలో క్రైస్తవ వివాహము చేసేవారి లిస్టులో ఒకటైన నా ప్రత్యేకమైన సంఖ్య కూడా ఇప్పుడు ఆలోచించండి. ఇది ఆంధ్రప్రదేశ్ రాజపత్రం (గెజిట్)లో ఇలా మ్యారేజ్ లైసెన్స్ తీసుకొనే వారికి ఒక్కొక్కరికి ఒక్కో సంఖ్య ఇస్తారు. ఇదే సంఖ్య ఇంకొకరికి రాదు. ఇలా ఏ లైసెన్సు తీసుకొన్నా, ఉద్యోగం కోసం ఇచ్చే అపాయింట్‌మెంట్ లెటర్‌లోని సీరియల్ నెంబరు మరియు ప్రతి ఉద్యోగి ఐడికార్డ్ నెంబరు కూడా అంతే గదా! ప్రతి దానికి ఒక ప్రత్యేకమైన సంఖ్య ఉండి తీరుతుంది. అది ఒక మనుష్యుని సంఖ్య మాత్రమే అని ఇప్పటికైనా అర్థం చేసుకోండి. ఇంకా అర్థం చేసుకోకపోయినా నేనేమి చేయలేను. ఇక దేవునికే వదిలివేద్దాం.

ఇప్పుడు ఈ దేశంలో ఎవరైనాసరే ఎటువంటి లావాదేవీలు చేయాలన్నా పాన్‌కార్డుగాని, రేషన్‌కార్డుగాని, ఆధార్‌కార్డుగాని, ఏదో ఒక గుర్తింపు కార్డుకాని తీసుకోవాలని బలవంతం చేయుచున్నది. రేషన్‌కార్డు లేదా ఆధార్‌కార్డు ఉంటేనే వంటగ్యాస్ ఇస్తామనే నిబంధన తెచ్చింది. ఇంకా బస్సు, రైలు, విమానం దేంట్లో ప్రయాణం చేసినా ఏదో ఒక గుర్తింపు కార్డు చూపాలనే ఖచ్చితమైన నిబంధనలున్నాయి. ఇందులో కూడా ప్రభుత్వ సంఖ్యతో పాటు మన మనిషి అనే ఒక వ్యక్తి సంఖ్య మాత్రమే ఉంటుంది. ఇందులో ఏదో ఒకటి తప్పనిసరిగా తీసుకొని తీరాలని ఆ క్రూరమృగము లేదా దాని ప్రతిమాస్వరూపము మనలను బలవంతం చేయుచున్నది. కొందరు తప్పనిసరియై కొన్ని అవసరాల కోసమైతే మరికొందరు కొన్ని ఆకర్షణీయమైన పథకాల నుండి లబ్ది పొందడానికి కూడా వీటిని తీసుకొంటున్నారు.




అయితే ఈ కార్డులు కావు సాతాను ముద్రలు వాటి మీదున్న నెంబరు మాత్రమే మన లేదా ప్రతివారి లేకా ప్రతి మనిషి సంఖ్య. ఇది మనదేశంలో మన ప్రభుత్వాలు మనకిచ్చిన ఈ సంఖ్య మరొకరికి ఉండదు. ఈ దేశం నుండి మరోదేశం వెళ్ళాలంటే పాస్‌పోర్టును కలిగి ఉండాలి.దాంట్లో కూడా మన సంఖ్య మరియు ప్రభుత్వపు పైలు సంఖ్య కలిసి వుంటాయి. ఈ పాస్‌పోర్ట్ నంబరు మన దేశం మొత్తం మీద మనకొక్కరికే ఉంటుంది. ఈ నంబరు వేరెవ్వరికి ఇవ్వబడదు. వీటన్నింటి మీద ఆ విభాగపు ప్రభుత్వ అధికారి మరియు కేంద్రప్రభుత్వ అధికారపు చిహ్నాముతో కూడిన రాజముద్ర కూడా ఉంటుందని మరచిపోకండి.

ఇలా ఈనాడు మనిషి ఈ భూమి మీద బ్రతికినప్పుడు తన జీవితంలో తప్పనిసరై ఎప్పుడో ఒకప్పుడు ఎలాగోలా ఈ క్రూరమృగము లేక దాని ప్రభుత్వానికి మరియు దాని అధికారానికి అనగా దాని ముద్రకు లోనవుతున్నాడు. ఈ రోజుల్లో మనకు కావాల్సిన అత్యవసర వస్తువులలో ఒకటైన ఇల్లు కొనాలన్నా, అమ్మాలన్నా లేదా స్థలం కొని ఇల్లు నిర్మించుకోవాలన్నా ఆ ప్రాంత మునిసిపాలిటీయో, కార్పొరేషనో లేదా గ్రామపంచాయితీ వారి పర్మిషన్‌తో పాటు ఆ స్థలంయొక్క రిజిస్ట్రేషన్ కూడా తప్పనిసరి అయిపోయింది. మరో వాస్తవ విషయం ఏమంటే దేవుని గుడో, ప్రార్థనా మందిరమునో, చర్చి బిల్డింగో మరియు బైబిల్ కాలేజీలు కట్టాలన్నా కూడా ప్రభుత్వ అనుమతి మరియు రిజిస్ట్రేషన్ తప్పని సరియే

గదా! అలాగే మనం కారు, స్కూటర్ ఏది కొన్నా అంతే. అయితే ఇవి ఈ కాలంలో తప్పనిసరి అవుతాయని దేవుడికి ముందే తెలుసు. అందుకే క్రీస్తు ప్రభువు నరుడిగా ఈ భూమిమీద జీవించిన కాలములో ఆయనను శోధించడానికి సాతాను సంబంధులు ఆనాటి ప్రభుత్వానికి పన్ను చెల్లించుట న్యాయమా అని అడిగారు. అందుకు ఆ వాక్యము ఏమంటుందంటే....

"మనము కైసరుకు పన్ను ఇచ్చుట న్యాయమా? కాదా? అని ఆయనను అడిగిరి ఆయన వారి కుయుక్తిని గుర్తెరిగి ఒక దేనారము నాకు చూపుడు. దీని మీద రూపమును, వ్రాతయు ఎవనివని వారి నడుగగా, వారు కైసరువనిరి. అందుకాయన – అలాగైతే కైసరువి కైసరుకును దేవునివి దేవునికిని చెల్లించుడని చెప్పెను" (లూకా20:22–25).

ఇక్కడ ప్రభువు ఈ లోకాధికారికి ఇవ్వవలసినవి వానికి ఇవ్వమన్నాడు గనుక అవి ఇవ్వడానికి ఎన్ని పాన్‌కార్డులు, ఎన్ని ధృవపత్రాలు తీసుకొన్నా వాటిమీద ఎన్నిసంఖ్యలున్నా క్షమించాల్సిన బాధ్యత కూడా ఆయనదే కదా! అలాగే సర్వలోకానికెళ్ళి సువార్త ప్రకటించాలన్నా ఈ లోకాధికారి ద్వారా పాస్‌పోర్ట్ తీసుకోవాలి, సువార్త సభలకు పర్మిషన్ కూడా తీసుకోవాలిగదా! అందుకే ఇవి మరణకరము కాని పాపము క్రిందికి వస్తాయని గమనించాలి (1యోహాను 5:16,17). అయితే వాడి బలవంతముగా కాక తామే ఇష్టపడి ఆ ముద్రను వేయించుకొని ఆ సంఖ్యకు నమస్కరించిన వారికే నరక బాధలు అని గ్రహించుకొందాము. అవేవనగా మనుషులను చెడగొట్టే వ్యాపారాలకు అనగా వడ్డీ షాపులు, సిగరెట్, గుట్కాలు, కల్లు, సారాయి – వైనుషాపులు, హోటల్స్ – బార్‌లు, రియల్ ఎస్టేట్, షేర్ మార్కెట్లు ఇలా అనేకమైన దుర్వ్యాపారాలు చేయుటకు తీసుకొని పర్మిట్లు, లైసెన్సులు అని చెప్పవచ్చును.

"సాతాను సింహాసనమున్న స్థలములో నీవు కాపురమున్నావని నేనెరుగుదును. మరియు సాతాను కాపురమున్న ఆ స్థలములో, నా యందు విశ్వాసియైయుండి నన్ను గూర్చి సాక్షియైన అంతిపయను వాడు మీ మధ్యను చంపబడిన దినములో నీవు నా నామమును గట్టిగా చేపట్టి నా యందలి విశ్వాసము విసర్జింపలేదని నేనెరుగుదును."(ప్రకటన2:13).

కాబట్టి ఈ లోకాధికారము క్రింద కొద్దికాలమే జీవిస్తున్న మనం కొన్నిసార్లు ఆ అధికార ప్రభావానికి లోబడి తప్పనిసరి పరిస్థితుల్లో దాని బలవంతంతో లోబడి అనగా ముద్రకు లోబడి దాని సంఖ్యను వేయించుకొన్నా దేవునిని మరియు విశ్వాసమును మరువకూడదు అంటున్నాడు. ఈ లోక ప్రభుత్వానికి పన్ను చెల్లించాలి. మరి కనబడని దేవునికి చెల్లించాల్సిన పన్ను ఏమిటి? అంటే మన విశ్వాసమును విసర్జింపకపోవడం, అనగా అత్మఫలాలను కలిగివుండటమే దాని ముద్ర నుండి తప్పించుకొనే ఉపాయం ఈ లోకంలో, ఈ దేశంలో లేదా ఏ దేశంలోనైనా నివసించినంత కాలం ఈ దేశం లేదా ఆ దేశ రాజ్యాంగాన్ని కూడా ఒప్పుకొని దానిని గౌరవించి తీరాలి. ఆ దేశ సంస్కృతిని, సాంప్రదాయాన్ని, సార్వభౌమత్వాన్ని కాపాడవలసి వుంది లేకపోతే ఆ దేశంలో నివాసం ఉండే అర్హత కోల్పోతాం కదా?

మనకిష్టమున్నా లేకపోయినా మెజారిటీ ప్రజల అభిప్రాయం ప్రకారం ఏ దేశంలోనైనా (ప్రజాస్వామ్య) ప్రభుత్వాలు ఏర్పాటవుతున్నాయి గదా? ఆ ప్రభుత్వం అప్పుడప్పుడు ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు మరియు దైవవ్యతిరేక పనులు కూడా చేపట్టినా మనము ఏంచేయలేము గదా; అయితే క్రైస్తవులైన మనము మాత్రము వీలయినంత వరకు ఈ కౄరమృగాలు చేసే గొప్ప సూచనల బారి నుండి వాటి ముద్ర నుండి సకల విధములైన

అనుభవజ్ఞానంతో తెలివిగా తప్పించుకోవాలి. కనీసం క్రీస్తు రాజ్యంలో (సంఘంలో) నైనా! వాటి వాసన కూడా దరిదాపులకు రానివ్వకూడదు. దేవుని రాజ్యంలో అనగా సంఘంలో ఉండి కూడా అందులోనికి ఈ ముద్రను రానిస్తే ఇక మనకు రక్షణ లేదు. ఇది మరణకరమైన పాపము, ఈ పాపానికి క్షమాపణ లేదు.

కాని ఇప్పుడున్న అనేక సంఘాలలో ఆభ్రష్ఠుడు ఎప్పుడో ప్రవేశించాడు. వారిలో చాలామంది తెలిసీతెలియక వాని ముద్రలోనే ఉండి అదే అసలైన భక్తి మరియు దేవునిముద్ర అనుకొని, అందులోనికి అనేకులను రమ్మని బలవంతము చేస్తున్నారు. కావున క్రీస్తు స్వరక్తమిచ్చి సంపాదించిన సంఘమా బహుపరాక్, మీరేమీ వినుచున్నారో మరియు ఏమి చేయుచున్నారో జాగ్రత్తగా చూచుకొనుడి. దేవుని ముద్రకై దేవుని రాజ్యంను క్రీస్తు రాజ్యంగానే ఉండనివ్వండి. ఇదియే సాతాను సింహాసనమున్న స్థలములో కాపురమున్నా, మన విశ్వాసాన్ని కాపాడుకొంటూ దేవునిముద్రను వేసుకొంటూ, బలవంతంగా మనమీద వేయబడిన సాతాను ముద్రను ఎప్పటికప్పుడు తుడిచివేసుకొంటూ అనగా ప్రార్థనలు, యాచనలు దేవుడు మనకిచ్చిన పనిని పూర్తిచేసి యేసురక్తంలో కడుగుకుంటూ ఉండటము అని అర్థం.

యేసు రక్తంలో కూడా కడుగలేని అనగా మరణకరమైన పాపపు ముద్రను అనగా సాతాను ముద్రను ఇష్టపడి వేసుకొంటున్న క్రైస్తవులను హెచ్చరిస్తూ ఎప్పుడో నేను వ్రాసిన నాశనకరమైన హేయవస్తువు దేవుని ఆశీర్వాదములు మరియు ప్రార్థించిన నూనె మహోత్యం అనే (కరపత్రాలను) అంశాలను జాగ్రత్తగా చదవండి. ఎంతమంది స్వతంత్రులు అనగా విశ్వాసులు కూడా దేవునిముద్ర అనుకొని, భిన్నమైన సువార్తలో ఉండి సాతానుముద్రకు ఆనందముతో బలైపోతున్నారో గ్రహించి అనేకులను ఆ నిత్యాగ్నిదండనలో నుండి కాపాడండి.




"దైవాశీర్వాదములు అనేమాట వినబడగానే కటిక దరిద్రుని నుండి ఆగర్భ శ్రీమంతుని వరకు ఒక రకమైన ఆశ చిగురించి, ఆ ఆనందముతో ప్రతివారి ముఖములో మార్పు కొట్టొచ్చినట్లు కనబడుతుంది. నేటి మన తరంలో కూడా చిన్నవారు మొదలుకొని కాటికి కాలుచాపుకొన్న వృద్ధుల వరకు మమ్మల్ని దేవుడు ఆశీర్వదించాలని ఎదురుచూస్తూ దైవాశీర్వాదం కొరకు దివారాత్రులు దేవున్ని ప్రార్థించుచూ, పూజిస్తున్నారు. దైవజనులమని చెప్పుకొనేవారు కూడా దైవాశీర్వాదం కోసం సువార్త సభలను ఆశీర్వాద పండుగలుగా మార్చేస్తున్నారు. ప్రతివారం, నెల ఉపవాస, కుటుంబ, ఎడతెగని ప్రార్థనలు, యజ్ఞ, యాగాదులు జరిపిస్తున్నారు. బలులు, అర్పణలు, మొక్కుబడులు చెల్లించేవారు, పుణ్యక్షేత్రాలు - పవిత్ర స్థలాలుగా చెప్పబడుతున్న చర్చీలు, గుడులు, గోపురాలు దర్శించే వారనేకులు మనలో రోజు, రోజుకు విపరీతంగా తయారవుతున్నారు.

ఎవరింటికెళ్ళినా బ్రదర్ మాకోసం ప్రార్థించండి, చాలా కష్టాలు, ఇరుకులు, ఇబ్బందుల్లో ఉన్నాం, దేవుడు మమ్మల్ని ఆశీర్వదించాలని మీ అనుదిన ప్రార్థనలో జ్ఞాపకం చేసుకోండి అనేవాళ్ళు మరీ ఎక్కువయ్యారు. యేసుక్రీస్తును నమ్మితేనే ఏదో ఒకటి కలిసి వస్తుందని చాలామంది

క్రైస్తవులుగా మారుతున్నారు. ఇంతకీ దేవుడు ఎలా ఆశీర్వదిస్తాడని అలా ఆశిస్తున్న వారినడిగితే ఈ జీవితంలో ఈ లోకంలో మన శరీరానికి అవసరమైన మేలులే కదండీ ఆ మాత్రం మాకు తెలియదా! పాతనిబంధన గ్రంథాలలో ఎంతోమందిని ఆశీర్వదించిన దేవుడు మమ్మల్ని ఎందుకు ఆశీర్వదించడు? అని ఎదురు ప్రశ్నిస్తున్నారు. ఇలా మానవజ్ఞానంతోనే ఆలోచించి మహోన్నతుని మహిమను మసిబూసి మారేడుకాయగా మారుస్తున్నారు. ఇంతకీ ఆశీర్వాదం అంటే ఏమిటి? ఈ పదం యొక్క అర్థం ఏమిటీ, ఇంతకూ ఈ మాటెలా ఉద్భవించిందో కూడా ఆలోచిద్దాం.

ఈ సృష్టిలోని సకల చరాచర జీవులలో జ్ఞానము - వివేకము కలిగిన నరుడొక్కడే ఆశాజీవి అని చెప్పక తప్పదు. ఈ నరుడికున్నన్ని ఆలోచనలు, ఆశలు - ఆశయాలు ఈ సృష్టిలో మరే జీవికి లేవు. ఈ ఆశే లేకపోతే మనిషి జీవించలేడు కూడా. ఆది మానవుడి నుండి అధునాతన మానవుని వరకు ప్రతి క్షణం వాని ఆశల సౌధాలు పెరిగిపోతున్నాయే గాని తరగడం లేదు. ఆశించడం తప్పుగాదు కాని ఆశకు అంతు ఉండాలి. ఈ ఆశ దురాశగా మారితే లేదా ఆశించినది దొరక్కపోతే నిరాశలో పడి, నిర్వేదంలోపడి నిత్యాగ్ని దండనపాలయ్యే ప్రమాదముంది.

మనకు చేతగానివి, అందనివి, మనం అందుకోలేనివి, అనగా ఆశించిన వాటిని వేరేవాళ్ళు ఉచితంగా ఇవ్వాలని ఆలోచించి వాటిని ఫ్రీగా పొందే విధాన్నాన్నే ఆశీర్వాదింపబడటము అంటారు. ఆశను తృప్తిపరచుటకే ఆశీర్వాదమనే పదం పుట్టుకొచ్చింది అని గ్రహించగలము. అడిగితే ఇచ్చేది దానము, అడగకుండా ఇచ్చేది బహుమానమైతే ఈ రెండింటికి మించినది లేదా అతీతమైనదే ఆశీర్వాదము అని చెప్పవచ్చు. దేవుని వాక్యమైన బైబిల్ భాషలో అయితే ఇది ఏ నరుడు ఇవ్వలేనిది, కేవలం దేవుడు మాత్రమే ఇచ్చేది ఆశీర్వాదం.

నేడు మన మధ్య ఉన్న అనేక సంఘాలలోని అనేకమంది బోధకులు, మీరు మా సంఘాలకొస్తేనే బహుగా ఆశీర్వదింపబడుతారని పదేపదే చెప్పి ఒక రకమైన హిప్నాటిజంలాంటి బోధనలు చేస్తున్నారు. ఈ మధ్యనే వచ్చిన టి.వి. ఛానెళ్ళలోనైతే మరీ బరితెగించి కొందరు సువార్తికులు మా ప్రసంగం (అరగంటలో) విని ఆశీర్వాదాలు అందుకొన్న వారు మాకు వ్రాయండని, చందా తప్పక పంపమని, అలా పంపిన వారు ఎలా ఎక్కువగా ఆశీర్వదింప బడ్డారో వెంటనే సాక్ష్యాలు కూడా చూపిస్తున్నారు. సంఘానికో, దేవునికో ఎంత ఇస్తే అంతకు రెండింతలు పొందుతారని చెప్పి దైవజనులు తమ బ్యాంక్ బ్యాలన్స్ పెంచుకొంటూ దేవుడు ఇలా మమ్మల్ని ఆశీర్వదించారనుకొంటున్నారే గాని, మీ డబ్బు పరలోకంలో జమ అవుతుందని విశ్వాసులకు చెప్పేవారే కరువైపోయారు. నాటి నుండి నేటి వరకు బోధింపబడుతున్న ఇలాంటి బోధనల పర్యవసానమే ప్రతి విశ్వాసిలో నరనరాలలో జీర్ణించుకునిపోయి సిరి సంపదల కోసము కడకు నిజమైన దేవుని వాక్యాన్నే కాదనే స్థితికి చేరిపోయారు.

క్రైస్తవులమని, విశ్వాసులమని, దైవజనులమని చెప్పుకొంటున్న వారిని ఎవరినడిగినా ఆశీర్వాదమనగానే ఆస్తి, అంతస్తు, ఉద్యోగం, వ్యాపారాభివృద్ధి, పంటలో అభివృద్ధి, సమాజంలో మంచి హోదా, ఉన్నత పదవులు, విదేశాల్లో ఉద్యోగాలు, చదువులు, రాజకీయపలుకుబడి మరియు రాజకీయ నాయకత్వం (వార్డు మెంబరు మొదలుకొని యం.ఎల్.ఏ, యం.పి., మంత్రి, ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి, దేశాధ్యక్షుడు) ఇలా ఎన్నో సంగతులను ఏకధాటిగా చెప్పేస్తున్నారు. ఇలాంటి శరీర సంబంధులిచ్చే గొప్ప, గొప్ప సాక్ష్యాలను బట్టే క్రైస్తవేతరులలో గూడా ఈ విషయాలే బలంగా నాటుకొనిపోయి, అంతవరకు వారు చేసిన పూజలు, వ్రతాలు మొదలుగునవి

ఫలించకపోయే సరికి యేసుప్రభువైనా తమ బాధను గ్రహించి తమ శరీర అవసరాల కోసమే (ఆర్థికంగా, ఆరోగ్యపరంగా, సామాజికంగా దెబ్బతిన్న వారే) మనలను ప్రార్థించమని చెప్పి, ఎక్కువమంది ప్రార్థనలకొస్తూ క్రైస్తవులుగా మారుతున్నారు. ఇక్కడికి (చర్చికి) వచ్చాక కూడా వారి కోర్కెలు తీరకపోతే మమ్మల్ని మాయమాటలు చెప్పి మతం మార్చేసారు అని చెప్పి తిరిగి అమ్మఒడి పేరుతో తమ మాతృ మతంలోనికి మారిపోతూ క్రైస్తవ్యాన్ని అవహేళన చేస్తున్నారు. ఇలాంటి మనిషి బలహీనతలను ఆధారం చేసుకొనే నేడు ప్రతి ఊరికో సంఘం, వాడకో చర్చీ మరియు ఎందరో బాబాల ఆశ్రమాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి.

ఈ లోకాశలు, భూ సంబంధమైన ఆశీర్వాదాల ఆశలలోపడి, దేవుడు నిజంగా ఆయన ఇష్టానుసారంగా (వాక్యానుసారంగా) ఆశీర్వదించిన వారినే దరిద్రులని, మీకు విశ్వాసంలేదని, తప్పుడు బోధకులని నిందించే స్థాయికి ఎదిగిపోయింది నేటి క్రైస్తవ్యం, క్రైస్తవేతర సమాజం. నేటి సంఘాలలో 95% మంది బోధకులు చెబుతున్న దైవాశీర్వాదములు బైబిల్‌కు 100% భిన్నంగా ఉన్నాయంటే నమ్మలేక సత్యం చెప్పిన వారి సంఘాలకు రాలేని దశలో ఉన్నారు. క్రీస్తు సిలువ రక్తంతో రచించిన / చేసిన నూతన నిబంధనలోని అపొస్తలుల బోధవైపు అనగా సిలువ వేయబడిన క్రీస్తు బోధవైపు చూడక, ఆనాటి పాత నిబంధనలోని ప్రవక్తల బోధను, ఆనాటి వారిని ఆశీర్వదించిన వాక్యాలు మాత్రమే చూపెడుతూ ఈ అబద్ధ బోధకులు ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు.

దీనికి ముఖ్యకారణం బ్రతుకుదెరువుకోసం మాత్రమే బైబిల్ చేతపట్టి తమ కడుపే దేవుడుగా చేసుకొన్న (ఫిలిప్పి 3:17-21) సాతాను అనుచరులే అని దేవుని ప్రజలు ఈ సాతాను తంత్రములను గ్రహించడంలేదు. అబ్రహామును, ఇస్సాకును, యాకోబును, యోబును, దావీదును,

సొలోమోనును ఇలా మలాకి గ్రంథం వరకున్న వారిని చూపించి మాయ చేస్తున్నారు. కాని వారి ఆజ్ఞలు వేరు, వారి సున్నతి వేరు, వారి దేశం (భూసంబంధమైనది - కనాను) పాలు తేనెలు ప్రవహించే ప్రదేశం వేరు మనం నివస్తున్న దేశం వేరు అని అర్థం చేసుకోవాలి. క్రీస్తు సువార్తలో ఇదేదీ లేదు మనం పరదేశులమని, పరసంబంధమైన ఆశీర్వాదమే మనదని జ్ఞాపకం చేసేవారే కరువైనారు (ఎఫెసీ 3:3-6). గనుక సాతాను ప్రభావం (ముద్ర) ఎంత బలంగా పడుతుందో గమనించాలి.

అయినా ఆదికాండము నుండి అనగా ఆదాము నుండి ఇశ్రాయేలు సమాజం వరకున్న ఆశీర్వాదమనే పదం, వారితో మాట్లాడిన విధానం చదివికూడా అర్థం చేసుకోలేని అంధులుగా మారిపోయారు. దేవుని వాక్యము సెలవిచ్చినట్లుగా "దేవుని స్వరూపియైయున్న క్రీస్తు మహిమను కనపరుచు సువార్త ప్రకాశము వారికి (నాటి నుండి నేటి భక్తులందరికి) ప్రకాశింపకుండు నిమిత్తము, ఈ యుగసంబంధమైన దేవత అవిశ్వాసులైన వారి మనోనేత్రములకు గ్రుడ్డితనమును కలుగజేసి యున్నది" (2కొరింథీ 4:4).

అందుకే అనేకుల ఆత్మీయ అంధకారాన్ని, ఎంతో చదువు ఉన్నా బైబిల్‌ను చదవరాని విద్యా విహీనతను పారద్రోలి నాతరంలోని కొందరినైనా అగ్నిలోంచి లాగి రక్షించాలనే దేవుని ఆలోచన, ఆజ్ఞకు లోబడి, మరోసారి మీ అందరిచేత కాలాన్నిబట్టి, సందర్భాన్ని బట్టి, మనుష్యులందరి జీవగ్రంథమైన బైబిల్‌ను చదివి గ్రహించి, దాని ప్రకారం ప్రవర్తించే వారుగా దేవునిముందు నిలబెట్టాలని ఈ అంశాన్ని ప్రత్యేకముగా వ్రాయుచున్నాను (1పేతురు 1:8-11; 2తిమోతి 2:7; అపొ.కా. 17:10,11; యాకోబు 1:20,21). సాతానుముద్రకు దేవుని ముద్రకు ఉన్న తేడాను గమనించగలరు.

ఆదాము పాపం చేయకముందు చేసిన తర్వాత దేవుని ఆశీర్వాదం గూర్చి చదువుదాం. “దేవుడు వారిని ఆశీర్వదించెను, ఎట్లనగా – మీరు ఫలించి అభివృద్ధి పొంది, విస్తరించి భూమిని నిండించి దానిని లోబరచుకొనుడి...” (ఆది.కాం. 1:28, 9:7) భూమిని, దానిలోని సమస్తాన్ని మనమే లోబర్చుకోవాలి. ఆయన మనకధికారం ఇచ్చాడు. మనం ఎంత కష్టపడ్డా ఫలితం రానిది అదే దేవుని నిజమైన అనగా మనిషి అడగనిది, అనుకొనినది దేవుడే తనకునచ్చి మనకు ఇచ్చిన ఆశీర్వాదం పిల్లలను కనడం. అందుకే నరుడు ఒంటరిగా ఉంటే ఆయనకే మంచిది కాదని అనుకొన్నాడు (ఆది.కా. 2:18). పెళ్ళి అనే వ్యవస్థను ఆయన వలన కలిగినది అని వ్రాయించాడు (ఆది.కా. 24:50-60).

ఈ ఆశీర్వాదమే అబ్రామును అబ్రహాముగా, యాకోబును ఇశ్రాయేలుగా మార్చి మనుషులకు మనుషులను బహుమానంగా ఇవ్వడమే ఆశీర్వాదమని బోధించి, అనేకమంది పిల్లలను కనమని ఆజ్ఞాపించాడు (ఆది.కాం. 15:5,6; 16:10, 17:1-8, 20, 22:15-18, 26:1-5, 28:1-4, 35:9-12, 48:3,4, 15-16) ఆ తర్వాత ఇశ్రాయేలీయులు, దేవునియందు భయభక్తులు కలిగిన యోబు, దావీదు, సొలోమోను లాంటివారి చేతి పనిని దీవించి ఆస్తిపరులను చేసినా, దానిని వారు ఆశీర్వాదముగా చెప్పక పిల్లలను, పిల్లల పిల్లలను చూడడం లేదా ఎక్కువమందిని కనడమే దేవుని ఆశీర్వాదమని కీర్తించారు.

“పిల్లలు యెహోవా అనుగ్రహించు స్వాస్థ్యము (ఆస్తి). గర్భఫలం ఆయన ఇచ్చు బహుమానమే”, “యెహోవా యందు భయభక్తులు గలవాడు ఈలాగు ఆశీర్వదించబడును” (కీర్తన 127, 128 మరియు 107:30, 115:12-16) ఇలా పిల్లలే ఆశీర్వాదమని అర్థం గాని చిన్నపిల్లలు,

మొదలుకొని పిల్లల పిల్లలను చూసిన ముసలివారు కూడా గ్రహించడం లేదు. పిల్లలను ఎక్కువమందిని కంటేనే భాగ్యవతి (ధనవంతురాలు) అని పాతరోజుల్లో  అన్నారు. స్త్రీలు గర్భం ధరించగానే శ్రీమంతం చేస్తారు. ఇంతకు పెళ్ళికార్డులోనే అమ్మాయి పేరుకుముందు చిరంజీవి లక్ష్మీసౌభాగ్యవతి అని వ్రాస్తారు (చి॥ల॥సౌ).

ఎంత ఆస్తిపరులైనా పిల్లలు లేని వారి బాధ వర్ణనాతీతమని, పెండ్లి అయినవారు కుమారుడు కావాలని ప్రార్థిస్తే కూతురు పుట్టడం, కూతురు కావాలంటే కొడుకు పుట్టడం ఎందుకు జరుగుతుందో తెలియని ఆయోమయంలో ఉండి, అర్థంకాక అది తమ ఖర్మ, గ్రహచారం, తలరాత అని సర్దిచెప్పుకొంటున్నారు. ఇది మన ఖర్మ గ్రహచారం అస్సలుకాదు ఇది దేవుని ఇష్టం మరియు అనాది సంకల్పం, ఆశీర్వాదం. ఇది అర్థంగావాలంటే నూతన నిబంధనలోనికెళ్ళాలి. ఈ విషయం లేదా మర్మమును పాతనిబంధనలోని వారికి వివరంగా చెప్పలేదు దేవుడు.

"ఎట్లనగా తన ప్రియునియందు, తాను ఉచితముగా... యేసుక్రీస్తు ద్వారా తనకు పిల్లలనుగా స్వీకరించుటకై... జగత్తు పునాది వేయబడక మునుపే ప్రేమచేత క్రీస్తులో మనలను ఏర్పరచుకొనెను". (ఎఫెసి 1:3-6). దేవునికి పిల్లలు కావాలిగాబట్టే అబ్రామును అబ్రాహాముగా మార్చాడు, మనకు అడిగితే నచ్చిన వారిని ఇవ్వక అడగకుండానే పిల్లలను ఆశీర్వాదంగా ఇస్తున్నాడు. అడిగితే ఇచ్చేది దానం కదా. అయితే నూతన నిబంధనలో పిల్లలే ఆస్తి అని, అయితే ఇది కూడా పరసంబంధమైనదేనని, అనగా మనతో పాటుగా మనం పరలోకానికి తీసుకెళ్ళేది, అనగా పరలోకం పంపేది కూడా ఈ పిల్లలనే ఆస్తిని, ఆశీర్వాదాన్ని అని గ్రహించాలి.

అయితే పిల్లలు లేనివారు దేవునిచేత ఆశీర్వదింపబడినవారు కారా? అని ప్రశ్నించే అవకాశం ఉంది గనుక, ఇతరుల పిల్లలను వాక్యముతో కని అనగా దత్తత తీసుకొని క్రీస్తులో పెంచి పరలోకం పంపే వారు కూడా ఆశీర్వదింపబడేవారే. ఉదా॥ పౌలు తీతును, తిమోతిని అనేకులను వాక్యంలో కనడం. ఎందుకంటే పౌలుకు పెండ్లే కాలేదు మరి, అయినా అతడు కూడా బహుగా ఆశీర్వదింపబడ్డవాడే. మన తలంపులు వేరు దేవుని తలంపులు వేరు అనే దేవోక్తిని గ్రహించకపోవడమే ఈ గందరగోళానికి కారణమని ఇప్పటికైనా గ్రహించి తీరాలి.

అయితే ఈ అవకాశం అనగా దత్తత తీసుకొని పెంచి కూడా ఉపయోగించుకొనని వారికి సిలువ వేయబడిన క్రీస్తు బోధలో మరో అవకాశం ఇచ్చాడు. ఇది కూడా చేస్తే ఆశీర్వదింపబడినవారే. "అప్పుడు రాజు తన కుడివైపున ఉన్నవారిని చూచి – నా తండ్రిచేత ఆశీర్వదింపబడిన వారలారా, రండి, లోకము పుట్టినది మొదలుకొని మీ కొరకు సిద్ధపరచిన రాజ్యమును స్వతంత్రించుకొనుడి. నేను ఆకలిగొంటిని, మీరు నాకు భోజనము పెట్టితిరి. పరదేశినైయుంటిని నన్ను చేర్చుకొంటిరి, రోగినైయుంటిని నన్ను చూడవచ్చితిరి. చెఱసాలలో ఉంటిని చూడవచ్చితిరి... అందుకు రాజు మిక్కిలి అల్పులైన ఈ నా సహోదరులలో ఒకనికి మీరు చేసితిరని నిశ్చయంగా మీతో చెప్పుచున్నాననెను" (మత్తయి 25:31-46). ఇలా లోకంలోని అనాథలను కూడా ఆదుకొన్న వారు అందరు కూడా ఆశీర్వదింపబడిన వారేనని వాక్యం చెబుతుంది. దీంట్లో చిన్నా, పెద్ద, ఆడ, మగ తేడా లేదు కాని ఒక విషయం గమనించాలి. అదేదనగా మన స్వహస్తాలతో కష్టపడి సంపాదించిన ఆస్తిలో భాగాన్ని ఖర్చు చేయవలెనే గాని ఇతరుల నుండి కానుకలనే ధనం ఉచితంగాపొంది వాటితో దేవుని సేవ చేయాలనే విషయాలు వాక్యములో ఎక్కడాలేవుసుమా.

మనం పుట్టుటకు, మన బ్రతుకుటకు, మనం పిల్లలను దేవుని కోసం కని వారిని క్రీస్తులా పెంచుటకు, అనాధలను ఆదుకొనుటకు అనగా అన్నింటికి అవసరమైన, మరియు అసలు సిసలైనది, ఈ రోజుల్లో మరి శ్రేష్ఠమైన క్రొత్తనిబంధనలోని దేవుని ఆశీర్వాదములు మనకెలా వస్తున్నాయో మరికొన్ని వాక్యాలలో జాగ్రత్తగా చదివి ఆలోచించి చూద్దాం.

ప్రతి ఆదివారపు ఆరాధనలో, కుటుంబ ఆరాధనలో, స్వస్థత - ఉజ్జీవ - రక్షణ సువార్త కూటములలో, శుభకార్యములు, జ్ఞాపకార్ధ కూటములతో సహా అన్నింటి చివరిగా ముగింపు ప్రార్థన చేశాక అయ్యగారు (కాపరి గారు) ఇచ్చే దైవాశీర్వాదములు తీసుకొని ఇంటికెళుతాం. అయితే ఇచ్చే వాడికి, తీసుకొనే వాడికి ఇది ఓ అలవాటుగా - కేవలం ఆచారంగా మారిందే గాని అందులోని అసలైన పరమార్ధం ఎవరు గ్రహించుటలేదు. ఇదేనండి అసలైన సంగతి అనగా ఈ ఆశీర్వాదముల ద్వారానే మనం పరలోకం చేరవలసి ఉందని ఆలోచించలేకపోతున్నారు. పైగా ఈ ఆశీర్వాదం లేకుండా ఎవ్వరూ లేవద్దని, ఇంటికెళ్ళకూడదని గట్టిగా చెబుతుంటారు. సభా నిర్వాహకులు, మరియు ఆనాటి బోధకులు లేదా సువార్తికులు అదేదనగా...

"ప్రభువైన యేసుక్రీస్తు కృపయు, తండ్రియైన దేవుని ప్రేమయు, పరిశుద్ధాత్మ సహవాసమును మీ (మన) కందరికిని (సదా కాలము) తోడైయుండును గాక!..." (2కొరింథీ 13:14). వరుసక్రమం అప్పుడప్పుడు అటు-ఇటు అయినా ఇదే ఆశీర్వాదమని గ్రహించి ప్రవేశపెట్టిన మనవారు చాలా చాలా ధన్యులు సుమా. అదెలాగో జాగ్రత్తగా ఒక్కొక్క దానిని ధ్యానిద్దాం. ఇందులో కూడా ధనానికి, చర-స్థిరాస్థులకు ఎంతమాత్రం స్థానం లేదు. ఇప్పటికైనా వీటిని జాగ్రత్తగా చదివితేనే పూర్తిగా గ్రహించగలము.



**తండ్రియైన దేవుని ప్రేమ :** దేవుని ప్రేమ అనగానే ఈ లోకంలో ఆయనిచ్చే ఉద్యోగం, ఆస్తి, అంతస్తు, కార్లు మొదలుగునవి అనే భ్రమలో ఉన్నారు. ఉద్యోగం దేవుని ప్రేమ అంటే 60 సం॥లు రాగానే ప్రభుత్వం వారు రిటైర్మెంట్ అనే పదము గౌరవించి గెటౌట్ అంటుంది. కారు గాడ్ గిఫ్ట్ అంటే 15 సం॥లకే పనికిరాదని ఆర్.టి.ఏ. వారంటారు. బిల్డింగ్ 50సం॥లలో కూలిపోతుంది. కాని దేవుని ప్రేమ కలకలాం ఉంటుంది కదా. అందుకే ఇక చదవండి బైబిల్‌ను “దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా తన అద్వితీయ కుమారుని నామమందు విశ్వాసముంచువాడు నశింపక నిత్యజీవము పొందున్నట్లు ఆయనను అనుగ్రహించెను”. (యోహాను 3:16, 5:24).

“మనము దేవుని ప్రేమించితిమని కాదు, తానే మనలను ప్రేమించి మన పాపములకు ప్రాయశ్చిత్తమైయుండుటకు తన కుమారుని పంపెను. **ఇందులో ప్రేమయున్నది**”. (1యోహాను 4:7-11). దీనిని ఇక్కడ పూర్తిగా వివరించాలంటే ఈ కరపత్రము మరియు పుస్తకము సరిపోదు. నేను వ్రాసిన పుస్తకం “మానవ మేథస్సుకందని ప్రేమ” చదవండి. అయితే ఈ లోకంలో మనం బ్రతకడానికి కావల్సిన తిండి, బట్ట మొదలగునవి

అన్నీ ఇచ్చి తండ్రిగా తన బాధ్యత నెరవేరేస్తూ, మనం పాప విమోచన పొంది పరలోకం వెళ్ళడానికి, మనం ఏ మాత్రము అడగకుండానే క్రీస్తుతో సిలువయాగం చేయించడంలోనే దేవుని ప్రేమ ఉన్నది. ఈ ప్రేమ దేవుడిచ్చిన గొప్ప ఆశీర్వాదం. దీనికిమించినది ఈ లోకంలో మరి ఏది లేదు. ఇంకా ఏది వద్దు కూడా, ఈలాంటి ప్రేమ కావాలని, ఈలాంటి ప్రేమతో దివారాత్రులు దేవునిని ప్రార్థించిన వారెందరున్నారో ఒకసారి ఆలోచించండి.

**ప్రభువైన యేసుక్రీస్తు కృప :** "మీరు మన ప్రభువైన యేసుక్రీస్తు కృపను ఎరుగుదురు గదా? ఆయన ధనవంతుడైయుండియు మీరు తన దారిద్ర్యము వలన ధనవంతులు కావలెనని మీ నిమిత్తము దరిద్రుడాయెను". (2కొరింథీ 8:9). కృప అనే పదానికి ఇంగ్లీషులో గ్రేస్ అని చెప్పాడు. దాని అర్థం జాలి, కరుణ, దయ అనే పర్యాయ పదాలకు సరిపోతుంది. ఈ లోకాన్ని సృష్టించిన వాడు అనగా ఈ భూమి అంతటికి (వెల) ధరకడితే ఆయన ఎంతడి ధనవంతుడో ఆలోచించండి. ఈ భూమి మీదనున్న మనల్ని ఆయన ధనంతో మాత్రమే అనగా ఆశీర్వాదములతో ధనవంతులనుగా చేయడం ఆయన కృప అని దేవుడే అంటున్నాడు. దీనిని పైపైన మాత్రమే చూసిన మూర్ఖులు యేసు దగ్గరకొస్తే తప్పకుండా ధనవంతులవుతారని భ్రమపడుతున్నారు.

ధనవంతుడు పరలోకం చేరడని, నీ ధనమెక్కడ ఉండునో నీ హృదయం అక్కడే ఉంటుంది గనుక నీ ధనాన్ని అమ్మి బీదలకిచ్చి నన్ను వెంబడించమన్న వాక్యము (మత్తయి 6:19-24, 19:16-27; మార్కు 10:17-27; లూకా 18:18-27, 12:13-21; 1తిమోతి 6:3-10)లను మనవారు ఎప్పుడో మరచిపోయారు. ఒకని కలిమి (ఆస్తి) విస్తరించుట వాని జీవానికి (ఈ లోకంలో బ్రతకడానికి కూడా) మూలం కాదన్నాడంటే ధనం ఎంతటి రక్తపిశాచో ఆ దేవుని అనుగ్రహం పొందిన వారికి మరియు

ధనం చేసిన దగాను రుచి చూసిన వారికి అనగా అనుభవించిన వారికి మాత్రము చాలా బాగా అర్థం అవుతుంది.

మరి ఈ ధనం లేక ఐశ్వర్యం విషయమైన కృప ఏమిటని ఆలోచిస్తున్నారు గదా! చదవండి. "క్రీస్తును గూర్చిన జ్ఞానం మీలో స్థిరపరచబడినందున ఆయనయందు మీరు ప్రతి విషయంలోను, అనగా సమస్త ఉపదేశములోను, జ్ఞానములోను ఐశ్వర్యవంతులైతిరి". (1కొరింథీ 1:6, 4:7). వారి తొట్రుపాటు లోకానికి ఐశ్వర్యమును, వారి క్షీణదశ అన్యజనులకు (మనకు) ఐశ్వర్యమును అయినయెడల, వారి పరిపూర్ణత యెంత ఎక్కువగా ఐశ్వర్యకరమగును" (రోమా 11:11-14). లోకంకన్నా లోకాన్ని కలిగించిన వాక్యం చాలా ఖరీదైనదగును గదా! ఆ గొప్ప ధననిధియైన వాక్యాన్ని ఇశ్రాయేలీయుల నుండి తీసేసి మన స్వంతం చేయడానికి క్రీస్తు ఈ లోకానికి వచ్చాడు.

ఈ (లోకాంతం) యుగసమాప్తి వరకు మనతో ఉంటానన్నాడు క్రీస్తు. దేవుని ఆజ్ఞ ప్రకారం మాత్రమే కాక మన యెడల జ్ఞానానికి మించిన ప్రేమ, దయ, కరుణతో మనకోసం సిలువలో మరణించాడు (ఎఫెసీ 3:14-21). ఇది ఆయన చూపిన కృప (రోమా 15:21). ఈ కృప మన జీవితాంతం వరకు ఉంటేనే, అనగా మనం దేవుని వాక్యంలో పరిపూర్ణులవుతేనే పరలోకాన్ని స్వతంత్రించుకొంటాం గనుక. వాక్యం దగ్గరున్న వాడే అనగా వాక్యాన్ని కలిగియున్న వాడే ప్రపంచంలో అందరికన్నా ధనవంతుడు కాదా! దీనిని దైవాశీర్వాదమనాలా వద్దా? మనందరికి ఇదే ఎల్లప్పుడు కావాల్సినది.

**పరిశుద్ధాత్మ సహవాసము :** సృష్టి ఆరంభం నుండి, ఈ సృష్టి అంతం వరకు పరిశుద్ధాత్మ మనకు వివిధ పేర్లతో కనిపిస్తాడు. అయితే యేసు పరలోకం వెళ్ళాక మనం అనాథలంకాక, ఆదరణ పొందుటకై సదాకాలము

మనతో ఉండటానికి ఆదరణకర్తగా మనలోనికి పంపాడు. ఆయన మనలో ఉంటే మనం దేవుని పిల్లలం కాగలం అనగా శరీరక్రియలను చంపి నీతిమంతులం కాగలము (రోమా 8:9-26). పరిశుద్ధాత్మ ఉంటేనే క్రీస్తును ప్రభువని చెప్పగలం. క్రీస్తు ద్వారానే అందరికి తండ్రియైన దేవునికి ప్రార్థన, విజ్ఞాపనలు, కృతజ్ఞతాస్తుతులు చెల్లించగలము.

ఆత్మ సహాయం ఉంటేనే ఈ వాక్యాన్ని సరిగా అర్థం చేసుకోగలము, బోధించగలము, అనేకమైన తప్పుడు బోధలను ఖండించి, బుద్ధిచెప్పి, సరిదిద్దగలము (1కొరింథీ 2:10-15; 2తిమోతి 3:16-17). దేవునిని ఆరాధించాలంటే ఈ ఆత్మ సహవాసం, సహాయం తప్పనిసరి (యోహాను 4:24). దీనిని దేవుడే మనకు ఉచితంగా ఇచ్చాడు. ఎల్లప్పుడు దీనినే అడుగమన్నాడు, ఒకప్పుడు అపొస్తలులను మాత్రమే కనిపెట్టమన్నాడు. ఇప్పుడైతే బాప్తీస్మం తీసుకోగానే అందరికి వరంగా (అపొ.కా. 3:38) ఇస్తున్నాడు. గనుక ఈ ఆశీర్వాదం గూడా ఎంతో ముఖ్యమైనది. దీనిని ఆశీర్వాదంగా ఆశిస్తున్న వారెంతమంది ఉన్నారో ఇప్పటికైనా మిమ్మల్ని మీరే పరీక్షించుకోండి.

ఇప్పటికైనా ఆత్మతో ఆలోచించే విశ్వాసులు గ్రహించారను కొంటాను. నిజమైన దైవాశీర్వాదమంటే ఏమిటో. ఇంకా మూర్ఖంగా ఏదైనా రిఫరెన్స్ తీసి దీనికి వ్యతిరేకంగా నాతో వాదించాలనుకొంటున్నారా? అయితే మనం అనగా క్రైస్తవులైన వారు దేవునిని నమ్ముకొన్న వాళ్ళం. కాని దేవుడే ఎంచుకొన్న లోకసంబంధులైన ఇశ్రాయేలీయుల నుండి (ఆస్తి, అంతస్తులే ఆశీర్వాదాలుగా రుచిచూసిన వారినే) ప్రత్యేకంగా పట్టుకొన్న క్రీస్తు అపోస్తలులను ఆశీర్వదించిన విధానం చదవండి మీ బైబిల్ తీసి 1కొరింథీ 4:8-13; 2కొరింథీ 4:7-12, 6:3-10, 11:18-28. మరి ముఖ్యముగా

ఈ లోకంలో దొరికే మేలులే దేవుని ఆశీర్వాదాలనుకొని క్రీస్తునందు నిరీక్షణ కలిగి యుంటే మనుష్యులందరి కంటే నమ్మనివారికంటే దౌర్భాగ్యులము అని చెప్పాడు (1కొరింథీ 15:19).

ఇంకా యేసుక్రీస్తు ఎవరి ఇంటికొస్తే వారికి రక్షణ వస్తుంది, అయితే వారివారి ఇంట్లోంచి ధనం మాత్రం తప్పక వెళ్ళిపోతుంది (లూకా 19:1-10). ఇదే సత్యమని నమ్మిన మొదటి శతాబ్దములో క్రీస్తు సంఘంలో చేరిన సభ్యులందరూ తమ చరస్థిరాస్తులను అమ్మారు (అపో.కా. 2:43-47, 4:32:35, 5:1-11). ఈ సంగతులు మనకు సాక్ష్యార్థమై నేటికి బైబిల్‌లో ఉన్నా, బోధించే బోధకులు మరియు బోధ మారింది గనుకనే దైవాశీర్వాదాల పేరిట దేవుని సంఘం (చర్చి) ఆస్తులను నమ్మి తమ ఇండ్లు కట్టుకొంటున్నారు నేటి క్రైస్తవులు. పైగా దేవుడు మమ్మల్ని బహుగా ఆశీర్వదించాడని బహిరంగంగా సాక్ష్యము చెబుతున్నారు.

స్వహస్తములతో కష్టపడ్డ ప్రతి వారికి కడుపు నిండుతుందని ఆదాము నుండి నేటికి చెబుతున్నాడు దేవుడు (ఆది.కాం. 3:17-23; 2థెస్స 3:6-12). అన్యజనులకు అపొస్తలుడైన పౌలు తన చేతులతో కష్టపడ్డాడు (అపో.కా. 20:33-35). అపొస్తలులు కూడా స్వహస్తాలతో పనిచేశారు. దేవుని నీతిని రాజ్యాన్ని మొదట వెతికితే (మత్తయి 5:19-24), తిండి, బట్ట ఇస్తానని యేసు ఏనాడో చెప్పాడు. సువార్త చెప్పేవాడు మాత్రమే సువార్తవలన జీవించాలంటే, సంఘం ఇచ్చేది సరిపోదని విదేశీ డబ్బుకాశపడి అనేకమంది సువార్తికులు అన్యాయమైపోతున్నారు. ఇక్కడ సేవజేసినందుకు జీతం కూడా ఇక్కడే పొందితే, ప్రభువు ఇక పరలోకం అనే జీతం తేడనే సంగతి వీరి ఆలోచనకే రావడంలేదు.

కావున డబ్బు, ఆస్తి అంతస్తులు, ఉద్యోగం (స్వదేశీ - విదేశీ) ఈ లోక నాయకత్వం అనగా రాజ్యాధికారం, అంతస్తులు, విదేశీ ధనం, కార్లు ఇవేవి దేవుని ఆశీర్వాదాలు కావు. వీటిని మనమే కష్టపడితే సంపాదించు కోగలము. ఈ అంశము పూర్తిగా అర్థం కావాలంటే నేను వ్రాసిన 'యెహోవా కట్టిన ఇల్లు' పుస్తకం కూడా చదవగలరు. ఉచితంగా డబ్బు వచ్చి, మనవద్ద నిల్వ ఉంటుందంటే మనం దేవునికి దూరంగా జరిగిపోయినట్లే (లూకా 16:8-13). ఈ లోకాశలతో అనగా శరీరాశ, నేత్రాశ, జీవపుడంబములతో విశ్వాసులిచ్చిన కానుకలతో ఆస్తులు, అంతస్తులు సంపాదించిన వారి మీద సాతానుముద్ర ఉన్నట్లుగానే అనేక శ్రమలను అనుభవించి ఆత్మలను సంపాదించి పరలోకం కోసం ఈ లోకంలో ఏమి లేకపోయినా భయభక్తులతో బ్రతికే వారిమీద దేవునిముద్ర ఉంటుంది.

మట్టి నుండి పుట్టిన దేహం తిరిగి మట్టిలోనే కలిసిపోకుండా నిత్యజీవాన్ని పొంది పరలోకం వెళ్ళాలంటే దేవుడిచ్చే పర సంబంధమైన ఆశీర్వాదాలనే కోరండి. సాతాను బోధకుల మాయ బోధల నుండి, చమత్కారమైన కల్పనా కథల జోలికి వెళ్ళకుండా, కనీసం మనకు తెలిసిన అనేకులను వారివైపు వెళ్ళనీయకుండా దేవుని ప్రేమకోసం, క్రీస్తు కృపకోసం పరిశుద్ధాత్మ సహాయం కోసం నిరంతరం పరితపిస్తూ, దివారాత్రులు వాక్యాన్ని ధ్యానించి, పరిశోధించి, విశ్వాసాన్ని కాపాడుకొని మన పరలోకాన్ని తిరిగి చేరుకొందాం.

నీకు డబ్బువస్తే నీవు పరలోకంరావు అని యేసు చెబితే, యేసే నాకు డబ్బు ఆస్తినిచ్చాడు అని చెప్పేవాడి సాక్ష్యము సత్యమా? అది దేవుని ఆశీర్వాదం అనడం అక్రమమా? కాదా? ఇతరులను ప్రేమించి

సాధ్యమైనంత మట్టుకు ఉన్నదానితోనే సమాధానపడండి అన్న యేసుబోధను నమ్మాలా? యేసుప్రభువును ప్రార్థిస్తేనే, ఆయన కృపవలననే కోర్టులో కేసు గెలిచాను అన్నవాడి సాక్ష్యాన్ని నమ్మాలా? ఆలోచించండి. ఇలాంటి వారందరి మీద సాతానుముద్ర ఎప్పటి నుండో పడుతూనే ఉన్నది. ఇది క్రీస్తు రెండవ రాకడ వరకు నిరాటంకముగా కొనసాగుతూనే ఉంటుంది గనుక మెలకువగా ఉండండి (రోమా 13:11-14).

దేవునిముద్ర కూడా నాటి నుండి క్రీస్తు రెండవ రాకడ వరకు అనగా ఈ లోకాంతము వరకు యేసుదేవుని కుమారుడని నమ్మి, ఆయనను ధరించుకొన్నవారి మీద కూడా పడుతూనే ఉంటుంది. వ్రాయబడిన దేవుని ఆశీర్వాదములు అనే ఈ అంశంపై కూడా ఇంకా ఏమైనా సందేహాలు, సమస్యలుంటే నన్ను నేరుగా సంప్రదించి సమాధానం పొందండి. మరియు దేవుని వాక్యానుసారంగా లేకపోతే నన్ను ఏలాగైనా వాక్యాధారంతోనే సరిదిద్దండి. సకలాశీర్వాదాలకు కారణభూతుడైన దేవుని ప్రేమ, ప్రభువైన యేసుక్రీస్తు కృప, పరిశుద్ధాత్మ సహవాసము, సమాధానము సదాకాలము మనందరికి తోడైయుండును గాక....




**నే**టి దినములలో అనేక సంఘాలలో ఆదివారం నాటి ఆరాధనలలో గాని, సువార్త – స్వస్థత మహాసభల్లో గాని, మరీ ప్రత్యేకంగా శుక్రవారం లేదా శనివారం నాటి స్వస్థత ప్రార్థనా కూటములలో గాని, స్వస్థతశాలల్లోను, స్వస్థత తోటల్లోను, ప్రత్యేకముగా ఏర్పాటు చేసుకొన్న 'ప్రార్థనా గోపురము'లలోను ఎక్కడ చూసినా **"నూనె రాచి"** శరీర స్వస్థత కోసం ప్రార్థనలు చేయడంకన్నా ప్రార్థించిన నూనె సీసాలిచ్చి మనలనే రోగాలున్నచోట రాసుకోమనడం, కొన్ని నూనె చుక్కలు నీళ్ళలో వేసుకొని మనలనే ప్రార్థన చేసుకొని త్రాగమనడం మరీ ఎక్కువయిపోయింది. తాము నిత్యము వెళ్ళే స్వంత సంఘాలపై, వారి కాపరులపై నమ్మకంలేక ప్రత్యేకమైన వాహనాలలో, బస్సులలో, రైలులలో కొత్తగా వెలసిన స్వస్థతశాలలకు ఎంత దూరమైనా, ఎంతో ఖర్చు పెట్టుకొని వెళుతున్నారు. కొన్ని సంఘాలలోని బోధకులే తమ సంఘస్తులను అక్కడికి వెళ్ళమని ప్రోత్సహించడం మరీ విచిత్రం.

ఆరు రోజులు వెళుతున్న తమ సంఘంలో దొరకని శారీరక స్వస్థత ఒక్కరోజు కొద్ది సేపు మాత్రమే ప్రార్థించే వారి మీద విపరీతమైన నమ్మకంతో

దాదాపు ఏడువారాలపైన వరకు వెళ్ళి రావడం అన్యాయం, అక్రమం అని ఎవరికి ఆలోచనే రావడంలేదు. ప్రారంభమునుండి వెళుతున్న తమ సంఘంలోనూ మరియు తమ హృదయాలలోను ఉన్న దేవునికి, క్రీస్తుకు, పరిశుద్ధాత్మలకు శక్తి లేదనే కదా వీరి ఆలోచన. నీలో, నీ సంఘములో, నీ చర్చిలో, నీ సేవకునిలో లేని దేవుడు, యేసుక్రీస్తు, పరిశుద్ధాత్మలు అక్కడ ఎలా ఉంటారనే ఇంగిత జ్ఞానం కూడా లేకుండా అనేకమంది భ్రష్టాత్మ ముసుగులోపడుతున్నారు. ఇది ఒకరకంగా పరిశుద్ధాత్ముని దూషించడము అవునో కాదో ఆలోచించండి లేదా ఈ వాక్యాన్ని చదివి ధ్యానించండి (మత్తయి 12:31-34).

ఈ రోజుల్లో కొందరు తమ కొబ్బరిచెట్లకు కాసే కాయల్లో తీయటి నీటికోసం, చీడ-పురుగు పట్టిన పంటపొలాలమీద, పాలియ్యని ఆవులు - గేదెల మీద భక్తులు ప్రార్థించిన నూనె రాయడం, చల్లడం (పురుగులమందు స్ప్రే చేసినట్లు) చాలా విపరీతమైపోయింది. మరికొందరు సమయము లేదని చెప్పుచూ మనుషుల మీద గూడా స్ప్రే చేసి కపట భక్తిని ప్రదర్శించి అమాయకపు క్రైస్తవులను, క్రైస్తవేతరులను ఎన్నో విధాలుగా దోచుకొంటున్నారు, క్రీస్తు నామాన్ని ప్రక్కనపెట్టి తమను తాము హెచ్చించుకుంటూ దేవుని పేరుతోనే చలామణి అవుతూ దేవాంతకులుగా మారి దైవద్రోహానికి పాల్పడుతున్నారు. ఇది ఎంతటి భయంకరమైన దయ్యముల బోధనో బైబిల్‌ను బట్టి ఆలోచించి వివేచిస్తే చాలా భయంకలుగుతుంది.

కాని అనేకులు నేడు ముఖ్యంగా టీచర్లు, లెక్చరర్లు, ప్రొఫెసర్లు, డాక్టర్లు, ఇంజనీర్లు, లాయర్లు అనగా బాగా చదువుకొన్నామని చెప్పేవారందరు కూడా ఈ బోధ, ఇలాంటి కార్యక్రమముల యందే చాలా

ఆసక్తి కనపరుస్తున్నారు (1తిమోతి 4:1). ఈ మాయా బోధకుల స్వస్థత సభలు కుటీరములు, స్వస్థతశాలల వద్ద ప్రార్థించిన నూనె సీసాల వ్యాపారం జోరుగా సాగుతుంది. వైద్యశాల (ఆసుపత్రి)లలో గ్యారంటీగా వైద్యం దొరికి తీరుతుందనే దానికన్నా ఎక్కువ నమ్మకాన్ని కల్గించుటకే స్వస్థతశాల అని పేర్లు పెట్టుచున్నారు. మరికొందరైతే కేవలము శరీరం, దాని అవసరాలు, స్వస్థతలకోసమే 24 గంటల ప్రార్థనా గోపురాలను స్థాపించి కొందరికి ఉద్యోగాలిచ్చి / డబ్బులిచ్చి అనేకులచేత బలవంతంగా (విధిగా) ప్రార్థింపజేస్తున్నారు, మరియు వారి సంఘాలకు మాత్రమే రమ్మని అందరిని ఆహ్వానిస్తున్నారు, మరిముఖ్యంగా డబ్బును పంపమని మనీయార్డరు ఫారాలు ఇంటికే పంపిస్తున్నారు. బ్యాంకు అకౌంట్ నెంబర్లు కూడా వరసగా ఇస్తున్నారు.

ముందుపేజిలో పైన వ్రాయబడిన ఈ కరపత్రము పేరు చదువగానే కొందరికి ఈ కరపత్రాన్ని ఆతురతతో చదువాలని అనిపించవచ్చు, మరికొందరికి ప్రశ్న-ఆశ్చర్యం గుర్తులు చూసి మరియు ముందు పేరా ఆఖరిపేరా లేక కొన్ని పేజిలుపైపైన చదివి ఈ కరపత్రాన్ని చింపేయాలనో, పడేయాలనో కూడా అనిపించవచ్చు. అయితే ఒక్కక్షణం ఆలోచించి మీ బైబిల్‌ను తెరిచి ఇందులో నేను వ్రాసింది బైబిల్‌లో పెద్దలు వ్రాసినది వాక్యానుసారంగా ఉందో లేదోనని మిమ్మును మీరే పరిశీలించి, పరిశోధించి చూచుకొనండి (2కొరింథీ 13:5; అపో.కా 17:11). ఎందుకంటే ఆనాడే అనగా 2వేల సం॥ క్రితమే ఈ దొంగ బోధకులను గూర్చి ముందుగా చెప్పాడు మన రక్షకుడైన క్రీస్తు.

"మీరేమి వినుచున్నారో జాగ్రత్తగా చూచుకొనుడి" (మార్కు 4:24), నా పేరిటనే ఎవడును మిమ్మును మోసపరచనియ్యకుడి (మత్తయి

24:4,23-25) అని ముందుగానే చెప్పి వ్రాయించాడు. పరిశుద్ధాత్మ ముసుగులో భ్రష్టాత్మ అయిన సాతాను దేవుని ముసుగులో దేవాంతకులైన తన అనుచరుల ద్వారా మోసము చేయు వరాలనిచ్చి గొప్ప గొప్ప సూచకక్రియలు, అద్భుతాలు చేసినట్లు చూపిస్తాడే తప్ప అనగా కనపరుస్తాడే తప్ప నిజంగా జరిగింపడు అని మన బ్రతుకు పుస్తకమైన బైబిల్‌లో చాలా ముందుగానే చెప్పబడింది (మత్తయి 24:24; 2కొరింథీ 11:13-15).

"ధర్మ విరోధ సంబంధమైన మర్మము ఇప్పటికే క్రియచేయుచున్నది... వానిరాక అబద్ధ విషయమైన సమస్త బలముతోను, నానా విధములైన సూచక క్రియలతోనూ, మహత్కార్యములతోను, దుర్నీతిని పుట్టించు సమస్త మోసముతోను, నశించుచున్న వారిలో సాతాను కనబరుచు బలమును అనుసరించి యుండును" (2థెస్స 2:8-12) అని పరిశుద్ధాత్ముని ద్వారా దేవుడు క్రీ.శ. సుమారు 64లోనే వ్రాయించాడు గనుక ఈ ప్రార్థించిన నూనె మహాత్యం యొక్క విషయాన్ని తప్పక ఆలోచించి తీరాల్సిందే ఎందుకంటే? నేడు మన విశ్వాసానికి సంబంధించిన అతి ప్రాముఖ్యమైన విషయాలలో ఇది కూడా ఒక్కటి.

అనేకమంది బోధకులు, సువార్తికులతో సహా చదువురాని, చదువొచ్చినా బైబిల్ సరిగ్గా చదవటం చేతకాని క్రైస్తవులు ప్రార్థించిన నూనె అని అందులో మహత్మ్యం చాలా ఉందని అమాయకంగా అతి భక్తి, వినయములతో తీసుకుంటున్నారే గానీ సీసాలలోని నూనె కోసం ప్రార్థన చేయాలా? చేస్తే ఎవరు లేదా ఎలాంటివారు ఆ ప్రార్థన చేయాలి? ఎందుకోసం చేయాలని బైబిల్ చెప్పిందని వాక్యానుసారంగా ఆలోచించేవారు కాగడా పెట్టి వెతికినా కనపడడం లేదు. నూనె రాయమన్నాడే గాని దానిని ఎక్కడ రాయాలి? రోగమున్నచోట రాయాలా? నుదుటి మీద సిలువ గుర్తుగా రాయాలా? తలమీద రుద్దాలా?

ప్రార్థించిన నూనె సీసాలు కొనుక్కొని ఇంటికెళ్ళినాక మనమే మళ్ళీ ప్రార్థన చేసుకొని కొన్ని నూనె చుక్కలు నీళ్ళలో కలుపుకొని తాగాలా? లేక డైరెక్టుగా నూనెను త్రాగమన్నాడా? ఏమని దేవుని వాక్యంలో వ్రాయబడింది అనే కనీస ఆలోచన కూడా వీరిలో కరువైంది. బైబిల్‌లో వ్రాయబడి ఉన్నట్లు చేయాలి గాని, మన ఇష్టం వచ్చినట్లు ఏ పనీ చేయగూడదు కదా! అందుకే కొందరు మాయబోధకుల బోధలు లేక క్రియలనుండి నేటితరం, మరియు రాబోయే ఎన్ని తరాలవారినైనా కాపాడాలనే ఉద్దేశ్యంతో ఈ విషయాన్ని మీకు మరీ మరీ గుర్తు చేస్తున్నాను. దీనిని అనేకులకు ప్రకటించి మనవంతు ప్రయత్నం చేస్తూ దేవుడిచ్చే జీవకిరీటాన్ని పొందుదాం. కాబట్టి ఈ విషయంలో మన జీవవాక్యం ఏం చెబుతుందో చదువుదాము.

"మీలో ఎవడైనను రోగియై ఉన్నాడా? అతడు **సంఘపు పెద్దలను** పిలిపించవలెను. **వారు** ప్రభువు నామమున అతనికి **నూనెరాచి** అతని కొరకు ప్రార్థన చేయవలెను. విశ్వాస సహితమైన ప్రార్థన ఆ రోగిని **"స్వస్థపరచును"**. ప్రభువు అతనిని లేపును అతడు **పాపము చేసిన వాడైతే పాప క్షమాపణ** నొందును" (యాకోబు 5:14-16).

"The Prayers of the Faith shall SAVE the Sick (English NKJV)"

పై వాక్యభాగంలో ఉన్నది రోగి అని, ఆ రోగము శరీర రోగము కాదని అది ఖచ్చితంగా పాపరోగమని, పాప రోగానికి మాత్రమే ఈనాడు స్వస్థత అనగా రక్షణ అవసరము అని ఆలోచించడం చేతగాని దొంగబోధకులు దానిని శరీర రోగమని చెప్పారు. కాబట్టి శరీరానికే స్వస్థతగా భ్రమింపజేసి అనేకులను మాయచేస్తున్నారు. ఇంగ్లీషు, గ్రీకు బైబిల్‌లో వెదికితే **'రక్షణ'** అని స్పష్టంగా ఉన్నది. అనగా మన తెలుగు

బైబిల్‌లో విశ్వాస సహితమైన ప్రార్థన ఆ రోగిని **"రక్షించును"** అనే తర్జుమాకు బదులు **"స్వస్థపరచును"** అనే తర్జుమాలో జరిగిన చిన్న పొరపాటుకు ఇన్ని స్వస్థతశాలలు వెలిసి క్రీస్తు బోధను చెరిపే భిన్నమైన బోధలు వచ్చాయి.

"పాపులను **రక్షించుటకు** క్రీస్తు యేసు లోకమునకు వచ్చెనని వాక్యము నమ్మదగినదియు, పూర్ణాంగీకారమునకు యోగ్యమునైయున్నది". (1తిమోతి 1:15, 4:9,10; లూకా 19:10; యాకోబు 1:21) అనే వాక్యములను గుర్తుచేసుకొని అయినా దీనిని సరిచేసుకోలేక (2తిమోతి 3:14-17) పోయారు. బైబిల్‌లో దేవుడు యేసుప్రభువు, అపొస్తలుల ద్వారా చెప్పిన మాటలను చదివి ఆలోచిస్తే (2తిమోతి 2:7) దేవుడే మనకు అందరికి వివేకమిస్తాడని మరచిపోయారు. మనకళ్ళముందు చాలా బాగా అనగా అద్భుతంగా జరుగుతున్నాయని చెబుతున్న ఈ మాయా తతంగాన్ని గూర్చి ఇంకా కొంచెం వివేకంతో చర్చిద్దాం.

రోగికి నూనెరాచి ప్రార్థన చేయవలెను అని బైబిల్‌లో ఉన్నది మాత్రం నిజం. అయితే ఆ రోగి శరీరముపై ఈ నూనెను ఎక్కడ రాయాలి. నూనె రాయడం అంటే అర్థం ఏమై ఉన్నది. ఆ నూనె కూడా కొబ్బరి నూనె అనిగాని, ఒలీవనూనె అని గాని బైబిల్‌లో లేదు కదా. మరి ఏ ఆధారంతో మన క్రైస్తవ 'బాబా'లు ఈనాడు కొబ్బరినూనెను రాయటం లేక త్రాగించడం లేదా మన మీద చల్లటం చేస్తున్నారో అభిషేకింపబడ్డానని చెబుతున్న ఈ బోధకులు. దేవుని వాక్యంలో ఉన్న ఈ లేఖన భాగాన్ని మరోసారి జాగ్రత్తగా, లోతుగా ఆత్మచేత పరిశీలిద్దాం. ఎందుకంటే దేవుడు చేయమన్నట్లు చేయకపోతే ఆనాడు మోషే (సంఖ్యా 20:1-13)ను, సౌలు రాజును (1సమూ. 15) శిక్షించినట్లు మనల్ని కూడా శిక్షిస్తాడని మరువవద్దు. అపొ. పౌలు తన తోటి జతపనివాడైన త్రోఫీము రోగియై ఉంటే అతన్ని

మిలెతులో వదిలి వచ్చాడే గాని, ఆ భక్తునికి నూనెరాచి / త్రాగించి ప్రార్థన చేయలేదు (2తిమో 4:20) తన రుమాలును పట్టుకోమనలేదు అని మరచిపోవద్దు. అందుకే వాక్యాన్ని మళ్ళీ మళ్ళీ చదివి పరిశోధించి, ధ్యానిద్దాం.

“మీలో ఎవడైనను రోగియై ఉన్నాడా? అతడు సంఘపు **పెద్దలను** పిలిపించవలెను”. ఈ వాక్యాన్నిబట్టి అయితే సంఘములో రోగియైనవాడు తమ సంఘపెద్దలను మాత్రమే తన ఇంటికి పిలిపించుకోవాలి గాని అతడు సంఘపెద్దల వద్దకు వెళ్ళకూడదు. అతని సంఘపెద్దలే రోగియై ఉన్న తమ సంఘస్థుని ఇంటికి వెళ్ళాలి. అయితే బైబిల్ ప్రకారంగా ఈ సంఘపెద్దలకు కొన్ని అర్హతలున్నాయి. కాని నేటి సంఘాలలో డబ్బున్న వారిని, పెద్ద పెద్ద హోదాల్లో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులను, పలుకుబడి కలిగిన రాజకీయ నాయకులను, కాంట్రాక్టర్లను, డాక్టర్లు, ఇంజనీర్లు, లాయర్లు, ఐ.పి.యస్., ఐ.ఎ.యస్. లాంటి వారిని మాత్రమే సంఘపెద్దలుగా ఎంపిక చేసుకొంటున్నారు. పెద్ద చదువులు, హోదా, డబ్బు, రాజకీయపలుకుబడి మొదలగునవి అనగా రక్తమాంసములు దేవుని రాజ్యంలో అస్సలు పనికిరావు. ఇది శుద్ధతప్పు, అన్యాయం, అక్రమం. మరియు వాక్యప్రకారంగా సంఘపెద్దలుగా ఉండటానికి మేము అర్హులమా? కామా? అని పెద్దలైనవారు కూడా ఏ మాత్రము ఆలోచించడము లేదు.

దైవవాక్కులలో వ్రాయబడిన అర్హతలు లేకుండా అధ్యక్షులుగా ఉండటం కూడా పరిశుద్ధాత్మకు వ్యతిరేకంగా చేస్తున్న మరణకరమైన పాపంగా ఈనాటి సంఘపెద్దలు కూడా ఎవరూ పరిగణించడంలేదు. ఒకవేళ ఎవరూ చెప్పకపోతే ఇప్పుడైనా బైబిల్ ప్రకారంగా పెద్ద అనగా అధ్యక్షుడు (ఇంగ్లీషులో బిషప్ అని ఉంది)గా ఎవరుండాలో చదువండి. “ఏకపత్నీ

పురుషుడు, విశ్వాసులైన పిల్లలు (అనగా క్రీస్తులోనికి బాప్తీస్మం పొంది తండ్రికి సేవలో సహకరించేవారు మరియు ఒక్కరికన్నా ఎక్కువమంది పిల్లలు) గలవాడు, నిందారహితుడు, అతిధి ప్రియుడు... ఇలా తాను హిత బోధ విషయమై జనులను హెచ్చరించుటకును, ఎదురాడు వారి మాట ఖండించుటకును శక్తిగల వాడగునట్లు, ఉపదేశము ననుసరించి నమ్మదగిన బోధను గట్టిగా చేపట్టువాడై యుండవలెను." (తీతు 1:5-9; 1తిమోతి 3:1-7).

ఇలాంటి అర్హతలున్న సంఘపెద్దలను కనీసం ఇద్దరిని (ఒక్కరిని కాదు) రోగియైన లేక అవిశ్వాసియైన సంఘస్తుడే తన వద్దకు పిలువవలెను. వారు అతని ఇంటికి వెళ్ళి ప్రభువు నామమున **"అతనికి నూనెరాచి"** అతనికొరకు ప్రార్థన చేయవలెను. విశ్వాస సహితమైన (పెద్దలకున్న విశ్వాస పరిమాణాన్ని బట్టి మాత్రమే) ప్రార్థన ఆ రోగిని స్వస్థపరుచును లేదా రక్షించును. బైబిల్‌లో వ్రాసిన దానినిబట్టి అయితే వారి, వారి శరీర రోగమైతే ఆ రోగి యొక్క విశ్వాసాన్ని బట్టి నూనె రాయకపోయినా స్వస్థతపరచబడ్డారు. ఆత్మరోగం / పాపరోగం అయితేనే నూనె రాసినాక ప్రార్థించే వారి విశ్వాసాన్ని బట్టి స్వస్థపరచబడతారనే విషయం గమనించాలి. మీలో ఎవడైనను రోగియై ఉన్నాడా? అంటే ఆ సంఘములోని వాడని మాత్రమే అర్థమిచ్చుచున్నది గదా! క్రైస్తవుడు కాని వారికి కూడా ఈ రోజుల్లో నూనె రాస్తున్నారు మరియు త్రాగిస్తున్నారు అంటే ఆ బోధకులకే బైబిల్ సరిగ్గా అర్థం కాలేదన్నమాట. గుడ్డివారికి గుడ్డివాడు త్రోవజూపితే ఇద్దరూ కలిసి గుంటలో పడుతున్నారు.

అందుకే ఇప్పుడు అన్ని సంఘాలలో జరుగుచున్న స్వస్థత కార్యక్రమాలను బోధను మరొక్కసారి ఆలోచించండి (2తిమోతి 2:7; మార్కు 4:24). బైబిల్‌లో చెప్పబడిన సంఘపెద్దల కోసం ముందు ఎంత కష్టమైనా

వెదకండి. నేడు మన మధ్యన ఉన్న సంఘాలలో పెద్దల కోసం వాక్యప్రకారం వెతికితే ఒక్కడు కూడా ఇలాంటి సంఘపెద్ద కాగడాపట్టి వెతికినా కనిపించటం కష్టంగా ఉంది. ఇలాంటివారితో జీవముగల దేవుని సంఘం ఎలా నిర్జీవమై ఎంతటి భయంకరమైన విశ్వాస స్థితిలోనికి వెళ్ళిందో ఆలోచిస్తే భయం వేస్తుంది. ఇదంతా సాతాను చేస్తున్న భిన్నమైన బోధయని, సాతాను తంత్రమని, దీనికి కారణాలు చెబితే ఏ మాత్రం దేవుడు సహించడని ఇప్పటికైనా ఈ నూనె రాసే (త్రాగించే) బోధకులు, నూనెను రాయించుకొనే (త్రాగే) విశ్వాసులు గ్రహించకపోవడం బహు శోచనీయం.

ఈ రోజుల్లో అనేకచోట్ల జరుపబడుతున్న స్వస్థత సభలలోను, శుక్ర లేదా శనివారపు కూడికలైన స్వస్థత ప్రార్థన / ఆరాధనలలోను నూనె సీసాల కోసం ప్రార్థన చేసి ఇవ్వగా రోగులకు సంపూర్ణ స్వస్థత జరుగుతుందో లేదో అని కూడా పరిశీలించాలి. నిజంగా వైద్యశాలల్లో జరిగినట్లుగా మాత్రము జరుగడం లేదు. ఆ స్థలంలో అప్పటికప్పుడు కొద్దిసేపు మాత్రమే స్వస్థత జరిగినట్లు అనిపిస్తుంది. ఎందుకంటే కొద్దిగా మన మనోబలం (విల్‌పవర్) పెరిగినప్పుడు శరీరంలో జరిగే రసాయనిక చర్యలవలన మరియు ఆ బోధకుడు మాటిమాటికి గట్టిగా చెప్పే హిప్నాటిజం లాంటి చర్యలవల్ల కొద్దిసేపు బాధ నివారణ కలుగుతుంది. అంతేగాని పర్మనెంటుగా రోగం తీసివేయబడడంలేదు. వాస్తవం తెలుసుకోవాలన్న ఆశకల్గిన వారు సభలలో స్వస్థత దొరికిందని సాక్ష్యమిచ్చిన వారి ఇంటికి వెళ్ళి తెలివిగా వాకబు చేయండి. అప్పుడు నిజం తెలుస్తుంది.

మన చేతిలో ఉన్న బైబిల్లో చూస్తే విశ్వాసంలేని వారికి కూడా ఆనాడు స్వస్థత దొరికింది (యోహాను 5:2-13). ఒకసారి స్వస్థపడ్డవారికి విశ్వాసం లేకపోయినా కూడా తిరిగి ఆ రోగం ముదరలేదు (లూకా 17:11-18).

ఇప్పుడున్న స్వస్థతశాలల్లో జరుగుచున్న తంతు అంతా సాతాను క్రైస్తవ బాబాల ద్వారా చేస్తున్న మాయాజాలం (2థెస్స 2:9-12). ఎందుకంటే ఈ అబద్దీకులు పేరుపెట్టి పిలిచే ప్రక్రియలో, సూచకక్రియలు లేదా అద్భుతాలు చేసినట్లు కనబరిచెదరు (మత్తయి 24:24). అనగా ఆ క్షణంలో చేసినట్లు, అవి జరిగినట్లు చూపెడుతున్నారు, అందుకే వెంటనే సాక్ష్యం చెప్పమని వత్తిడి చేస్తారు. నిజంగా స్వస్థత చేయరు అని వాక్యమే చెబుతుంది గదా! ఫలానా భక్తుడి చేత **ప్రార్థనచేసిన నూనెవాడితే** అన్ని రోగాలు పోతాయని ముందుగానే వారి శిష్యుల ద్వారా విపరీత ప్రచారం చేయిస్తారు. ఒకవేళ ఆ క్షణంలో స్వస్థత దొరికినట్లు అనిపించినా మనం నమ్మకూడదు ఎందుకంటే దేవుడు మనలను పరీక్షిస్తున్నాడని గ్రహించాలి.

మరో అద్భుతమైన సంగతి చెబుతాను జాగ్రత్తగా చదివి మీ చేతిలో ఉన్న బైబిల్లో అలాగుందో లేదో చూసుకోండి. సంఘపెద్దలు నూనెరాచి ప్రార్థన చేయాలని దేవుడు వ్రాయిస్తే నేడు సంఘకాపరులు, సువార్తీకులనబడే బోధకులు మరియు బోధకురాండ్రు మాత్రమే నూనెకోసం ప్రార్థనలు చేస్తున్నారు. ఈ రోజుల్లో ఎక్కడా అనగా **ఏ సంఘంలో కూడా సంఘపెద్దలు నూనె రాచి ప్రార్థన చేసిన దాఖలాలు కనబడుటలేదు**. మరియు నూనె రాచిన తర్వాత ప్రార్థన చేయమని దేవుడు చెబితే వీరేమో ప్రార్థించిన నూనెను రాస్తున్నారు, మరియు నూనెరాసే ఓపిక లేక ఇంటికెళ్ళినాక ఆ రోగినే తమ రోగగ్రస్తమైన చేతులతో రోగమున్నచోట ప్రార్థన చేసుకొని రాసుకోమంటున్నారు లేదా నీళ్ళలో కలుపుకొని త్రాగమంటున్నారు. చీడపట్టిన పంటపొలాలన్నింటి మీద కూడా ఈ నూనె నీళ్ళలో కలిపి జల్లమంటున్నారు. అనగా నూవాక్రాన్‌లాంటి రసాయాలు స్ప్రే చేసినట్లు చేయమని బోధిస్తున్నారు.

మరికొందరు సేవకులనబడిన వారు తమ వ్యాపారాభివృద్ధి కోసం ప్రార్థించిన నూనెను రకరకాల వ్యాధుల పేర్లతో పార్శిల్స్ చేసి ఇంటికే

పోస్టు లేదా కొరియర్స్ ద్వారా పంపుచున్నారు. ఇది క్రీస్తు సువార్తను చెరుపగోరే భిన్నమైన సువార్తయని లోతుగా / వాక్యానుసారంగా ఆలోచిస్తేనే గ్రహించగలము. సంగతులను పైపైననే చూస్తే ఈ మోసాన్ని అంత సుళువుగా పసిగట్టలేము. ఈ సభల్లో, స్వస్థతశాలల్లో నూనె రాసే వాడిని, రాయించుకొనే వాడిని చూడండీ వారిద్దరిదీ ఒకే సంఘ కాదు, ఒకే ఊరు, ఒకే ప్రాంతం, ఒకే భాష కూడా కాదు. నూనె రాసేవారు ఏ సంఘానికి పెద్దో అనే విషయం కూడా రాయించుకొనే వారికి ఏ మాత్రము తెలియదు కదా!

పైగా ఈ నూనె రాసేవారికి పెళ్ళి అయిందా? అయితే ఒకే భార్య ఉందా లేక ఇద్దరు, ముగ్గురు భార్యలున్నారా? మరిముఖ్యంగా వారికి కనీసం ఇద్దరు విశ్వాసులైన పిల్లలున్నారా? తమ ఇంటిని, సంఘాన్ని సరిగ్గా ఏలుతున్నారా? అని కూడా ఆలోచించడంలేదు. పెళ్ళికాని వారు ఎంతటి విశ్వాసులైనా, బోధకులైనా మరియు సువార్తికులైనా కూడా నూనె రాయకూడదు. పెళ్ళి అయినా, భార్య చనిపోయినవాడై ఉండకూడదు, ఏకపత్నీవ్రతుడు అనగా భార్యతో కాపురం చేస్తున్నవాడు అని అర్థం. విడాకులు ఇచ్చిన వాడుకూడా సంఘపెద్దగా అనగ అధ్యక్షుడు (బిషప్)గా పనికిరాడు.

బాప్తిస్మం తీసుకున్న పిల్లలులేని వాడు ఎప్పుడు సంఘపెద్దగా ఉండకూడదు. సంఘపెద్దలకున్న అర్హతలుగల కాపరులు మాత్రు నూనెరాచి ప్రార్థన చేయవచ్చును (అపో.కా. 20:28). అధ్యక్షుడు కాపరి కూడా అవవచ్చును. కాని కాపరి, సువార్తికుడు అధ్యక్షుడు కాలేడు కదా! ఇది దేవుని ఆజ్ఞ అని ఎల్లవేళలా మరచి పోకూడదు. ఈ మధ్య డబ్బులెక్కువై, చర్చిలెక్కువైనావని చెప్పి ఎవరుపడితే వారు బిషప్ అనే బిరుదుతో ఊరేగుచున్నారు. బిషప్ అనగా పెద్ద లేదా అధ్యక్షుడు అని మన తెలుగు

భాషలో అర్థము కాబట్టి బిషప్ అని పిలిపించుకొంటున్న జాగ్రత్త సుమా! (యాకోబు 3:1,2).

మరో అతి భయంకరమైన ఆజ్ఞాతిక్రమం గూర్చి వ్రాయుచున్నాను దేవుని ఆత్మతో ఆలోచించండి. అదేంటంటే ఈ మధ్యన స్త్రీలు విపరీతంగా స్వస్థత ప్రార్థనలు, కూటములు నడిపిస్తూ శరీర రోగుల కొరకు నూనెరాచి భయంకరంగా ప్రార్థించుచున్నారు. ప్రార్థించిన నూనెను ఇంటికి తీసుకెళ్ళి త్రాగమంటున్నారు. దేవుని వాక్యంలోని ఆజ్ఞ ప్రకారంగా స్త్రీలు ఎట్టి పరిస్థితులలోను నూనె రాయకూడదు. వారెంతటి విశ్వాసులైనను, ప్రార్థనాపరురాలైనను, బోధకురాండ్రైనను, ఎంతమంది విశ్వాసులైన పిల్లలున్నను, ఎన్ని సంఘాలు కట్టి, నడిపిస్తున్నను ఏ రోగి మీదనైనను (ఆత్మరోగమైనా సరే) నూనె రాయకూడదు, నూనె సీసాలకోసం ప్రార్థించకూడదు. అయితే వాక్యము చెప్పవచ్చును, సువార్త చేయవచ్చును, (మత్తయి 28:18-20; గలతీ 3:26-29) బోధ చేయవచ్చును స్త్రీలు నూనెరాచి ప్రార్థిస్తే పరిశుద్ధాత్మచేత వ్రాయించిన వాక్యానికి విరుద్ధం గనుక, పరిశుద్ధాత్మకు వ్యతిరేకంగా మాట్లాడినట్లే గనుక వీరికి అనగా పెళ్ళికాని, పిల్లలు లేని పురుషులైనా, స్త్రీలైనా అందరికీ ఏ యుగంలోను పాపక్షమాపణ దొరకదని ప్రభువు చెప్పాడు (మత్తయి 12:32).

ఇలా బైబిల్‌లో ఉన్నది చదువక, చదివినా ఆత్మీయ గుడ్డితనంతో గుర్తించక పోయినట్లయితే నూనె సీసాలకోసం ప్రార్థించినవారు, ప్రార్థించిన నూనె త్రాగినవారు మరియు నూనె రాచినవారు, రాయించుకొన్నవారు ఇద్దరూ గుడ్డివారుగా గుంటలో పడతారు. కాబట్టి క్రీస్తు స్వరక్తమిచ్చి సంపాదించిన సంఘముగా చెలామణి అవుతున్న క్రైస్తవులారా, కాపరులారా, ఇకనైనా కళ్ళుతెరచి ఈ భ్రష్టత్వాన్ని, ఈ భ్రష్టులను, క్రీస్తు బోధనుతేని

వారికి శుభమని లేదా PRAISE THE LORD లేదా హల్లెలూయా అనో మన భాషలో వందనాలు, మరనాత, జైక్రీస్తు అని కూడా చెప్పవద్దు (2యోహాను 9,10,11). కొందరినైనా ఏ విధంగానైనా అగ్నిలోంచి లాగి రక్షించండి (యూదా 22,23; యాకోబు 5:19,20; గలతీ 6:1-5) అనే క్రీస్తు ఆజ్ఞ ప్రకారంగానే మనం నడువాలి.

చివరగా **కొబ్బరినూనె** అని బైబిల్‌లో ఎక్కడా రాయించి లేకపోయినా ఆ నూనెనే అపవాది ఎందుకు ప్రవేశపెట్టాడో తెలుసా? ప్రార్థన చేయనివారు దేవున్ని నమ్మనివారు కూడా మామూలుగా దెబ్బలవల్ల తగిలిన గాయాలు, పుండ్లుగా మారినప్పుడు, కాలిన గాయాలకు, శరీర పగుళ్ళు మొదలైన వాటికి కొబ్బరినూనె రాస్తే త్వరగా నయం లేదా బాగవుతుంది. కొబ్బరినూనెలో సహజంగా ఉన్న స్వస్థపరిచే గుణం వలననే స్వస్థత దొరికితే సైతాను చేసే ఈ మాయ మనకు అర్థం కాకుండా ఉండి, వాడు చేసే బోదే కరెక్టని అమాయకులు నమ్మి మోసపోవడానికి ఈ పద్ధతిని ఎంచుకున్నాడు. ఇశ్రాయేలు దేశంలో దొరికే **ఒలీవ నూనెలో** కూడా ఎన్నో ఔషద గుణాలున్నాయనే సంగతి మరువకూడదు. అది కూడా స్వస్థతకోసం రాయమని బైబిల్‌లో లేదు.

ఈ మధ్య మన రాష్ట్రంలోని తూర్పు - పశ్చిమ గోదావరి, వరంగల్, మెదక్, గుంటూరు, అనంతపురం మొదలగు జిల్లాలలోని స్వస్థతా వరాలున్న భక్తులు ఈ ప్రార్థించిన నూనెను అందరిపైనా ఒకేసారి స్ప్రే (జల్లడం) చేస్తున్నారు, వారు కాళ్ళు, చేతులు, ముఖంకడిగిన నీళ్ళుకూడా భక్తుల నెత్తి మీద జల్లుకొంటే కూడా స్వస్థపడుతారనే ప్రచారం జరుగుతుంది. పవిత్రమైన యేసురక్తాన్ని పంట పొలాల మీద, ఇంటి గోడలు, వారి స్థలాలయొక్క పొలిమేరల మీద జల్లమన్నాడా? ఘోరమైన వ్యాధి కలిగిన మనిషి హృదయపు గోడలను మన ప్రభువైన యేసు రక్తంతో కడుక్కోమన్నాడా? ఈ మధ్యనే ఒక సాతాను అనుచరుడైన క్రైస్తవ బాబా,

అతను మాట్లాడినప్పుడు టి.వి. ముందు నూనె సీసా పెట్టండి ప్రార్థిస్తాను మీకు స్వస్థత దొరికి తీరుతుంది అంటున్నాడు. టి.వి. స్క్రీన్ తాకితే స్వస్థత దొరుకుతుందట ఈ మాయగాడికి దీనికి వాక్యం రుజువు లేదు. వీడో అభిషేకాన్ని టి.వి. తెర ద్వారా ఎదిటివాడికి ట్రాన్స్‌ఫర్ చేస్తాడంట. కనీసం ఒక్కసారైనా జాగ్రత్తగా ఆత్మతో ఆలోచించి బైబిల్‌ను పరిశోధించండి.

దేవుని వాక్యానికి ఎంతటి భయంకరమైన అన్యాయం జరిగిపోతుందో చూస్తున్నారా? పోనీ అన్ని శరీర రోగాలకు ఈ నూనె రాస్తే సరిపోయి సంపూర్ణ స్వస్థత దొరుకుతుందా? అంటే సమాధానంలేదు. అపెండిసైటిస్ వస్తే ప్రార్థించిన నూనె రాయకూడదు, త్రాగకూడదు. ఎంతటి రెవరెండు, బిషప్స్, పోప్‌వైనా 24 గం॥లో ఆపరేషన్ చేయాలి. గుండె వాల్వులు (కవాటాలు) బ్లాక్ అయిపోతే బైపాస్/ఓపెన్ హార్ట్ సర్జరీ చేయాలి. యాక్సిడెంట్‌లో కాలో, చెయ్యో విరిగితే లోపల స్టీల్ రాడ్ వేసి కుట్లు వేయాలి, వెంటనే టి.టి. ఇంజక్షన్ చేయించుకోవాలి కాని ఈ కొబ్బరినూనె రాస్తే అతకదు. మధుమేహం (షుగర్) వ్యాధివస్తే పరిస్థితిని బట్టి అవసరమైతే రెండుపూటలా ఇన్సులిన్ ఇవ్వాలి కాని ప్రార్థించిన కొబ్బరినూనె ఇంజక్షన్ చేయకూడదు. బి.పి. (బ్లడ్ ప్రెషర్) ఉంటే శరీర వ్యాయామంతో పాటు, నిద్ర ఆహార నియమాలు పాటించి తీరాలి. సమయానికి టాబ్లెట్ (మాత్ర) వేసుకోవాలి.

ఇంకా కిడ్నీలో కాని గాల్ బ్లాడర్‌లో గాని రాళ్ళు వస్తే త్వరగా ఆపరేషన్ చేసి తీసేయాలి. ఇలా ఇంకా ఎన్నో రోగాలకు కూడా ఏ నూనె రాయకూడదు, తాగకూడదు. క్యాన్సర్ ముదిరినా, ఎయిడ్స్ రోగం వస్తే మందులు కూడా లేవు ఇక మరణమేగతి. శరీరరోగం పోవడంకోసం మాత్రమే దేవున్ని విశ్వసించి సమయానికి మందులు (Medicen) వాడకపోతే ఆ రోగం ముదిరి చివరకు మరణం సంభవిస్తే అది ఆత్మహత్య కిందికి వస్తుందేమోనని కూడా తప్పక ఆలోచించాలి. మరియు ఒకసారైనా

మన రోగానికి తగ్గ స్పెషలిస్ట్ డాక్టర్ దగ్గరకెళ్ళాలి. అనగా కన్నుకోసం కంటి డాక్టర్, పంటికోసం పంటి డాక్టర్, గుండెకోసం గుండె స్పెషలిస్ట్ దగ్గరకెళ్ళాలి, కేన్సర్ కోసం కేన్సర్ స్పెషలిస్ట్ దగ్గరకెళ్ళాలి కాని కేవలం దగ్గరలో ఉన్నాడని చెప్పి ఆర్.ఎం.పి., యం.బి.బి.యస్.ల చుట్టూ తిరిగి, నా రోగం ఏ డాక్టర్ కూడా బాగుచేయలేదని తప్పుడు సాక్ష్యం చెప్పకూడదు.

నూనె రాయమన్నది లేక రుద్దమన్నది అనగా అభిషేకించమన్నది విశ్వాసంలో బలహీనపడిన ఆత్మరోగికి మరియు పాత నిబంధనలో, దేవుని ప్రజలను కాయువారికి లేదా పరిపాలించుటకు సిద్ధపడ్డ రాజులకు వారి యాజకులు మాత్రమే అభిషేకించాలి. (1సమూ 16:3; 1రాజులు 1:38,39; మార్కు 14:3-9; మత్తయి 26:6-13) ఈ మర్మము తెలియనివారు మోసపోతూ, అనేకులను మోసపుచ్చుచున్నారు. ప్రకృతి, అందులో మందే అనగా చెట్లు మొదలగునవి ఎన్నో ముందు పుట్టినవి. ఆ తరువాతనే మనిషిని పుట్టించాడంటే దేవుని ప్రణాళికను గ్రహించి రోగానికి మందు, రోగికి వైద్యుడవసరమని నమ్మి తీరాలి.

ప్రకృతి నుండి తీయబడిన శరీరానికి రోగం వస్తే, ప్రకృతి నుండి తీయబడిన (మెడిసిన్) మందులేగతి. మానవశరీరం ఎన్నో రసాయన మూలకాల సమ్మేళనమే కదా! ప్రకృతిలోని మూలకాలన్నీ మన శరీరంలో ఉన్నాయి గనుక మందులన్నీ (ఇనుము, జింక్, సోడియం, అయోడిన్) చూస్తే తెలుస్తుంది. మందులు లేని రోగమొస్తే దేవుడే బాగు చేస్తాడు. సరియైన మందులు ఇచ్చునట్లు మరియు సరిగా రోగ నిర్ధారణ చేసే జ్ఞానం డాక్టరుకు ఇవ్వమని ప్రార్థన చేయాలి. తీసుకొన్న మందులు మనకు ఏ హానీ చేయకుండా అది సరిగ్గా పనిచేయునట్లు డోసు ప్రకారం వేసుకొనే ముందు ప్రార్థన చేయాలి. రోగులకు వైద్యుడవసరం (మత్తయి 9:12) అని ఆనాడే యేసుక్రీస్తు చెప్పాడు.

క్రీ॥పూ॥ హిజ్కియాకు రోగం వస్తే అంజూరపు పండ్ల ముద్ద ఆ పుండుకు కట్టవలెనని దేవుడే చెప్పాడు (యెషయా 38:21). తిమోతికి వచ్చిన కడుపు జబ్బు నిమిత్తం నీళ్ళే త్రాగక ద్రాక్షరసం వాడమన్నాడు (1తిమోతి 5:23). క్రైస్తవులు నమ్మిన దేవుడే అందరికి కూడా దేవుడు ఆయన పక్షపాతము లేనివాడు. యేసుక్రీస్తు కూడా అందరికి ప్రభువు. ఆయనను ఎవరు నమ్మినా (దేవుని కుమారుడని), నమ్మకపోయినా ఈ లోకంలో అందరి బాగోగులు చూడాల్సిన బాధ్యత వారిద్దరిది కూడా. అందుకే ఇప్పుడు అందరికి (ఆయనను నమ్మినా, నమ్మకపోయినా) దేవుడు సృష్టించిన ప్రకృతిలోని మందుల ద్వారా ఆసుపత్రులలో కూడా గ్యారంటీగా స్వస్థత దొరుకుతుంది.

ఆత్మీయ రోగాలకు స్వస్థత మాత్రం క్రీస్తును నమ్మినవారు మాత్రమే పొందుతారు (యాకోబు 1:21-23; 1తిమోతి 4:8-10). మనిషి శరీరాలకు రోగాలొస్తాయని వాటికి మందు (MEDICINE) అవసరమని ముందే ఎరిగిన దేవుడు మానవునికన్నాముందే ఈ ప్రకృతిని అందులో వివిధ రకాలైన ఔషధ గుణాలున్న మొక్కలను కలుగజేశాడు. ఎందుకంటే నీ ఆయుష్షు తీరేవరకు నిన్ను ఏ విధంగానైనా బాగు చేసి బ్రతికించుకోవడం, మనకన్నాముందు దేవునికే ఎక్కువ అవసరం ఉన్నది. ఫలానా రోగముందని తెలిసి మందులు వాడకుండా చనిపోతే అది ఆత్మహత్య అయి తీరుతుందని మరోసారి ఆలోచించండి.

మానవ దేహానికి అనేక సందర్భాలలో ఆకలి కూడా రోగమే గదా! ఆకలి ఎక్కువ లేకా తక్కువైనా అనగా ఈ రోగానికి ప్రార్థించిన నూనె తాగకూడదు, టైము ప్రకారం ఆహారమనే మందు వేసి తీరాలి. ఇంకా కంటి చూపుకు కళ్ళజోడు మందు, కాలికి చెప్పులే మందు, ఒంటికి బట్టలు కూడా మందేనని ఆలోచిస్తే అద్భుతంగా ఉంటుంది. క్షయమైన శరీరం

క్యాన్సర్‌తో గాని, ఎయిడ్స్‌తో గాని మరే రోగంతో చచ్చినా పునరుత్థానంలో మనంపొందే అక్షయ శరీరానికి ఈ రోగాలుండవు. గనుక నిష్ప్రయోజనమైన శరీరానికి రోగమొచ్చి స్వస్థత దొరకకపోయినా పర్వాలేదు గాని నిత్యత్వానికి వెళ్ళవలసిన ఆత్మకు క్యాన్సర్ లాంటి (ఆత్మ) పాపరోగాలు అంటకూడదు (1తిమోతి 5:24). శరీరరోగంతో చనిపోయినా లాజరులాంటి విశ్వాసంతో చివరి వరకు ఉంటే వెంటనే లాజరువలె ముందుగా పరదైసుకు ఆ తర్వాత క్రీస్తు రెండవ రాకడలో పరలోకం వెళుతాం గాని ఈ పాపరోగంతో చనిపోతే వెంటనే అధ:పాతాళమేగతి. ముందుగా ఆత్మరోగాల నుండి స్వస్థత (రక్షణ) కోసమే క్రీస్తునాశ్రయించండి.

మాకే వరాలున్నాయనిచెప్పి స్వస్థత ప్రార్థనలు చేసేవారిలోనే కాదు నీలో, నీ సంఘంలో, నీ దేహంలో కూడా దేవుడున్నాడు. భయభక్తులతో ఆయన ఆత్మతో నీవు ప్రార్థన చేసుకున్నా కూడా నీవు స్వస్థత పొందవచ్చు. కాబట్టి అనేకులను పరలోకం పంపడముకోసమే క్రీస్తు దేవుని కుమారుడని, ఆయనను ఏకైక లోకరక్షకుడని నమ్మమని ప్రకటించండి. ఏడువారాలు శరీర స్వస్థతకోసం, నూనె ప్రార్థనల కోసం భ్రష్టాత్మ అనుచరుల చుట్టూ తిరుగక, ఏడ్పును, పండ్లుకొరుకుటలోనికి, అనగా కటిక చీకటిలోని నరకాగ్నికి నీ ఆత్మ జారిపోకుండా దేవుని **వాక్యమనే నూనెతో నీ ఆత్మను** వెలిగించుకో.

పనికిరాని పిట్టకథలు వినిపించి, పేరుపెట్టి పిలిచి, స్వస్థతల ముసుగులో పవిత్రమైన క్రైస్తవ్యాన్ని వ్యాపార కోణాల్లోకి మారుస్తున్న ఈ కపట బోధకులు లేక క్రైస్తవ భూతవైద్యులు తిరిగి మారు మనస్సుపొందునట్లు ప్రార్థించండి, ఈ కరపత్రాన్ని వారికిష్టం లేకపోయినా ఈమాయా బోధకులందరికిని ప్రేమతో అందించండి. ఒక్కసారైనా ఆలోచించి చదవమని బ్రతిమాలండి. నీ లేదా నా అవసరం ఈ లోకంలో

దేవునికుంటే ఎలాగైనా నిన్ను మరియు నన్ను అందరిని స్వస్థపరచి ఆయనే మనలను బ్రతికించుకుంటాడని ఏ మాత్రం మరచిపోకండి!

ఈనాడు మన చుట్టూ ఉన్న సంఘాలలో జరుగుతున్న అనేకమైన సాతాను తంత్రాలను పసిగట్టే నిజమైన వాక్య సందేశాలను తెలుసు కొనుటకు, ఈ అంశములో మీకు అర్థం కాని సంగతులను గాని, మీకు తప్పుగా అనిపించినా, నూనె ఎందుకోసం రాసి ప్రార్థన చేయాలో, ఇలాంటి అనేకమైన సందేహాలకు వాక్యానుసారమైన పూర్తి సమాధానం కోసం మరియు "ప్రార్థించిన నూనె మహత్యం" అనే కరపత్రాలు ఉచితంగా కావాల్సిన వారు ఎళ్ళవేళలా ఈ పుస్తకం మొదట్లో ఇచ్చిన చిరునామాలలో సంప్రదించండి,

మరియు నేను రచించిన "పరిశుద్ధుని ముసుగులో భ్రష్టుడు" అనే పుస్తకం చదవండి అందులో నూనె ఎందుకు రాయాలో, పాతనిబంధనలో ఎవరు, ఎవరికి ఎందుకోసం నూనెను రాసారో ఎలాంటి అనుమానం గాని, ప్రశ్నలుగాని రాకుండా వ్రాశాను దయచేసి దానిని ఓపికతో చదువుకోగలరు. ఆత్మ జ్ఞానంతో అందరి మనో నేత్రాలను తెరిపించండి. అనేకులను విశ్వాసంలో బలపడమని ప్రకటించండి. అనవసరమైన హస్తనిక్షేపణలు చేసి మరియు చేయించుకొని పరుల పాపములో పాలిభాగస్థులు కావొద్దు సుమా! ఇలా ఇష్టపడి దేవుని మీద భక్తితోను, విశ్వాసముతోను నూనె సీసాలకోసం ప్రార్థించినవారు, ప్రార్థించిన నూనెను త్రాగినవారు అందరూ సాతానుముద్రకులోనై నడుస్తున్నవారే. ఆ దినము అక్రమము చేయువారలారా నా యొద్దనుండి తొలగిపొండి అనే మాటను మన ప్రభువైన క్రీస్తు ద్వారా అనిపించుకోవద్దని బ్రతిమాలుకొనుచున్నాను. దేవుని కృపా సమాధానములు మనకు తోడైయుండును గాక?




**దే**వుని గ్రంథం, పరిశుద్ధగ్రంథమైన బైబిల్‌ని కాలానుగుణంగా, సందర్భానుసారంగా చదవాలి. పవిత్రగ్రంథంలోని ప్రతి అంశాన్ని ప్రతి వచనాన్ని కూడా అదే బైబిల్‌లోని వాక్యానుసారంగా ఎంతో చక్కగా చదవగలిగినపుడే పరిశుద్ధగ్రంథమైన బైబిల్ మనకు అర్ధమవగలదు. ఇలా ప్రతిరోజూ దేవుని వాక్యాన్ని చదవలేక ఎన్నో గొప్ప గొప్ప సంగతుల్ని అర్ధం చేసుకోక పోవడమే కాక, అపార్ధం చేసుకుంటున్నారు దైవజను లనేకులు. ఇలా అపార్ధం చేసుకున్న వాటిలో బైబిల్‌లో చెప్పబడిన "నాశనకరమైన హేయవస్తువు" అనే అంశము కూడా ఒకటి. దీనిని కూడా అన్నింటిలాగే అర్ధం చేసుకోలేకపోయారు. బైబిల్ చదవడం గూర్చి బైబిలే ఏం చెబుతుందో చూస్తే (1పేతురు 1:8-11) "మీకు కలుగు ఆ కృపను గూర్చి ప్రవచించిన ప్రవక్తలు ఈ రక్షణను గూర్చి పరిశీలించుచు, తమయందున్న క్రీస్తు ఆత్మ క్రీస్తు విషయమైన శ్రమల గూర్చియు, వాటి తరువాత కలుగబోవు మహిమలను గూర్చియు, ముందుగా సాక్ష్యమిచ్చునప్పుడు, ఆ ఆత్మ, ఏ కాలమును ఎట్టి కాలమును సూచించుచూ వచ్చెనో దానిని విచారించి పరిశోధించిరి".

ఆనాటి ప్రవక్తలు దేవుని ఆత్మను గూర్చి దాని కుమ్మరింపునుగూర్చి, ప్రేరణను గూర్చి ప్రవచించినప్పుడు వారు ఆయా కాలాలన్నిటిని గూర్చి పరిశీలించి పరిశోధించారు. ఆ విధంగానే మనం కూడా ఒక వాక్యాన్ని చదివినప్పుడు ఆ వాక్యము ఏ కాలం, ఎట్టి కాలాన్ని సూచిస్తుందో పరిశోధించగలగాలి. అప్పుడు మాత్రమే దేవుని వాక్యం మనకు సరిగ్గా అర్థమవగలదు.

బైబిల్‌ని కాలానుగుణంగా చదువడంరాక పైన చెప్పబడిన "నాశనకరమైన హేయవస్తువు" అనే అంశాన్ని నేడు అనేకులు నానారకాలుగా చెప్పుకుంటున్నారు. అసలు ఈ "నాశనకరమైన హేయవస్తువు" ఏంటి? ఎందుకు దీనిని గురించి బైబిల్‌లో చెప్పబడింది? ఇది ఏ కాలానికి సంబంధించిది?? ఎవరు, ఎవరితో ఈ విషయం చెప్పడం జరిగిందని మనం ఆలోచించగలిగితే – యేసుక్రీస్తు ఈ లోకానికి వచ్చి, ఇశ్రాయేలీయులకు, తనను గూర్చి బోధిస్తున్నప్పుడు అనగా పాత ధర్మశాస్త్రాన్ని మార్చి నూతన ధర్మశాస్త్రాన్ని పరిచయం చేస్తున్న కాలం, ఆ తర్వాత ధర్మశాస్త్రాన్ని కొట్టి వేసి, "నూతన నిబంధననిచ్చి" 'ప్రపంచానికి దిక్కు" ఇదే అని బోధిస్తున్నప్పుడు అనేక విషయాల్ని వాళ్ళకి తెలుపుతూ వచ్చాడు. అలాగే ఆయన సిలువ మరణానికి ముందు వారితో మాట్లాడుతూ ఉన్నప్పుడు ఆయన శిష్యులు "ఆయన రెండవ రాకడ" గూర్చి క్రీస్తుయేసుని అడిగినప్పుడు యేసు ప్రకృతిలోని సూచనల్ని చెప్పాడు (మత్తయి 24:1-14). సిలువవేయబడి లేచిన క్రీస్తు సంఘంలో జరిగే భ్రష్టత్వం, (2థెస్స 2:1-9) శ్రమల గూర్చి చెప్పి, ఆ తర్వాత అంతం గురించి చెప్తారు (మత్తయి 24:15-51). అక్కడే దీన్ని గూర్చి కూడా చెప్పాడు. ఇశ్రాయేలీయులతో ఆనాడు ఆయన చేసిన ఈ బోధ నేడు ఈ కాలంలో ఉన్న మన క్రైస్తవులకు వర్తించదని ఈ "నాశనకరమైన హేయవస్తువు" అనే అంశం గురించి జాగ్రత్తగా, ఆలోచించి చదివితే అర్థమౌతుంది.

"కాబట్టి ప్రవక్తయైన దానియేలు ద్వారా చెప్పబడిన "నాశనకరమైన హేయవస్తువు" పరిశుద్ధ స్థలమందు నిలుచుట మీరు చూడగానే చదువువాడు గ్రహించుగాక – **"యూదయలో" ఉండువారు** కొండలకు పారిపోవలెను, మిద్దెమీద ఉండువాడు తన యింటిలోనుండి ఏదైనను తీసికొని పోవుటకు ఇంటికి రాకూడదు. అయ్యో, ఆ దినములలో గర్భిణులకు పాలిచ్చువారికిని శ్రమ. .అప్పుడు మహాశ్రమ కలుగును గనుక, మీరు పారిపోవుట చలికాలమందైనను **"విశ్రాంతిదినమందైనను"** సంభవింపకుండవలెనని ప్రార్థించుడి (మత్తయి 24:15–20). ధర్మశాస్త్రం ఇంకా అమలులో ఉన్నప్పుడు యేసు శిష్యులతో మాట్లాడుతూ, ప్రవక్తయైన దానియేలు ద్వారా చెప్పబడిన మాటని యేసు తన శిష్యులకు గుర్తు చేస్తున్నాడు.

ఇక్కడ యేసు క్రీస్తు మాట్లాడుతూ ఇది అనగా "నాశనకరమైన హేయవస్తువు" అనేది ఎవరికి సంబంధించినదో గుర్తెరగడానికి వీలుగా "యూదయలో" ఉన్నవారు పారిపోవాలంటున్నాడు. ఇంకా సంభవించబోయే శ్రమ చలికాలమందైనను, "విశ్రాంతి దినమందైనను" సంభవింపకుండ వలెనని ప్రార్థించమంటున్నాడు. పేతురు గారు బ్రతికి ఉన్న కాలంలో అనగా సత్యము పరిపూర్ణముకాకమునుపే ఆనాటి యూదులు, ఇశ్రాయేలీయులు మహాశ్రమలను అనుభవించుచుఉన్నారని తన పత్రికలో వ్రాశాడు (1పేతురు 4:12–16). కాబట్టి ఇది ఆ కాలములో నెరవేరిందని నిశ్చయముగా చెప్పవచ్చును. దానియేలువలె క్రీస్తు కూడా ఇశ్రాయేలీయులకు ప్రవక్త. ఇంకా విశ్రాంతిదినం అనేది యేసును నమ్మని ఇశ్రాయేలీయులు మాత్రమే ఆచరించేవారు. కాబట్టి ఇది ఖచ్చితంగా ఇశ్రాయేలీయులకు సంబంధించినదే. అసలు దానియేలు గ్రంథంలో ఏం చెప్పబడిందని చూస్తే...

"ఈ అరువది రెండు వారములు జరిగిన పిమ్మట ఏమియు లేకుండ అభిషిక్తుడు నిర్మూలము చేయబడును వచ్చునట్టి రాజు యొక్క ప్రజలు

పవిత్ర పట్టణమును పరిశుద్ధ ఆలయమును నశింపజేయుదురు. వాని అంతము హఠాత్తుగా వచ్చును. యుద్ధకాలాంతము వరకు నాశనము జరుగునని నిర్ణయింపబడెను. అతడు ఒక **వారమువరకు** అనేకులకు నిబంధనను స్థిరపరచును. అర్ధవారమునకు బలిని నైవేద్యమును నిలిపివేయుము. హేయమైనది నిలుచువరకు నాశనము చేయువాడు వచ్చును నాశనము చేయు వానికి రావలెనని నిర్ణయించిన నాశనము ముగించువరకు ఈలాగున జరుగును" (దానియేలు 9:26,27).

పైన చెప్పబడిన వాక్యములో అభిషిక్తుడు అనగా క్రీస్తు. ఈ అభిషిక్తుడు ఏ నిబంధనను స్థిరపరుస్తాడో ఈ వాక్యం తెలుపుతుంది. ఇక్కడ వారం అనగా ఏడు దినములు. అర్ధవారం అనగా మూడున్నర దినాలు. ఈ అభిషిక్తుడు అనుదినబలిని అనగా రోజూ జరిగే బలిని మూడున్నర దినాలు నిలిపివేస్తాడు. ఆ తర్వాత ఎప్పుడైతే నాశనకరమైన హేయవస్తువు పరిశుద్ధ స్థలంలో నిలుపబడుతుందో అప్పుడు ఆ పరిశుద్ధ స్థలం కూలగొట్టబడుతుంది. అనే వచనాన్ని కూడా దానియేలు గారు రాసాడు. ఇదే ప్రవచనం క్రీస్తు మళ్ళీ చెప్పాడు. దానియేలు చెప్పిన నాశనకరమైన హేయవస్తువు ఏమిటి? ఇశ్రాయేలీయులకు హేయమైనది ఏంటి? అనేది ముందుగా తెలియాలి. మరియు ఇశ్రాయేలీయులకు మాత్రమే హేయమైనవి ఏంటో తెలియాలంటే మళ్ళీ దర్మశాస్త్రాన్ని చదవాలి.

"నీవు హేయమైనదేదియు తినకూడదు. మీరు తినదగిన జంతువులు ఏవేవనగా ఎద్దు, గొర్రెపిల్ల, మేకపిల్ల, దుప్పి, ఎర్రచిన్న జింక, దుప్పి, కారు మేక, కారు జింక, లేడి, కొండగొఱ్ఱె అనునవే. జంతువులలో రెండు డెక్కలు గలదై నెమరువేయు జంతువును తినవచ్చును. నెమరువేయు వాటిలోనిదే కాని రెండు డెక్కలుగల వాటిలోనిదే కాని నెమరువేసి ఒంటిడెక్కగల ఒంటె, కుందేలు, పొట్టికుందేలు, అనువాటిని తినకూడదు. అవి మీకు హేయములు. మరియు **"పంది"** రెండు డెక్కలు గలదైనను

నెమరువేయదు గనుక **"అది మీకు హేయము"**, వాటి మాంసము తినకూడదు, వాటి **"కళేబరములను"** ముట్టకూడదు (ద్వితీయో 14:3-8).

పైన చెప్పబడిన వాక్యములో హేయమైన జంతువుల గురించి చెప్పబడింది. కాని మనకు కావాల్సింది "హేయవస్తువు" పంది అనేది జంతువు. అదే కళేబరము అయితే వస్తువు అవుతుంది. పంది బ్రతికున్నప్పుడు అది జంతువు. చనిపోతే ఆ శరీరము కళేబరము లేదా శవం (ప్రాణం లేనిది) వస్తువు అవుతుంది. కాబట్టి దీనిని బట్టి నాశనకరమైన హేయవస్తువు అంటే పంది యొక్క కళేబరము. ఈ పంది కళేబరము ఎప్పుడైతే పరిశుద్ధ స్థలములో ఉంచబడుతుందో అప్పుడు ఇశ్రాయేలీయులకు అంతము మరియు యుద్ధం రాబోతుంది. అప్పటినుండే ప్రపంచనాశనానికి ప్రారంభం అని దానియేలు ప్రవక్త ద్వారా చెప్పబడింది. ఆనాడు దానియేలు ఇశ్రాయేలీయులకు చెపితే ఇదే మాటను ఇశ్రాయేలీయులకే మళ్ళీ క్రీస్తు గుర్తు చేశాడు. ఇది పూర్తిగా ఇశ్రాయేలీయులకు సంబంధించిన విషయం. కాని ఇది తెలియని నేటి క్రైస్తవులు ఇప్పటికి జరుగలేదని ఇంకా భవిష్యత్‌లో లేదా త్వరలో ఇది జరుగబోతుందని ఎదురుచూస్తున్నారు.

అయితే ఇంతకీ ఈ పంది మరియు దాని కళేబరాన్ని నాశనకరమైన హేయవస్తువుగా ఎవరికి చెప్పబడింది? ఎప్పటి వరకు అనగా ఏ కాలం వరుకు ఇది హేయమైనదిగా ఉంది అనే విషయం దానియేలులోని ఇదే 9వ అధ్యాయం 26,27 వచనాల్లోనే చెప్పబడింది. అదేంటంటే అర్ధవారము ($3^{1/2}$ దినాలు) వరకు బలినైవేద్యం నిలిపివేయబడుతుంది.

అసలు ఈ అర్ధవారం = మూడున్నర దినాలు అనేవి ఏంటి?

వారం = ఏడు దినాలు అనేవి ఏంటి?

అనే విషయం తెలియాలి. ఇంకా ఆ తర్వాత కొన్ని దినాలకు లేదా వారాలకు మరియు 70 వారాలు పూర్తికాగానే ఈ నాశనకరమైన

హేయవస్తువు దేవాలయంలోని పరిశుద్ధ స్థలములో పెట్టబడుతుందని దేవుడు బైబిల్ గ్రంథంలో రాయించిన మాట. మరి ఇదే విషయాన్ని చరిత్ర ప్రకారంగా మరియు బైబిల్‌లో చెప్పిన కాలానుగుణంగా కూడా ఆలోచించి, ఇది ఎప్పుడు జరిగిందో తెలుసుకోవాలి. ఎందుకంటే కాలాన్నిబట్టి ప్రవచనము యొక్క నెరవేర్పును పరిశీలించి చదువుకొని దాని ప్రకారం ప్రవర్తించాలి (2దిన 36:21-23; ఎజ్రా 1:1-5; యిర్మీయా 25:8-12; దానియేలు 9:2). ఇదే పేతురు 1:8-11లో చెప్పింది పేతురుకు జరిగిందే చూద్దాము.

“మరునాడు వారు ప్రయాణమైపోయి పట్టణమునకు సమీపించి నప్పుడు పగలు ఇంచుమించు పండ్రెండు గంటలకు పేతురు ప్రార్థన చేయుటకు మిద్దెమీదికెక్కెను. అతడు మిక్కిలి ఆకలిగొని భోజనము చేయగోరెను. ఇంటివారు సిద్ధము చేయుచుండగా అతడు పరవశుడై ఆకాశము తెరువబడుటయు, నాలుగు చెంగులు పట్టి దింపబడిన పెద్ద దుప్పటివంటి యొక్క విధమైన పాత్ర భూమి మీదికి దిగివచ్చుటయు చూచెను. అందులో భూమియందుండు సకలవిధములైన చతుష్పాద జంతువులను, ప్రాకు పురుగులును, ఆకాశపక్షులును ఉండెను. అప్పుడు - పేతురూ నీవు లేచి చంపుకొని తినుమని ఒక శబ్దమతనికి వినబడెను. అయితే పేతురు వద్దు ప్రభువా, నిషిద్ధమైనది అపవిత్రమైనది ఏదైనను నేనెన్నడును తినలేదని చెప్పగా - దేవుడు పవిత్రము చేసిన వాటిని నీవు నిషిద్ధమైనవాటిగా ఎంచవద్దని మరల రెండవమారు ఆ శబ్దము అతనికి వినబడెను. ఈలాగు ముమ్మారు జరిగెను. వెంటనే ఆ పాత్ర ఆకాశమునకెత్తబడెను” (అపొ.కా. 10:9-16).

పేతురు అప్పటికి నిష్టగలిగిన ఇశ్రాయేలీయుడు, ఆయన మోషే ధర్మశాస్త్రాన్ని పాటించే వాడు. నిషిద్ధమైనవి ఏవి తినకూడదు, పేతురు నిషిద్ధమైనవి, అపవిత్రమైనవి ఎన్నడూ తిన్లేదు. ధర్మశాస్త్ర ప్రకారము

ఇశ్రాయేలీయులకు పరిశుద్ధమైనవి, నిషిద్ధమైనవి ఉండేవి. కాని అపొస్తలుల కార్యములో దేవుడు పేతురుతో మాట్లాడుతున్న సమయానికి పేతురు ఎవరు? ఏమై ఉన్నాడో ఆలోచించాలి.

పేతురు ఇంకా ఇశ్రాయేలీయుడేనా? క్రైస్తవుడా? అంటే ఖచ్చితంగా క్రైస్తవుడే ఎందుకంటే ఈ బండ (పేతురు) మీదే సజీవుడగు దేవుని కుమారుడైన క్రీస్తు సంఘాన్ని కడతానని చెప్పాడు. ఇంకా పేతురు క్రీస్తును అనుసరిస్తూ, క్రీస్తు పరిచర్య సంపూర్ణముగా చేస్తున్న క్రీస్తు యొక్క సంఘ ప్రారంభకుడు, పెద్ద మరియు పరిచారకుడు. అసలుసిసలైన క్రైస్తవుడు ఇందులో సందేహం ఏ మాత్రము లేదు. కాబట్టి పేతురు ప్రార్ధన చేసే కాలానికే దేవుడు నిషిద్ధమైన వాటిని అనగా హేయమైన వాటిని ఎత్తివేసాడు. అంటే ఏదైతే తినకూడదని, నిషిద్ధమైనదని మోషే ధర్మశాస్త్రం ద్వారా ఇశ్రాయేలీయులకు సెలవిచ్చిన దేవుడే ఇక్కడ పేతురు క్రైస్తవుడిగా ఉన్నకాలానికి ఆ కట్టడల (ఆజ్ఞల)ని తీసివేసి (ఎత్తివేసి) అందర్ని అన్ని తినేయమన్నాడు.

అసలు నిషిద్ధమైనది తినొద్దనే కట్టడ (ఆజ్ఞ) రూల్ ఎప్పుడొచ్చింది. దేవుడు ఇది ఎవరికిచ్చాడు? క్రీ.పూ. దేవుడు ఎంచుకున్న ఇశ్రాయేలీయులకే కదా (కీర్తన 78:8).

పేతురు ప్రార్ధన చేసిన కాలానికి నిషిద్ధమైనది తొలగిపోయింది. దేవుడే దానిని తీసేశాడు. కాబట్టి ఈ ఆజ్ఞ తినొద్దనే రూల్ పేతురు ప్రార్ధన చేసే ముందు వరకు అంటే క్రీస్తు సిలువ వేయబడక ముందు (రోజు, గంట లేదా ముందు క్షణం) వరకు ఇది వర్తిస్తుంది. కాబట్టి పేతురు ప్రార్ధనకి ముందే ఈ హేయమైన వస్తువు పరిశుద్ధ స్థలంలో పెట్టబడాలి. పేతురు ప్రార్ధన తర్వాత కాలంలో హేయమైనదేది లేదు ఉండకూడదు. కాబట్టి ఆ తర్వాత కాలంలో హేయవస్తువు పెట్టబడే అవకాశం కూడా లేదు.

కనీసం ఇశ్రాయేలీయులతోపాటు, ప్రపంచ ప్రజలందరికి అనగా క్రైస్తవులతో పాటు పేతురు గారు ప్రార్ధనచేసే కాలంనుండైనా అనగా అపొస్తలుల కార్యముల కాలం నుండి ఇక ఏది కూడా నిషిద్ధమైనది గాని, హేయమైనది గాని లేదనే విషయం అర్ధమౌతుంది. ఇది దేవుని వాక్యం కూడా పక్కాగా చెబుతందేంటంటే...

“ఆ అబద్ధికులు, వాత వేయబడిన మనసాక్షి గలవారై, వివాహు నిషేదించుచు, సత్య విషయమై అనుభవజ్ఞానముగల విశ్వాసులు కృతజ్ఞతాస్తుతులు చెల్లించి పుచ్చుకొను నిమిత్తము “దేవుడు సృజించిన ఆహారవస్తువులను **కొన్నిటిని తినుట మానవలెనని** చెప్పుచుందురు’ దేవుడు సృజించిన **ప్రతి వస్తువును మంచిది**, కృతజ్ఞతాస్తుతులు చెల్లించి పుచ్చుకొనిన యెడల “ఏదియు నిషేదింపతగినది కాదు”. ఏలయనగా ఇది దేవుని వాక్యము వలనను ప్రార్ధనవలనను పవిత్రపరచబడుచున్నది (1తిమోతి 4:1-5).

కాబట్టి వాక్యం ప్రకారంగా ఇక మనకు (క్రైస్తవులకు) ఏదియు నిషేదింపతగినవి అంటూలేవు. ప్రతిది కృతజ్ఞతాస్తుతులు చెల్లించి తినవచ్చని దేవుడు వాక్యం ద్వారా ఇంత చక్కగా క్రైస్తవులకు తెలియజేసాడు. అటు క్రైస్తవులు, ఇటు ఇశ్రాయేలీయులు కూడా కాని వారికి అంటే ఆదాము మొదలుకొని మోషే వరకు (ఇశ్రాయేలీయులకు ముందున్న వారికి) ఏం చెప్పాడు? వారికి ఏమైనా నిషిద్ధమైనది, హేయమైనది పెట్టాడా? అని కూడా ఒకసారి దేవోక్తులను చదివి ఆలోచించి చూస్తే...

దేవుడు తాను చేసినది యావత్తును చూచినప్పుడు ఇది “చాలా మంచిదిగా” నుండెను (ఆది.కా. 1:31).

ప్రాణముగల సమస్త చరములు మీకు ఆహారమగును. పచ్చని కూర మొక్కలనిచ్చినట్లు వాటిని మీకిచ్చియున్నాను (ఆది.కా. 9:2,8).

ఇశ్రాయేలీయులకు ముందున్న వారికి కూడా, ఎలాంటి నిషిద్ధమైనది, హేయమైనది, తినకూడదనే (రూల్) కట్టడ పెట్టలేదు. ఇక నిషిద్ధమైనది,

హేయమైనది తినొద్దనే ఆజ్ఞ కేవలం ఈ ఇశ్రాయేలీయులకే దేవుడు పెట్టినట్లు వాక్యం ద్వారా తెలిసికొన్నాము. ఆదిలో అనగా ఇశ్రాయేలీయులకు ముందున్న వారికి ఇశ్రాయేలీయులకు తర్వాత ఉన్న ప్రజలకి ఈ సృష్టిలో ఎలాంటి హేయమైనదనే కట్టడ, ఆజ్ఞ అంటూ ఏమీ లేదు. వీరు క్రైస్తవులతోపాటు ప్రతిది అనగా ప్రాణంగల సమస్త చరములు (వాటిలో పంది కూడా ప్రాణం గలదే గనుక ఇది కూడా) తినవచ్చు (రోమా 8:1).

ఇప్పటివరకు హేయమైనదేంటో, అది ఎవరికి తినొద్దని చెప్పాడో అనేది చదివాము. ఇంక కావాల్సింది **"పరిశుద్ధ స్థలం"**. ఈ పరిశుద్ధ స్థలం అనేది ఎప్పుడు, ఎవరి కాలంలో అమలులోకి వచ్చింది? అసలు పరిశుద్ధ స్థలం అంటే ఏమిటి? అనేది కూడా వాక్యంలో చూద్దాము.

అప్పుడు మోషే - ఆ పొద యేల కాలిపోలేదో నేను ఆ తట్టు వెళ్ళి యీ గొప్ప వింత చూచెదననుకొనెను. దానిని చూచుటకు అతడు ఆ తట్టు వచ్చుట యెహోవా చూచెను. దేవుడు ఆ పొద నడుమ నుండి - మోషే మోషే అని అతనిని పిలిచెను. అందుకతడు - చిత్తము ప్రభువా అనెను. అందుకాయన దగ్గరకు రావద్దు, నీ పాదముల నుండి నీ చెప్పులు విడువుము, **"నీవు నిలిచియున్న స్థలము పరిశుద్ధ ప్రదేశము"** అనెను (నిర్గ.కా. 3:3-6).

ఇదే నిర్గమాకాండములోని వాక్యమును గూర్చి సిలువ వేయబడిన క్రీస్తు బోధలో పౌలు గారు రాస్తున్నాడు...

**మొదటి నిబంధనకైతే** సేవానియమములును ఈ లోక సంబంధమైన పరిశుద్ధ స్థలమును ఉండెను. ఏలయనగా మొదట ఒక గుడారమేర్పరచబడెను. అందులో దీపస్తంభమును, బల్లయు, దానిమీద ఉంచబడిన రొట్టెలును ఉండెను. దానికి **"పరిశుద్ధ స్థలమని"** పేరు. రెండవ తెరకు ఆవల **"అతి పరిశుద్ధస్థలమను"** గుడారముండెను (హెబ్రీ 9:1-12).

హెబ్రీ 9:11-12లోని ఈ వాక్యం ప్రకారం, ఇశ్రాయేలీయులకే పరిశుద్ధ స్థలం, అతిపరిశుద్ధ స్థలం, బలులు, దూపదీప నైవేద్యాలు అనేవి ఉన్నాయి. కాబట్టి ఇది ఇశ్రాయేలీయులకు సంబంధించినది. క్రీస్తు సిలువ మరణంతో దేవాలయపు తెర చినిగింది. ఇశ్రాయేలీయులకు అన్యులకు మధ్యనున్న అడ్డుగోడ పడగొట్టబడి అందరూ దేవుని యొద్దకు క్రీస్తు ద్వారా చేరే మార్గము ఏర్పడినది (ఎఫెసి 2:11-22; గలతీ 3:23-29). ఆ ప్రకారంగా భూమిపైన ఇక పరిశుద్ధస్థలం కొట్టివేయబడింది. దేవుడు ఒక స్థలానికిచ్చిన మహిమ ఎలాంటిదో, ఎంత గొప్పదో ఇశ్రాయేలీయులకు చెప్పాడు. ఇశ్రాయేలీయులు అంతం ఎప్పుడైతే జరిగిందో అప్పుడే ఈ పరిశుద్ధస్థలం, హేయమైనదనే వాటిని కూడా ఎత్తివేశాడు.

ఇలాగైతే మరి దానియేలు గ్రంథంలో చెప్పబడిన నాశనకరమైన హేయమైన వస్తువు పరిశుద్ధస్థలంలో పెట్టుట చూచువరకు అంటే అది ఎప్పుడు సాధ్యపడుతుంటే అప్పటి వరకు పరిశుద్ధస్థలం ఉండాలి, అప్పటికింకా నాశనకరమైన హేయవస్తువు కూడా ఉండాలి. ఈ రెండు ఇశ్రాయేలీయుల (అంత్య దినాలలో) కాలంలో ఇశ్రాయేలీయులకే ఉన్నాయి. కాబట్టి ఖచ్చితంగా ఇశ్రాయేలీయుల కాలంలోనే ఇది జరిగితీరాలి. మరి ఈ ఇశ్రాయేలీయుల కాలం ఏంటి? వారి అంతం ఎప్పుడు జరిగిందో తెలియాలి. క్రీస్తు సిలువ మరణంతోనే ఇశ్రాయేలీయుల అంతం పూర్తిగా జరుగలేదు.

ఎందుకంటే సిలువ మరణంతోనే ఇశ్రాయేలీయులందరికి 'సువార్త' సంపూర్ణముగా ప్రకటింపబడలేదు. గనుక వారిలో కొందరు ఇంకా వారు ధర్మశాస్త్రాన్ని అవలంభిస్తూనే ఉన్నారు. కాబట్టి మరి ఈ ఇశ్రాయేలీయుల అంతం గాని, ధర్మశాస్త్రం కొట్టివేయబడటం గాని ఎప్పుడు జరిగిందంటే, ఎప్పుడైతే పౌలు గారు ఈ వాక్యము పూర్ణాంగీకారమునకు యోగ్యమైనదని చెప్పాడో, (1తిమోతి 1:25, 4:9; 1కొరింథీ 13:9-12) ఇంకా యోహాను

గారు ఇక వాక్యానికి ఒకటి కలుపకూడదు, ఒకటి తీయకూడదని ముద్ర వేశాడో (ప్రకటన 22:18-19) ఆనాటి నుండి ధర్మశాస్త్రం పూర్తిగా కొట్టివేయబడింది. ఇక అందరికి దిక్కుగా కేవలం సిలువ వేయబడిన క్రీస్తు బోధ మాత్రమే ఉంది.

ఇక ఆనాటి నుండి ఇశ్రాయేలీయులు గాని, పరిశుద్ధ స్థలం గాని లేవు. కాబట్టి ఈ నాశనకరమైన హేయవస్తువు పరిశుద్ధ స్థలం పెట్టబడటం అనేది ఇశ్రాయేలీయుల కాలంలోనే జరగాలి. అది ఎప్పుడు జరిగిందనే విషయం ఇటు బైబిల్ ప్రకారం, అటు చరిత్ర ప్రకారంగా కూడా ఆలోచించగలిగితే (దానియేలు 12:11,12) "అనుదిన బలి నిలుపు చేయబడిన కాలము మొదలుకొని వెయ్యిన్ని రెండువందల తొంబది దినములగును. వెయ్యిన్ని మూడువందల ముప్పదియైదు దినములు తాళు కొని కనిపెట్టుకొను వాడు ధన్యుడు". పైన చెప్పబడిన వాక్యం ప్రకారం 1335 దినాల నుండి 1290 దినాలు తీసేస్తే 45 దినాలు.

అనుదిన బలి పూర్తిగా నిలుపు చేయబడింది క్రీస్తు సిలువ మరణదినం నుండి మాత్రమే క్రీస్తు బోధ చేసింది మూడున్నర సంవత్సరాలు (అర్ధవారం) అనుదిన బలి పూర్తిగా నిలిపివేయబడింది క్రీస్తు మరణ దినం నుండి. అయితే మరి క్రీస్తు సిలువ మరణ దినం ఎప్పుడో తెలియాలి.

క్రీస్తు సిలువ మరణం క్రీ.శ. $33^{1/2}$ సం॥లు అని ప్రపంచం అనుకుంటుంది .కాని బైబిల్ గ్రంథ చరిత్ర ప్రకారంగా ఆలోచిస్తే నిజానికి క్రీస్తు చనిపోయింది క్రీ.శ. $29^{1/2}$ లేదా 30 సం॥. ఎందుకంటే క్రీస్తు పుట్టింది అనగా యేసుక్రీస్తు ఈ లోకానికి వచ్చింది క్రీ.పూ. సుమారు 4 సం॥ అని తెలుస్తుంది. కాబట్టి ఈ ముప్పైమూడు సంవత్సరాల నుండి 4 సంవత్సరాలు తీసేస్తే సుమారుగా ఇరవైతొమ్మిది లేదా ముప్పది సంవత్సరాలు ($29^{1/2}$ లేకా 30సం॥) వస్తుంది. ఈ లెక్క ప్రకారంగా క్రీస్తు చనిపోయింది క్రీ.శ. $29^{1/2}$ లేకా 30 సం॥ అనే నిజము మనుషులు వ్రాసిన చరిత్ర ప్రకారము తెలుస్తుంది.

పైన చదువుకున్న వాక్యాల ప్రకారంగా, 1. హేయవస్తువు అంటే ఏంటో, 2. పరిశుద్ధ స్థలం ఏంటో, అది ఎవరికో, 3. అనుదిన బలి నిలుపువేయ బడిందెప్పుడో అనే విషయాలు తెలుసుకున్నాం (చదువు కున్నాం). ఇక మనకు కావాల్సింది ఈ హేయమైనది పరిశుద్ధస్థలంలో పెట్టబడిందెప్పుడు? దేవాలయం, యెరూషలేం పట్టణం ముట్టడి ఎప్పుడు జరిగింది?

యెరూషలేం పట్టణం కూలబడిందెప్పుడనే విషయం చరిత్ర ప్రకారంగా, మరియు బైబిల్ ప్రకారంగా క్రీ.శ. 70వ సంవత్సరం. క్రీ.శ. 70వ సంవత్సరం యెరూషలేము దండ్ల చేత చుట్టబడి (లూకా 21:20-22) దాని ప్రాకారములు పడగొట్టబడి పరిశుద్ధస్థలం ముట్టడివేయబడింది. యేసు బోధ చేస్తున్న కాలంలో ఈ రాతి మీద రాయి ఒకటైనను లేకుండా దేవాలయపు గోడలు పడగొట్టబడతాయని అన్నాడు. క్రీస్తు చనిపోయి తిరిగి లేచిన తర్వాత క్రీ.శ. 70వ సంవత్సరములో టైటస్ అనే వ్యక్తి కాలంలో యెరూషలేము దేవాలయం, యెరూషలేము పట్టణం కూలగొట్టబడింది. యెరూషలేము పట్టణం మరియు దేవాలయం పడగొట్టబడింది క్రీ.శ. 70వ సంవత్సరం అని బైబిల్, మరియు చరిత్ర ప్రకారంగా కూడా జరిగింది. ఇప్పుడు ఈ 70 సంవత్సరాల నుండి $29^{1/2}$ లేదా 30 సంవత్సరాలు తీసేస్తే వచ్చేది 40 సంవత్సరాలు. దానియేలు గ్రంథంలో చెప్పిన లెక్క 45 రోజులు.

దానియేలులో 45 “రోజులు” గా (దినాలుగా) చెప్పబడింది. దేవాలయం పడగొట్టబడిన లెక్క 40 సంవత్సరాలు సుమారు. చరిత్ర ప్రకారంగా క్రీస్తు మరణించిన తర్వాత దేవాలయం పడగొట్టబడింది. 40 సంవత్సరాలుగా ఉంది. బైబిల్ ప్రకారం అది దానియేలు ప్రవచనం తీసుకుంటే 45 దినాలుగా తెలుస్తుంది. ఇంతకీ ఇవి దినాలా? సంవత్సరాలా? తెలియాలంటే మళ్ళీ బైబిల్ దగ్గరకే వెళ్ళాలి. అసలైన

ఖచ్చితమైన సమాధానం దొరకాలన్నా, ఈ చిక్కుముడి విప్పాలన్నా బైబిల్‌లోని వాక్య సమాధానమే కావాలి. అసలు ఈ దినాలు, సంవత్సరాలు గురించి బైబిల్ ఏం చెబుతుందో అనే విషయం చూస్తే...

"మరియు నీ యెడమ ప్రక్కను పండుకొనియుండి ఇశ్రాయేలువారి దోషమును దానిమీద మోపవలెను. ఎన్ని దినములు నీవు ఆ తట్టు పండుకొందువో అన్ని దినములు నీవు వారి దోషమును భరింతుము. **ఇశ్రాయేలు వారి దోషమును** నీవు భరించునట్లుగా వారు దోషము చేసిన సంవత్సరముల లెక్క చొప్పున నీకు **"మూడువందల తొంబది దినములు"** నిర్ణయించియున్నాను. ఆ దినములు గడచిన తరువాత కుడి ప్రక్కను పండుకొనియుండి "నలువది దినములు యూదావారి" దోషమును భరింపవలెను, **"సంవత్సర మొకటింటికి ఒక దినము"** చొప్పున నేను నిర్ణయించి యున్నాను" (యెహెజ్కేలు 4:1-6).

యెడమ ప్రక్కను పండుకొని, ఇశ్రాయేలు వారి దోషమును మూడువందల తొంబై దినాలు, కుడి ప్రక్కను పండుకొని యూదావారి దోషమును నలువది దినములు భరింతువు అని యెహెజ్కేలుతో చెప్పి, సంవత్సరమొకటింటికి ఒక దినము చొప్పున నేను నిర్ణయించి యున్నానని దేవుడు చెప్పుచున్నారు. క్రీస్తు భూమిమీదకు వచ్చే సరికి ఇశ్రాయేలీయులలో కేవలం యూదులు మాత్రమే తమ పవిత్రతను కాపాడుకొన్నారు. ఎందుకంటే యేసుక్రీస్తు యూదులలో నుండి రావాలి మరియు రక్షణ యూదులలో నుండే కలుగాలి (రోమా 3:1,2). మరియు వారి దేశము యూదయ దేశంగా పిలువబడినది. కాబట్టి వారి రక్షకుడు మరియు అభిషిక్తుడు మరణించాక 40 సం॥లకే యెరూషలేము దండ్ల చేత చుట్టబడి అన్యజనులచేత తొక్కబడింది అంటే ఆ 40 సం॥ యూదా వారి దోషాలను మన్నించాడు దేవుడు (లూకా 21:20-22; కీర్తన 74:3-10).

ఇశ్రాయేలు వారి దోషము - 390 దినములు

యూదా వారి దోషములు - 40 దినములు

430 దినములు

ఒక సంవత్సరము = ఒక దినము.

అంటే యెహెజ్కేలు ప్రవచించిన (430 సం॥) నాలుగు వందల ముప్పై సంవత్సరాలకి యెరూషలేము ముట్టడి చేయబడుతుందని దేవుడు యెహెజ్కేలు ప్రవచనాల ద్వారా తెలియజేసాడు. ఇక్కడ సంవత్సరాన్ని ఒక దినంతో పోల్చాడు. కాబట్టి దానియేలు గ్రంథంలోని 45 దినాలు 45 సం॥రాలు, మరియు 40 దినాలు 40 సం॥లుగా తీసుకొంటే ఈ 45 సం॥రాలు, అక్కడ చరిత్ర ప్రకారంగా తేలిన 40 సం॥రాలు సుమారుగా సరిపడింది. (ఇదంతా చరిత్రలో సుమారుగా లెక్కగాబట్టి 40 లేదా 45లో పెద్దగా తేడా లేదు. యెహెజ్కేలు చెప్పిందే సరియైనదిగా తీసుకోవాలి).

430 సంవత్సరాలు తర్వాత యెరూషలేము ముట్టడి వేయబడుతుందని యెహెజ్కేలుతో మాట్లాడిన దేవుడు ఆ తర్వాత మలాకీ ద్వారా మాట్లాడి మళ్ళీ బాప్తీస్మమిచ్చు యోహాను కాలం వరకు (400 సం॥లు) మాట్లాడలేదని బాప్తీస్మమిచ్చు యోహాను నుండే మాట్లాడాడని ఆ తర్వాత 70 సు॥లకే క్రీస్తు మరణించిన (క్రీ.శ. 30వ సం॥) తర్వాత 40 సం॥కే యెరూషలేము ముట్టవేయబడిందనే విషయాలు తెలిసాయి. కాబట్టి యెరూషలేము పట్టణం వాక్యం స్థిరపరచబడక మునుపే అనగా సత్యం పరిపూర్ణంగా ప్రకటింపక మునుపే ముట్టడివేయబడింది. అయితే నాశనకరమైన హేయవస్తువు కూడా ఖచ్చితంగా 1వ శతాబ్దంలోపే అనగా క్రీ.శ. 70వ సం॥లోనే పెట్టబడింది.

పైన చెప్పబడిన రీతిగా దానియేలులో చెప్పబడినట్లు 70 వారాలు అనగా 70×7=430 దినములు మరియు 430 సం॥లు సరిగ్గా

సరిపోతుంది గనుక ఈ హేయవస్తువుని పరిశుద్ధస్థలంలో పెట్టడం, దేవాలయం అందులోని పరిశుద్ధ స్థలం పడగొట్టబడటం జరిగింది.

పైన వివరించిన ప్రకారం పరిశుద్ధ స్థలం, హేయవస్తువు అనేవి ఇశ్రాయేలీయులకే ఉండేవి. వాళ్ళ కాలంలోనే ఈ హేయవస్తువు పరిశుద్ధ స్థలంలో పెట్టబడం, యెరూషలేము పట్టణం దేవాలయం కూలగొట్టబడటం ఇశ్రాయేలీయుల కాలంలోనే జరిగింది. ఇది ఈ కాలంలో గాని, ఇంకా భవిష్యత్‌లో గాని జరిగే వీలేలేదు. కాకపోతే క్రైస్తవులమైన మనకు కూడా పరిశుద్ధస్థలం అనేది లేదా? అని ఆలోచిస్తే రాళ్ళతో కట్టబడిన గుడిలోని పరిశుద్ధస్థలంలాంటిది క్రైస్తవులకు లేదు గాని ఆత్మీయంగా ఆలోచిస్తే ఖచ్చితంగా క్రైస్తవులకు కూడా పరిశుద్ధమైన స్థలం ఉంది. అది ఏంటంటే

**"మీరు దేవుని ఆలయమై"** ఉన్నారనియు, మీరెరుగరా? ఎవడైనను దేవుని ఆలయమును పాడు చేసిన యెడల దేవుడు వానిని పాడు చేయును. దేవుని ఆలయము **పరిశుద్ధమై** యున్నది. మీరు ఆ ఆలయమై ఉన్నారు. (1కొరింథీ 3:16,17) మీ దేహము దేవుని వలన మీకు అనుగ్రహింపబడి, మీలోనున్న **"పరిశుద్ధాత్మకు ఆలయమై"** ఉన్నదని మీరెరుగరా? మీరు మీ సొత్తు కారు (1కొరింథీ 6:19).

పైన చెప్పబడిన రెండు వాక్యాల ప్రకారంగా మానవ దేహమే దేవుని ఆలయం, పరిశుద్ధాత్మకు ఆలయం (నిలయం). మన హృదయం, మన దేహమే **"పరిశుద్ధ స్థలం"**. ఆనాడు రాళ్ళతో కట్టబడిన దేవాలయాన్ని ఇశ్రాయేలీయులకిచ్చి, క్రీస్తులో దానిని కొట్టివేసి, రాళ్ళతో కాక, తన స్వహస్తాలతో కట్టిన మానవదేహాన్నే దేవుడు దేవాలయం, పరిశుద్ధస్థలం అన్నాడు. మరి ఇంత పవిత్రమైన పరిశుద్ధమైన ఈ పరిశుద్ధ స్థలంలోకి

1. నాశనకరమైన హేయవస్తువు పెట్టబడుతుందా? 2. పెట్టబడితే ఆ హేయమైనది ఏంటి? 3. అది ఎప్పుడు పెట్టబడుతుంది? 4. అప్పుడు ఏం జరుగుతుంది? హృదయమనే పరిశుద్ధ స్థలంలో కూడా హేయవస్తువు ఎలా పెట్టబడుతుంది?

నాటి నుండి నేటి క్రైస్తవులకు హేయమైనదేంటంటే మొదట భ్రష్టత్వము సంభవించి "నాశన పాత్రుడగు పాప పురుషుడు" బయలుపడితేనే గాని ఆ దినము రాదు. ఏది దేవుడనబడునో, ఏది పూజింపబడునో, దానినంతటిని ఎదిరించుచు, దానికంతటికిపైగా వాడు తన్ను తానే హెచ్చించుకొనుచు, తాను దేవుడనని తన్ను కనపరచుకొనుచు, **"దేవుని ఆలయంలో కూర్చుండును"**. గనుక ఏ విధముగానైనను ఎవడును మిమ్మును మోసపరచనియ్యకుడి (2థెస్స 2:3,4).

ఇప్పుడు హేయమైనది అటు దేవునికిని, ఇటు క్రైస్తవుడికి ఏంటంటే **"నాశన పాత్రుడగు సాతాను క్రియలు"** లేదా నాశన పాత్రుడగు ఈ సాతాను "హృదయమనే దేవాలయంలో" కూర్చుంటాడు (పెట్టబడతాడు) ఇలా పెట్టబడినప్పుడు ఏం జరుగుతుందంటే (2పేతురు 3:11-12 ప్రకారం) పంచభూతములు మహావేండ్రముతో కరిగిపోతాయి అంటే క్రీస్తు రెండవ రాకడ సంభవిస్తుంది. ఇంతకీ నాశనకరమైన హేయవస్తువు సిలువవేయ బడిన క్రీస్తు బోధ ప్రకారంగా ఏంటంటే 1తిమోతి 6:9-10 ప్రకారంగా ధనాపేక్ష సమస్తమైన కీడులకు మూలము ఈ ధనాపేక్ష నేటి క్రైస్తవుల్ని నాశనంలోకి ముంచేస్తుంది. ఈ ధనాపేక్షనే ఈ రోజుల్లో ఒక వ్యక్తిని, దేవుని సంఘాన్ని, పట్టణాన్ని, దేశాన్ని, ప్రపంచాన్ని కూడా నాశనం చేస్తుంది.

ధనం, ధనాపేక్ష, శరీరాశ, నేత్రాశ, జీవపుడంబము వంటి సాతాను క్రియలు మన హృదయం అనే దేవాలయంలో పాతుకుపోయి, దేవుడు ఉండాల్సిన స్థలంలో దేవున్ని లేకుండా చేసి భ్రష్టత్వంలోకి తీసుకొస్తుంది. యేసుక్రీస్తు కాలానికే డబ్బు లేదా ధనం లేకా సిరి దేవుని స్థానానికి ఎదిగిందని యేసుప్రభువే చెప్పాడు (మత్తయి 6:19-24). నేటికి అది ఏ స్థితిలో ఉందో ఎలా పూజింపబడుతుందో ఆలోచిస్తే దేవుని వాక్యమెంత సత్యమో అర్ధమవుతుంది.

ఒకనాటి **ఇశ్రాయేలీయులకు** హేయవస్తువు పంది మరియు దాని కళేబరమైతే ఆ పంది కళేబరం పరిశుద్ద స్థలం (రాళ్ళతో కట్టబడిన దేవాలయం)లో ఎప్పుడో పెట్టబడింది. అప్పుడు యెరూషలేము పట్టణం ముట్టడి వేయబడిందని సిలువ వేయబడుతుందని క్రీస్తు బోధ చెపితే, అదే దేవుడు సిలువ వేయబడిన క్రీస్తు బోధ ద్వారానే మనకు ఏం చెబుతుందంటే దేవుడు తన స్వహస్తాలతో కట్టిన దేహమనే ఈ దేవాలయంలోకి (పరిశుద్ద స్థలం) నాశనమైన హేయమైనది (సాతాను క్రియలు, ధనాపేక్ష, సిరి) పెట్టబతుంది. అప్పుడు సంఘంలో భ్రష్టత్వం సంభవించి, ఒక వ్యక్తి నుండి సంఘం, దేశం మరియు ఈ సృష్టి ఇలా సమస్తాన్ని నాశనం చేస్తుంది. ఇది సిలువవేయబడిన క్రీస్తు బోధ. కాబట్టి అన్నింటికంటే ముఖ్యముగా నీ హృదయమును భద్రముగా కాపాడుకొనుము (సామెతలు 4:23).

నేటి నాశనకరమైన హేయవస్తువు అయిన ధనాన్ని లేక సిరిని ఈ కాలంలో తన హృదయంలో ప్రతిష్టించుకొని, ప్రతి నిత్యము దాని సంపాధన కోసం ఆలోచించేవారు మరియు సంపాదన కోసమే పరుగులెత్తే

వాడే సాతాను ముద్రను కలిగియున్నాడు. అయితే మన దేహం (హృదయం) అనే దేవుని ఆలయంలో క్రీస్తును ప్రభువుగా (దేవుని కుమారుడిగా) ప్రతిష్టించుకొని పౌలు వలె తన ఆస్తిని పెంటగా ఎంచుకొన్న వారంతా దేవుని ముదద్రను కలిగి యున్నవారని గ్రహించాలి (1పేతురు 3:16; ఫిలిప్పీ 3:7-11). కాబట్టి క్రైస్తవుడా నేడు దేవాలయంగా ఉండాల్సిన ప్రతి సంఘాన్ని ఎన్నో విధాలుగా భ్రష్టత్వములోనికి నెడుతూ, సంఘాలను చీలుస్తూ, అందులోని వారికి నెమ్మది లేకుండా చేస్తూ, ప్రతి నిత్యము కోర్టులు, పోలీస్ స్టేషన్‌ల చుట్టూ తిప్పుతున్న ఈ డబ్బు అనే నాశనకరమైన హేయవస్తువును తరిమికొట్టండి. అనగా డబ్బు అనే సాతానును తమ కాళ్ల క్రింద చితక తొక్కిన నాడే ఏ సంఘమైనా ఎత్తబడుతుంది.

వాక్యమైయున్న క్రీస్తు బోధించిన కాలానికి, శరీరధారియైన క్రీస్తు బోధించిన కాలానికి, సిలువ వేయబడిన క్రీస్తు బోధించిన కాలానికి వాక్యంలో ఉన్న తేడాలను గమనించి చదివితేనే సత్యమును సరిగ్గా గ్రహించగలము. అంటే సత్యవాక్యాన్ని సరిగ్గా విభజించడము అని అర్థం. ఇలా బైబిల్ చదివి బోధింపబడటం లేదు గనుకనే ఎన్నో సిద్ధాంతాలు, భిన్నమైన బోధలతో సాతాను స్వైర విహారం చేస్తూ అందరిని మింగుతూ క్రీస్తు రాజ్యాన్ని నాశనం చేయాలని చూస్తున్నది. జీవవాక్యాన్ని దేవుని తలంపులతో ఆలోచించి చదివి, అనేకులచేత చదివించిన వారే దేవుని ముద్ర కలిగిన వారు, వారికే జీవకిరీటము, నీతి కిరీటము, పరలోకము సుమా!

## *కనుక ప్రియమైన దేవుని ప్రజలారా !*

**దే**వుడే తన అనాది సంకల్పము చొప్పున హెబెలు మొదలుకొని తనను నమ్మినవారి మీద ఆయన తన ముద్ర ఇప్పటికీ వేయించుచున్నాడు. అపవాది కూడా తనదైన శైలిలో కయీను మొదలుకొని తన ప్రభావానికి, అధికారానికి లొంగిన వారి మీద తన ముద్రను కూడా ఎప్పటినుండో ముద్రించుచునే యున్నాడు. ఈలోకంలో దేవుని పాలననుకాదని ప్రత్యేక రాజరికపు వ్యవస్థ వచ్చిన తర్వాత మరియు ఆ రాజరికము ముగిసిన తర్వాత కూడా ప్రజల యొక్క ప్రభుత్వాలు అవతరించినప్పటికిని సైతాను ప్రత్యేకమైన పద్ధతుల ద్వారా తన ముద్రను బలవంతముగా ఇశ్రాయేలీయుల నుండి నేటి మనమీద కూడా ముద్రించుచున్నది. దేవుడు, సాతానుల మధ్యన జరుగుచున్న ఆధిపత్యపు పోరులో అది మనకు తెలిసినా తెలియకపోయినా మోషేవలె దేవునిని గెలిపించడానికి దేవుని మద్రను మాత్రమే వేయించు కోవాలి అనేదే దేవుని అనాది సంకల్పము (ఎఫెసీ 1:3-12).

సాతానుముద్ర మరియు దాని సంఖ్య (666) ఇంకా రాలేదని అది అతి త్వరలో రాబోతుందని మన క్రైస్తవులలోని కొందరు దొంగబోధకులు బోధిస్తున్నారు. నిజంగా ఆ ముద్ర ఈనాటివరకు రాకపోతే ఇప్పటివరకు మరణించిన వారంతా పరదైసుకు పోవాలి గదా! కాని క్రొత్తనిబంధన కాలానికే అనేకులు పాతాళలోకంలోని నరకానికి వెళ్ళినట్టు బైబిల్ గ్రంథములోనే వ్రాయబడినది గదా! “అప్పుడా మృగమును, దానియెదుట సూచక క్రియలు చేసి దాని ముద్ర వేయించుకొనినవారిని, ఆ మృగపు

ప్రతిమకు నమస్కరించిన వారిని, మోసపరచిన ఆ అబద్ధప్రవక్తయు, పట్టబడి వారిద్దరు గంధకముతో మండుచున్న అగ్ని గుండములో ప్రాణముతోనే వేయబడిరి” (ప్రకటన 19:20; లూకా 16:19-31).

అయితే తమ ఇష్టపూర్వకంగా దేవుడు మరియు పరిశుద్ధాత్మ ముసుగులో సాతాను సంబధక్రియలు చేసి దాని ముద్రను వేయించుకొనిన అనేకులు అనగా క్రైస్తవ బాబాలు, వేషధారులు, రాజ్యాధికారంలో పాలుపంచుకొన్నవారు, మరియు లోకంలో ఎంత చెప్పినా దేవునిని ఎరుగనివారు, క్రీస్తు సువార్తకు లోబడని వారు, తాగుబోతులు, వ్యభిచారులు, మాంత్రికులు, మాయా బోధకులు అందరూ అగ్నిగుండములో అనగా వేదనకరమైన స్థలములో (నరకంలో) ఎప్పటినుండో యాతనపడుచున్నాడు. తప్పనిసరియైన పరిస్థితులలో అనగా సాతాను చేత బలవంతంగా దాని ముద్రలను వేయించుకొనిన వారి గూర్చి మాత్రమే “దేవుని ఆజ్ఞలను యేసును గూర్చి విశ్వాసమును గైకొనుచున్న పరిశుద్ధుల ఓర్పు ఇందులో కనబడును”.(ప్రకటన 14:22, 2:13) వీరిని గూర్చి మాత్రమే దేవుడు కనికరించినట్టుగా కనబడుచున్నది.

సాతాను అధికారము ఈ లోకమంతా ఉంది. ఇదే లోకములోవున్న క్రీస్తు రాజ్యంలో ఉండి అందులో ఆయన అధికారము క్రింద కూడా మనము బ్రతకాలి గదా! ఇది దేవునికి ముందే తెలియదా అంటే తెలుసు గనుకనే తన చట్టంలో మినహాయింపు ఇచ్చాడనుకోవాలి. అందుకే దేవుని రాజ్యమైన సంఘములోనికి వచ్చాకనైనా దేవుని ముద్రను వేయించుకోవాలి. దేవుని సంఘములో ఉండి కూడా సాతాను లేదా కౄరమృగము యొక్క ప్రభావముతోనే జీవించి దాని ముద్ర వేయించుకొని ఇంకా అనేకుల మీద వేయించాలని చూస్తున్న క్రీస్తు విరోదులకు మాత్రము ఏ యుగంలోనూ క్షమాపణ లేదు.

సాతానుముద్ర ఇంకా రాలేదు, త్వరలో రాబోతుంది. ఈ మధ్యనే వచ్చింది అనే తప్పుడు బోధలు చేసేవారు ఇప్పటివరకు మరణించినవారంతా నరకానికి ఎందుకెళ్ళారో వాక్యానుసారమైన రుజువులు చూపాలని మరోసారి గుర్తు చేస్తున్నాను. సాతాను సింహాసనమున్న స్థలములో కాపురమున్నా మన విశ్వాసాన్ని బైబిల్ ప్రకారంగా నిలబెట్టుకోవాలి. దేవుని ముద్రకై పోరాడాలి. దేవుని స్వరూపంలోనికి మారిన దేవుడిగా దేవుని రాజ్యంలో మరియు ఈ లోకంలో కూడా బ్రతకాలి.  బయటి లోకంలో కూడా దేవునిలాగే బ్రతకాలి కాని కొన్నిసార్లు అది సాధ్యం కాదు గదా! అని కొందరు అనుకోవచ్చు. యధార్ధంగా ప్రయత్నిస్తే విశ్వాసులకు అసాధ్యమైనదేది అనగా మనిషి సాధించలేనిదేదీ లేదు (మత్తయి 19:23-30; మార్కు 9:23).

ఇప్పటివరకు చదివిన లేదా పరిశోధించిన వాక్యాలను బట్టి సాతాను ముద్ర ఎప్పటినుండో మనుషులందరి మీద పడుతున్నదని అది కూడా దేవునిముద్రలాగే కనబడదని, ఈ ముద్రలు ఉన్న వారిని ఎలా గుర్తుపట్టాలంటే వారి క్రియలను, నడవడినిబట్టి వారిని గుర్తుపట్టాలి. ఎన్నో తప్పుడు బోధలు ఇప్పటికే వచ్చాయి గాబట్టి వాటి ఆధారంతో సాతానుముద్రయైన 666 అనే వాటితో మనుషులు పుట్టినట్లుగా లేదా పుడతారన్నట్లుగా ఎన్నో కథలు సినిమాలుకూడా వచ్చాయి. పైకి మంచి మనుషులుగా లేకా భక్తులుగా కనబడుతూ లోన కౄరమైన ఆలోచనలు కలిగిన మానవ మృగాలెన్నో  మన మధ్య ఇప్పటికే సంచారము చేయుచున్నవి.

అందరికి తండ్రియైన దేవునిని ఆయన కుమారుడైన సత్యవాక్యాన్ని కాదని మరియు ఎదిరించి లోకాధికారంకోసం, కులతత్వాన్ని,

మతోన్మాదాన్ని, ప్రాంతీయతత్వాన్ని ఇంకా ఎన్నో తత్వాలను, ఇజాలను ప్రేరేపిస్తున్న అనేకుల మీద ఆ ముద్ర ఎప్పటినుండో పడుతూనే ఉన్నదని గుర్తుపట్టండి. దేవుని ప్రజల రక్షణ, భద్రతపేరిటనే రాజ్యకాంక్షతో సమాజాన్ని అల్లకల్లోలం చేస్తూ మానవ జాతి మనుగడకే ప్రమాదాన్ని తెస్తూ దానవులుగా మారిన వారెందరో మన మధ్య దేవుని పరమ భక్తులుగా ఇప్పటికే ఊరేగుచున్నారు. వారిని వారి క్రియలనుబట్టి దేవుని మాటలున్న బైబిల్‌తో సరిచూసుకొని ఓ కంట కనిపెట్టి వారి ప్రభావానికి ఏ మాత్రం లోనుగాకుండా ఉండటమే సాతానుముద్ర నుండి తప్పించుకొనే మార్గం.

సాతాను సింహాసనమున్న ప్రాంతంలో కాపురముంటున్న మనం విశ్వాసాన్ని కాపాడుకొన్నా, కొన్నికొన్ని విషయాలలో మన కిష్టము లేకపోయినా బలవంతముగానైనా అప్పుడప్పుడు ఏదోరకంగా ఈ సాతాను ముద్రను వేయించుకొంటున్నాం. దేవుడు ఈ రాజ్యాధికారులది అనగా రాజ్యాధికారులకు రాజులకిచ్చేవి వారికిచ్చి దేవుడిది దేవునికియ్యమన్నాడు గదా! అయితే దేవుని రాజ్యంలోనికి సాతాను సామ్రాజ్యాన్ని అనగా రక్తమాంసాలను తీసుకొని రాకూడదు. నేటి సంఘాలలో కూడా సాతాను సంబంధులు అనేకులు ఈ ముద్రను బలవంతంగాను మరియు ఇష్టపడి వేసుకుంటున్నారు. అనేకమంది నిర్లజ్జగా బయటకు కూడా కనపడుచున్నారు. కావున సాతాను ముద్రను సంఘంలో ఉన్నవారు ఎట్టి పరిస్థితులలో కూడా వేసుకోవద్దని దేవుడు చెబుతున్నాడు.

ఇలా దేవుని రాజ్యమైన సంఘములో సాతానుముద్రను ఏ మాత్రము తమ దరికిరానివ్వక దేవునిముద్రను మాత్రమే వేయించుకొన్నవారికే దేవుడున్న పరలోకం అని మరువకండి. ఈ లోక రాజ్యంలో ఈ రకమైన సాతాను ముద్రపడుతున్న వారందరు దాని నుండి రక్షణ కోసం దేవుని

రాజ్యంలో ప్రవేశించి రాజులకు రాజైన క్రీస్తుకు రాజులైన యాజకులుగా ఉండాలని, దేవునిముద్రను ఆయన రాజ్యాన్ని ప్రపంచం నలుమూలలకు ఉచితంగా కష్టపడి, ఇష్టంతో విస్తరింపజేసి సాతాను సామ్రాజ్యాన్ని దాని ముద్రను తరిమి కొట్టాలనేది దేవుని అనాది సంకల్పం.

పరిశుద్ధాత్మ ఫలాలు (గలతీ 5:22) కలిగియుండి నీతి ఫలాలతో నిండుకొని తమ ఒంటిని, ఇంటిని, చర్చిని, వాడను, ఊరును, మన దేశాన్నే ఒక దేవాలయంగామార్చి ప్రతివారిని దేవుని ముద్రచేత ముద్రింపజేయడానికి జీవ వాక్యాన్ని చేతపట్టుకొని ఈ లోకమందు జ్యోతులవలె మనలను మనమే తయారు చేసుకొందాం. కేవలం శరీరావసరాల కోసమే క్రీస్తును నమ్మక, ప్రార్థించిన నూనెల మాయలోపడక, లోకసంబంధమైన దేవుని ఆశీర్వాదాల ముసుగులో పరలోకపు ఆశీర్వాదాలను పోగొట్టుకొనక, పాపక్షమాపణ, ఆత్మరక్షణకోసం అనుక్షణం దేవున్ని వేడుకొందాం. ప్రతిదినము వాక్యాన్ని పరిశీలించి, ధ్యానించి, ఆత్మచేత ముద్రింపబడి వాక్యపు వెలుగులో నడుద్దాం. మనందరికి తండ్రియైన దేవుడు, మనందరికి ప్రభువైన యేసుక్రీస్తు, మనందరికి మరొక ప్రభువైన పరిశుద్ధాత్మ సదాకాలము మనందరికి తోడైయుండి నడిపించుదురు గాక... ఆమెన్.

*రారాజు క్రీస్తు యేసు రాజ్యంలో రాజు - యాజకుడైన*

*మీ ఆత్మీయ సోదరుడు* ***డా॥ బొంకూరి జాన్***

## డా॥ బి. జాన్‌గారి గళం నుండి వెలువడిన
### సత్యపు వెలుగులో నడిపించే దివ్యమైన వాక్య సందేశాలు
#### ఆధునిక సమాజానికి ఆధ్యాత్మిక (వాక్యానుసారమైన) ఉపదేశములు
#### ఆడియో / సి.డి.లు (ఒక్కో సి.డి.లో 5లేక 6 ప్రసంగాలు కలవు)

---

**1. విశ్రాంతి దినము**

- క్రీస్తును మరల సిలువ వేయుచున్న నవీన యూదులు (వాల్. 1,2)
- దేవునికి పేరు అవసరమా?
- యెరూషలేము
- ధర్మశాస్త్రము ఎవరికి?
- విశ్రాంతి దినం నాటి ఇశ్రాయేలియులకా లేక నేటి క్రైస్తవులకా?

**2. పరలోక రాజ్యము**

- పరలోక రాజ్యంలో అల్పుడెవరు?
- పరలోక రాజ్యం బలాత్కారముగా పట్టబడుచున్నదా?
- పరలోక రాజ్యపు తాళపు చెవులు
- నాశనకరమైన హేయవస్తువు
- గొఱ్ఱెలు - మేకలు ఎవరు?
- నీతిమంతుడు ఒక్కడు లేడా?
- పరలోకరాజ్యంలో గొప్పవాడు ఎవరు?

**3. తీర్పు తీర్చు దినము**

- తీర్పు దినము (జడ్జిమెంట్ డే వాల్ - 1)
- తీర్పు దినము (జడ్జిమెంట్ డే వాల్ - 2)
- తీర్పు దినము (జడ్జిమెంట్ డే వాల్ - 3)
- తీర్పు
- క్రీస్తు రెండవ రాకడ
- అంత్య తీర్పు

**4. దైవత్వము**

- ఏది నిజమైన దైవాశీర్వాదం

* దైవత్వము
* దేవుని ప్రేమించువారికి సమస్తము సమకూడి జరుగునా?
* పరిశుద్ధత అనగా?
* యేసువైపు చూచుట ఎలా?

**5. శ్రమల దినములు**

* 40 రోజులు శ్రమలా?
* 7 మాటలు
* మట్టల ఆదివారము
* శ్రమల దినములు
* ప్రవాసం
* యేసుక్రీస్తు మూడు రాత్రులు సమాధిలో ఉన్నాడా?
* యేసు రాజ్య పట్టాభిషేకము

**6. జ్ఞానము**

* యేసు అంజూరపు చెట్టును శపించుట
* హనోకు ఏలియాలు మరణించలేదా?
* పౌలు శరీరంలో ముల్లు
* మోషే శరీరం కొరకు తర్కం
* తూర్పు దేశపు జ్ఞానులు ఎవరు?
* ఇద్దరు, ముగ్గురు ఎక్కడ ఉంటే అక్కడ యేసు ఉంటాడా?

**7. ప్రకటన గ్రంథంలోని విషయాలు**

* 666 సాతాను ముద్ర (వాల్ - 1)
* 666 సాతాను ముద్ర (వాల్ - 2)
* 666 సాతాను ముద్ర (వాల్ - 3)
* 144000 మంది ఎవరు?
* బైబిల్ అంతా దర్శన గ్రంథమే
* మహా బబులోను

**8. సువార్త**

* సువార్త అనగానేమి? దానిని ఎలా ప్రకటించాలి?

✿ సువార్త ప్రకటన ఎవరు చేయాలి?

✿ భారతదేశమునకు సువార్త ఎప్పుడు వచ్చింది?

✿ సువార్తను ప్రకటిస్తున్న ప్రేతాత్మలు

✿ బైబిల్ పూర్తిగా ఆచరించడం అసాధ్యమా?

✿ అపోస్తలుడైన తోమా ఇండియా వచ్చాడా?

**9. రక్షణ**

✿ బాప్తిస్మము

✿ పరిశుద్ధత

✿ నిరీక్షణ అనగా ఏమిటి?

✿ రక్షణ అనగా ఏమిటి?

✿ విశ్వాసము దాని పరీక్ష

✿ మారుమనస్సు

**10. సందర్భానుసారమైన వాక్యం కొరకు**

✿ కృతజ్ఞత కూటము

✿ జ్ఞాపకార్ధ కూటము

✿ నామకరణమహోత్సవము

✿ శిశు ప్రసూతి

✿ ఆలయ ప్రతిష్ఠ / గృహ ప్రతిష్ఠ

✿ పుష్పావతి కార్యక్రమము

✿ సీమంతము / శ్రీమంతము

**11. వాక్యమర్మములు**

✿ జీవ వృక్షము

✿ దానియేలు గ్రంథములోని ప్రవచన నెరవేర్పు

✿ ఏదేనువనములో మంచి చెడ్డల తెలివినిచ్చు చెట్టు

✿ బీదలు ఎల్లప్పుడూ ఉంటారా?

✿ బైబిల్‌లోని నాటి పరిశుద్ధ స్థలములు నేటికి పవిత్రమైనవా?

✿ దీప వృక్షము

✿ యోబును గూర్చి వివరణ

**12. దేవుని ధన్యతల కొరకు**

- విశ్రాంతి / నెమ్మది / ఆత్మలకా? శరీరాలకా?
- ధన్యతలు / ఎప్పుడు / ఎక్కడ
- జ్ఞానానుసారమైన ఆసక్తి?
- భయము / భక్తి
- ఆత్మానుసారంగా జీవించుట
- మనుష్యుల యెడల దేవుని చిత్తం
- నిన్నువలె నీ పొరుగువానిని ప్రేమించడమెలా?

**13. దేవుని వాక్యమైన బైబిల్**

- బైబిల్ దేవుని వాక్యమా?
- బైబిల్ దేవుని వాక్యమే!
- ది. డావిన్సీ కోడ్ - 1
- ది. డావిన్సీ కోడ్ - 2
- వాక్య విభజన / దేవుని యెదుట యోగ్యత
- పరిశుద్ధ గ్రంథం / దేవుని వాక్యమేనా?

**14. మేము సిలువ వేయబడిన క్రీస్తును ప్రకటించుచున్నాము**

- సిలువ వేయబడని క్రీస్తు బోధ
- సిలువ వేయబడిన క్రీస్తు బోధ
- క్రీస్తు సిలువ వేయబడ్డాడు! జవాబులు!!
- సిలువకు శత్రువులు ఎవరు?
- అబద్ధ ప్రవక్తలు లోకములోనికి బయటకు వెళ్ళిరి!
- పరిశుద్ధాత్మ వరాల బోధకొరకైన హెచ్చరిక
- బాలయేసు / క్రిస్మస్

**15. నిబంధన తేడా నాడు - నేడు**

- సద్దూకయ్యులు / పరిసయ్యులు
- విశ్రాంతి అనువాగ్ధానము
- మరుగై యున్నమన్నా
- హర్మెగిద్దోను యుద్ధం ఎప్పుడు?

- నిబంధన తేడా
- క్రైస్తవుడు
- క్రైస్తవ్యం నాడు - నేడు

**16. దయ్యాలు / మంత్రాలు**

- నేడు మంత్రాలు, దెయ్యాలు, మానవాతీత శక్తులున్నాయా?
- దయ్యాలు ఇప్పుడు ఉన్నాయా?
- శోధన సహించువాడు ధన్యుడు
- జ్యోతి శాస్త్రాన్ని సవాల్ చేసిన బైబిల్
- భూమిని వణికిస్తున్నదెవరు?
- దినములు చెడ్డవా?
- క్రైస్తవుడికి చదువురావాలా?

**17. పునరుత్థానము**

- పునరుత్థానము
- మొదటి పునరుత్థానము / రెండవ పునరుత్థానము
- జీవపునరుత్థానము / తీర్పు పునరుత్థానము
- శరీరముతో నరకమా?
- ప్రకటన గ్రంథ వివరణ
- ధర్మశాస్త్రం / ఆచరణ
- శాస్త్రమెరుగని ప్రాణం పోకడ

**18. పరిశుద్ధాత్మ దేవుని కొరకు**

- పరిశుద్ధాత్మ / అగ్ని బాప్తిస్మం
- పరిశుద్ధాత్మ ప్రేరణ
- అభిషేకం
- దేవుని పిలుపు
- అబద్ధ ప్రవక్తలు
- ప్రవచనం అంటే ఏమిటి?
- అంత్య క్రీస్తు ఎవరు?

**19. బోధకుల జాగ్రత్తలు**

- సంఘము
- సంఘము ఎలా ఉండాలి?
- బోధకుల జాగ్రత్తలు
- సమాజంలో స్త్రీ పాత్ర
- బైబిల్‌ను ఎలా చదవాలి?
- బైబిల్‌ను అర్థం చేసుకోవడం / పాటించడం కష్టమా?
- యేసువైపు చూచుట

**20. యేసు / రక్షకుడైన క్రీస్తు**

- యేసు ఎవరు?
- యేసు రక్తము?
- క్రీస్తు స్వరూపము?
- క్రీస్తు శరీరము
- జయశాలి ఎవరు?
- క్రొత్త నిబంధన
- ప్రకటన గ్రంథ వివరణ

**21. తండ్రి కుమార, పరిశుద్ధాత్మలు**

- దేవుడెవరు?
- దేవుడెలా ఉంటాడు?
- యేసుక్రీస్తు ఎవరు?
- పరిశుద్ధాత్మ ఎవరు?
- దేవదూతలు ఎవరు?
- సాతాను ఎవరు?
- సాతానును ఎరుగుట ఎట్లు?

**22. మనిషి కారణజన్ముడా?**

- మనిషి ఎవరు?
- మానవుడు జీవుడా? దేవుడా?
- మనిషి ఎందుకు పుట్టాడు?

- మానవుని అంతం ఎలా ఉంటుంది?
- మానవుని జీవన విధానం
- దేవాలయం
- యెహోవా కట్టిన యిల్లు

**23. పాపమును గూర్చి**

- పాపము
- మరణకరమైన పాపం
- పాపము యొక్క ఉనికిని ఎలా గుర్తించాలి?
- › పాపములోకి / పాపముతోకి ఉన్న తేడా
- ప్రకృతి / జంతువుల ద్వారా బోధ
- క్రైస్తవ్యం కులమా? - మతమా?

**24. బైబిల్ శాస్త్రం**

- శాస్త్ర సాంకేతిక రంగం
- కరువులు భూకంపాలు
- కాలుష్యం
- మానవ క్లోనింగ్ సాధ్యమా?
- బూడిదయ్యే భూమితో అంతరిక్షం అంతరిస్తుందా?
- శాస్త్ర మెరుగని ప్రాణం పోకడ!?

**25. ప్రార్థన కొరకు**

- అడుగుడి / వెదకుడి / తట్టుడి
- ప్రార్థన అనగా ఏమి?
- ప్రార్థన ఎలా, ఎవరికి చెయ్యాలి?
- హన్నా ప్రార్థన
- స్తోత్రార్హుడెవరు?
- దేవునితో / ఎవరైనా / ఎప్పుడైనా మాట్లాడారా?

**26. హెచ్చరిక లేక ఆజ్ఞ / ఆచరణ**

- ఆచరణ - ఆజ్ఞ - సంస్కృతి - సంప్రదాయము
- విశ్వాసము - ప్రేమ - నిరీక్షణ - సువార్త

- యేసుక్రీస్తు ముద్రలు
- స్వస్థత శాలలు వాక్యానుసారమా?
- సత్యమును బట్టి ఆత్మ వర్ధిల్లుట

**27. క్రీస్తును, దేవుని, ఎందుకు ఎరగాలి?**

- దేవుని క్రీస్తును ఎరుగుట, ఎందుకు, ఎలా ఎరగాలి?
- దేవుడు ఎవరు?
- నేడు సేవకై దేవుని పిలుపు అవసరమా?
- నిరీక్షణ
- రాజ్యహింస - రాజ్యాధికారము
- ఆత్మతోనా కట్టెతోనా కైలాసము?

**28. క్రైస్తవుని జాగ్రత్తలు**

- ఉపవాసము అనగా?
- పరిశుద్ధాత్మ ఎవరు?
- డిసెంబరు 25న యేసు పుట్టాడా?
- అన్యాయపు సిరి అనగా?
- ఎవరు నీ శత్రువు
- చెడు కనిపిస్తే చట్టానికి నేరం.... దాన్ని తలిస్తేనే దేవునికి దూరం
- విశ్వాస పరీక్ష
- అబద్ధమాడితేనే కాదు పాపం
- భాషలు - వరాలు

**29. క్రిస్టమస్**

- క్రిస్టమస్ సందేశము, క్రీస్తు జననము
- నూతన సంవత్సర సందేశము
- క్రైస్తవులు దేనియందు ఐక్యతగా ఉండాలి?
- ఏది నూతనమైనది?
- సమయం వాచ్‌నైట్ సర్వీసు?
- ఇశ్రాయేలు దేశము ఎప్పుడు ఏర్పడినది?

**30. పండుగలు - పుణ్యక్షేత్రాలు**

- పండుగలు - పుణ్యక్షేత్రాలు
- క్రొత్తభూమి - క్రొత్త ఆకాశము
- మానవ మేధస్సుకందని దేవుని ప్రేమ
- శుభ శుక్రవారము

**31. మనిషి జీవన యానం**

- దేవుని నీతి - రాజ్యము
- జీవాత్మని ద్వారా దేవుడు కోరుచున్నది
- మనిషి ఆయుష్కాలము
- మనిషి జీవన యానం

**32. పరలోక పట్టణము**

- దేవునిలో పరిపూర్ణత
- క్రొత్త ఆకాశము - క్రొత్త భూమి
- పరలోక పట్టణము
- రక్షణ - సువార్త - దేవునిపిలుపు
- దేవునికి విశ్రాంతి అవసరమా

**33. కఠినమైన తీర్పు**

- క్రైస్తవుడు దేశ చట్టమును ఉపయోగించుకొనుట
- విశ్వాసమునకు నిర్వచనము
- కఠినమైన తీర్పు
- మనిషి తన పనిలో నిజాయితి
- మరణము - దేవుని సన్నిధి
- సువార్త సేవకై ఈ దేశ చట్టమును ఉపయోగించుకొనుట

**34. జీవ వృక్షఫలము**

- దేవదూతలు సేవకులైన ఆత్మలు
- దేవుని కుమారులు / మనుష్య కుమార్తెలు
- జీవవృక్షఫలము / యెహోవా కట్టిన ఇల్లు
- మర్మము మరుగు చేయబడిందా?

- క్రీస్తు సిలువ మీద పలికిన ఏడు మాటలు

**35. వాక్య పరిశీలన?**

- దేవుని సేవకు పిలుపు ఈ కాలములో ఉన్నదా?
- కొత్తనిబంధన ఆజ్ఞ
- మట్టల ఆదివారము
- తమకు తెలియని దానిని ఆరాధించుట
- విగ్రహారాధన అనగా
- వెలుగు, జీవపు వెలుగు

**36. భార్యా - భర్తల సంబంధము**

- భార్యా - భర్తల సంబంధం
- దుష్టత్వము నుంచి మళ్ళించి ఆశీర్వదించుట
- దేవుని స్తుతించుట (ఫాదర్స్‌డే)
- క్రైస్తవ వివాహ చట్టము - విడాకులు
- మనిషి జన్మలో వివాహము అవసరమా?

**37. ఏది నిజమైన దైవారాధన?**

- బాధపడువారిని ఆదరించేవారు
- నేటి క్రైస్తవుల సాక్ష్యం
- ఉపమాన రీతిగా యేసు ఎందుకు బోధించాడు
- ఏది నిజమైన దైవారాధన
- క్రైస్తవుడు కనిపెట్టవలసినది దేనికోసం?

**38. మానవ జ్ఞానము?**

- దేవుని నీతి / జ్ఞానం తప్ప భూమిపై విస్తరించుటకు దేవుని ద్వారా అన్ని నేర్చుకున్న మనిషి
- భూమి బూడిదవుతుందా? యుగాంతం
- ఈ మట్టిలోకంలో మనిషికి మరో రూపం, జీవం ఉందా?
- గ్రహాంతర జీవులు ఎవరు?
- సమాధి చెప్పిన సజీవ సాక్ష్యం

**39. ప్రవక్తలు, అబద్దప్రవక్తలు?**

- అబద్ధ ప్రవక్తలు
- ఆ ప్రవక్త ఎవరు?
- బైబిల్‌లో మహమ్మద్
- పూజార్హుడు ఎవరు?
- యేసుక్రీస్తు ఇండియా వచ్చాడా?

**40. మనిషి జీవన విధానం?**

- మనిషికి మరణం శాపమా? వరమా?
- మంచిపేరు అనగా
- నిర్ధోషికి తీర్పు న్యాయమా?
- పేరులో ఏముంది?
- గ్రంథం, తీర్పు

**41. క్రీస్తు సిలువకు శత్రువులు ఎవరు?**

- పునరుత్థానం క్రైస్తవుల పండుగలు
- పుట్టనివానికి మేలా / పుట్టనివారుంటారా?
- ఆదికాండములోని మొదటి దినము వివరణ
- రూపాంతరము
- క్రీస్తు సిలువకు శత్రువులు ఎవరు?

**42. ధర్మశాస్త్రం దాని ఆవశ్యకత?**

- దేవుని ఆశీర్వాదం
- దేవుని చిత్తం అంటే ఏమిటి?
- మానవత్వమే మతం
- దేవుని పోలిక / స్వరూపం
- యుక్తి / కుయుక్తి
- ధర్మశాస్త్రం దాని ఆవశ్యకత

**43. త్రిత్వమా? ఏకత్వమా?**

- బైబిల్‌లో త్రిత్వ సిద్ధాంతం ఉన్నదా?
- దేవుడెవరు? దేవుడు ఎలా ఉంటాడు?

✿ యేసుక్రీస్తు ఎవరు?
✿ పరిశుద్ధాత్మ ఎవరు?
✿ పూజార్హుడు ఎవరు?
✿ త్రిత్వమా? ఏకత్వమా?

**44. ధార్మికము / దైవ భావన**

✿ చీకటిలో నుండి వెలుగులోనికి
✿ ధార్మిక గ్రంథాలలోని దైవభావన
✿ దేవుడిచ్చు స్వతంత్రము
✿ ఈ లోక అధికారము
✿ జ్ఞానానుసారమైన భక్తి మరియు బోధ
✿ హెచ్చరికలు

**45. వెలుగు నందు విశ్వాసము**

✿ జీవ పునరుత్థానము
✿ మెల్కిసెదెకు ఎవరు?
✿ తీర్పు పునరుత్థానము
✿ వెలుగునందు విశ్వాసముంచుట
✿ యేసుక్రీస్తు స్త్రీ సంతానమా?

**46. విశ్వాసము - వినుట వలననా / చూచుట వలననా?**

✿ చూడక నమ్మిన వారు ధన్యులు
✿ దైవభక్తిని గూర్చిన మర్మము
✿ హృదయ ప్రతిష్ఠ
✿ వెలుగు జీవపు వెలుగు
✿ విశ్వాసం - వినుట వలనా? చూచుట వలనా?
✿ యెహోవా దినం / క్రీస్తు దినము

**47. గత జన్మలోని పాపమే ఈ జన్మకు కారణమా?**

✿ భూ రాజులనేలు మహా పట్టణము
✿ గత జన్మలోని పాపమే ఈ జన్మకు కారణమా?
✿ ప్రార్థన ఎలా? ఎవరికి, ఎందుకు చేయాలి?

- సత్ సంవత్సరము న్యూ ఇయర్, వాచ్‌నైట్
- శకునములు / మూఢనమ్మకాలు / మంత్ర తంత్రాలు

**48. నిషేదించిన రాయి**

- జీవవృక్షఫలం - 1
- జీవవృక్షఫలం - 2
- ఇల్లు కట్టువారు నిషేదించిన రాయి
- నీతిమంతుడే లేడా
- పునరుత్థాన భయం / భక్తి

**49. ఆత్మ విషయమైన దూషణ**

- జ్ఞానం క్రీస్తు విషయమైన నింద
- ఇతరులు పొందిన మేలుకొరక కృతజ్ఞత
- క్రీస్తు తైలాభిషేకం
- మనలో వున్న దైవత్వం
- వినుటకు వేగిరపడుట

**50. క్రీస్తే మన స్నేహితుడు**

- దేవుని నీతి స్వనీతి
- క్రైస్తవ బాబాలు
- క్రీస్తుతో స్నేహం (ఫ్రెండ్‌షిప్ డే)
- నీతిమంతుని జ్ఞాపకం చేసికొనుట
- వివాహబంధం / విడాకులు

**51. ప్రకటనలోని 7 సంఘాలు**

- ఎఫెసు - సంఘము
- స్ముర్న - సంఘము
- పెర్గము - సంఘము
- తుయతైర - సంఘము
- సార్దీస్ - సంఘము
- ఫిలదెల్ఫియా - సంఘము
- లవొదికయ - సంఘము

**52. బైబిల్ అంతా దర్శన గ్రంథమే**

- మహా బబులోను
- ఇద్దరు సాక్షులు
- 144000మంది ఎవరు?
- 24 పెద్దలు ఎవరు?
- బైబిల్ అంతా దర్శన గ్రంథమే
- ఆలయ ప్రతిష్ఠ

**53. దేవుని చేత ప్రేమింపబడిన వారు**

- క్రిస్మస్ / వాచ్‌నైట్ / న్యూ ఇయర్
- దేవునిచేత ప్రేమింపబడినవారు
- మార్పు చెందిన జీవితాలు
- మంచి పేరు ఏది?
- పరిశుద్ధులైనవారి మధ్య జ్ఞానం

**54. యేసువైపు చూచుట**

- క్రీస్తు పుట్టుక రహస్యం
- యేసువైపు చూచుట
- జీవముగల దేవుని సంఘము
- మెల్కొసెదెకు? - (డా॥ పులవర్తి రామకృష్ణ)
- మెల్కొసెదెకు? - (బ్రదర్. వేణు)
- మెల్కొసెదెకు? - (డా॥ బి.జాన్)
- అవినీతిపై ఉద్యమం

**55. విశ్వాసమూఢత్వం**

- వారి కడుపే వారి దేవుడు
- వెలుగులేని స్థితి చీకటి
- క్రైస్తవులే సిలువకు శత్రువులు
- మూఢనమ్మకములు
- సిలువ వేసుకున్న మనిషి
- విగ్రహం కన్ను తెరిచిందా?

**56. క్రైస్తవ్యంలో స్వతంత్ర్యము**

- ఫ్రీడమ్ ఇన్ క్రిష్టియానిటి - 1
- ఫ్రీడమ్ ఇన్ క్రిష్టియానిటి - 2
- తూరు (దేశపు) దేశాల జ్ఞానులా

**57. సంఘము సత్యమునకు ఆధారము**

- సంఘము కొరకు - 1
- సంఘము కొరకు - 2
- దేవుడు / దేవుని కుమారునికి తేడా
- అంత్య దినములు
- హృదయం ఎక్కడున్నది - 1
- హృదయం ఎక్కడున్నది - 2

**58. గుడ్ ఫ్రైడే**

- మట్టల ఆదివారం
- గుడ్ ఫ్రైడే
- పునరుత్థానం
- మరల నూతనపర్చుట
- మానవత్వం / దైవత్వం
- ప్రార్థన - సువార్త ప్రకటన

**59. జ్ఞానానుసారమైన బోధ**

- గ్రహఫలం / బలం
- ప్రాణం విలువ
- జ్ఞానానుసారమైన బోధ
- ప్రకృతిమార్పు
- దైవజ్ఞానం
- మహాబబులోను

**60. భీకరుడైన దేవుడు**

- దేవదూతలు / పాపం
- యేసును ఎలా నమ్మాలి

- ✿ జంతువుల సహవాసం
- ✿ దేవుని నమ్ముకొనుట మేలు
- ✿ భీకరుడైన దేవుడు
- ✿ ఆ సృష్టికి పూర్వం
- ✿ విశ్వాసమనగా

**61. ఏడేండ్ల శ్రమలు**

- ✿ ఏడేండ్ల శ్రమలు
- ✿ 1. మూఢనమ్మకాలు, 2. మూడున్నరేళ్ళ విందు
- ✿ పాతాళమెక్కడున్నది
- ✿ బోధలోని తేడా

**62. ధర్మోరక్షతి రక్షిత్తః**

- ✿ మానవధర్మము
- ✿ జీవ వైవిద్యము
- ✿ తల్లిదండ్రుల ధర్మాలు
- ✿ మతమార్పిడి (బలవంతపు)

**63. బలవంతపు మతమార్పిడి నశించాలి**

- ✿ బలవంతపు మతమార్పిడులు నశించాలి
- ✿ జీవ / తీర్పు పునరుత్థానము
- ✿ మరణ శాసనము
- ✿ నీతిధనము / కృపా ధనము
- ✿ యధార్థమైన భక్తి

**64. క్రైస్తవుల మరణం - సమాధి**

- ✿ వాక్యంలో ఐక్యత
- ✿ సత్యసువార్త
- ✿ శాస్త్రానికందని మరణం
- ✿ క్రైస్తవుల మరణం సమాధి
- ✿ క్రీస్తు పుట్టాడా / వచ్చాడా?
- ✿ ప్రాచీన నవీన స్వభావం

**65. క్రీస్తు తత్వం ప్రజల్లో నాటబడాలి**

✿ ప్రకృతి వైపరీత్యం / సంఘ భ్రష్టత్వం
✿ రాజ్య సువార్త రాజ్యాధికారం
✿ వాక్యమైన క్రీస్తు
✿ క్రీస్తు తత్వం ప్రజల్లో నాటబడాలి
✿ భాధ్యత గల జీవితం / క్రీస్తు యేసుకు కలిగిన ఈ మనస్సు
✿ మందిర ప్రారంభోత్సవం ప్రార్థన మందిర ప్రారంభోత్సవం

**66. దేవున్ని ఎలా ప్రేమించాలి**

✿ పొరుగువాన్ని ఎలా ప్రేమించాలి
✿ బలి అర్పణ
✿ దశమభాగం దేవునికి ఏమి అర్పించాలి
✿ ప్రార్థన - పని ఏదిముందు?
✿ యేసుక్రీస్తు ఎవరు

**67. పవిత్రయుద్ధము**

✿ మరణకరమైన పాపము
✿ ఏది పరిశుద్ధ స్థలము
✿ పవిత్రయుద్ధము
✿ మానవ ప్రేమ
✿ క్రైస్తవ్యం
✿ భార్య భర్తల హెచ్చరిక

**68. దేవాలయాలు**

✿ ప్రేమ అంటే ఏమిటి?
✿ మదర్స్ డే
✿ పరిశుద్ధ పర్వతం / మృగములు
✿ దేవుని ముద్రలు
✿ ఉద్యోగస్తులు - దేవుని సేవ
✿ ఎవరు నీ శత్రువు
✿ దేవాలయాలు

**69. శాస్త్రానికందని మరణం**

- శాస్త్రానికందని మరణం
- పెళ్ళి ఎందుకు ఘనమైనది
- దీవించబడిన చర్చి
- పునరుత్థానము
- జ్ఞాపకార్థ కూడిక
- దైవ సేవకులకే ఎందుకు శోధన

**70. జ్ఞానమునకు మించిన క్రీస్తు ప్రేమ**

- క్రీస్తు రాజ్య పట్టాభిషేకం
- క్రైస్తవుల మరణం సమాధి
- అపోస్తలులు / ప్రవక్తలు ఎవరు
- దేవుని ముసుగులో దేవాంతకులు
- జ్ఞానమునకు మించిన క్రీస్తు ప్రేమ
- అన్యులను క్రీస్తులో నిలపడం

**71. అతిశయానికి పాపపు ముల్లు**

- పాపపుముల్లు
- పరలోకపు మన్నా
- దేవుని గ్రంథంలో పేరు
- జీవ గ్రంథంలో పేరు
- పునరుత్థానం
- పరిశుద్ధాత్మ అగ్ని అభిషేక బాప్తిస్మం
- యేసుక్రీస్తు స్త్రీయందు పుట్టాడా!

**72. ప్రకటన గ్రంథములోని ముద్రలు**

- మొదటి ముద్ర
- రెండవ ముద్ర
- మూడవ ముద్ర
- నాల్గవ ముద్ర
- ఐదవ ముద్ర

- ఆరవ ముద్ర
- ఏడవ ముద్ర (కడబూర)

**73. సత్యవాక్య పరిశోధన**

- హృదయాలోచన
- మనిషి ఆయుష్షు కొన్ని దినములేనా?
- క్రైస్తవుల ఐక్యత - కాపరుల బాధ్యత
- జ్ఞానమునకు మించిన క్రీస్తు ప్రేమ
- వాక్య పరిశోధన
- విశ్వాస మౌలిక అంశములు
- దేవాలయాలు - గృహవాస్తు
- క్రీస్తుజన్మ రహస్యమా?
- మూర్ఖతరము వారికి వేరై రక్షణ పొందండి
- పరిశుద్ధులకప్పగింపబడిన బోధ
- సూర్యుని క్రింద నూతనమైనదేది లేదు

**74. తండ్రి ఆకర్షణ**

- కడబూర
- నిజమైన దైవారాధన
- శుభశుక్రవారం
- పునరుత్థానం
- పుచ్చుకొనుట - ఇచ్చుటలో ధన్యత
- తండ్రి ఆకర్షణ
- క్రీస్తు ఎలా మనుష్యకుమారుడు

**75. విశ్వాసమూలమగు నీతి**

- ఆదరణ కూటము
- ప్రభువు నా ప్రభువుతో చెప్పెను
- క్రైస్తవులు - రాజ్యాధికారం
- విశ్వాస మూలమగు నీతి
- దేవుని ప్రత్యక్షత

✿ విశ్వాసులెవరు?

✿ ఈ జీవిత కాలముమట్టుకే నిరీక్షిస్తే...

**76. తండ్రి నామమున యేసు వచ్చాడా?**

✿ జ్ఞాపకార్థము/ఓదార్పు/కృతజ్ఞత

✿ గృహప్రవేశం

✿ క్రైస్తవులు - రాజకీయాలు

✿ మానవుడు - జీవుడా? దేవుడా?

✿ తండ్రినామమున యేసు వచ్చాడా?

✿ యేసుక్రీస్తు విజయోత్సవం

**77. ప్రాంతీయ విభేదాలలో క్రైస్తవ్యం?**

✿ ఏది నిజం

✿ క్రీస్తుకే బోధించిన సాతాను

✿ అన్యాయపు సిరి

✿ దయ్యములను గూర్చిన దేవుని బోధ

✿ దేవుని ప్రజలకు విశ్రాంతి నిలిచి ఉందా?

✿ ప్రాంతీయ విభేదాలలో క్రైస్తవ్యం?

✿ దేవునికే అసాధ్యమైనది?

✿ యెరూషలేము కొరకు ప్రార్థనా?!


**ఇంకా లేటెస్టుగా మాట్లాడిన అంశాలు "యెరూషలేము కొరకు ప్రార్థనా!?"**

**అనే బైబిల్ రీసెర్చ్ సెమినార్ (02-10-2014)లో విడుదల కానున్నాయి.**

**6లేక 5 అంశాలతో కూడిన 1 సి.డి./యం.పి.3 /డి.వి.డి.**

**వెల రూ. 50/- మాత్రమే. పోస్టేజి అదనం.**

**సంప్రదించండి : బ్రదర్ జె. రవి - 9440792192, 9676744233**

**డా॥ బి. జాన్‌గారి గళం నుండి వెలువడిన**

**సర్వమానవాళిని సర్వసత్యపు వెలుగులోనికి నడిపించే దివ్యమైన వాక్య సందేశాలు**

**(సెమినార్ల డి.వి.డి. / వి.సి.డి.లు)**

| | | |
|---|---|---|
| **1.** | ముల్లోకాల మర్మములు (వి.సి.డి. - 4) | 15-8-2002 |
| 2. | వరకట్నమా? / కన్యాశుల్కమా? (వి.సి.డి. - 2) | 2-10-2002 |
| 3. | క్రీస్తు జన్మదినము (వి.సి.డి. - 4+1) | 6-12-2002 |
| 4. | నేటి క్రైస్తవుల సాక్ష్యం | 14-1-2003 |
| 5. | క్రీస్తు మరణదినం | 2-4-2003 |
| 6. | ఎయిడ్స్ భూతం (వి.సి.డి. - 2) | 1-5-2003 |
| 7. | త్రిత్వమా? ఏకత్వమా (2సెట్ వి.సి.డి. - 3) | 15-8-2003 |
| 8. | నేటి సువార్త పాటలు... వాక్యానుసారమా? (3సెట్ వి.సి.డి.-3) | 2-10-2003 |
| 9. | దయ్యాలు / మంత్రాలు, క్షుద్రశక్తులు-దైవిక శక్తులు ఉన్నాయా? (వి.సి.డి. - 4) | 26-11-2003 |
| 10. | సిలువకు శత్రువులు ఎవరు? | 15-1-2004 |
| 11. | సమసమాజ స్థాపనకు కావలసింది ఏది? (వి.సి.డి. - 4) | 6-3-2004 |
| 12. | క్రైస్తవ్యం కులమా? / మతమా? (వి.సి.డి. - 4) | 1-5-2004 |
| 13. | జన్మపాపమా? / ఖర్మపాపమా? (వి.సి.డి. - 3) | 14-8-2004 |
| 14. | సమాజంలో స్త్రీ పాత్ర - సంఘంలో అలంకరణ (వి.సి.డి. - 3) | 2-10-2004 |
| 15. | ఏది నిజమైన దైవారాధన? | 12-11-2004 |
| 16. | 1000 ఏండ్ల పరిపాలన | 14-1-2005 |
| 17. | సిలువ వేయబడిన క్రీస్తు?! (వి.సి.డి. - 3) | 8-3-2005 |
| 18. | జలయజ్ఞం | 14-5-2005 |
| 19. | 666-సాతాను ముద్ర (వి.సి.డి. - 3) | 15-8-2005 |

20. పెండ్లి విందు / వివాహ మహోత్సవం 12-10-2005

21. ప్రపంచ దేశాలకు స్వతంత్రం వచ్చిందా? (వి.సి.డి. - 4) 14-1-2006

22. తీర్పు దినం (వి.సి.డి. - 3) 30-3-2006

23. సంఘము / సంఘపెద్దలు (వి.సి.డి. - 3) 1-5-2006

24. జ్యోతిష్యం / వాస్తు / శాస్త్రాలా? (వి.సి.డి. - 3) 15-8-2006

25. నాశనకరమైన హేయమైన వస్తువు (వి.సి.డి. - 3) 2-10-2006

26. క్రీస్తు రెండవ రాకడ!? (డి.వి.డి-3) 2-10-2010

49. గ్రహాంతర వాసులెవరు? (డి.వి.డి-2) 17-12-2010

50. పరలోక పట్టణము (డి.వి.డి-3) 26-1-2011

51. జీవ వృక్ష ఫలం (డి.వి.డి-2) 4-4-2011

52. గతజన్మ పాపమే ఈ జన్మకు కారణమా? (డి.వి.డి-2) 14-5-2011

53. మెల్కిసెదెకు ఎవరు? (డి.వి.డి.-2) 15-8-2011

54. ఆలయ ప్రతిష్ఠ (డి.వి.డి.-2) 06-10-2011

55. క్రిస్మస్ - వాచ్‌నైట్ - న్యూఇయర్ (డి.వి.డి.-2) - 06-12-2011

56. అంత్యదినములు (డి.వి.డి-2) - 26-01-2012

57. మహాబబులోను (డి.వి.డి.-2) - 23-03-2012

58. ప్రార్థన - సువార్త ప్రకటన (డి.వి.డి.-2) - 01-05-2012

59. ఏడేండ్ల శ్రమలు - ఎవరికి? ఎప్పుడు? ఎక్కడ? (డి.వి.డి.-2) - 15-08-2012

60. బలవంతపు మతమార్పిడులు నశించాలి (డి.వి.డి.-2) - 02-10-2012

61. ఆధునిక శాస్త్రానికందని మరణం (డి.వి.డి.-2) - 13-11-2012

62. యేసుక్రీస్తు ఎవరు? (డి.వి.డి.-2) - 26-01-2013

63. క్రైస్తవుల మరణము సమాధి?! (డివిడి.-3) - 27-03-2013

64. ప్రవక్తలు - అపోస్తలులు ఎవరు? (డి.వి.డి.-2) - 01-05-2013

65. పునరుత్థానం (డి.వి.డి.-2) - 15-08-2013

66. క్రైస్తవుల ఐక్యత - కాపరుల బాధ్యత (డి.వి.డి.-3) - 02-10-2013

67. జ్ఞానానికి మించిన క్రీస్తు ప్రేమ (డి.వి.డి.-3) - 14-11-2013

68. కడబూర - మ్రోగిందా? మ్రోగబోతుందా? (డి.వి.డి.-3) - 14-01-2014

69. విశ్వాసులెవరు? (డి.వి.డి.-3) - 31-03-2014

70. జ్ఞాపకార్థమా?! ఓదార్పా?! కృతజ్ఞతా కూటమా?! (డి.వి.డి.-3) - 01-05-2014

71. యేసుక్రీస్తు దావీదుకు ప్రభువా?
మరణశాసనం వ్రాసిన వారెవరు? (డి.వి.డి.-2) - 15-08-2014

72. యెరూషలేము కొరకు ప్రార్థనా!? (డి.వి.డి.-3) - 02-10-2014

**బహిరంగ సభలు**

**1.** యేసుక్రీస్తు ఎవరు? (డి.వి.డి. - 1)

2. సృష్టికర్తకు కోడ్ వుందా? (వి.సి.డి.)

3. మనిషిని కాపాడేదే మతమా? ధర్మమా? (1,2,3 - డి.వి.డి)

4. దైవకణం - సృష్టి పుట్టుక (డి.వి.డి - 1)

5. మరణశాసనం వ్రాసిన వారెవరు? (డి.వి.డి. - 1)

6. ప్రకృతి మార్పులు (డి.వి.డి.- 1)

7. నీతిని విత్తువాడు (డి.వి.డి.- 1)

8. దేవుని యందలి భయము - భక్తి (డి.వి.డి. - 1)




*మేము సిలువ వేయబడిన క్రీస్తును ప్రకటించుచున్నాము.* *(1కొరింథీ 1:23).*

మానవులందరు సర్వేశ్వరుడైన దేవుని యొద్దకు తిరిగి చేరడానికి ఆయన ప్రియ కుమారుడైన క్రీస్తు యేసు చూపిన సర్వోన్నతమైన మార్గముపై నేటి మన అఖండ భారతావని ప్రశ్నలకు – అనుమానాలకు, శాస్త్ర సాంకేతికపరంగా, చరిత్ర – న్యాయ – ఆధ్యాత్మికంగా సకల విధములైన అనుభవ జ్ఞానంతో, ప్రేమ – సాత్వీకంతో సమాధానం చెప్పి అవసరమైనచోట తర్కించి – వాదించి – ఒప్పించి దేశరాజ్యాంగ చట్టాలకనుగుణంగానే ధైర్యముగా మాట్లాడే వారిగా, అనేకుల ఆత్మ రక్షణ కొరకు దేవుడే ఈ జీవుడి ద్వారా వ్రాయించిన జీవగ్రంథమైన బైబిల్‌లో తర్ఫీదునిచ్చి, మనిషిలోని రాక్షసత్వాన్ని రూపుమాపి, తనలోని దైవత్వాన్ని పైకి తీసి దేశంలోని, మూఢనమ్మకాలను సాంఘిక దురాచారాలను, సంఘు వ్యతిరేక కార్యకలాపాలను మాన్పించి ఈ ప్రపంచాన్ని అందులోని ప్రతి మనిషి దేహాన్ని ఒక దేవాలయంగా మార్చి ప్రతి మనిషిని కులపిచ్చి, మతపిచ్చి, ప్రాంతీయ పిచ్చి, ధనపిచ్చి రాజ్యాధికారమనే పిచ్చి ఇలా ఎన్నింటినుండో విడుదల చేయాలన్నదే మా ఆశ–ఆశయము.

ప్రపంచంలోని ఎన్నో బైబిల్ కళాశాలల్లో బోధించని సృష్టి రహస్యములను, అనేక దేశ చరిత్రలలోనూ, రాజ్యాంగ న్యాయ చట్టాలలోను అణువణువునా కనిపించేవి, ఆధునిక శాస్త్రాలను సైతం అధిగమించినవి, మానవ మనుగడకు అత్యవసరమైన వాటిని బైబల్ నుండి పరిశోధించి ఉచితముగా బోధించుచున్నాము, **ప్రస్తుతము బోధనా భాష తెలుగు.**

**మావద్ద కోర్సులు :**

**1. D.B.Th. (Diploma in Bible Theology / Technology) - 1సం॥**

**2. B.B.Th. (Bachelor of Bible Theology / Technology) -1సం॥**

**3. M.B.Th. (Master of Bible Theology / Technology) - 1సం॥**

**4. Ph.D (Degree of Doctroate in Bible Philosophy) - 1 సం॥**

కనీస విద్యార్హత : ఎ) 10వ తరగతి (ఎస్.ఎస్.సి.) పాస్ అయి ఉండాలి

బి) ఇంగ్లీషు, సైన్సు, చరిత్రలపై అవగాహనుండాలి.

సి) మా కాలేజిలోనే అన్ని కోర్సులు వరుసగా చేసిన వారికే **Ph.D** కోసం ప్రాధాన్యత ఇవ్వబడుతుంది.

2. ప్రతి సోమవారం సాయంత్రం 7:30 నుండి 9 గం॥ల వరకు నెలకు నాలుగు పాఠాలు బోధించబడును. ప్రతి నెల ఆఖరి ఆదివారం గాని రెండవ శనివారం నాడు గాని మరియు సెలవురోజున గాని బైబిల్ క్లాసులు మరియు పరీక్ష నిర్వహించబడును. సర్టిఫికేట్ అవసరం లేనివారు కూడా వచ్చి పాఠాలు విని వెళ్ళవచ్చు.

3. **ప్రతి ఆదివారం ఉదయం 11:30 నుండి 13:30 వరకు.**

4. సిలబస్‌లో ఇచ్చిన బోధనాంశముల క్రమసంఖ్యను అవసరాన్నిబట్టి లేదా సమయానుకూలతను బట్టి మార్పులు చేసి బోధించబడును. ఏ విషయం ఒక వారం ముందుగా తెలియజేయబడును. బైబిల్‌పై మీకున్న అనుమానాలన్నిటికి పూర్తి వివరణ ఇవ్వబడును.

5. అవసరాన్నిబట్టి వారానికి రెండు క్లాసులు జరిపి ఇంకా ఎక్కువ సంగతులు బోధింపబడును. ప్రతిరోజు క్లాసు తర్వాత ఆ రోజు పాఠ్యభాగంపై సమగ్రమైన పరిశోధన (చర్చ), ప్రశ్నలకు సమాధానములు ఉంటాయి.

6. ప్రతి విద్యార్థి స్వంత నోట్ పుస్తకం, పెన్ను, పెన్సిల్, బైబిల్ తెచ్చుకొనవలెను. ఆసక్తి కలిగినవారందరు వయోబేధం - స్త్రీ-పురుష బేధం లేకుండా అప్లికేషన్ కొరకు పై ఆఫీస్ అడ్రస్‌కు వ్రాయండి. దరఖాస్తుతోపాటు 4 పాస్‌పోర్టుసైజు ఫోటోలు తప్పక జతచేయండి.

7. పండుగ మరియు సెలవు దినములలో ఆత్మరోగులకు ఉచితవైద్య శిబిరములుగా ప్రత్యేకమైన సెమినార్లు సంవత్సరానికి 6లేక 5 జరుగును. సర్టిఫికేట్ కావల్సినవారు తప్పనిసరిగా ఈ సెమినార్లకు హాజరు కావలెను. ప్రతి సం॥ జనవరిలో జరిగే ఎగ్జామ్‌కు తప్పని సరిగా హాజరు కావలెను.

*- కరస్పాండెంట్*

*9440142887 / 9676944233 / 9440792192 / 995937221*

**డా॥ బి. జాన్ గారి కలం నుండి వెలువడి అనేకులను వాక్యపు వెలుగులో నడిపిస్తూ దేవుని రాజ్యంలో నిలిపి దేవుని యొద్దకు చేర్చుచున్న ఆత్మజ్ఞాన గ్రంథములు.**

1. ఏది నిజమైన దైవారాధన?
2. మనిషి జన్మ ఎందుకు?
3. పరిశుద్ధుని ముసుగులో భ్రష్టుడు!
4. దేవుడెవరు? (త్రిత్వమా? ఏకత్వమా?)
5. జన్మపాపమా? కర్మపాపమా?
6. వివాహము బంధమా? బంధకమా?!
7. వెయ్యేండ్ల పరిపాలన! (ఎప్పుడు? ఎక్కడ? ఎవరితో?)
8. సాతాను ముద్ర!? దేవుని ముద్ర!?
9. యెహోవా ఏర్పాటు చేసిన దినము?!
10. సమాజంలో స్త్రీ పాత్ర?! (సంఘంలో స్త్రీల అలంకరణ)
11. సిలువ వేయబడిన క్రీస్తు!?
12. క్రిస్మస్ - వాచ్‌నైట్ - న్యూ ఇయర్
13. యెహోవా కట్టిన ఇల్లు - ఆలయ ప్రతిష్ఠ?!
14. క్రైస్తవ్యం కులమా? మతమా?
15. బలవంతపు మతమార్పిడులు సాధ్యమేనా?!
16. మానవ మేధస్సుకు అందని ప్రేమ
17. **యేసుక్రీస్తు ఎవరు?**



మనుషులందరి బ్రతుకు పుస్తకము, జీవగ్రంథమైన బైబిల్‌లోని దేవోక్తులలో వ్రాయబడిన, దేవుడు – యేసుక్రీస్తు – పరిశుద్ధాత్మల యొక్క ముద్రలు, పరలోక ప్రార్థన, 1,44,000 మంది జనులు, క్రూర మృగం దాని ప్రతిమా స్వరూపం, మహాబబులోను – స్త్రీ మరియు సాతాను ముద్రల యొక్క వాక్యానుసారమైన నిజ స్వరూపాలను దేవుని ఆత్మ సహాయంతో అతి సులువుగా అర్థం చేసుకొని తాము బ్రతికి, అనేకులను నిత్యము బ్రతికించడానికి ఆశపడేవారు మాత్రమే దీనిని చదివి, అనేకుల చేత చదివిస్తారని ఆశిస్తూ బైబిల్‌ను పరిశోధించి వ్రాసినదే ఈ **"దేవుని ముద్ర! సాతాను ముద్ర?"**

**డా॥ జాన్ బొంకూరి**

SSGraphics @ 9550015417